# సాధ్వీమణుల సందేశాలు

రచన

**డా॥ సూరపరాజు వసంత కుమారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2022**

# SAADHVEEMANULA SANDESAALU

**by**
**Dr. Suraparaju Vasantha Kumari**

T.T.D. Religious Publications Series No.1420
@ All Rights Reserved

First Edition : 2022

Copies : 500

Price :

Published by :
**Sri A.V. DHARMA REDDY,** I.D.E.S.,
Executive Officer (FAC),
Tirumala Tirupati Devastanams,
Tirupati - 517 501

**D.T.P.**
Publications Division,
T.T.D, Tirupati

Printed at
**Tirumala Tirupati Devastanam's Press**
Tirupati - 517 501

## ముందుమాట

### యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః

స్త్రీలు ఎక్కడ పూజింపబడతారో గౌరవింపబడతారో అక్కడ దేవతలు ఆనందిస్తారని వేదాలు చెబుతున్నాయి. హైందవ సంస్కృతి సంప్రదాయాలలో స్త్రీకి విశిష్టస్థానమున్నది. ఈ సమస్త సృష్టికి మూలాధారం స్త్రీ. అందుకే స్త్రీని మాతృమూర్తిగా పూజిస్తాము. హైందవ సమాజంలో తొలిస్థానం కూడా స్త్రీదే. ముందు తల్లి ఆ తరువాతే తండ్రి గురువు దైవం అందరుకూడా. భారతీయ సాహిత్యం సంస్కృతి సంప్రదాయాలకు పెట్టింది పేరు. సమాజహితాన్ని కోరేదే సాహిత్యం.

వేదమాతగా గాయత్రీదేవిని కీర్తిస్తాము. విద్యాధిదేవతగా సరస్వతిదేవిని పూజిస్తాము. అందుకే పోతనామాత్యుడు అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ అని.. తిక్కన శారదనీరదేందు ఘనసారపటీర మల్లికాహార తుషార...అని ఇలా అనేక మంది మహాకవులు అమ్మవారిని స్తుతించారు.

పురాణాలలో ఆదర్శవంతమైన స్త్రీలు అనేకమంది ఉన్నారు. పతివ్రతాధర్మాన్ని అనుసరించి భర్త అయిన శ్రీరామచంద్రుని అనుసరించి అరణ్యాలకు వెళ్లిన సీతాదేవి, భర్త ప్రాణాలను కాపాడుకునే నిమిత్తం యమధర్మరాజును సైతం వెన్నాడిన సతి సావిత్రి, త్రిమూర్తులను సైతం పసిపిల్లల్లా మార్చిన అనసూయ ఇలా అనేక మంది స్త్రీమూర్తులు తమ జీవన విధానంద్వారా నేటి ఆధునిక సమాజానికి ఆదర్శవంతంగా నిలుస్తున్నారు.

సాధ్వీమణుల సందేశాలు అనే ఈ గ్రంథంలో ఆదర్శవంతులైన సాధ్వీమణులు 11 మంది ఈ నేటితరానికి తమ జీవన విధానంద్వారా

అందించిన సందేశాలను రచయిత్రి డా॥ సూరపరాజు వసంతకుమారి గారు చాలా చక్కగా వివరించారు. ఈ గ్రంథంలో వారి జీవిత సారాన్ని తెలుసుకోవడం ద్వారా యాంత్రికంగా మారిన నేటి ఆధునిక యుగంలో స్త్రీమూర్తులు వారి జీవితాలకు బంగారు బాటలు వేసుకునే అవకాశం ఉంటుందని భావించి ఈ పుస్తకాన్ని తి.తి.దే. ముద్రిస్తున్నది. యువత ఈ గ్రంథాన్ని చదివి తమ జీవితాలను సుగమం చేసుకోవాలని ఆశిస్తూ...

సదా శ్రీవారి సేవలో...

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

## అభినందన

భారతీయ సాహిత్యం అమూల్య రత్నరాశుల నిధి. మన సాహిత్య సంద్రంలో ఎన్నో ఎన్నెన్నో ఆణిముత్యాలున్నాయి. వానిని పాఠకలోకానికి అందించడానికి రచయిత్రి చేసిన అద్భుతమైన పరిశోధనా పరిశ్రమ ఫలితరూపమే సాధ్వీమణుల సందేశాలు అన్న ఈ పుస్తకం. నిజమైన సాహిత్య ప్రయోజనము సమాజ హితమే. సంఖ్యాశాస్త్రంలో అత్యంత ప్రాముఖ్యం గల సంఖ్య తొమ్మిది. బహుశా అందుకేనేమో రచయిత్రి మన ఇతిహాసాల్లోని మహాసాధ్వీమణులు తొమ్మిది మందిని ఎంచుకొని, వారు మన సమాజానికి ఏమి సందేశాన్నిచ్చారన్న పరిశోధన చేసి, ఆ ఫలితాలను ఈ పుస్తకరూపంలో అందించారు.

పవిత్రమైన వివాహానుబంధంలో భార్య యొక్క ఆదర్శమైన పాత్రకు ప్రతిరూపంగా, సహనానికి మారుపేరుగా నిలిచినది సీతాదేవి. (బంగారులేడి లాంటి) ఆకర్షణల పరిణామాలు ఎంత ప్రమాదమైనవో తెలిపి, జీవితంలో ఎన్ని కష్టాలు, పరీక్షలు ఎదురైనా ధైర్యంగా వాటిని ఎదుర్కోవాలని ఆమె ఇచ్చిన సందేశాలు, నేడు ఆకర్షణల ఉచ్చులోపడి ఎన్నో కష్టాలకు లోనవుతున్న మరియు చిన్న చిన్న కష్టాలకు, పరీక్షలకు కూడా తట్టుకోలేక తనువులు చాలిస్తున్న ఎందరో స్త్రీలకు కనువిప్పును కలిగిస్తాయి, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తినిస్తాయి.

కులము, చదువు కాదు, గురుమార్గ దర్శకము, దైవభక్తి, సాధనే భగవంతుని చేరే మార్గాలని, అవి భగవంతుడినే భక్తుల దగ్గరకు రప్పిస్తాయని మరియు శరీరమనే సాధనంతో మోక్షాన్ని పొందడమే మానవజీవన పరమార్థమని శబరి జీవితమిచ్చిన సందేశాలు మానవాళికి ఎంతో విలువైనవి.

తారలోని మంచి వాక్చాతుర్యము, దూరదృష్టి, భర్తకు హితబోధ చేయగల జ్ఞానము, సమస్యల్ని పరిష్కారం చేయగల ధైర్యం, నేర్పు, ఇత్యాది

సుగుణాలు నేటి సతులందరూ గ్రహించి తదనుగుణంగా వారి జీవితాలను చక్కపరుచుకోవాలి.

ప్రతినాయకుడి సతియైనా తానుమాత్రం చెడు అనే బురదను అంటించుకోకుండా స్వచ్ఛంగా జీవించి, తనదైన వ్యక్తిత్వంతో, మహాపతివ్రతగా నీరాజనాలందుకొన్నది మండోదరి. పరస్త్రీలను చెరపట్టడం వలన వినాశనం జరుగుతుందని బోధించినది. ఇంద్రియాలను జయించలేనివారు ఇంద్రుడిని జయించినవారైనా సరే, పతనం తప్పదని తెలిపింది. తద్వారా చెడు మనుషుల మధ్యలో వున్నా సరే, తప్పులను సమర్థించక, మంచి సొంత వ్యక్తిత్వంతో మనుషులంతా మనుగడ సాగించాలని మండోదరి మనకు సందేశాన్నిచ్చింది.

కౌరవ సభలో దుశ్శాసనుడిచే వస్త్రాపహరణ వేళ, అరణ్యవాసంలో సైంధవుడిచే అపహరణ సమయాన, విరాటరాజు కొలువలో కీచకుడిచే మానాపహరణ వేళ ద్రౌపదిదేవి ఎన్నో అవమానాలు ఎదుర్కొంది. ఆమె వాటిని ప్రశ్నించి, ధైర్యంగా ఎదుర్కొనడమే కాక, ఎంతటి వారైనా సరే చేసిన తప్పులకు మూల్యం చెల్లించక తప్పదని చాటింది. నేడు జీవితంలో ఎదురవుతున్న చిన్న చిన్న అవమానాలను సైతం తట్టుకోలేక జీవితాలనే చాలిస్తున్న ఎందరో స్త్రీలకు ద్రౌపది జీవితం, అన్యాయాల్ని ప్రశ్నించే, అవమానాలను ఎదుర్కొనే ధైర్యాన్ని, అందుకు కారకులైనవారికి శిక్షపడేలాచేసే స్ఫూర్తిని అందిస్తూవుంది.

నీ దర్శనం కోసం మాకు మరల మరల కష్టాలనివ్వు కృష్ణా! అని ప్రార్థించిన మహాభక్తురాలు కుంతీదేవి. ఆమె భక్తి శ్రద్ధలతో దుర్వాస మహర్షిని సేవించి పొందిన వరాన్ని, కుతూహలంతో వివాహానికి మునుపే ప్రయోగించి, సూర్యదేవుని వలన కర్ణునికి జన్మనిచ్చి, దాని ఫలితంగా జీవితాంతం ఎంతో వేదనను అనుభవించింది. కుతూహలంతో పెండ్లికి మునుపే పొరపాట్లు చేసి, ఫలితంగా ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటున్న కన్యలందరికీ కుంతిదేవి

జీవితం కనువిప్పు కలిగిస్తుంది. పుత్రులను గొప్పవారిని చేయడంలో తల్లిపాత్ర ప్రముఖమైనదనే సందేశాల్ని కుంతీదేవి జీవితం అందిస్తూవుంది.

తపోవనాన పెరిగిన పతివ్రతా శిరోమణి శకుంతల. మనకు పుట్టబోయే బిడ్డను యువరాజుగా చేస్తాను అన్న దుష్యంతుని మాటలను నమ్మి ఆమె అతనికి తన సర్వస్వాన్ని అర్పించింది. మూడు రోజుల్లో రాజ మర్యాదలతో ఆశ్రమం నుండి తన రాజ్యానికి ఆమెను పిలిపించుకొంటానని వెళ్ళిన దుష్యంత మహారాజు మాట నిలుపుకోలేదు సరికదా, దూర్వాసుని శాపకారణంగా ఆమెనే మరచిపోయాడు. ఫలితంగా జన్మించిన పుత్రుడిని తీసుకొని కొంతకాలం తర్వాత అతని రాజ్యానికి వెళ్ళింది శకుంతల. దుష్యంతుడు శకుంతలతో నీవు ఎవరో నాకు తెలియదన్నాడు. జరిగిన మోసాన్ని తట్టుకొని నిలిచిన శకుంతల, అతని మోసాన్ని నిలదీసి చివరకు విజయాన్ని సాధించింది. పురుషులు వివాహానికి ముందు చెప్పే ఎన్నో మాటలను నమ్మి యువతులు మోసపోకూడదని, మోసాల్ని నిలదీసి విజయాల్ని సాధించాలని శకుంతల జీవితం సందేశాల్నిస్తూవుంది.

మహాపతివ్రతైన సావిత్రి తాను భర్తగా ఎంచుకొన్న సత్యవంతుడు అల్పాయుష్కుడని పెండ్లికి మునుపే తెలిసినా, తనకు నచ్చిన వ్యక్తికి తన మనసు ఒక్కమారే ఇవ్వడం జరుగుతుందంటూ అతనినే వివాహమాడింది. తన భర్త ప్రాణాలను తీసుకువెళుతున్న యమధర్మరాజు వెంటపడి, తన తపస్సు, వ్రతసిద్ధి, పతివ్రతా ధర్మాలు, తెలివి తేటలు, సమయస్ఫూర్తితో తిరిగి తన భర్త ప్రాణాలను పొందడమే గాక, అటు పుట్టినింట ఇటు మెట్టినింటా వెలుగులు నింపింది. తద్వారా నేటి సతులు దేనినైనా సాధించడానికి అవసరమైన సాధనా సుగుణాలను సంపాదించాలనే సందేశాన్ని సతీసావిత్రి సమాజానికి అందించింది.

దేవతలే తన స్వయంవరానికి వచ్చి వరించమన్నా వారిని కాదని, తాను ప్రేమించిన నలచక్రవర్తినే వివాహమాడి, ప్రేమ గొప్పతనాన్ని చాటినది

దమయంతి. తన భర్త జూదంలో సర్వం పోగొట్టుకొని, భయంకరమైన అరణ్యంలో ఆమెను వంటరిగా వదిలి వెళ్ళిపోయాడు. ఆమె ఆ కష్టాలన్నీ తట్టుకొని, భర్త ఎక్కడున్నాడో శోధించి, తన తెలివి తేటలతో అతనిని తిరిగి తన వద్దకు రప్పించి, కలి పురుషుని ప్రభావం వలన భర్త చేసిన తప్పులను మన్నించి, తమ జీవితాల్ని తిరిగి నందన వనంలా మలచుకొన్నది. భర్తలు వ్యసనపరులయ్యారనో, భర్తలు తమ పట్ల తప్పు చేశారనో, తమకు వారు దూరం అయ్యారనో, వివాహబంధానికి తెగతెంపులు మరియు ఆత్మహత్యలు చేసుకొంటున్న ఎందరో సతులున్నారు. వివాహ వ్యవస్థను గౌరవించి భార్యాభర్తలు తమ పరస్పర పొరపాట్లను సర్దుకొని ముందుకు వెళ్ళాలని, శోధించి సాధించే తత్వంతో సమస్యలను పరిష్కరించుకొని, తమ జీవితాల్ని ఆనందమయం చేసుకోవాలని దంపతులందరికీ దమయంతి జీవితం సందేశాల్నిస్తూ వుంది.

ఇలా ఎన్నో అద్భుతమైన విషయాల్ని రచయిత్రి ఈ పుస్తకం ద్వారా పాఠకులకు అందించారు. వసంతకుమారి గారు ఇంతకుముందే అక్షరాంజలి, అరుణకిరణాలు మరియు తెలుగు సాహిత్యంలో నీతిచంద్రికలు అనే పుస్తకాలు రచించి పాఠకుల ప్రశంసలు పొందివున్నారు. నేటి సమాజానికి హితాన్ని, మంచి మార్గ దర్శకాన్ని అందించడానికి ఎంతగానో ఉపయోగపడే ఇలాంటి అద్భుతమైన రచనను అందించిన రచయిత్రి అభినందనీయురాలు. ఈ పుస్తకం మరింత ప్రశంసలు అందుకోవాలని కోరుకుంటూ, ఈ సాధ్వీమణుల సందేశాల్ని పాఠకలోకం చదివి ఆ ఫలాలతో తమ జీవితాల్ని చక్కదిద్దుకోవాలని ఆశిస్తూ....

**– డా॥ ముంగర రమేష్ కుమార్**

## మనవి

మన భారతీయ సాహిత్యం అమృత భాండాగారం. అందులోని ఎందరో సాధ్వీమణులలో, నవరత్నాల్లాంటి తొమ్మిది మంది సాధ్వీమణులను ఎంచుకొని, వారు ఈ లోకానికి ఎలాంటి సందేశాల్ని ఇచ్చారు అన్న పరిశోధన చేయడం జరిగింది.

రామాయణ, మహాభారతాల్లోని సాధ్వీమణులైన సీతాదేవి, శబరి, తార, మండోదరి, ద్రౌపది, కుంతీదేవి, శకుంతల, సతీసావిత్రి, దమయంతులు తమ జీవితాల ద్వారా భావితరాలకు ఎలాంటి సందేశాల్ని ఇచ్చారు, వారి ద్వారా మనం ఏమి తెలుసుకోవాలి అన్న విషయాలు ఇందులో వివరింపబడ్డాయి.

వ్యక్తిత్వ వికాసాన్ని, స్ఫూర్తిని, మార్గదర్శకత్వాన్ని అందించే అమూల్యమైన ఆలోచనామృతం ఈ సాధ్వీమణుల సందేశాలు.

ఈ పుస్తకమును చదివి పాఠకులు అమృతఫలాల్ని అందుకోవాలని ఆశిస్తూ వున్నాను.

ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు తెలియజేసుకొంటూ.....

**– డా॥ సూరపరాజు వసంత కుమారి**

# విషయసూచిక


| వరస సంఖ్య | | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | సీతాదేవి | 1-22 |
| 2. | శబరి | 23-33 |
| 3. | తార | 34-49 |
| 4. | మండోదరి | 50-61 |
| 5. | ద్రౌపది | 62-83 |
| 6. | కుంతీదేవి | 84-99 |
| 7. | శకుంతల | 100-113 |
| 8. | సతీసావిత్రి | 114-130 |
| 9. | దమయంతి | 131-160 |

# సీతాదేవి

సీతమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇంతవరకు వెలుగు చూసిన విశ్వ సాహిత్యాన్ని, ఇకముందు వెలువడబోయే విశ్వసాహిత్యాన్ని కాగడాలు పెట్టి వెతికినా మరొక సీత కనిపించదు. సీత పాత్ర అంత అమోఘమైనది. రాముళ్ళు చాలామంది వుండగలరేమో గానీ, సీత మాత్రము ఒక్కతే. నిజమైన భారతీయ స్త్రీ మూర్తికి ఆమె ప్రతినిధి. పరిపూర్ణ స్త్రీమూర్తిమత్వానికి ఏ భారతీయ ఆదర్శాలు అవసరమో, అవన్నీ ఒక్క సీతమ్మ జీవితం నుండే వృద్ధి పొందాయి. అందుచేతనే ఆర్యావర్తంలో ఆ సేతు హిమాచల పర్యంతం, ఇన్ని వేల సంవత్సరాల తరబడి ప్రతి పురుషుడు, స్త్రీ, సీతాదేవిని ఆరాధిస్తూనే వున్నారు.

–స్వామీ వివేకానంద

(చైతన్య రామాయణం – మొదటి భాగం – పుట 476)

దుష్టశిక్షణ శిష్ఠ రక్షణలో భాగంగా, రాక్షస సంహారంతో పాటు వారి రాజైన రావణ సంహారం చేసి, లోక కల్యాణం జరిపించడానికి జనియించినది జానకి దేవి. ఆమె జీవనంలోని అడుగడుగూ నేటి సమాజానికి ఆదర్శమై, అనుకరణ యోగ్యమైన జీవిత సందేశాలను అందిస్తూ వుంది.

సీత సద్గుణ రాశి. సీతలో చేరిపోతే తమకే కీర్తి లభిస్తుందని భావించి, సుగుణాలన్నీ ఒకదాని వెంబడి మరొకటి నెట్టుకుంటూ వచ్చి సీతలో చేరిపోయాయి, అంటాడు. తమిళంలో కంబరు కవి, తన కంబ రామాయణంలో.

దివ్య సౌందర్యం, దేదీప్యమానమైన తేజం, అచంచలమైన పతిభక్తితత్వం, అసాధారణ పాతివ్రత్యం, ధర్మ పరాయణత్వం, నిర్భయత్వం, సౌశీల్యం, త్యాగం, సహనశీలత్వం, సాహార్దం, సంయమనం, సేవాతత్వం,

సదాచారం, సాహసం, శౌర్యం, వినయం, క్షమాగుణం, ఇలా లెక్కకు మిక్కిలి యగు మేలి సుగుణాల రాశి సీతమ్మ.

రాజర్షి అయిన జనక చక్రవర్తి యజ్ఞం చేయాలని సంకల్పించి యజ్ఞభూమిని బంగారు నాగలితో దున్ని సిద్ధం చేస్తూ వుండగా, ఆ భూమిలోని ఒక పెట్టె లోపల ఒక పాప కనిపించింది. తనకు సంతానం లేని లోటు తీర్చడానికి భూదేవి ప్రసాదించిన వరంగా భావించి, ఆపాపకు సీత అని పేరు పెట్టి, జనకుడు సీతను అల్లారు ముద్దుగా పెంచాడు.

లోకకల్యాణార్థం ఈ భూమిపైకి వచ్చిన సీత సామాన్యురాలు కాదని, ఆమెను వివాహం చేసుకొనే యువకుడు లోకానికి మంగళము చేసేవాడై వుండాలని, యుక్తవయస్కురాలైన సీత యొక్క కళ్యాణము మిథిలానగరంలోని శివధనుస్సు ఎక్కుపెట్టిన వీరునితో జరుగుతుందని, జనక మహారాజు స్వయంవరం చాటించాడు. తల్లిదండ్రులు, పిల్లల యొక్క భవిష్యత్తు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే వివాహాలు నిర్ణయిస్తారని, వాటిని గౌరవించాలనే సందేశం సీతాదేవి తన స్వయంవరం విషయంలో తండ్రి నిర్ణయాన్ని శిరసావహించడం ద్వారా నేటి సమాజానికి అందించినది.

స్వయంవరంలో శివధనుస్సు ఎక్కు పెట్టడానికి ఎందరో రాజులు ప్రయత్నం చేసి విఫలురైనారు. చివరగా రాముడు శివధనుస్సును ఎత్తి ఎక్కు పెట్టగా అది విరిగిపోయింది. సీతారాముల కళ్యాణ మహోత్సవం జరిగింది.

**ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ ।**
**ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా ॥**
**పతివ్రతా మహాభాగా ఛాయే వానుగతా సదా ।**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 1వ భాగం - 1వ కాండము - 73వ సర్గ- 26,27 శ్లోకాలు)**

వివాహానంతరం సీత రామునితో పాటు అత్తగారి ఇల్లు అయిన అయోధ్యా నగరానికి వచ్చి ఎంతో అన్యోన్యమైన దాంపత్య జీవితాన్ని

గడిపింది. సీతారాముల హృదయములందు పరస్పర రూపాలే మెదలుచుండగా, పరస్పర అనురాగంతో, ప్రేమతో మెలిగారు. ఉత్తమ గుణాలతో, మంచి ప్రవర్తనతో, పతిసేవా పరాయణత్వంతో శ్రీరాముని హృదయం తెలుసుకుని సీత వైవాహిక జీవితాన్ని గడిపింది.

తండ్రిగారు ఎంచిన సంబంధము అని సీతను రాముడు ప్రేమించాడట. కానీ సీతమ్మ రాముడిని ప్రేమించడానికి కారణం లేదట. ఈయన నాకు భర్త అన్న కారణంచేతనే ఆమె రాముడిని ప్రేమించినదట. ఇదీ భారతదేశ సంస్కృతి అంటే. రాముని మనసులో ఏముందో చెప్పక మునుపే సీత గ్రహించేదట. అతని ఇష్టాయిష్టాలకనుగుణంగా నడుచుకొనేదట. రాముడి మనసును అతనికంటే సీతే అధికంగా గ్రహించగలిగేదట. తన ప్రాణ విభుడైన శ్రీరామ చంద్రుడికి అత్యంత అనుకూలవతియైన సహధర్మచారిణిగా వెలుగొంది, భార్యాభర్తల బంధం ఎలావుండాలో ఈ లోకానికి తెలియచేసింది సీత. వివాహమైన దంపతులు నడుమ సాగవల్సిన అన్యోన్య జీవితము ఎలా వుండాలో, నేటి సమాజానికి సీత సందేశాన్నిచ్చింది.

మామగారిని ఆదరించడం, అత్త, పిన్నత్త గార్లను గౌరవించడం, మరుదులను కొడుకుల్లా చూసుకోవడం, చక్కటి మాటతీరు, వినయ విధేయతలు, ఆనంద ఉల్లాసాలు, ఇలా ఎంతో చక్కగా ప్రవర్తించినదట సీత తన అత్తగారింట. మంచి సంస్కారం, గుణముతో, వివాహానంతరం అత్తవారింట స్త్రీలు ఎలా నడుచుకోవాలో తాను ఆచరించి చూపి, సీత నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

దశరథ మహారాజు రాజ్యభారము నుంచి విశ్రాంతి తీసుకోవడం కోసం, శ్రీరామచంద్రుడిని అయోధ్య రాజ్యానికి రాజుగా చేయాలనుకుంటున్నట్లు, అందరి అంగీకారంతో ప్రకటించాడు. శ్రీరాముడికి అయోధ్య రాజ్య రాజుగా

పట్టాభిషేకం చేయడానికి ముహూర్తం నిర్ణయించారు. అందరూ అంతులేని ఆనందంతో వున్నారు. ముహూర్తపు రోజు ఉదయాన సీతారాములు పట్టాభిషేకానికి సిద్ధమై పిలుపు కొరకు ఎదురు చూస్తూ ఉన్నారు. దశరథ మహారాజు కైకేయి మందిరంలో వున్నారు. కైకేయి తమను వెంటబెట్టుకుని రావాలన్నారు, అన్న పిలుపు శ్రీరాముడికి అందింది. సీతా రాముల మోములు ఆనందంతో వెలిగాయి. రాముడు వెళ్ళాడు. సీత రాముని రాకకై ఉత్సాహంగా ఎదురు చూస్తూ వుంది.

ఇంతలో రాముడు రానే వచ్చాడు, కాని మోములో కళాకాంతులు లేవు. రాహుగ్రస్తమైన చంద్రునిలా వున్నాడు. ఆశ్చర్యముతో నిలువెల్లా కంపించిన సీత, విషయమేమిటని అడిగింది. కైకమాత తండ్రిని అడిగిన రెండు వరాలైన భరతునికి పట్టాభిషేకము, రాముని అరణ్యా వాసము గురించి తెలియచేసి తాను అరణ్యవాసానికి బయలుదేరుతున్నట్లు, ఆ విషయం సీతకు తెలియచేయడానికి వచ్చినట్లు చెప్పి అయోధ్యలో సీత ఎలా వుండాలో ఎన్నో జాగ్రత్తలు తెలియచేసి, తాను అరణ్య వాసానికి వెళ్ళొస్తానని చెప్పాడు. సీత కంటి వెంట కుండపోతగా ధారగా కన్నీళ్ళు స్రవిస్తుండగా, రామునితో ఇలా తెలిపింది.

**ఆర్యపుత్ర! పితామాతా భ్రాతా పుత్ర స్తథా స్నుషా ।**
**స్వాని పుణ్యాని భుంజానాః స్వం స్వం భాగ్యముపాసతే ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 1వ భాగం - 2వ కాండము - 27వ సర్గ- 4వ శ్లోకము)**

ఓ ఆర్య పుత్రా! తండ్రి, తల్లి, సోదరులు, పుత్రులు, అట్లే కోడలు మొదలగు వారందరును తాము చేసుకొనిన పాపపుణ్యకర్మల ఫలములను తప్పక పొందెదరు. తమ తమ శుభాశుభ కర్మఫలములను వారే అనుభవింపవలెనుగాని ఇతరులు గాదు.

**భర్తుర్భాగ్యం తు భార్యైకా ప్రాప్నోతి పురుషర్షభ।**
**అతశ్చైవాహమాదిష్టా వనే వస్తవ్యమిత్యపి॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 1వ భాగం - 2వ కాండము - 27వ సర్గ- 5వ శ్లోకము)**

**ప్రాసాదాగ్రైర్వి మానైర్వా వైహాయస గతేన వా ।**
**సర్వావస్థాగతా భర్తుః పాదచ్ఛాయా విశిష్యతే ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 1వ భాగం - 2వ కాండము - 27వ సర్గ- 9వ శ్లోకము)**

**శుశ్రూషమాణాతే నిత్యం నియతా బ్రహ్మచారిణీ ।**
**సహ రంస్యే త్వయా వీర! వనేషు మధు గంధిషు ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 1వ భాగం - 2వ కాండము - 27వ సర్గ- 13వ శ్లోకము)**

ఓ పురుష శ్రేష్ఠా! భార్య భర్తకు అర్ధాంగి. కావున భర్త యొక్క భాగ్యఫలములను పొందుటకు భార్యయే అర్హురాలు. అందువలన వనములలో నివసింపుము అని మహారాజు మీకిచ్చిన ఆదేశము మీ భార్యనైన నాకును వర్తించును. కనుక మీతో గూడి నేనును వనవాసము చేయవలసియున్నది.

సమస్త సుఖములకును నిలయమైన రాజభవనములలో నివసించుటకంటెను, స్వర్గాది లోకములలో విమానములలో విహరించుట కంటెను, అష్టైశ్వర్య సంపదలతో అంబరమున హాయిగా సంచరించుట కంటెను, ఎన్ని కష్టములు అనుభవింపవలసి వచ్చినను పతి అడుగు జాడలలో సాగిపోవుటయే సతికి సుఖప్రదము, శుభప్రదము, ధర్మ సమ్మతము.

ఓ మహావీరా! నియమ నిష్ఠలతో బ్రహ్మ చర్యమును పాటించుచునే నిత్యమూ మీకు శుశ్రూషలు చేయుచుందును. పుష్పశోభితమైన వనముల యందు మీతో విహరించుచు, అచట సంతోషముగా నుందును.

**స్వర్గేపి చ వినా వాసో భవితా యది రాఘవ ।**
**త్వయా మమ నరవ్యాఘ్ర! నాహం తమపి రోచయే ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 1వ భాగం - 2వ కాండము - 27వ సర్గ- 21వ శ్లోకము)**

**అనన్య భావా మనురక్త చేతసం త్వయా వియుక్తాం మరణాయ నిశ్చితామ్!**
**నయస్వ మాం సాధు కురుష్వ యాచనాం న తే మయాతో గురుతా భవిష్యతి॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 1వ భాగం - 2వ కాండము - 27వ సర్గ- 23వ శ్లోకము)**

**యే త్వయా కీర్తితా దోషా వనే వస్తవ్యతాం ప్రతి ।**
**గుణా నిత్యేవ తాన్ విద్ధి తవ స్నేహ పురస్కృతాన్ ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 1వ భాగం - 2వకాండము - 29వ సర్గ- 2వ శ్లోకము)**

ఓ నరోత్తమా! మీరు లేకుండా స్వర్గ సుఖములు లభించినను వాటికి నేను ఇష్టపడను. మీ వెంట ఉండుట తప్ప ఇంక నాకేమియు అక్కరలేదు.

స్వామి! నా హృదయము నందు నిన్నే పూర్తిగా నిలుపుకొనియున్నాను. నీ యందే ప్రేమానురాగాలతో జీవించియున్నాను. నీవు నాకు దూరమైనచో నేను మరణించుట తథ్యము. నా ప్రార్థనను మన్నించి, నన్ను నీ వెంట, తీసికొని పొమ్ము. నేను అరణ్యవాసాన నీకు ఏవిధముగానూ భారము కాను.

అరణ్య వాసాన ఎదురయ్యే అనేక కష్టనష్టాలను ప్రేమ పూర్ణమైన మీ సాహచర్యములతో నేను అవలీలగా అధిగమిస్తాను. మీరు నాతో వుంటే చాలు ఎంత కష్టమైనా నాకు సుఖంగానే అనిపిస్తుంది, అని సీతమ్మ రామునితో పలికింది.

సుఖాల్లోనే కాదు కష్టాల్లో కూడా ఎప్పుడూ భర్త వెంటే భార్య ఉండాలని, భర్త తోడులేనపుడు ఎంతటి సుఖమైనా వ్యర్థమేనని, భార్యాభర్తలు శరీరాలు రెండైనా ఆత్మ ఒక్కటే అన్న చందంగా జీవించాలని చెప్పి, సీతమ్మ ఈ లోకానికి సందేశాన్నిచ్చింది.

నీ సహధర్మ చారిణియైన నేను ధర్మార్థ కామ ఆచరణలోను, కష్టసుఖాల్లోను సర్వదా నీకు తోడుగా వుండి నిన్ను నీడవలె అనుసరిస్తాను, అని మా తండ్రి గారైన జనక మహారాజు వివాహ సమయమున నన్ను అప్పగించే వేళ నీకు తెలియచేశారు కదా! అని సీత శ్రీరామునికి గుర్తు చేసింది. నీవు పితృవాక్య పరిపాలకుడవై అరణ్య వాసాలకు వెళ్లడానికి సిద్ధమయ్యావు కదా! అలాగే నేను కూడా మా తండ్రి గారు చెప్పినట్లు, అన్ని కష్టసుఖాల్లో సర్వదా నీకు తోడుగా, ఎల్లవేళలా నీ నీడలా నీ వెంట నేను వుండాలి కదా. నేను కూడా నీలాగే పితృ వాక్య పరిపాలన చేయాలి కదా! అని సీత శ్రీరామునికి తెలిపింది. ఈ విధంగా కష్టసుఖాల్లోను ఎల్లప్పుడునూ నీడవలె భార్య భర్త వెంటే ఉండాలనే సందేశాన్ని మరియు స్త్రీ, పురుషులు ఇరువురూ కూడా తండ్రి మాటను తప్పక ఆచరించవలెను, అన్న సందేశాల్ని నేటి సమాజానికి సీత ఇచ్చింది.

**అను శిష్టాస్మి మాత్రా చ పిత్రా చ వివిధాశ్రయమ్ ।**
**నాస్మి సంప్రతి వక్తవ్యా వర్తితవ్యం యథా మయా ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 1వ భాగం - 2వ కాండము - 27వ సర్గ- 10వ శ్లోకము)**

భర్తతో మసులుకొను విధానము, అత్త మామలు, తోడి వారితోను, ఎవరెవరి పట్ల ఎలా ప్రవర్తించాలన్న విషయాలను నాకు తల్లిదండ్రులు ఇంతకు పూర్వమే శిక్షణ యిచ్చివున్నారు. కావున నేను అడవిలోనైనా సరే నీతో కలిసి ఉండడమే సరైన విధానము, అని సీత రామునితో తెలిపింది.

పిల్లలు పెరిగి పెద్దవుతున్న వయస్సులోనే తల్లిదండ్రులు ఇచ్చే ఉపదేశాలు పిల్లల యొక్క వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాయని, వారిని మహోన్నతమైన మూర్తులుగా తీర్చిదిద్దుతాయని, సీత నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. ఈ కారణంగానే ధర్మ స్వరూపుడైన శ్రీరామునికే, ఎంతో విశ్వాసంతో కూడిన విజ్ఞాన ఖనిలా ధర్మాలను తెలియచేయగలిగింది సీత.

చివరికి శ్రీరాముడంతటి వాడు సీత తెలియచేసిన ధర్మాలకు, తనను విడిచి ఉండలేనన్న ఆమె యొక్క అనంతమైన ప్రేమకి, రాజ్యసుఖాల కన్నా పతి ఉన్న అడవే మిన్న అన్న, సీత సతి ఔన్నత్యానికి శ్రీరాముడు తల వంచి, సీత కోరిన విధంగా తనతో పాటు అరణ్యాలకు తీసుకొని వెళ్ళడానికి అంగీకరించాడు.

శ్రీరాముడు తండ్రి మాట నిలపడం కోసం, కైకేయి అరణ్యాలకు వెళ్ళమని కోరితేనే, రాజ్యాన్ని మరియు రాజ పదవిని వదిలి అరణ్యాలకు వెళ్లాడు. కాని సీతమ్మను అరణ్యాలకు వెళ్ళమని ఎవ్వరూ కోరలేదు. పైగా శ్రీరాముడు, కౌసల్యాదేవి, వసిష్ఠుడు, ఇతరులు అందరూ సీతాదేవిని అడవులకు వెళ్ళవద్దనే కోరారు. కాని రాజ్యాన్ని, రాణి పదవిని, సకల సుఖ భోగాలను తృణీకరించి, తానే అందరినీ ఒప్పించిమరీ అరణ్యాలకు వెళ్ళిన మిక్కిలి ఉత్తమురాలు సీతాదేవి. కానీ వారిరువురూ ఆత్మ-దేహంలా వేరు వేరుగా కనిపించినా, ఇద్దరూ ఒక్కరే. తానూ అరణ్యాలకొస్తానని లక్ష్మణుడు కూడా పట్టుబట్టి అన్నయైన శ్రీరాముని అనుమతిని పొందాడు. సీతా రామలక్ష్మణులు అరణ్యవాసానికి వెళ్లడానికి బయలుదేరి దశరథ మహరాజు దగ్గరికి వచ్చారు. దశరథుడు తన మంత్రితో రాముడు పద్నాలుగు సంవత్సరాలు అరణ్య వాసం చేయడానికి అవసరమైన ధనం, వజ్ర వైడూర్య రత్నరాశులు, చతురంగ బలాలు, సేవకులను, సకల సౌకర్యాల సరంజామాను రామునితో పాటు పంపమని ఆదేశించాడు. అది విన్న కైకేయి, రాజ్యంలోని సకల సంపదనలంత రాముడితో పంపేసి, ఏమీ లేని

ఖాళీ రాజ్యాన్ని నా కొడుకు భరతునికిస్తారా? అలా వీలు కాదని అన్నది. అది విన్న రాముడు నాకు అవేవి అవసరం లేదు. నార చీరలతో అరణ్యాలకు బయలుదేరుతానని వాటిని ధరించి వచ్చాడు. కైక నారచీరలు తెచ్చి సీత మెడపై వేసి, ఆమెను కూడా వాటిని ధరించమన్నది. అది చూసిన కులగురువు బ్రహ్మర్షి అయిన వసిష్ఠ మహర్షి అంతటి మహానుభావునికి కూడా కోపం వచ్చింది. పాపీ! కైకేయీ!, ఊరుకున్న కొద్దీ నీవు మరీ దారుణంగా ప్రవర్తిస్తున్నావు. నీవు కోరిన వరాలలో అసలు సీత అడవులకు వెళ్లాలనే లేదు. రాముడు సీత ఇద్దరూ ఒక్కరే కాబట్టి, సీతకు రాజ్య పట్టాభిషేకం నేను చేస్తాను. పతి ధర్మానికి కట్టుబడి తనకు తాను స్వయంగా అడవులకు వెళుతున్న సీతను నార చీరలు ధరించడమనడం తగదని హెచ్చరించాడంట. సీత మాత్రం ఏమి పలుకక లోనికెళ్ళి ఆ వస్త్రాలను ధరించడానికి ప్రయత్నం చేసి, వాటిని ఎలా కట్టుకోవాలో తెలియక కన్నీళ్ళ పర్యంతమవుతూ వుంటే, శ్రీరాముడు వచ్చి ఎలా ధరించాలో చెప్పాడంట. సీతమ్మకొచ్చిన కష్టాలను చూసి అక్కడ ఉన్న దశరథుని భార్యలు, మంత్రులు గుండెలను బాదుకుని మరీ ఏడ్చారట. ఈ ఘటనలో సీత సహనం, పెద్దలను ఎదిరించి మాట్లాడకపోవడం లాంటి సత్ప్రవర్తనలు సమాజానికి ఇచ్చిన సందేశాలు.

సీత అరణ్యాలలో కూడా ఆనందంగా, నిర్భయంగా రామునితో ఉండేది. అడవులలో తపస్సు చేసుకునే ఋషులు, రాక్షసులు పెడుతున్న బాధలను శ్రీరామునికి వివరించి, వారిని కాపాడమని కోరారు. రాముడు రాక్షసులందరినీ సంహరించి వారిని కాపాడుతానని మాట ఇచ్చాడు. ఆ తరువాత రాముడితో దారి మధ్యలో, రాక్షసులతో అకారణ వైరం వద్దని, హింసకు దూరంగా ఉండి ప్రశాంతంగా తాపసధర్మాన్ని స్వీకరించి పదునాలుగేండ్లు అరణ్యవాసం పూర్తి చేసుకొని అయోధ్యకు తిరిగి వెళదాం అని, ధర్మాన్ని సీతమ్మ భర్తకు బోధించింది. అకారణ వైరం ఎప్పుడూ

ఎవరితోనూ మంచిది కాదనే సందేశాన్ని నేటి సమాజానికి సీత తెలియ చేసింది.

రావణుడి కోరిక మేరకు మారీచుడు బంగారు లేడి రూపంలో వచ్చాడు. సీత ఆ లేడిని చూసి ఆకర్షితురాలై దానిని పట్టి తీసుకురమ్మని రాముడిని కోరింది. లక్ష్మణుడు హెచ్చరించినా రాముడు ఆగలేదు. ఆ మాయలేడి రాముడిని దూరంగా తీసుకెళ్ళింది, రాముడు వేసిన బాణానికి ఆ మారీచుడనే రాక్షసుడు చనిపోతూ హా లక్ష్మణా!, హా సీతా! కాపాడమంటూ రాముడి గొంతుతో అరచి మరీ చనిపోయాడు. రాముడు ఆపదలో ఉన్నాడనుకొన్న సీత, లక్ష్మణుడిని బలవంతంగా అన్నను కాపాడమని చెప్పి పంపి మరీ, అరణ్యాన ఒంటరిగా మిగిలింది. అంతటి అంతఃపుర భోగాలే వదులుకొని అడవులకు వచ్చేసిన సీతకు, ఆ కాంచన లేడిపై ఎందుకంత కాంక్ష కలిగిందో? అన్న ప్రశ్నకు సమాధానం, ఆకర్షణలు మనసును హరించి సకల కష్టాలకు కారణమవుతాయన్న సందేశాన్ని నేటి సమాజానికి ఇవ్వడానికే అనే భావించాలి.

యతి వేషంలో వచ్చి సీతను ప్రలోభపెట్టడానికి ప్రయత్నించి, తర్వాత తన నిజరూపాన్ని చూపి భయపెట్టిన రావణుడు, లంకకు సీతను ఎత్తుకొని వెళ్ళాడు.

రావణాసురుడు సీతమ్మను తీసుకొని ఆకాశమార్గాన వెళుతూ ఉన్నప్పుడు తన జాడ రామునికి తెలపాలని, తన ఆభరణములను కొన్నింటిని మార్గ మధ్యలో సీత జారవిడిచింది. తరువాత సీత జాడ తెలుసుకోవడంలో రామునికి ఆ ఆభరణాలే ఎంతగానో ఉపయోగపడతాయి. ఎవరికైనా ఆపద ఎదురైనప్పుడు మనోధైర్యాన్ని వీడక, బుద్ధికుశలతను ఉపయోగించి సమయస్ఫూర్తితో వ్యవహరించి, ఆపద నుంచి తప్పించుకోవడానికి ప్రతి ఒక్కరూ ఉపాయంతో కూడిన ప్రయత్నం చేయాలన్న సందేశాన్ని ఈ చర్య ద్వారా, సీతాదేవి సమాజానికి అందించింది.

లంకా నగరంలో అశోకవనంలో ఉన్న సీతను రావణుడు తన సంపద గొప్పదనాలు చూపి ఆశలు పెట్టి, రాముడు ఇక్కడికి రాలేడని, యవ్వనం కరిగిపోతుందని చెప్పించి, బెదిరించి, పరి పరివిధాలుగా ప్రాధేయపడి తన కోరిక తీర్చమన్నాడు. చెరగని నిర్భయత్వంతో సీత గడ్డి పరకలు అడ్డుపెట్టి ఇలా మాట్లాడింది. నువ్వు పరమ దుర్మార్గుడివి, నేను రామపత్నిని, పతివ్రతను, ఆడ సింహాన్ని, రాముని ముందు నీవు గడ్డిపరకతో సమానము. కోరి ప్రాణాల మీదికి తెచ్చుకోకు. రాముడు మహావీరుడు, నా పతే నాకు దైవం. రాముడు లేనప్పుడు దొంగగా నన్ను అపహరించుకొని వచ్చావు. నీ ప్రాణాలు తీసి నా స్వామి నన్ను తీసుకువెళతాడు. నా ప్రాణం పోయినా నేను రాముడిని తప్ప అన్యులను కన్నెత్తి కూడా చూడనని చెప్పింది. ఆపదలు ఎదురయినా మొక్కవోని నిర్భయత్వం, ప్రలోభాలకు లొంగని పతివ్రతాతత్వం, ఇవన్నీ నేటి సమాజానికి సీత ఇచ్చిన సందేశాలు.

రామలక్ష్మణులు సీతను వెతుకుతూ, సుగ్రీవుని మైత్రితో, వానరులను సీతా అన్వేషణకు దశదిశలకు పంపారు. మహా బలశాలి శ్రీరామ బంటు హనుమంతుడు, లంకలోని సీతమ్మ జాడ తెలుసుకొని, ఎవ్వరూ లేని సమయాన రామనామ స్మరణ చేస్తూ చెట్టుపై నుంచి దిగి, సీతమ్మకు నమస్కరించి నేను రామదూత హనుమను, అని సీతకు తెలిపాడు. అది కూడా రాక్షస మాయేనేమో అన్న అనుమానంతో, చాలా జాగ్రత్తగా వివరాలను తెలుసుకొని, శ్రీరామలక్ష్మణుల శారీరక చిహ్నాలు హనుమ తెలిపి, రామనామం కలిగిన ముద్రికను చూపిన తరువాతే హనుమను సీత నమ్ముతుంది.

**అర్హసే చ కపిశ్రేష్ఠ మయా సమభిభాషితుమ్ ।**
**యద్యసి ప్రేషితస్తేన రామేణ విదితాత్మనా ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 2వ భాగం - 5వ కాండము - 36వ సర్గ- 10వ శ్లోకము)**

హనుమా! ఆత్మజ్ఞాని అయిన రాముడు నిన్ను పంపి ఉంటే నీవు నాతో భాషించవచ్చునని, సీత పలుకుతుంది. స్త్రీలు కొత్త వ్యక్తులను నమ్మకూడదు. రకరకాలుగా మోసం చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎంతో అప్రమత్తతతో జాగరూకతో నడుచుకోవాలనే సందేశం, సీత నేటి సమాజానికిచ్చింది.

అమ్మా! నీవు నాపై అధిరోహించు, అగ్నిహోత్రుడు హవిస్సును తీసుకువెళ్ళి ఎలా దేవతలకప్పగిస్తాడో, అలా నిన్ను ఆకాశ మార్గాన తీసుకువెళ్ళి రామునికి అప్పగిస్తాను. అన్న హనుమతో సీతమ్మ ఇలా అంటుంది.

**భర్తృభక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర ।**
**నాహం స్ప్రష్టుం స్వతో గాత్రమిచ్ఛేయం వానరోత్తమ ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 2వ భాగం - 5వ కాండము - 37వ సర్గ- 62వ శ్లోకము)**

వానరోత్తమా! పాతివ్రత్య ధర్మం ప్రకారం నేను రాముణ్ణి తప్ప మరి ఏ పురుషుని కూడా ముట్టుకోను, అని పుత్ర సమానుడైన ఆంజనేయునితో సీత పలికింది. రాముడు లేనప్పుడు అపహరించుకొని వచ్చిన రావణాసురుడి చెరలో సకల కష్టాలను ఎన్నో రోజులుగా అనుభవిస్తున్న సీతమ్మ, వచ్చిన అవకాశాన్ని తృణప్రాయంగా కాదని, రాముడే వచ్చి రావణుడిని సంహరించి తనను తీసుకెళ్ళాలి, అని కోరిన మహోన్నతురాలు. ఇటువంటి ఎన్నో సుగుణాలను సీతాదేవి నేటి సమాజానికి అందించారు.

సీతమ్మ ఎన్నో రాక్షస మాయలను, కష్టాలను మొక్కవోని ధైర్యంతో, సహనంతో, రామునిపై అచంచలమైన విశ్వాసంతో తట్టుకొని నిలబడింది. రామరావణ యుద్ధంతో, రావణాది రాక్షసులందరూ మరణించారు. హనుమంతుడు వచ్చి ఈ విషయాన్ని సీతమ్మకు తెలియచేశాడు.

**న హిపశ్యామి సదృశం చింతయంతీ ప్లవంగమ ।**
**మత్ప్రియాఖ్యాన కస్యేహ తవ ప్రత్యభినందనమ్ ॥**

**నచ పశ్యామి తత్ సౌమ్య! పృథివ్యామపి వానర ।**
**సదృశం మత్ప్రియాఖ్యానే తవ దాతుం భవేత్ సమమ్ ॥**

**హిరణ్యం వా సువర్ణం వా రత్నాని వివిధాని చ ।**
**రాజ్యం వా త్రిషు లోకేషు నైతదర్హతి భాషితుమ్ ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 6వ కాండము - 116వ సర్గ- 19 నుండి 21 శ్లోకములు)**

"హనుమా, నువ్వు నాకు ఎంత ప్రియమైన మాట చెప్పావో తెలుసా!" ఇవ్వాళ నీవు చెప్పిన ఇంత ఆనందమైన మాటకి నేను నీకు ఏదో ఒక బహుమతి ఇవ్వాలి. ఎంత బంగారం ఇచ్చినా సరిపోదు. ఎన్ని రత్నములు ఇచ్చినా సరిపోదు. మూడు లోకములు తెచ్చి నీకు ఇచ్చినా కూడా అది తృణప్రాయం. నేను ఏమి ఇవ్వగలను? ఇవ్వాళ నీకు ఇవ్వడానికి నా దగ్గర ఏమీ లేదు. అంత గొప్ప మాట చెప్పావు", అని సీతమ్మ, హనుమంతుడితో అన్నది. ఇతరులు చేసిన మేలును గుర్తించే కృతజ్ఞత అనే గొప్ప సుగుణం ఈ సమాజానికి అవసరమని సీత ఈ చర్య ద్వారా సందేశాన్నిచ్చింది.

నాకు ఇవ్వడానికి ఏమి లేదన్నావుగా అమ్మా, నాకు ఒక వరం ఇవ్వు అమ్మా, నిన్ను ఎన్నో హింసలకు గురిచేసిన ఈ రాక్షస కాంతలను చంపెయ్యాలని వుంది, ఆ వరం ఇమ్మని సీతమ్మను హనుమ అడిగాడు. అప్పుడు సీతమ్మ ఇలా చెప్పింది.

**రాజ సంశ్రయవశ్యానాం కుర్వంతీనాం పరాజ్ఞయా ।**
**విధేయానాం చ దాసీనాం కః కుప్యేద్వానరోత్తమ ॥**

**పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ ।**
**కార్యం కరుణ మార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి ॥**
**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 6వ కాండము - 116వ సర్గ- 39వ శ్లోకము)**

హనుమా, వాళ్లు దాసీజనం, వాళ్ళ రాజు ఏమి చెప్పాడో అదే వాళ్ళు చేశారు. దోషం వాళ్ళది కాదు, ప్రభువుది. చెడు చేసిన వాని పట్ల దయ వుండాలి. అంతా మంచిగా ఉన్న వాడిమీద దయ ఎందుకు? కాబట్టి ఈ రాక్షస స్త్రీల పట్ల దయతో వుండాలి. నీవు ఇటువంటి వరం కోరకూడదు. వాళ్ళను చంపకూడదు. వీళ్లందరికీ నారక్ష, అని సీత హనుమంతుడితో పలికింది. ఇవి సీతామాత యొక్క దయా, క్షమాగుణాలు. భారతీయ స్త్రీలు ఇటువంటి గుణాలు కలిగి మంచి సంస్కారం కలిగివుండాలని సీత సమాజానికి సందేశాన్నిచ్చింది.

రావణ వధ తరువాత విభీషణునికి లంకారాజ్య పట్టాభిషేకం జరిపించాడు శ్రీరాముడు. తరువాత శ్రీరాముడు సీతను తీసుకురమ్మని కోరాడు. ఇన్ని కష్టాల తర్వాత, ఇంత ఎడబాటు తరువాత, శ్రీరాముడిని కలవబోతున్న తన భర్త ఎంత ప్రేమగా చూస్తాడో! ఎంత ప్రియంగా పలకరిస్తాడో అన్న, ఎన్నో ఊహలతో, ఆనందంతో అశోకవనం నుంచి వచ్చిన సీతను చూసి, రాముడు ఇలా పలికాడు. సీతా! శత్రు సంహారం చేశాను. నా పౌరుషం చూపించాను. నా ప్రతిజ్ఞ నెరవేర్చాను, నా మిత్రుల కృషి ఫలించింది. ఇదంతా నీ కొరకు కాదు. నా కొరకు, నా కీర్తి కొరకు, నీవు ఇంత కాలం రావణుని ఆధీనంలో వున్నావు కాబట్టి నీ చరిత్ర సందేహాస్పదం. నిన్ను స్వీకరించడానికి నా మనసు అంగీకరించడం లేదు. ఇక నీవు నీ యిష్టం వచ్చిన చోటికి వెళ్ళవచ్చు. భరత లక్ష్మణ సుగ్రీవ విభీషణులు ఎవరైనా నీకు తిండి బట్టలు ఇచ్చి పోషిస్తారు, అన్నాడు రాముడు.

ఊహించని ఆ పరిణామానికి ఒక వైపు దుఃఖం, మరొకవైపు కోపం, ఇంకోవైపు అందరిలో జరిగిన అవమానంతో సీత తల్లడిల్లిపోయింది. ఏం చేయాలో, ఏం మాట్లాడాలో తెలియక కన్నీటి తరంగాలు ఉప్పెనై కనుల నుంచి దుముకుతూ ఉంటే తట్టుకోలేక విలవిలాడిపోయింది. కొంతసేపటికి కన్నీళ్లు తుడుచుకుంటూ, పొంగిపొరలే దు:ఖాన్ని దిగమ్రింగుకుంటూ ఇలా పలికింది. స్వామీ! మీరేనా ఇలా మాట్లాడినది? మీరు అనకూడని, నేను వినకూడని ఇలాంటి మాటలు అన్నారేమీ మహానుభావా? చిన్నతనంలో పాణిగ్రహణం చేసి, చాలాకాలం నాతో దాంపత్య జీవనం చేసిన మీకు తెలియదా, నేను ఎటువంటి దాననో? అయోనిజగా, భూమిసుతగా పుట్టి, జనకుని ఇంట పెరిగిన నేను, అంత చేతకాని స్త్రీలా నీకు కనపడుతున్నానా? నీకు నిజంగా ఇలాంటి అనుమానం వుండి వుంటే హనుమను ఎందుకు నా జాడ కోసం పంపావు? ఇంత దూరం సేతువు కట్టి మరీ వానర సేనతో ఎందుకు వచ్చావు? యుద్ధం ఎందుకు చేశావు. ఆ రోజే హనుమ ద్వారా నీ అనుమానం తెలిపివుంటే నేను ఈ పాటికే అక్కడే ప్రాణాలను విడిచి ఉండేదానిని కదా?. నేను స్త్రీని కాబట్టి ఎలా అయినా మాట్లాడవచ్చునని అనుకుంటున్నావా? నా భక్తి, నా సౌశీల్యం, నా నడవడిక, అన్నింటినీ, కేవలం నేను లంకలో ఉండిపోయానన్న కారణంతో, నీవు మరచిపోయావు.

**చితాం మే కురు సౌమిత్రే! వ్యసనస్యాస్య భేషజమ్ ।**
**మిథ్యోప ఘాతోపహతా నాహం జీవితు ముత్సహే ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 6వ కాండము - 119వ సర్గ- 18వ శ్లోకము)**

**యథా మే హృదయం నిత్యం నాపసర్పతి రాఘవాత్ ।**
**తథా లోకస్య సాక్షీ మాం సర్వతః పాతు పావకః ॥**

**యథా మాం శుద్ధ చారిత్రా మదుష్టాం జానాతి రాఘవః ।**
**తథా లోకస్య సాక్షీ సర్వతః పాతు పావకః ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 6వ కాండము - 119వ సర్గ- 24, 25 శ్లోకములు)**

నేను బ్రతికి ఉంటే రాముని ఇల్లాలిగా బ్రతుకుతాను. చచ్చిపోయినా రాముని ఇల్లాలిగానే చచ్చిపోతాను. అంతేకాని ఒకసారి అపనింద పడ్డ తర్వాత ఇంక నాకీ జీవితంతో సంబంధం లేదు. లక్ష్మణా చితిపేర్చు, అంది సీత. లక్ష్మణుడు చితి పేర్చాడు. సీత శ్రీరామునికి ప్రదక్షిణ చేసి, దేవ, బ్రాహ్మణులకు ప్రణమిల్లి, అగ్నికి నమస్కరించి ఇలా పలికింది.

హే లోకసాక్షి! అగ్నిదేవా! రాముని తప్ప నేను అన్య పురుషుని స్మరించకుండా ఉన్నట్లయితే, మనసా, వాచా కర్మణా నేను ఆ రామునే స్మరిస్తూ ఉన్నట్లయితే, పంచభూతాలు, అష్టదిక్పాలకులు నన్ను పతివ్రతగా భావించినట్లయితే నన్ను రక్షించు, అని సీత పలికి, భగభగ మండే ఆ మంటలలోకి అగ్నిప్రవేశం చేసింది. అక్కడ వున్న రాక్షస వానరులందరి హాహాకారాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. బ్రహ్మ, రుద్ర, ఇంద్రాది సకల దేవతలు అక్కడికి వేంచేశారు. అగ్నిదేవుడు సీతమ్మ తల్లిని అగ్నిహోత్రం నుంచి పైకి తీసుకుని వచ్చి ఇలా పలికాడు.

**ఏషా తే రామ! వైదేహీ పాపమస్యాం న విద్యతే ।**
**నైవ వాచా న మనసా నానుధ్యానాన్న చక్షుషా ॥**

**సువృత్తా వృత్త శౌండీర! న త్వామ్ అతిచచార హ ।**
**విశుద్ధ భావాం నిష్పాపాం ప్రతి గృహ్ణీష్వ రాఘవ ॥**
**న కించిదభిధాతవ్యమ్ అహమాజ్ఞాపయామి తే ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 6వ కాండము - 121వ సర్గ- 6, 7, 11వ శ్లోకములు)**

రామచంద్ర ప్రభూ! నీ ధర్మపత్నియైన ఈ సీత యందు ఎట్టి దోషమూ లేదు. ఆమె వాక్కులు పవిత్రములు, మనసు నిర్మలము, బుద్ధి స్వచ్ఛము, చూపులు దివ్యములు, ఈమె సత్ప్రవర్తన కలిగి త్రికరణ శుద్ధిగా ఎల్లప్పుడునూ నిన్నే ధ్యానించు చుండెడిది. ఈ పుణ్యాత్మురాలు నిన్ను తప్ప ఇతరులను చింతించి యెరుగదు. ఈమె హృదయము పవిత్రమైనది. ఎట్టి దోషమూ ఎరుగనిది, ఈమెను స్వీకరింపుము, ఇది నా ఆజ్ఞ, అని అగ్నిదేవుడు శ్రీరామునితో పలికాడు. అప్పుడు శ్రీరాముడు సీతాదేవిని స్వీకరించాడు. రాశీభూతమైన ధర్మ స్వరూపమైన శ్రీరాముని వ్యక్తిత్వం కంటే ఎంతో మిన్నగా సౌశీల్యవతియైన మహాపతివ్రతా శిరోమణియైన సీతాదేవి వ్యక్తిత్వం ప్రకాశించిన ఈ అద్భుత ఘట్టం రామాయణంలోనే ఎంతో కీలకం. తనపై వెలిబుచ్చిన సందేహాలకు సీత ధీటుగా సమాధానాలు చెప్పి, అభిమానవతియై తన సౌశీల్యం నిరూపించడానికి అగ్ని ప్రవేశం చేసిన ధీరోదాత్త, మహా పతివ్రత అయిన సీత జీవనం ఈ లోకానికే ఆదర్శం. ఎటువంటి నిందలు ఎదురయినా ధీటుగా వాటికి సమాధానం ఇవ్వాలని, తమను తాము నిర్దోషులుగా నిరూపించుకోవాలని, సీత నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

సీతారామ లక్ష్మణులు పదునాలుగు సంవత్సరాలు అరణ్యవాసాన్ని పూర్తి చేసుకొని అయోధ్యకు వచ్చారు. శ్రీరామునికి అయోధ్య రాజ్య పట్టాభిషేకం జరిగింది. సీతమ్మ చక్కగా తన గృహస్థ ధర్మాలను పాటిస్తూ ఆనందంగా కాలం గడుపుతూ ఉంది. రాజాంతఃపురంలోని ఉద్యానవనంలో విహరిస్తున్న సీతను రాముడు నీవు సంతానవతివి కాబోతున్నావు. ఏం కావాలో కోరుకో అని అడిగాడు. గంగాతీర పవిత్ర మున్యాశ్రమాల్లో ఒక్క రోజైనా ఉండాలని ఉందని కోరింది. రాముడు పంపిస్తాను అన్నాడు, వేగులను కలవడానికి వెళ్ళిన రామునికి, లోకంలో ఎవరో సీతమ్మపై వేసిన అపవాదు గురించి తెలిసింది. రాముడు లక్ష్మణుడిని పిలిచి సీతమ్మను అడవులలో వదిలి రమ్మని చెప్పాడు. గర్భవతి అయిన సీతను లక్ష్మణుడు అడవిలో వదిలి, లోకుల

అపవాదు, శ్రీరాముని ఆజ్ఞ గురించి చెప్పాడు. సీత కంట కన్నీళ్ళ ప్రవాహం గంగా నదిలా ధారగా కారిపోతూ ఉండగా, గడ గడ వణుకుతూ, ఎందుకు నే చేయని తప్పుకు నాకీ అకారణ శిక్ష? అని శోకిస్తూ మూర్ఛపోయింది. ఎంతో సేపటికి తెప్పరిల్లుకొని, నేనొక దురదృష్టవంతురాలని, ఈ అరణ్య వాసాన్ని ఎలా అనుభవించేది అని, అగ్ని ప్రవేశం చేసి మరీ నా పవిత్రతను నిరూపించుకొన్నాక కూడా నాకీ అపవాదులెందుకు అని, రోదించింది. చివరకు శ్రీరామునికి తెలుపమని లక్ష్మణుడితో సీత ఇలా పలికింది.

**శిరసాభినతో బ్రూయాః సర్వాసామేవ లక్ష్మణ ।**
**వక్తవ్యశ్చాపి నృపతిః ధర్మేషు సుసమాహితః ॥**

**జానాసిచ యథా శుద్ధా సీతా తత్త్వేన రాఘవ ।**
**భక్త్యా చ పరయా యుక్తా హితా చ తవ నిత్యశః ॥**

**అహం త్యక్తా త్వయా వీర అయశోభీరుణా జనే ।**
**యచ్చతే వచనీయం స్యాత్ అపవాద సముత్థితమ్ ॥**

**మయా హి పరిహర్తవ్యం త్వం హి మే పరమాగతిః ।**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 7వ కాండము - 48వ సర్గ- 11,12,13 శ్లోకములు)**

**అహంతు నానుశోచామి స్వశరీరం నరర్షభ ।**

**యథాఽపవాదం పౌరాణాం తథైవ రఘునందన ।**
**పతిర్హి దేవతా నార్యాః పతిర్బంధుః పతిర్గురుః ॥**

**ప్రాణైరపి ప్రియం తస్మాత్ భర్తుః కార్యం విశేషతః ।**
**ఇతి మద్వచనాద్రామో వక్తవ్యో మమ సంగ్రహః ।**
**నిరీక్ష్య మద్య గచ్ఛ త్వమ్ ఋతుకా తివర్తినీమ్ ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 7వ కాండము - 48వ సర్గ- 16,17,18 శ్లోకములు)**

రఘురామా! యథార్థానికి సీత పరమ పవిత్రురాలు, నిరంతరమూ అత్యంత భక్తి తత్పరతతో నీహితమే కోరుతూ ఉంటుంది. ఈ విషయం మీకు కూడా తెలుసు, అయినా నలుగురిలో అపకీర్తి పాలవుతానేమో అన్న భయంతో నన్ను అడవులలో వదిలివేసి, దిక్కులేని దానిని చేశావు. లోకాపవాదము వలన నీపై వచ్చిన నిందను నేను తొలగింపచేయాలి. ఎందుకంటే అది భార్యగా నా ధర్మము.

మహారాజా! నేనయితే నా ప్రాణమును గురించి ఏ మాత్రం బాధపడను. పౌరులు నాగురించి అపవాదులు పలికి ఉండచ్చు. నేను దాని గురించి భయపడను, ఎందుకంటే నేను స్వచ్ఛమైన శీలము గల ధర్మపత్నిని. స్త్రీకి పతియే దైవం, బంధువు, గురువు, ప్రాణముల కంటే మిన్న. అందువల్ల భర్త ఆజ్ఞను ఇల్లాలు ఎప్పుడూ పాటించాలి అని, రామునికి తెలియచేయుమని లక్ష్మణునితో సీత తెలిపింది. లోకులను కానీ, రామున్ని కానీ, ఎవ్వరినీ సీత ఎన్నడూ నిందించని మహానుభావురాలు.

సీతమ్మ ధర్మనిరత, త్యాగతత్వం అనన్యం, అసామాన్యం. సీతమ్మ మాటల్లోని ఆణిముత్యాలాంటి ఎన్నో సుగుణాలు నిత్యపఠనీయాలు, ఆచరణ, ఆదర్శకాలు. తమ జీవితాలను పతివ్రతా పరమయోగినులుగా తీర్చిదిద్దుకోవడానికి నేటి స్త్రీలోకానికి ఇవన్నీ కూడా అవసరమైన సందేశాలు.

లక్ష్మణుడు అరణ్యంలో ఒంటరిగా వదిలేసి వెళ్ళాక రోదిస్తున్న సీతను, వాల్మీకి మహర్షి తన ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు. అక్కడే లవకుశలకు సీతమ్మ జన్మనిచ్చింది. వారికి రామకథాగానాన్ని వాల్మీకి నేర్పాడు. రాముని ముందు లవకుశలు చేసిన రామకథా గానంతో, వారిరువురు తన పుత్రులే అన్న విషయాన్ని రాముడు గ్రహించాడు. దూతలను వాల్మీకి దగ్గరకు పంపి, సీత పవిత్రురాలైతే, ఏ పాపము ఎరగనిదే అయితే, పాతివ్రత్యాన్ని గురించి ఆమె సర్వజనుల సమక్షంలో ప్రమాణం చేస్తే, తిరిగి ఆమెను స్వీకరిస్తానని కబురు పంపాడు. రేపు సీత రామ సమక్షానికి వచ్చి, రాముడు కోరిన

విధంగా సర్వజనుల ముందు ప్రమాణం చేస్తుందని, వాల్మీకి తిరిగి రామునికి వర్తమానం పంపాడు.

ఆ మహర్షి సీతమ్మతో ఏం మాట్లాడాడో, ఆమె ఏమి నిర్ణయం తీసుకుందో తెలీదు. మరుసటి రోజు తలవంచుకొని ఒక మూగ బొమ్మలా మహర్షి వెంట నడచి వచ్చి రాజు, మంత్రులూ, పరివారం, ఋషులు, వానరులు, సర్వులు, సకల జనాలు ఉన్న రామసభలో అడుగుపెట్టింది. సీత తల ఎత్తి ఎవ్వరినీ చూడలేదు. చివరకు శ్రీరాముని కూడా, చేతులు జోడించి నిశబ్ధంగా నిలబడింది. శ్రీరామచంద్రా! సీత పరమ పవిత్రురాలు, మహా పతివ్రత, నా ఆశ్రమంలోనే కుశలవులకు జన్మనిచ్చింది. నీ కుమారులను, ఈ మహాసాధ్విని స్వీకరించు, అని వాల్మీకి మహర్షి పలికాడు.

మీరు చెప్పిన విషయం సత్యం, ఈ విషయాన్ని లంకానగరంలో సీత చేసిన అగ్నిప్రవేశం కూడా నిరూపించింది. లోకుల అపవాదు కారణంగానే నేను ఆమెను విడచిపెట్టాను. ఇప్పుడు నాకు ఆమె పవిత్రురాలన్న ప్రమాణం కావాలి, అప్పుడు గాని నేను ఆమెను స్వీకరించలేను, అని శ్రీరాముడు పలికాడు.

అభిమానధనురాలయిన ఆ పరమ పతివ్రతా శిరోమణికి ఎన్ని అవమానాలో? ఎన్నెన్ని కష్టాలో?? ఎన్నిసార్లు ఈ పరీక్షలో???. వంచిన తలను ఎత్తకుండానే కాషాయ వస్త్రాలు ధరించి వున్న సీతమ్మ ఒక్క అడుగు ముందుకు వేసింది, గద్గద కంఠంతో కన్నీరు కారుస్తూ ఎలుగెత్తి ఇలా పలికింది.

**యథాహం రాఘవాదన్యం మనసాపి న చింతయే ।**
**తథామే మాధవీ దేవీ వివరం దాతు మర్హతి ॥**

**మనసా కర్మణా వాచా యథా రామం సమర్చయే ।**
**తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి ॥**

**యద్యేతత్ సత్యముక్తం మే వేద్మి రామాత్ పరం నచ ।**
**తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 7వ కాండము - 97వ సర్గ- 15,16,17వ శ్లోకములు)**

అమ్మా! భూదేవీ! నేను రాముని తప్ప ఇతరుల నెవ్వరినీ నా మనసున ఎన్నడూ తలచకుండా ఉన్నట్లయితే నీ హృదయంలో నాకు స్థానమివ్వు. నేను ఎల్లవేళలా మనసావాచా కర్మణా త్రికరణ శుద్ధిగా రాముడినే ఆరాధిస్తూ ఉన్నట్లయితే నాకు నీలోనికి దారిచూపు. నేను శ్రీరాముడిని తప్ప ఇతరులని ఎరగనిది సత్యమే అయితే, భూమాతా నన్ను నీ ఒడిలోకి చేర్చుకో అమ్మా! అంటూ సీతాదేవి శపథం చేసింది.

అకస్మాత్తుగా భూమి బ్రద్ధలై, పృథ్వి లోపల నుంచి దివ్య సింహాసనంపై కూర్చోనివున్న భూదేవి పైకి వచ్చి, ప్రేమగా చేతులు చాపి సీతను దగ్గరకు తీసుకొని కన్నీరు తుడిచింది. తన ఒడిలో కూర్చోబెట్టుకొని స్వాగతపూర్వకంగా అభినందించి, సీతతో కలసి భూదేవి తిరిగి భూమిలోనికి అంతర్ధానమై పోతుండగా, దేవతలు పూల వాన కురిపించి జయజయ నినాదములతో సీతా సౌశీల్యమును కొనియాడారు. సభలోని వారంతా ఆశ్చర్యంలో మునిగిపోయి చూస్తూ వుండగా, సీతా! సీతా! అంటూ దిక్కులు పిక్కటిల్లేలా రాముడు శోకిస్తూండగా, సీతమ్మ తన తల్లి అయిన భూదేవితో పాటు పాతాళానికి వెళ్ళిపోయింది. ఈ పృథ్వీ మండలంలోనే సాటిలేని మేటి స్త్రీ మూర్తి జీవితం సమాప్తమైంది.

పరాశరభట్టర్, లక్ష్మీదేవిని గురించి ప్రార్థిస్తూ ఇలా అంటాడు - అమ్మా నీవు ఇంక ఎప్పుడయినా ఏ అవతారమయినా స్వీకరించు గాని, నీవు ఇక ఎప్పుడూ సీతమ్మగా మాత్రం రావద్దు. నీ కష్టాలు వినలేము. నీ కష్టాలు చదవలేము. ఎందుకమ్మా ఇన్ని కష్టాలు. ఇంతటి దేవతామూర్తియైన నీకు, అని.

సీతా సాధ్వి జీవితంలో ఎన్నో మలుపులు, ఎన్నెన్నో పరీక్షలు, ఎన్నో కష్టాలు, ఎన్నెన్నో శిక్షలు, ఎవరూ కోరకపోయినా, అందరూ వద్దన్నా, అంతఃపుర సుఖాలను కాదని, అరణ్య వాసాలకు తన భర్త కోసం వెళ్ళింది. సహధర్మచారిణిగా శ్రీరామునికి అన్ని విధాలా సహకారాన్ని అందించి అనునిత్యమూ సేవించింది. ఆయనకోసం అడవుల కెళ్లి సకల కష్టాలు పడి, రావణ అపహరణకు గురై, అశోకవనంలో ఎంతో శోకానికి గురై, పతి ధర్మపాలనకై అగ్నిలో ప్రవేశించింది. భర్త కీర్తి కోసం చేయని తప్పులకు నిందు గర్భవతిగా ఉన్న సమయంలో మరొకసారి అడవులపాలైంది. భర్త కోసం ఎన్నో త్యాగాలను, ఎన్నో కష్టాలను, చివరికి తన జీవితాన్నే ధారబోసిన సీత, ఎన్నడూ ఎవ్వరినీ నిందించలేదు, ఎవ్వరి మనసునూ నొప్పించలేదు. అభిమానవతిగా చివరకు శపథం చేసి మరీ తన జీవితాన్నే చాలించిన పరమ పతివ్రతా శిరోమణి సీతాదేవి. ఇంతటి వ్యక్తిత్వం రామ సతియైన సీతకే సొంతం. సీత కారణ జన్మురాలు. సీత లేకుంటే రావణవధే లేదు, రావణ వధే లేకుంటే రామ కథే లేదు, అందుకే రామాయణం సీతా చరిత్ర.

మానవుడిగా పుట్టి మాధవుడైన శ్రీరామచంద్రుడి వ్యక్తిత్వాన్ని మించిన మహోజ్వలమైన వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకొన్న సీతాదేవి జీవితం ధర్మానికి నిలువెత్తు ప్రతిరూపమే, ఆమె జీవితంలోని అడుగడుగు ఆదర్శమే.

సీత స్త్రీ జాతికి గర్వకారణం. ఆమె చరిత్ర లోకోపకారం, ఆమె జీవితంలోని ప్రతి అడుగూ ధర్మపథం, ఆదర్శం. పైన వివరించినట్లు నేటి సమాజానికి సీతాదేవి ఇచ్చే అమూల్యమైన సందేశాలు లెక్కకు మిక్కిలి. ఆ సందేశాలు ఆ చంద్రతారార్కం మానవజాతి వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శనం చేసే అద్భుతమైన అఖండ జ్యోతులుగా వెలుగొందుతూనే ఉంటాయి.

* * *

# శబరి

మహాభక్తురాలు, తపస్సంపన్నురాలు పరమయోగిని, మట్టిలో పుట్టిన మాణిక్యం, గురు భక్తి పరాయణురాలు, పరిచారికాభక్తి ద్వారా మోక్షాన్ని సాధించిన ధన్యజీవి, ఆత్మశక్తి మూర్తీభవించిన మూర్తి, ధర్మచారిణి, శ్రమజీవి, దీర్ఘాయువు, పరమభాగవతోత్తమురాలు శబరి. సీతారామ లక్ష్మణులు అరణ్యవాసంలో వున్న వేళ, మాయోపాయంతో రావణుడు సీతను అపహరించాడు. సీతను అన్వేషిస్తూ రామలక్ష్మణులు అరణ్యాల్లో సాగుతూ వున్నారు. గిరిజన జాతిలో జన్మించిన అడవి మల్లెపువ్వు శబరి. అడవిలోనే పుట్టి అడవిలోనే పెరిగి, అడవిలోనే మోక్ష సాధన సాధించిన సాధ్వి శబరి. అరణ్యంలో పంపానది తీరాన మాతంగ మహర్షి ఆశ్రమం ఉంది. ఆ ఆశ్రమ ప్రాంతం వివిధ ఫల పుష్పవృక్షములతో, నదీ సరోవర తీరంతో, విశేషమైన కందమూలాలతో, సుగంధ సువాసనలు నిండిన గాలులతో, ఎంతో అందంగా అలరారుతూ ఉన్నది. ఆ ఆశ్రమంలోనే మాతంగ మహర్షి, అతని శిష్యులు తపస్సు చేస్తూ ఉండేవారు. అక్కడ పూలను ఎవ్వరూ త్రుంచరు. మాలలుగా ధరింపరు. అవి ఎన్నడను వాడవు. రాలిపోవు. మాతంగ మహర్షి శిష్యులు గురువు గారి కొరకు వనములలో లభించెడి కందమూల ఫలములను, సమిధలను తీసికొని వచ్చెడి వేళ, అలసిన వారి శరీరములు నుంచి స్వేద బిందువులు రాలుచుండెడివి. అవి గాలి వాటున చెట్లపై బడి పూవులుగా మారెడివి. ఆ తపస్సంపన్నుల స్వేదం వలన జనియించిన మహిమాన్వితమైన ఆ పుష్పాలు ఎన్నటికీ నశించేవి కావు, అని తెలుపుతూ కబంధుడు శ్రీరామునితో ఇలా పలికాడు.

**తేషాం గతానామ్ అద్యాపి దృశ్యతే పరిచారిణీ ।**
**శ్రమణీ శబరీ నామ కాకుత్స్థ! చిరజీవినీ ॥**

**త్వాం తు ధర్మే స్థితా నిత్యం సర్వభూత నమస్కృతమ్ ।**
**దృష్ట్వా దేవోపమం రామ! స్వర్గలోకం గమిష్యతి ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగం - 3వ కాండము - 73వ సర్గ- 25,26 శ్లోకములు)**

మాతంగ మహర్షి, వారి శిష్యులందరూ వెళ్ళిపోయిననూ, వారికి సేవలు చేయుచూ ఉండిన ఒక సన్యాసిని మాత్రము నేటికిని అక్కడే ఉన్నది. శబరి అనుపేరుతో ప్రసిద్ధికెక్కిన ఆమె దీర్ఘాయువు. ఆమె నిత్యము ధర్మకార్యములను మహాత్ములను సేవించుట యందే తన జీవితాన్ని పండించుకొన్న మహానుభావురాలు. నీవు దైవము, సకల ప్రాణులకు ఆధార భూతము, నీ కోసమే ఆమె ఎదురుచూస్తూ ఉంది. నిన్ను దర్శించిన తర్వాతనే ఆమె మోక్షాన్ని పొందుతుందని, కబంధుడు శ్రీ రామునికి తెలిపాడు. రామలక్ష్మణులు మతంగ వనం వైపు కదిలారు.

మాతంగాశ్రమంలో ఒక మూల ఉంది శబరి కుటీరం. ఆమె నిత్యమూ వేకువనే లేచి ఆశ్రమాన్ని ఊడ్చి, శుభ్రం చేసి, నీళ్ళు చల్లి ముగ్గులు పెట్టేది. మహర్షుల పూజకు పూలు, వారి ఆహారానికి పండ్లు సిద్ధం చేసేది. మహర్షుల నారబట్టలు శుభ్రంగా ఉతికి ఆరబెట్టేది. ఆమె ఎప్పుడూ ఆశ్రమం, అందులోని ఋషుల సేవలో తరిస్తూ ఉండేది. శబరి చేసిన తపస్సు ఏమిటంటే, తపస్సు చేసే మహర్షుల శుశ్రూషయే. స్వామి సన్నిధికి చేరడానికి వారధులు గురువులే అని విశ్వసించడమే. ఆ ఆశ్రమంలోని ఋషులంతా మోక్షాన్ని పొందారు. వారు స్వర్గానికి వెళుతున్న వేళ మాతంగ మహర్షి శబరిని పిలిచి, శబరీ, నిన్ను చూడడానికి శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో కలసి ఇక్కడికి వస్తాడని, నీ అతిథి సత్కారాలను స్వీకరిస్తారని, ఆ పుణ్య పురుషుని దర్శనంతో నీకు మోక్షం లభిస్తుందని, చెప్పాడు. అప్పటి నుంచి శబరి శ్రీరామ దర్శనం కోసం నిరీక్షిస్తూ ఉంది.

శబరి నిరక్షరాస్యులైన గిరిజన కులంలో జన్మించినా, తాను జీవించడానికి భక్తి బాటను ఎంచుకొన్నది. తనకు చేతనైన పరిచారిక భక్తితో మహర్షులను సేవించింది. తద్వారా కులం, విద్య ఇవేవి కూడా సన్మార్గంలో జీవించడానికి అడ్డు కావనే సందేశాన్ని ఇచ్చింది. మహర్షుల, గురువుల మాటలు అజ్ఞాన చీకట్లను తొలగించే విజ్ఞానపు వెలుగులని, వాటిని ఆచరించాలనే సందేశాన్ని సమాజానికి శబరి ఇచ్చింది.

శ్రీరాముడు వస్తాడని ఆశ్రమాన్ని అలికి, ముగ్గులు పెట్టి, కూర్చోవడానికి శుభ్రంగా వేదికను సిద్ధం చేసి, తినడానికి చెట్టు చెట్టును వెతికి బాగా పండి ఎక్కువ తీయదనానిచ్చే మేలిమి పండ్లను, రకరకాల మధురమైన కందమూలాలను, తాగడానికి సెలయేటి నీటిని, పరిశుద్ధమైన తేనెను, పూజించడానికి రకరకాల పూలను, శబరి సేకరించి సిద్ధంగా ఉంచి, రామలక్ష్మణుల రాక కోసం ప్రతిరోజూ ఎదురుచూస్తూ ఉన్నది.

ఆ రోజు ఎందుకో శబరి మనసులో ఏదో తెలియని ఆనంద పారవశ్యం కలుగుతూ ఉంది. ఇన్నాళ్ళ తన ఎదురుచూపు ఫలించే రోజు నేడేనన్న ఊహ కలుగుతూ ఉంది. మాటి మాటికీ గుమ్మం దగ్గరకెళ్లి కుడిచేతిని నుదుటిపై పెట్టుకొని కనిపించేంత మేర రామలక్ష్మణులు వస్తూ ఉన్నారేమో అని శబరి చూస్తూనే ఉంది. అల్లంత దూరాన దివ్యతేజోరూపంతో కదిలివస్తున్న రామలక్ష్మణులు శబరికి దర్శనమిచ్చారు. వారు దగ్గరయ్యే కొద్దీ ఆ ఆశ్రమప్రాంతమంతా కాంతివంతంగా కళకళాడిపోయింది. ఇన్నాళ్ళ శబరి నిరీక్షణ ఫలించింది. శబరి శరీరం జలదరించి కళ్ళు ఆనంద భాష్పాలతో చెమ్మగిల్లాయి, పెదవులు రామా! రామా! అని పలవరిస్తూ ఉండగా, శబరి తనువెల్లా నిలువెల్లా భక్తి పారవశ్యంతో పులకించి పోయింది. పలకలేక, పలుకు రాక పరవశంతో తబ్బివుబ్బిబ్బైపోతున్న శబరి వైపు చిరునవ్వుతో చూశాడు శ్రీరాముడు.

**పతిత్వా పాదయోరగ్రే హర్షపూర్ణాశ్రులోచనా,**
**స్వాగతేనాభినన్ద్యాథ స్వాసనే సన్న్యవేశయత్.**

**రామలక్షణయోః సమ్యక్ పాదౌ ప్రక్ష్యాల్య భక్తితః**
**తజ్జలేనాభిషిచ్యాఙ్గమథార్ఘ్యాదిభిరాదృతా.**

**(ఆధ్యాత్మ రామాయణము - అరణ్యకాండము - 6,7 శ్లోకములు)**

సంతోషముచే నిండిన కన్నీళ్లు గల కన్నులతో, శ్రీరామ లక్ష్మణులకు సాష్టాంగ నమస్కారము చేసి, స్వాగతము పలికి వారిని వేదిక మీదనున్న సుఖాసనముపై శబరి కూర్చోబెట్టింది. భక్తితో రామలక్ష్మణుల పాదములను

పళ్ళెంలో ఉంచి కాళ్ళు కడిగి, ఆ నీటిని తన శిరస్సుపై చల్లుకొని, అర్ఘ్యము, చందనాను లేపనముతో గూడిన పూలతో పూజ చేసింది. తియ్యటి పండ్లను నివేదించి అత్యంత భక్తిశ్రద్ధలతో అతిథి మర్యాదలను చేసింది.

దైవం కోసం మనుషులు ఎలా నిరీక్షించాలో, ఎలా పూజలు చేయాలో, ఎలాంటి భక్తి శ్రద్ధలను దైవం పట్ల మానవులు కలిగి ఉండాలో తాను ఆచరించి చూపి, నేటి సమాజానికి శబరి సందేశాన్నిచ్చింది.

**కచ్చిత్ తే నిర్జితా విఘ్నాః! కచ్చిత్ తే వర్ధతే తపః ।**
**కచ్చిత్ తే నియతః క్రోధ ఆహారశ్చ తపోధనే! ॥**

**కచ్చిత్ తే నియమః ప్రాప్తః కచ్చిత్ తే మనసః సుఖమ్! ।**
**కచ్చిత్ తే గురుశుశ్రూషా సఫలా చారు భాషిణి! ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగం - 3వ కాండము - 74వ సర్గ- 8, 9 శ్లోకములు)**

తపోధనురాలా! నీ తపస్సు ఆటంకాలు లేకుండా వర్ధిల్లుతూ వుంది కదా!? కామక్రోధాలను పూర్తిగా జయించావా? ఆహారాది నియమాలకు ఏ విధమైన భంగము కలగడం లేదు కదా!? ప్రశాంతమైన జీవనం కొనసాగిస్తున్నావు కదా? ఓ మృదు భాషిణీ! నీవు చేసిన గురుసేవ ఫలించిందా? అని శ్రీరాముడు చిరునవ్వుతో శబరి యోగక్షేమాలు అడిగాడు.

తాపసియై దండకారణ్యంలోని తపోభూమికల్ని సున్నితంగా స్పృశిస్తూ, సాధనలే శ్వాసలుగా జీవించిన శబరిని శ్రీరాముడు ఆదరంతో అడిగిన ప్రశ్నలు ఆలోచింప చేసే విధంగా ఉన్నాయి. చిత్త వృత్తిని నిరోధించేదే తపస్సు అందులో ఏమి ఆటంకాలు లేవు కదా? మరి నిరంతరం చేసే ఆ తపస్సు సాధనలో ప్రగతి లభిస్తేనే దానికి సార్థకం, అందుకే అందులో వృద్ధి వుందా అని ప్రశ్నించాడు. అరిషడ్వర్గాలలో ప్రధానమైనవి కామక్రోధాలే.

కామం వలననే క్రోధం ఏర్పడుతుంది. ఈ రజోగుణాలు ఆధ్యాత్మిక జీవనానికి ప్రబల ప్రతిబంధకాలు, అందుకే వాటిని నిరోధించగలిగావా అని అడిగాడు. మనం తీసుకొనే ఆహారం సాత్విక, రాసజ, తామసాహారాలని మూడు రకాలు. అందుకే ఆహారాన్ని బట్టే మనుషుల గుణగణాలుంటాయి. అందుకే ఆహార నియమాలు పాటిస్తున్నావా? సాధన వలన లభించే శాంతి మనసుకు లభిస్తూ ఉందా? గురుసేవ ద్వారా పొందగలిగే నిత్యానందాన్ని పొందగలిగావా? అని శ్రీరాముడు శబరిని ప్రశ్నించాడు.

**రామేణ తాపసీ పృష్టా సా సిద్ధా సిద్ధ సమ్మతా ।**
**శశంస శబరీ వృద్ధా రామాయ ప్రత్యుపస్థితా ॥**

**అద్య ప్రాప్తా తపస్సిద్ధిః తవ సందర్శ నాన్మయా ।**
**అద్య మే సఫలం తప్తం గురవశ్చ సుపూజితాః ॥**

**అద్యమే సఫలం జన్మ స్వర్గశ్చైవ భవిష్యతి ।**
**త్వయి దేవవరే రామ! పూజితే పురుషర్షభ ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగం - 3వ కాండము - 74వ సర్గ- 10,11,12 శ్లోకములు)**

తపస్సిద్ధురాలు, సిద్ధులకును పూజ్యురాలు, జ్ఞాన వయోవృద్ధురాలు ఐన శబరి, భక్తి శ్రద్ధలతో శ్రీరామునికి ఇలా సమాధానము చెప్పింది. “ఓ శ్రీరామచంద్ర ప్రభో! నేడు నిన్ను కనులారా దర్శించుటతో నా తపస్సు సిద్ధించినది, నా తపోజీవనము సఫలమైనది, గురు సేవలు సార్థకములైనాయి. ఓ దేవ దేవా! పురుషోత్తమా! నిన్ను పూజించు భాగ్యము కలిగినందున నా జన్మ ధన్యమైనది. ఇక నాకు మోక్షం లభించినట్లే. ఓ రఘునందనా! నీ అవ్యాజ కరుణా కటాక్షముల వలన నేను పవిత్రురాలను అయ్యాను. నీ అనుగ్రహము వలన నేను మరల జన్మము లేని దివ్య పరంధామ ప్రాప్తిని పొందుతాను”, అని శబరి రామునితో పలికింది.

పరమాత్మను దర్శించడమే సమస్త సాధనల యొక్క లక్ష్యము. గురుసేవ ద్వారా భగవంతుని దర్శించవచ్చును. నిజమైన భక్తితో స్వామిని పూజిస్తే భక్తుడు అడవులలో ఉన్నా భగవంతుడు అక్కడికే వస్తాడు. మోక్ష సాధన కొరకే ఈ మనుష్య జీవితం. ఇత్యాది ఆణిముత్యాల్లాంటి ఎన్నో అద్భుతమైన సందేశాలను శబరి సమాజానికి అందించినది.

**చిత్రకూటం త్వయి ప్రాప్తే విమానైరతుల ప్రభైః ।**
**ఇతస్తే దివమారుఢా యానహం పర్యచారిషమ్ ॥**

**తైశ్చాహముక్తా ధర్మజ్ఞైః మహాభాగైర్మహర్షిభిః ।**
**ఆగమిష్యతి తే రామః సుపుణ్యమిమమాశ్రమమ్ ॥**

**సతే ప్రతిగృహీతవ్యః సౌమిత్రి సహితో తిథిః ।**
**తం చ దృష్ట్వా వరాన్ లోకాన్ అక్షయ్యాంస్త్వం గమిష్యసి ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగం - 3వ కాండము - 74వ సర్గ- 14,15,16 శ్లోకములు)**

నేను పరిచర్యలు చేసిన మునులందరూ, నీవు చిత్రకూట పర్వతము చేరినప్పుడే, ఈ ప్రదేశమును విడచి, సాటిలేని కాంతిగల విమానములు ఎక్కి స్వర్గమునకు వెళ్ళారు. వెళ్లేటప్పుడు, ధర్మవేత్తలు అత్యంత పూజ్యనీయులైన ఆ మహర్షులు, లక్ష్మణునితో కలసి శ్రీరాముడు పవిత్రమైన ఈ ఆశ్రమానికి వస్తారు, మీకు తగు అతిథి సత్కారములు చేయమని, మీ దర్శన భాగ్యంతో నేను అక్షయములైన ఉత్తమ లోకాలకు వెళ్ళగలనని, వారు నాకు చెప్పారు, అని శబరి శ్రీరామునితో తెలిపింది.

శబరికి మహర్షులు చెప్పిన మాటలపై అచంచలమైన విశ్వాసముంది. వారి వచనాలు వృథాకావనే నమ్మకం వుంది. మహాత్ములను సమీపించడం, వారి మాటలను ఆలకించడం మాత్రమే సరిపోదు. ఆలకించిన విషయాలను త్రికరణ శుద్ధిగా ఆచరించాలి. అప్పుడే భగవత్ కృపకు పాత్రులు అవుతారు.

మహాత్ములు, గురువులు, పెద్దల మాటలపై విశ్వాసము వుంచి, త్రికరణ శుద్ధిగా వాటిని ఆచరిస్తే మోక్షంతో సహా అసాధ్యం కానిది ఏదీ లేదు, అని శబరి తన జీవితం ద్వారా నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

**అధమతె అధమ అధమ అతి నారీ। తిన్హ మహమై మతిమంద ।**
**కహా రఘుపతి సును భామిని బాతా! మానఁ ఏక భగతి అఘారీ! కర నాతా ॥**

**జాతి పాతి కుల ధర్మ బడా ఈ। ధన బల పరిజన గున చతురాఈ ।**
**భగతి హీన నర సోహి కైసా। బిను జల బారిద దేఖిఅ జైసా ॥**
**(శ్రీరామచరిత మానసము - అరణ్యకాండము - 34 -2,3)**

ప్రభూ! నేనే విధముగా మిమ్ముస్తుతించేది? ఓ పాప విమోచన! నేను తక్కువ జాతి స్త్రీని, మంద బుద్ధిని, అధమురాలను, జడమతిని అని రాముని ఎదుట నిలుచుకొని ఆమె మనసున అంతులేని భక్తి పొంగి పొరలుతూ ఉండగా, శబరి పలికింది.

శబరీ! నాకు కేవలము భక్తి ప్రధానము. జన్మము, వంశము, కులము, ధనము, శక్తి, బంధుత్వం, గౌరవము, బుద్ధి మొదలైనవి ఎన్ని ఉన్నా అవన్నీ కూడా నీరు లేని మేఘము వలె వృథా. వారు నా ప్రేమకు పాత్రులు కాలేరు, అని రాముడు తెలిపినట్లు తులసి రామాయణము, రామచరిత మానసము తెలియజేశాయి.

జాతి, కులాలు, ఇతరములన్నియూ స్వామి కృప పొందడానికి అడ్డంకులు కావు. భక్తియే ప్రధానము. భక్తి కలిగివుంటే ఎవరైనా స్వామి అనుగ్రహాన్ని, ఏ తరతమ భేదాలు లేకుండా సాధించచ్చును, అన్న సందేశాన్ని శబరి నేటి సమాజానికిచ్చింది.

నవ విధ భక్తి మార్గాలు ఏమిటో శబరికి ఇలా రాముడుతెలియచేశాడని శ్రీరామచరిత మానసము తెలియచేసింది. నవవిధ భక్తులలో మొదటిది మంచి వారి సాంగత్యము, రెండవది భగవంతుడి కథలయందనురక్తి.

మూడవది గర్వమును వదిలి గురుచరణములను సేవించుట. మనస్ఫూర్తిగా దైవ గుణములను గానము చేయుట నాల్గవది. రామనామ జపము, దైవంపై దృఢ విశ్వాసం కలిగి వుండడం ఐదవది. ఇంద్రియ నిగ్రహము, శీలము, లౌకిక కర్మలయందు విరక్తి, సత్ కార్యాచరణము ఆరవది. జగత్తునంతా రామమయంగా భావించి, భాగవతోత్తములను పూజించుట ఏడవది. ప్రాప్తించిన దానితో తృప్తి పొందుతూ, కలలో కూడా ఇతరుల దోషములను తలపకుండుట ఎనిమిదవది. అందరితో మంచిగా, నిష్కపటముగా వ్యవహరిస్తూ, హృదయమున భగవంతునిపై విశ్వాసముంచి, ఆనంద విషాదములను దరిచేరనీయకుండా వుండడం తొమ్మిదవది. ఈ తొమ్మిదింటిలో ఏ ఒక్క భక్తి మార్గమును అనుసరించినా చాలు, వారు జడమైన, చేతనమైన, స్త్రీయైన, పురుషుడైన నాకత్యంత ప్రీతి పాత్రులు. నీలో ఈ తొమ్మిదింటిలో ఏ ఒక్కటో కాదు, తొమ్మిదీ సంపూర్ణముగా కలవు. అందుకే యోగులకు సైతం వీలుకాని నా దర్శనం మరియూ కైవల్యమూ రెండూ నీకు కలిగాయి, అని శ్రీరాముడు శబరికి వివరించాడు.

శబరీ!, కబంధుడు నీ గురించి, నీ గురువు గురించి, ఈ ఆశ్రమ వైభవాన్ని గురించి చెప్పాడు. నేను ఆ వైభవాన్ని ఒక్కసారి చూడాలను కొంటున్నాను, అని రాముడు అడగగానే శబరి వారికి ఆశ్రమం మొత్తము చూపిస్తూ, అన్ని వివరాలను ఇలా తెలిపింది. దట్టమైన వృక్ష సముదాయములతో కప్పి, జంతు పక్షులతో నిండి వున్న ఈ వనము మతంగ వనముగా ప్రసిద్ధికెక్కినది. సర్వవేళల పరమాత్మ ధ్యానములో వుండే మా గురువులు, గంగానదీ జలమును ఆహ్వానించి ఈ పంపా సరోవరమును రూపొందించారు. ఆ పూజా స్థలమును చూడండి, అక్కడే మా గురువు గారు వృద్ధాప్యం వలన వణుకుతున్న చేతులతో దేవతలను పూలతో అర్చించేవారు. వారి తపః ప్రభావం వలన ఈ వేదికలు నేటికీ దివ్యకాంతులను దశదిశలకు ప్రసరింపచేస్తూ ఉన్నాయి. ఉపవాస కారణంచే కలిగిన బడలిక వలన గురువు

సముద్రాల వద్దకు వెళ్ళలేక, తన తపః శక్తితో సప్త సాగరముల తీర్థములను ఇక్కడికే రప్పించారు. ఈ తీర్థము నందు స్నానములు ఆచరించి తమ తడి వస్త్రాలను ఇచ్చటి చెట్లపై ఆరవేశారు. వారి శరీర స్పర్శ ప్రభావము వలన అవి ఇంకా చెక్కు చెదరక అలానే ఉన్నాయి. వారు దేవతలకు పూజలు చేసిన కలువలు, కమలములు, పూలమాలలు నేటికిని వాడిపోక అలాగే సువాసనలు వెదజల్లుతూ తాజాగా ఉన్నాయి, అని శబరి శ్రీరామునికి ఆ తపోవన శోభను చూపి వివరించింది. రామ లక్ష్మణులు ఆ వైభవములను తిలకించి మిగుల ఆశ్చర్యకరములుగా ఉన్నవి అంటూ!, ఎంతో ఆనందించారు. ఈ విధంగా గురువులు తనకు అప్పచెప్పిన పనిని శబరి అత్యంత భక్తి శ్రద్ధలతో పరిపూర్ణంగా నెరవేర్చింది. పెద్దలు తమకు అప్పజెప్పిన పనిని ప్రతి ఒక్కరూ పరిపూర్ణంగా పూర్తి చేయాలనే సందేశాన్ని శబరి నేటి సమాజానికి అందించింది.

రాముడు శబరిని సీత జాడ తెలిస్తే చెప్పమని అడిగాడు. అప్పుడు శబరి సర్వము తెలిసిన దైవానివి నీవు, నీకు తెలియనిదేమీ లేదు. మానవ అవతారంలో వచ్చావు కాబట్టి, లోకము కోసం నన్ను అడుగుతున్నావా స్వామీ! అంటూ, రావణుడుచే అపహరింపబడిన సీత లంకలో ఉన్నదని, ఋశ్యమూక పర్వతముపై వున్న సుగ్రీవుడితో చెలిమి చేస్తే రామకార్యము పూర్తి అవుతుందని తెలిపింది. దైవ కార్యంలో తనవంతు సహాయ సహకారాలు అందించి తన జన్మను సార్థకం చేసుకొంది శబరి. దైవకార్యాలకు మనుషులు తమ జీవితాలను వెచ్చించి, తమ జీవితాలను ధన్యం చేసుకోవాలనే సందేశాన్ని శబరి నేటి సమాజానికి అందించింది.

**యావదాగమనం తస్య తావద్రక్ష కలేబరమ్,**
**దృష్ట్వా రాఘవం దగ్ధ్వా దేహం యాస్యసి తత్పదమ్**
**(ఆధ్యాత్మ రామాయణము – అరణ్యకాండము – శ్లో 15)**

శబరీ! పరమాత్మ రాక్షసులను వధించి, ఋషులను రక్షించుటకు శ్రీరాముడై భూమిపైన జనియించి ఉన్నాడు. ఆ రాముడు నీ దగ్గరకు వచ్చే

వరకు ఈ దేహాన్ని రక్షించుకో, రామ దర్శనం కాగానే పరమాత్మలో ఐక్యమవ్వు, అని గురువులు శబరితో గతంలో తెలిపారు.

**తదిచ్ఛామద్య సుజ్ఞాతా త్యక్తుమేతత్క ళేబరమ్।**
**తేషామిచ్ఛామ్యహం గన్తుం సమీపం భావితాత్మనామ్।**
**మునీనాశ్రమో యేషామహం చ పరిచారిణీ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగం - 3వ కాండము - 74వ సర్గ- 28, 29 శ్లోకములు)**

శ్రీరామ! నీవు అనుమతిస్తే ఇక నా శరీరాన్ని పరిత్యజించాలని కోరుకుంటూ ఉన్నాను. మా గురువులు నివసించిన ఈ ఆశ్రమాన నేను పరిచారికను. కనుక నేను కూడా ఆ పుణ్య పురుషుల కడకు వెళ్ళుటకు దయతో నన్ను అనుమతించు స్వామి, అని ప్రార్థించింది. అప్పుడు రాముడు ఆ యోగిని అయిన శబరితో నీవు చేసిన పూజలకు నేను ఎంతో సంతోషించాను. నీ ఇష్టానుసారము నీవు హాయిగా వెళ్ళుము, అని అనుమతినిచ్చాడు.

84లక్షల జీవరాశుల్లో మానవ జన్మ అత్యుత్తమైనది. ఈ జన్మలోనే జీవన పరమావధి అయిన మోక్షాన్ని సాధించాలి. మోక్ష సాధనకు సాధనము మానవ దేహం. కాబట్టి మనుషులు తమ జీవన అంతరార్థం, దాని సాధనా మార్గం, అందుకు అవసరమైన దేహ రక్షణ చేసుకోవాల్సిన అవసరము, వీటన్నింటిని అర్థం చేసుకొని, తదనుగుణంగా జీవించాలనే సందేశాన్ని సమాజానికి శబరి అందించింది.

**ఇత్యుక్త్వా జటిలా వృద్ధా చీరకృష్ణాజినాంబరా ।**
**తస్మిన్ ముహుర్తే శబరీ దేహం జీర్ణం జిహాసతీ ॥**

**అనుజ్ఞాతాతు రామేణ హుత్వాత్మానం హుతాశనే ।**
**జ్వలత్పావక సంకాశా స్వర్గమేవ జగామ సా ॥**
**దివ్యాభరణ సంయుక్తా దివ్యమాల్యాను లేపనా ॥**

**దివ్యాంబర ధరా తత్ర బభూవ ప్రియదర్శనా ।**
**విరాజయంతీ తం దేశం విద్యుత్సౌదామినీ యథా ॥**

**యత్రతే సుకృతాత్మానో విహరంతి మహర్షయః ।**
**తత్పుణ్యం శబరీ స్థానం జగామాత్మ సమాధినా ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగం - 3వ కాండము - 74వ సర్గ- 32 నుండి 35 శ్లోకములు)**

నార చీరను, జింకచర్మాన్ని ధరించి ఉన్న వృద్ధురాలగు శబరి అగ్నిని ప్రతిష్టించుకొని తన దేహాన్ని అగ్నిహోత్రునికి ఆహుతి చేసి, అగ్ని తేజస్సుతో వెలుగొందుచున్న దివ్య దేహాన్ని పొంది, అపూర్వములైన ఆభరణాలు, హారాలు, వస్త్రాలు, సుగంధాది లేపనములతో విద్యుల్లతవలె మెరసిపోతూ, ఆ ప్రాంతాన్నంతా వెలుగులతో నింపుతూ, శ్రీరామ లక్ష్మణులకు వినయపూర్వక నమస్కారాలు సమర్పిస్తూ, అక్షయ లోకాలకు తన సమాధి యోగ ప్రభావముచే చేరింది.

జ్ఞాన వైరాగ్య భక్తి మార్గాలలో ప్రయాణం చేసి, గురువులను సేవించి, వారి మాటలు ఆచరించి, దైవకార్యం నెరవేర్చి, తపశ్శక్తిని సంపాదించి, సన్యాసినిగా యోగశక్తిని సాధించి, పవిత్ర మనసుతో ఆత్మజ్ఞానాన్ని సంపాదించి, కులం, స్త్రీ, పురుష భేదాలతో సంబంధం లేదని భక్తే స్వామి దర్శనానికి మరియు మోక్షానికి కారణమని నిరూపించి నేటి సమాజానికి ఆదర్శనీయమైన సందేశాల్ని ఎన్నింటినో (పైన వివరించిన విధంగా) అందించిన ధన్యజీవి, పుణ్యజీవి శబరి.

* * *

# తార

గొప్ప దూరదృష్టి, విశేషమైన ప్రజ్ఞాపాటవాలు, అద్భుతమైన వాక్చాతుర్యము, అమోఘమైన ధైర్యస్థైర్యాలు, మంచి హితబోధ చేయగల నేర్పు, సాటిలేని రాజనీతిజ్ఞత లాంటి ఎన్నో సుగుణాలను కలిగి, ఆకాశంలో తారలు తళుకు మని మెరిసినట్లు రామాయణంలో తన వ్యక్తిత్వపు వెలుగులతో మెరిసిన స్త్రీ మూర్తి తార.

తార జన్మ వృత్తాంతం స్కాంద పురాణంలో చెప్పబడింది. సుషేణుడు ఒక వానరవీరుడు. ఒకసారి సుషేణుడు దేవతలతో యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో సుషేణుని యొక్క సృజనాత్మకశక్తి, యుద్ధ నైపుణ్య కౌశలాలు చూసి, ఆశ్చర్య ఆనందాలు చెందిన దేవతలు, ఒక గొప్ప కుమార్తె అతనికి పుట్టేలా వరాన్ని ఇచ్చారు. దేవతల వరంతో వానర వీరుడైన సుషేణునికి తార జన్మించింది. ఈమె అప్సరసలా సౌందర్యరాశి, వివేక శీలి, బాహ్య సౌందర్యంతో పాటు అంతః సౌందర్యము కూడా కలిగిన అద్భుతమైన వానర కన్య.

తార యుక్త వయస్కురాలవగానే ఆమె తండ్రి సుషేణుడు ఆమెకు స్వయం వరం ప్రకటించాడు. ఇంద్రుని అంశంతో జన్మించిన వాడు, ఇంద్రుడిచ్చిన బంగారు హారము ధరించడం వలన ఎప్పుడూ ఉత్సాహంగా వుండగలవాడు, తన ఎదుటికి ఎవరు వస్తే వారిలోని సగబలాన్ని బ్రహ్మదేవుని వరం వలన తన సొంతం చేసుకోగలవాడు, రావణాసురుడినే బంధించగల అత్యంత బలము గలవాడు, నిత్యమూ బ్రహ్మముహుర్తం నందు లేచి సూర్యుడు ఉదయించక మునుపే నలు దిక్కుల్లోని నాలుగు సముద్రాలలో అనాయాసంగా సంధ్యోపాసన చేయగల పరాక్రమవంతుడు, వానర రాజ్యమైన కిష్కంధా సామ్రాజ్యానికి రాజు అయిన వాలిని స్వయంవరంలో తార తన భర్తగా ఎంచుకొని, కిష్కంధ రాజ్య పట్టపురాణి అయ్యింది.

వాలి సోదరుడు సుగ్రీవుడు. రాజైన అన్న వాలికి సుగ్రీవుడు సేవా స్నేహభావాలతో సహాయ సహకారాలు అందిస్తూ వుండేవాడు. రాక్షస రాజైన మయుని పెద్ద కుమారుడు మాయావి అనే రాక్షసుడు. మాయావికి వాలికి పూర్వము స్త్రీ మూలమున వైరము ఏర్పడినది. ఒకనాడు రాత్రి అందరూ నిదురించువేళ కిష్కందకు మాయావి అనే రాక్షసుడు వచ్చి, వాలిని యుద్ధానికి రమ్మనమని బిగ్గరగా అరిచాడు. వాలి యుద్ధానికి బయలుదేరాడు. సుగ్రీవుడు కూడా అన్న అయిన వాలికి తోడుగా బయలుదేరాడు. వీరిరువురిని చూసి ఆ రాక్షసుడు భయంతో పారిపోయి ఒక బిలంలోకి ప్రవేశించాడు. లోనికి వెళ్ళి ఆ రాక్షసుడిని చంపివేసి వస్తాను, నేను తిరిగి వచ్చే వరకు నీవు ఈ బిలద్వారం వద్దనే ఉండు, అని సుగ్రీవుడికి చెప్పి వాలి లోపలికి వెళ్ళాడు. ఒక సంవత్సర కాలానికి పైగా ద్వారం వద్ద సుగ్రీవుడు ఎదురు చూశాడు. బిలం లోపల నుండి రాక్షసుల అరుపులు, రక్తం బిలద్వారం బయటకు రావడం చూసి సుగ్రీవుడు తన అన్నవాలి రాక్షసుడి చేతిలో చంపబడ్డాడని పొరపాటున అనుకొని, రాక్షసుడు బిలం నుండి బయటకు రావడానికి వీలులేని విధంగా ఒక పెద్ద బండరాయితో ఆ ద్వారాన్ని మూసివేసి, దుఃఖంతో రాజ్యానికి తిరిగివచ్చాడు సుగ్రీవుడు. విషయం తెలుసుకొన్న వానరరాజ్య మంత్రులు సుగ్రీవుడిని ఆ రాజ్యానికి రాజును చేశారు. కొంతకాలానికి ఆ బిలంలోని రాక్షసుడిని వెతకి చంపివేసిన వాలి, బిలం నుండి బయటకు రావడానికి ప్రయత్నించి బిలద్వారం బండరాయితో మూసివేసి వుండడం చూసి అతికష్టం మీద దానిని తొలగించి తన రాజ్యానికి వచ్చి సుగ్రీవుడు రాజుగా వుండడం చూసి, సుగ్రీవుడు రాజు కావాలన్న దుర్బుద్ధితో కావాలనే ఆ ద్వారాన్ని మూసివేసి వచ్చాడని అనుకొన్న వాలి, కోపంతో సుగ్రీవుడిని ఆ రాజ్యం నుండి తరిమి కొట్టి, అతని భార్య అయిన రుమను తనతో పాటే ఉంచుకొన్నాడు. సుగ్రీవుడు హనుమతో కలసి ఋష్యమూక పర్వతంపై ఉండగా, సీతను అన్వేషిస్తూ రామలక్ష్మణులు ఆ ప్రాంతానికి చేరుకోవడంతో, రామ సుగ్రీవులు మైత్రి ఏర్పడింది. ఒకరి కష్టాలు ఒకరు చెప్పుకొని,

వారిరువురూ పరస్పర సహాయం చేసుకోవడానికి ఒప్పందం కుదుర్చు కొన్నారు.

రాముడు వాలిని వధిస్తానని సుగ్రీవుడికిచ్చిన మాటతో, ధైర్యంగా వాలిపైకి యుద్ధానికి సుగ్రీవుడు వెళ్లాడు. ఇద్దరూ ఒకేలా వుండడంతో రాముడు వాలిని చంపలేకపోయాడు. సుగ్రీవుడు వాలిచేత చావు దెబ్బలు తిని, రాముడి దగ్గరకు పారిపోయి వచ్చాడు. రాముడు సుగ్రీవుడికి విషయాన్ని వివరించి, అతడిని, గుర్తు పట్టడానికి అనుగుణంగా సుగ్రీవుని మెడలో పూల తీగను ధరించి వెళ్ళమన్నాడు. సుగ్రీవుడు పూల తీగను ధరించి, మళ్లీ వాలి వద్దకు వెళ్ళి, యుద్ధానికి రమ్మని సింహనాదంతో గర్జించాడు. వాలి పట్టరాని కోపంతో సుగ్రీవునితో మళ్ళీ యుద్ధానికి బయలుదేరాడు.

అహల్య, ద్రౌపది, కుంతి, తార, మండోదరి వీరయిదుగురు పంచకన్యలని, వీరిని నిత్యము ఎవరు ధ్యానిస్తారో వారి సమస్త పాపాలు నశిస్తాయని శాస్త్రాలు తెలిపాయి. అటువంటి పంచకన్యలలో ఒకరైన తార పాత్ర రామాయణంలో ప్రప్రథమంగా ఇప్పుడు మనకు దర్శనమిస్తుంది. మహాపతివ్రత, వాలి ధర్మపత్ని అయిన తార ప్రేమతో అతనిని కౌగిలించుకొని, తన అనురాగమును ప్రకటించి, వాలితో ఇలా పలికింది.

**సాధు క్రోధమిమం వీర నదీవేగమివాగతమ్ ।**
**శయనాదుత్థితః కాల్యం త్యజ భుక్తామివ స్రజమ్ ।।**

**(శ్రీ వాల్మీకి శ్రీ మద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 15వ సర్గ - 7వ శ్లోకము)**

ఓ వీరుడా! నా ఈ మంచి మాటలను దయచేసి విను. రాత్రివేళ ధరించిన పూలదండను పురుషుడు ఉదయం లేవగానే నలిగిన ఆ దండను ఎలా పారవేస్తాడో, వేగముగా ప్రవహిస్తున్న నదీ జలముల వలె నీలో పెల్లుబికిన కోపాన్ని, అలా వదిలివేయి, అని తార వాలితో పలికింది. వాడిన, నలిగిన పూల దండ ఇక ఎలా పనికిరాదో, అలాగే కోపం కూడా మనిషికి

పనికిరాదు. కామక్రోధ లోభ మోహ మదమాశ్చర్యాలనే అరిషడ్వర్గాలు మనిషికి అంతఃశత్రువులు. వాటి వలన మనిషి పతనమవుతాడు. క్రోధం బుద్ధిని పాడుచేస్తుంది. విజ్ఞానాన్ని వక్రింప చేస్తుంది, శత్రుత్వాన్ని పెంచుతుంది, సుఖాన్ని కాలరాస్తుంది. దుఃఖకారణము, నిరుపయోగము అయిన ఆకోపాన్ని విడచిపెట్టు, అని తార పలికిన పలుకులు క్రోధం వలన జరిగే నష్టాలను సమాజానికి తెలియచేస్తున్నాయి. ప్రతి ఒక్కరూ కోపాన్ని అధిగమించవలెనన్న సందేశాన్నిస్తూ వున్నాయి.

యుద్ధమున నిన్ను మించిన వీరుడు నీ శత్రువులలో ఎవ్వరూ లేరు. నీవు యుద్ధానికి ఇప్పటికిప్పుడు వెళ్ళుట మంచిది కాదు. రేపు ఉదయం అతనితో నీవు పోరాడవచ్చు. ఇప్పుడు వెళ్ళవద్దు అని ఎందుకు చెప్పుతున్నానో కారణము చెపుతాను విను, అని వాలితో తార పలికింది.

**పూర్వమా పతితః క్రోధాత్ స త్వామ్ ఆహ్వయతే యుధి ।**
**నిష్పత్య చ నిరస్తస్తే హన్యమానో దిశో గతః ॥**

**త్వయా తస్య నిరస్తస్య పీడితస్య విశేషతః ।**
**ఇహైత్య పురనాహ్వానం శంకాం జనయతీహమే ॥**

**(శ్రీ వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 15వ సర్గ - 10,11 శ్లోకములు)**

ఇంతకు ముందే సుగ్రీవుడు నీపై యుద్ధానికి వచ్చి, నీవు పిడి గుద్దులతో చావమోదితే, ఆ దెబ్బలను తాళలేక మాతంగ వనానికి పారిపోయాడు. నీవు అలా కొట్టి ఓడించి తరిమిన వ్యక్తి, ఆ గాయాలు మానక మునుపే మళ్ళీ యుద్ధానికి రమ్మని పిలుస్తున్నాడంటే అందులో ఏదో రహస్యము వున్నట్లు నాకు అనిపిస్తూ వుంది, అని తార వాలితో పలికింది.

**దర్పశ్చ వ్యవసాయశ్చ యాదృశస్తస్య నర్దతః ।**
**నినాదశ్చాపి సంరంభో నైతదల్పం హి కారణమ్ ॥**

**నా సహాయమహం మన్యే సుగ్రీవం తమిహాగతం ।**
**అనష్టబ్ధసహాయశ్చ యమాశ్రిత్యైష గర్జతి ॥**

**(శ్రీ వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 15వ సర్గ - 12,13 శ్లోకములు)**

అంతేకాదు ఈసారి సుగ్రీవుని గర్జనలో ఏదో దర్పం, గట్టి ప్రయత్నము, ఆ నాదము తీవ్రతను బట్టి తెలుస్తూ వుంది. కాబట్టి నీవు దానిని ఒక సామాన్య విషయంగా భావించి, చులకనగా చూడకు. ఈసారి యుద్ధానికి వచ్చిన సుగ్రీవుడు వంటరిగా కాక బలమైన సహాయమును కూడగట్టుకొనే వచ్చినట్లు వున్నాడు, అని తార వాలితో తెలిపింది. సుగ్రీవుడు సహజముగా గొప్ప నేర్పు కలవాడు, కార్యసాధకుడు, వ్యక్తుల యొక్క శౌర్యపరాక్రమములను, గుణగణములను లోతుగా పరీక్షింపకుండా ఎవరితోను స్నేహం చేయడు, అని కూడా తార వాలికి తెలియచేసింది.

సుగ్రీవుని అరుపు విని మహా ఆవేశంతో యుద్ధానికి ఉరుకుతున్న వాలిని 'సాధూ' అంటూ ఆపి, అతని ఆవేశ ప్రవాహానికి తన ఆలోచనల ఆనకట్టలను పేర్చుకొంటూ, నిన్ను యుద్ధంలో గెలవగల వీరులెవరూ లేరనే ప్రశంసల పన్నీటి జల్లులతో అతనిని శాంత పరుస్తూ, సావధానంగా ఆలోచించేలా చేసి వాలిని అవగాహనా అంచులవైపుకు నడిపించడానికి ప్రయత్నించింది తార. తరువాత తన అనుమానాన్ని తెలుపుతూ, అది ఎలా వాస్తవమో వివరిస్తూ, సుగ్రీవుని వెనుక ఎవరో వున్నారని హెచ్చరిస్తూ, శత్రువుని తేలికగా తీసుకోవద్దని సుగ్రీవుని గుణాలను గుర్తుచేసింది. రాబోయే ఆపదను సూచించింది. అద్భుతమైన సలహాలను ఇచ్చింది, వాలికి తార.

భర్తల ఆవేశాలకు ఎలా అడ్డుకట్ట వేయాలో, వారిపై ప్రేమను ఎలా ప్రదర్శించి, ప్రశంసలతో చల్లబరచి వారిని ఎలా ఆలోచింపచేసే విధంగా మాట్లాడాలో, భార్యలు ఎంతటి సునిశితమైన పరిశీలనా శక్తిని, దూరదృష్టిని

కలిగి వుండి రాబోయే ప్రమాదాల గురించి భర్తలకు తెలియచేయాలో తార నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

ఇవన్నీ నేను ఊహించి చెప్పినవి కావు, మన కుమారుడైన అంగదుడు వనములో విహరించుచున్నప్పుడు ఈ విషయాన్ని మన గూఢాచారులు తెల్పడం వలన అంగదుడు నాకు తెలియచేశాడు, అని తార వాలితో పలికింది. అంతేకాదు, నువ్వు చాలా జాగ్రత్తగా వుండాలి, తొందరపడి యుద్ధానికి వెళ్ళకు. నువ్వు ఏమరుపాటులో ఉన్నావు. కాని నేను మాత్రం అప్రమత్తంగా ఉన్నాను. సుఖంలో వున్నవాడు నిద్రపోతాడు కాని కష్టంలో వున్నవాడు, శత్రువు నిద్రపోడు, తన శత్రువుని మట్టుపెట్టడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే వుంటాడు. కాబట్టి సుగ్రీవుని కదలికలు గూఢాచారుల ద్వారా అంగదుని ద్వారా కనిపెడుతూనే వున్నాను. నీకు ప్రమాదం పొంచి వుంది, అని తార వాలితో పలికింది.

**అయోధ్యాధిపతేః పుత్రౌ శూరౌ సమర దుర్జయౌ ।**
**ఇక్ష్వాకూణాం కులే జాతౌ ప్రథితౌ రామలక్ష్మణౌ ।**
**సుగ్రీవ ప్రియకామార్థం ప్రాప్తౌ తత్ర దురాసదౌ ॥**

**తవ భ్రాతుర్హి విఖ్యాతః సహాయో రణకర్కశః ।**
**రామః పరబలామర్దీ యుగాంతాగ్ని రివోత్థితః ॥**

**(శ్రీ వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 15వ సర్గ - 17,18 శ్లోకములు)**

ఇక్ష్వాకు వంశానికి చెందిన అయోధ్య రాజైన దశరథ మహారాజు కుమారులు రామలక్ష్మణులు. శత్రువులకు ఎదిరింప శక్యము గాని వారు, రణరంగమున అజేయులుగా కీర్తిగడించినవారు. శ్రీ రాముడు తిరుగులేని పరాక్రమశాలి. ప్రళయ కాలమునందలి అగ్నివలె శత్రుబలాల్ని దెబ్బతీయగల సమర్థుడు. సుగ్రీవుడు ఆ రామలక్ష్మణులతో స్నేహం కుదుర్చుకొన్నాడట, అని సుగ్రీవుని వెనుక ఎవరున్నారో మెల్లగా తార వాలికి తెలిపింది.

**నివాసవృక్షః సాధూనామ్ ఆపన్నానాం పరాగతిః ।**
**ఆర్తానాం సంశ్రయశ్చైవ యశసశ్చైక భాజనమ్ ॥**

**జ్ఞాన విజ్ఞాన సంపన్నో నిదేశే నిరతః పితుః ।**
**ధాతూనామివ శైలేంద్రో గుణనామ్ ఆకరో మహాన్ ॥**

**తత్ క్షమో న విరోధస్తే సహ తేన మహాత్మనా ।**
**దుర్జయేనా ప్రమేయేన రామేణ రణకర్మసు ॥**

**(శ్రీ వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 15వ సర్గ - 19,20,21 శ్లోకములు)**

తనను ఆశ్రయించిన వారికి నీడనిచ్చు మహావృక్షం వలె, రాముడు సాధుజనులకు కల్పవృక్షం వంటివాడు. దుఃఖములో వున్న వారికి ఆశ్రయాన్నిచ్చేవాడు, సర్వరక్షకుడుగా కీర్తిని సంపాదించినవాడు. అటువంటి రాముడి నీడలో నీ తమ్ముడైన సుగ్రీవుడు వున్నాడు. శ్రీరాముడు జ్ఞాన స్వరూపుడు, వేదములు,సకల శాస్త్రములు తెలిసినవాడు, తండ్రి ఆజ్ఞను పాలించువాడు, సకల సద్గుణాలకు గని వంటివాడు. ఆ రఘువీరుడు రణరంగమున శత్రు సంహారకుడు, సాటిలేని పరాక్రమశాలి, అని తార వాలికి తెలిపింది.

తార శ్రీరామచంద్రుని పరతత్వాన్ని ముందుగానే గుర్తు పట్టేయగల సాధ్వీమణి. ఆమె జ్ఞాన జ్యోతులు అఖండమైనవి, అందుకే మారీచుడి తర్వాత శ్రీరామచంద్రుడి గొప్పదనం గురించి అంత అద్భుతంగా రామయణంలో తార కీర్తించగలిగినది. ఆమె తన పుత్రుడైన అంగదుడు గూఢచారుల ద్వారా భర్తకు రాబోయే ప్రమాదాలను ముందే పసిగట్టి, సుగ్రీవుడు రాముని సహాయం పొందడానికి ఎలా అర్హుడో వివరించి, శ్రీరామచంద్రుని గుణ వైభవాలను వర్ణించి ఆయనే పరతత్వమైన దైవమని తెలిపి, వాలి యొక్క అజ్ఞానాంధకారాలను పోగొట్టడానికి ప్రయత్నించింది. పతి యొక్క రక్షణ కోసం అనుక్షణం అప్రమత్తత, శత్రువు బలబలాలను తక్కువగా అంచనా

వేయకపోవడం, దైవాన్ని గుర్తించి శరణు కోరడం లాంటి ఉత్తమ లక్షణాలను ప్రతిఒక్కరూ కలిగివుండాలనే సందేశం ఈ సమాజానికి తార జీవితం అందిస్తూ వుంది.

**శూర వక్ష్యామి తే కించిన్న చేచ్ఛామ్యభ్యసూయితుమ్ ।**
**శ్రూయతాం క్రియతాం చైవ తవ వక్ష్యామి యుద్ధితమ్ ॥**

**యౌవ రాజ్యేన సుగ్రీవం తూర్ణం త్వమభిషే చయ ।**
**విగ్రహం మా కృథా వీర భ్రాత్రా రాజన్యవీయసా ॥**

**అహం హితే క్షమం మన్యే తేన రామేణ సౌహృదమ్ ।**
**సుగ్రీవేణచ సంప్రీతిం వైరముత్సృజ్య దూరతః ॥**

**(శ్రీ వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 15వ సర్గ - 22,23,24 శ్లోకములు)**

శూరుడా! నీకొక విషయము చెపుతాను, నీవు కోపగించుకోకుండా, ఆ మంచిని విని అలా చేయి. నీ తమ్ముడితో నీవు విరోధము పెట్టుకోక వెంటనే సుగ్రీవుడిని మన రాజ్యానికి యువరాజును చేయి. సుగ్రీవునిపై ప్రేమను చూపు. శ్రీరాముడితో స్నేహం చేసుకో.

**నహితేన సమం బన్ధుం భువి పశ్యామి కంచన ।**
**దానమానాది సత్కారైః కురుష్వ ప్రత్యనంతరమ్ ॥**

**వైరమేతత్ సముత్సృజ్య తవ పార్శ్వే సతిష్ఠతు ।**
**సుగ్రీవో విపుల గ్రీవః తవ బంధుః సదా మతః ॥**
**భ్రాతుః సౌహృద మాలంబ నాన్యా గతిరిహాస్తితే ।**

**(శ్రీ వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 15వ సర్గ - 26,27,28 శ్లోకములు)**

నీ తమ్ముడు సుగ్రీవుడు నీకు ఐనవాడు, ఆత్మీయుడు, నీకు అటువంటి బంధువు ఈ లోకంలో ఇంకెవ్వరూ లేరు. అతనికి తగిన గౌరవాన్ని ఇచ్చి

అతనిని ఈ రాజ్యానికి నీ తరువాత వానినిగా చేయి. నీ కుడి భుజములాగా ఎప్పుడూ నీ ప్రక్కనే వుంచుకో. నీవు అతనిపై పూర్తి సోదర ప్రేమను చూపు. నీకు ఇప్పుడు ఇంతకంటే మరొక మార్గము లేదు. ఇంద్రుడిని మించిన మహాపరాక్రమశాలియైన శ్రీరాముడితో నీకు యుద్ధము తగదు, అని వాలికి హితబోధ చేసింది.

ఒక చెట్టుకు పూచిన, కాచిన రెండుపువ్వులు, కాయలు లాంటి వారు అన్నదమ్ములని, తమ్ముడు కొడుకులాంటి వాడని, అన్నదమ్ముల అనుబంధాన్ని మించిన బంధం ఈ లోకంలో వుండదని, వారిరువురు ఎంతో సఖ్యతతో, ఆదరణతో జీవించాలని, ఈ లోకంలో అన్నదమ్ములు ఏ విషయములోను ఘర్షణ పడకూడదని, నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. భర్త ఆవేశంలో వున్నప్పుడు ఆ ఆవేశాన్ని చల్లబరచి యుక్తాయుక్త వివేచనను మేల్కొలిపి 'కరణేషు మంత్రి'లా మంచి సలహాలు ఇవ్వాలి, హితబోధ చేయాలి, అని తార నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

నా తమ్ముడు, పైగా నా శత్రువు గర్జిస్తూ నన్ను యుద్ధానికి రమ్మంటూ వుంటే, నేను చేతకాని వానిలా ఎలా అతనిని దగ్గర తీసుకొని మంచి చేసుకొంటాను? అది జరగని పని, అంటూ వాలి సుగ్రీవునిపై యుద్ధానికి బయలుదేరాడు. తార వాలి వెంటే వెళుతూ వుంటే నా వెనుక రావద్దు, నీ ప్రేమను నాపై చూపావు కదా! ఇక అంత:పురానికి వెళ్లు, అని వాలి తారతో పలికాడు.

**తం తు తారా పరిష్వజ్య వాలినం ప్రియవాదినీ।**
**చకార రుదతీ మన్దం దక్షిణా సా ప్రదక్షిణమ్॥**

**(శ్రీ వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 16వ సర్గ - 11వ శ్లోకము)**

ప్రియంగా మాట్లాడునది, నేర్పు గలది అయిన తార మెల్లగా ఏడుస్తూ, వాలిని కౌగిలించుకొన్నది, అతనికి ప్రదక్షిణం చేసింది. భర్త విజయాన్ని

కోరుచు చేయవలసిన హారతి ఇత్యాది కార్యాలను చేసి అంతఃపురంలోనికి తారవెళ్ళింది.

తార భర్తకు కటువుగా కాకుండా ప్రియంగా, నేర్పుగా మంచిని చేయమని నచ్చచెప్పింది. వినకపోయేసరికి మంచిని చేయమని భగవంతుడిని ప్రార్థించింది. ఇవన్నీ కూడా నేటి సతులందరికీ కూడా అవసరమైన సందేశాలే.

వాలి సుగ్రీవుల యుద్ధం ప్రారంభమైంది. రాముడు చెట్టు చాటు నుంచి వాలిపై బాణాన్ని సంధించాడు. వాలి నేల కూలాడు. వాలి చేసిన ప్రధానమైన తప్పుయైన అతని తమ్ముడి భార్య అయిన రుమను తాను ఉంచుకోవడం, ఇతర ధర్మ విషయాలను రాముడు వాలికి తెలిపాడు. వాలి రాముడి మాటలు సత్యమని అంగీకరించాడు. తన పుత్రుడైన అంగదుని రక్షింపమని వాలి కోరాడు. రాముడు సుగ్రీవ అంగదుల్ని తన తమ్ములను ఎలా చూసుకుంటానో అలా చూసుకుంటానని మాట ఇచ్చాడు. తార యుద్ధం వద్దని నివారిస్తున్నా ఆమె మాట వినకుండా నేను వచ్చి మరణించబోతున్నాను, తార ఉత్తమురాలు, ఏ అపరాధము చేయనిది, ఆమెకు ఏ విధమైన అవమానము సుగ్రీవుని వలన జరగకుండా చూసుకోమని, వాలి రాముడిని కోరాడు. రాముడు అంగీకరించాడు.

కిష్కంధలో వాలి నేల కూలిన వార్త తెలిసి వానరులు భయంతో పరుగులు తీస్తూ ఆ వార్తను తారకు తెలిపి, ఆమెను అంతఃపురంలోనికి వెళ్ళమని, దుర్గము తలుపులు మూసివేసి శత్రువులు లోనికి రాకుండా చేయమని చెప్పారు. అప్పుడు తార వానర శ్రేష్ఠుడు, మహానుభావుడు అయిన నా భర్తే లేనపుడు ఇక నాకు పుత్రునితో, రాజ్యముతో, ప్రాణాలతో ఏమి పని అని పలికి, అంగదుడితో కలసి వాలి మరణించిపడివున్న యుద్ధభూమికి వెళ్ళింది. భర్తను చూసి ఎంతో విలపించింది. నిన్ను ఎన్నడూ దూషించని దీనురాలైన నన్ను ఇప్పుడు నీవు పలకరించవేమి? నీ తమ్ముడి భార్యను హరించి అతడిని రాజ్యమునుంచి వెడలగొట్టినందులకు ఫలితంగానే నీకి

దుస్థితి కలిగింది. నీ మంచి కోరి నే చెప్పిన మంచి మాటలను నీవు వినకపోవడం వలననే నీకు నేడు ఇలా జరిగింది. రాముడు సుగ్రీవునికిచ్చిన మాట నిలుపుకొన్నాడు. సుగ్రీవా! నీ కోరిక తీరినది నీ శత్రువు నేలకూలాడు. నీ భార్య రుమ, రాజ్యం నీకు లభిస్తుంది, ఇక ఏ దిగులూ లేకుండా వుండు, అని పలికింది తార. తెలియక నేను చేసిన తప్పులు ఏమైనా వుంటే మన్నించు అంటూ తన తలను భర్త పాదాలకు తాకించి, భర్తలేని జీవితం నాకిక ఎందుకు అంటూ వాలితో పాటే తన దేహాన్ని కూడా త్యాగం చేయడానికి అక్కడే సిద్ధపడింది తార.

అంత బాధలోనూ తార ఎంత మహోన్నతంగా పలికిందో పరిశీలిస్తే ఆమె యొక్క గొప్పతనం అవగతమవుతుంది. తన భర్త వాలి యొక్క అధర్మ ప్రవర్తనను సమర్థించలేదు, భర్తను కించపరచలేదు. ధర్మాధర్మాలు తెలిపింది. రాజ్యం కన్నా, పుత్రునికన్నా, చివరికి తన ప్రాణాల కన్నా పతి పాదాలే మిన్న అని తెలిపింది. సుగ్రీవుని కొరకు వాలిని వధించిన శ్రీరాముడిని దూషించలేదు, పైగా అధర్మపరుల్ని శిక్షించే ధర్మమూర్తి అని కీర్తించింది. అదేవిధంగా తన భర్త మరణానికి కారకుడైన సుగ్రీవుడిని తార నిందించలేదు. పైగా రాజ్యం, అతడి భార్య అయిన రుమతో సంతోషంగా వుండమని చెప్పింది. పతితో పాటు ప్రాణత్యాగానికి సిద్ధపడింది. ఇంతటి మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగినదే కాబట్టే తార మహాపతివ్రతలైన పంచ కన్యలలో ఒకరుగా మహాసాధ్వీమణులైన కుంతి, ద్రౌపది, అహల్య, మండోదరిల సరసన తానూ చేరింది.

పై సులక్షణాలన్నీ కూడా నేటి స్త్రీల కవసరమని తార నేటి సమాజానికి సందేశానిస్తూ వుంది.

ఆకాశము నుంచి జారి పడిన నక్షత్రము వలె నేలపై పడివున్నతారను హనుమంతుడు ఓదార్చి, వాలికి సంస్కారములు చేయవలెనని, అంగదునిని రాజుగా చేసి, నీ ఆధ్వర్యంలో పాలన జరిగేలా చూడమని పలికాడు. రాజ్యాన్ని

నడుపుట కానీ, అంగదుని చూచుకొనుట కాని చేయవల్సిది నేను కాదు, అంగదుని పినతండ్రి అయిన సుగ్రీవుడే, అని తార సమాధానమిచ్చింది. అంతటి దు:ఖంలోనూ తార ఔచిత్యాన్ని మరవలేదు. సుగ్రీవుడు వుండగా అంగదుడు రాజు అయితే మళ్ళీ రాజ్యకాంక్షతో సుగ్రీవుని ద్వారా తన పుత్రుడైన అంగదునికి ముప్పు వచ్చే అవకాశాన్ని కూడా ముందుగానే వూహించి, సుగ్రీవుడిని రాజుగా, అంగదుడిని యువరాజుగా చేసేలా వ్యూహాత్మకంగా తార పలికి తన రాజనీతిజ్ఞతను చాటింది. ఈ విధంగా తార సమాజానికి సందేశాన్నిచ్చింది.

సుగ్రీవుని దగ్గరకు పిలచి ఈ రాజ్యాన్ని స్వీకరించు, తన పుత్రుడైన అంగదుడిని, తన భార్య అయిన తారను జాగ్రత్తగా చూచుకోమని అప్పచెప్పాడు. తన మెడలోని ఇంద్రుడి వరంతో పొందిన బంగారు మాలను వాలి సుగ్రీవునికిచ్చాడు.

**సుషేణ దుహితా చేయమ్ అర్థ సూక్ష్మ వినిశ్చయే ।**
**ఔత్పాతికే చ వివిధే సర్వతః పరినిష్ఠితా ॥**

**యదేషా సాధ్వితి బ్రూయాత్ కార్యం తన్ముక్త సంశయం ।**
**నహి తారామతం కించిత్ అన్యథా పరివర్తతే ॥**

**(శ్రీ వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 22వ సర్గ - 12,13 శ్లోకములు)**

సుగ్రీవా! నా ధర్మపత్నియగు ఈ తార సుషేణుని కుమార్తె. ఈమె ఎంతో సూక్ష్మబుద్ధి గలది. అర్థ విశ్లేషణ చేయుటలో చతురురాలు. రాబోవు ఆపదలను పసిగట్టగలదు. సకల విషయముల యందును సమర్థురాలు. ఏది మంచిదో, ఏది కాదో తార ఖచ్చితంగా చెప్పగలదు. ఆమె చెప్పిన కార్యములు నిశ్చయంగా చేయవచ్చును. ఆమె చెప్పిన మాటలు ఎప్పుడూ సరిగ్గా వుంటాయి, అని వాలి సుగ్రీవునితో తెలిపాడు.

స్త్రీలు పై సుగుణాలను కలిగివుండాలని తార సమాజానికి సందేశాన్నిస్తూ వుంది.

వాలి మరణించాడు. అతనికి దహన సంస్కారాలు జరిగిన తరువాత కిష్కంధ రాజ్యానికి సుగ్రీవుడి రాజుగా, అంగదుడుకి యువరాజుగా పట్టాభిషేకం జరిగింది. వానరుల సోదరుడు చనిపోతే వారి భార్యను, జీవించివున్న సోదరుడు భార్యగా స్వీకరించాలన్న వానరుల ఆచారం ప్రకారం వాలి భార్యయైన తారను సుగ్రీవుడు భార్యగా స్వీకరించాడు. రాజ్యాధికారం, సురాపానం, అంగనల సుఖాల మత్తు, వినోదాలలో పడి రాముడికిచ్చిన మాట అయిన సీతాన్వేషణ గురించి వర్షాకాలము వెళ్ళి శరత్కాలము ప్రారంభమైనా కూడా సుగ్రీవుడు మరచిపోయాడు.

రాముడు వేచి వేచి ఇక లాభం లేదనుకొని తమ్ముడు లక్ష్మణుడిని సుగ్రీవుని దగ్గరకు వెళ్ళి ధర్మం ప్రకారం ఇచ్చిన మాటను నిలుపుకోవడం కోసం సీతాన్వేషణ ప్రారంభం చేస్తావా? లేక రామబాణానికి గురై అతని అన్న వాలి చేరిన లోకాలకు చేరుతావా? అన్న విషయము సుగ్రీవునితో మాట్లాడమని చెప్పాడు. లక్ష్మణుడు ప్రళయకాలాగ్ని వలె, బుసలు కొట్టే ఆదిశేషుని వలె కోపోద్రేకంతో కిష్కందరాజ్య అంతఃపురంలోనికి ప్రవేశించి, తన ధనస్సుచే దిక్కులు ప్రతిధ్వనించేలా టంకార ధ్వని చేశాడు. మద్యం మత్తులో మగువలతో నున్న సుగ్రీవుడు ఆ ధ్వని విని భయంతో లేచి, లక్ష్మణుని కోపాన్ని శాంతింపచేసి ఆ గండం నుంచి కాపాడమని తారను పంపాడు. రాజైన సుగ్రీవుడంతటివాడు భయపడి వణికపోతూ వుంటే తార నిర్భయంగా లక్ష్మణుని సమీపించి, లక్ష్మణా! ఏమయ్యా అంత కోపంగా వున్నావు? ఎవరయ్యా నీకు ఇంత కోపం తెప్పించడానికి సాహసం చేసిన వాళ్ళు? ఎండిపోయిన చెట్లతో కూడిన వనాన్ని దావాగ్ని దహించి వేస్తుంటే దానికి ఎదురువెళ్ళ గలిగిన మొనగాడు ఎవరు?, అని అడిగింది. లక్ష్మణునికి కోపం ఎవరి మీదో తారకు తెలిసినా కూడా ఆ మాటలాడే పద్ధతి ఎంత

అద్భుతమో చూడండి. లక్ష్మణుడి పరాక్రమాన్ని పొగుడుతూ అందంగా మాట్లాడింది. అందుకు లక్ష్మణుడు. నీ భర్త అయిన సుగ్రీవుడు మా అన్నకి ఇచ్చిన మాటను మరిచి, నాలుగు నెలలు అయినా ఇంకా కామము నందే రమిస్తున్నాడు. ఇది తప్పు కదా? అని లక్ష్మణుడు తారను ప్రశ్నించ్చాడు.

**కోపం కథం నామ గుణ ప్రకృష్టః కుమార కుర్యాదప కృష్ట సత్త్వే ।**
**కస్త్వ ద్విధః కోపవశం హి గచ్ఛేత్ సత్త్వా వరుద్ధస్తపసః ప్రసూతిః ॥**

**(శ్రీ వాల్మీకి శ్రీమద్రామాయణము - 2వ భాగము - 4వ కాండము - 15వ సర్గ - 51వ శ్లోకము)**

లక్ష్మణా! "నువ్వు మిక్కిలి శాంత మూర్తివి, పరాక్రమ శాలివి, సుగుణ సంపన్నునివి" కానీ, నా భర్త సుగ్రీవుడు, అల్పమైనవాడు, అందుకే కామమునకు లొంగిపోయాడు. మరి ఇంతటి గొప్పవాడైన నీవు అంతటి బలహీనునిపై కోపగించుకోవడం న్యాయమా?, అని తార లక్ష్మణుడితో పలికింది.

కామక్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యాలు అనే ఆరు మనిషికి అంతఃశత్రువులు కామాన్ని జయించలేనివాడు సుగ్రీవుడైతే, క్రోధాన్ని జయించలేనివాడివి నీవు అయితే, మరి సుగ్రీవుడికి, నీకు తేడా ఏమిటి, అని తార ఎంతో తెలివిగా లక్ష్మణుడిని ప్రశ్నించడంతో, లక్ష్మణుని కోపం వెంటనే చల్లారిపోయింది.

ఈ ఆరు అరిషడ్వర్గాలు మనిషికి అంత: శత్రువులని, వాటిని జయించాలని, వాటి బారిన పడి ఎవరూ, తమ కర్తవ్యాన్ని మరువకూడదని, తార నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

రాముని కోపం ఎలాంటిదో నాకు తెలుసు. చేయవలసిన కార్యం ఆలస్యమైందని కూడా నాకు తెలుసు. ఇప్పుడు ఏమి చేయాలో కూడా నాకు తెలుసు. కామానికి ఉన్న శక్తికి తపస్సు చేసుకునే ఋషులంతటివారు కూడా లొంగిపోవడం మనకి తెలిసిందే. మరి ఇంక ఒక వానరుడైన సుగ్రీవుడు కామాన్ని జయించగలడా? అందరూ నీలాగా జితేంద్రియులు

కావడం సాధ్యమా?, అని తార పలికి లక్ష్మణుని హృదయాన్ని కరిగేలా చేసింది.

సుగ్రీవుడు కామానికి దాసుడైనా, మీ కార్యంలో ఆలస్యం చేయలేదు. ఇంతకు మునుపే ఆజ్ఞలు ఇచ్చేశాడు. దాని ప్రకారం కోటానుకోట్ల వానరులు అనేక పర్వతాల నుంచి వచ్చి ఉన్నారు. ఇంకా బయటే నిలబడి ఉన్నావేమిటి? లోపలికి రా నాయనా!, అని తార లక్ష్మణునితో పలికింది. శాంతించిన లక్ష్మణుడు లోపలికి ప్రవేశించాడు. సుగ్రీవుడు లేచి నిలబడి చేతులు జోడించాడు. స్త్రీల మధ్య విలాసవంతుడైన సుగ్రీవుడిని చూడగానే లక్ష్మణుడికి మళ్ళీ కోపం వచ్చింది. ఉపకారం చేస్తానన్న మిత్రులకు ప్రత్యుపకారం చేస్తానని చెప్పి మోసం చేసిన కృతఘ్నుని బ్రతకనివ్వకూడదు. సుగ్రీవా! నీవు దుర్మార్గుడివి, కృతఘ్నుడివి, అసత్యపరుడివి, అని పలికాడు. సుగ్రీవుడు మొహం వెలవెలాపోగా తిరిగి మాట్లాడలేక గొంతు ఎండిపోయింది. అప్పుడు తార మళ్ళీ పరిస్థితి చక్కబరిచే విధంగా ఇలా మాట్లాడింది.

సుగ్రీవుడు కృతఘ్నుడు కాడు, అపకారి కాడు, రాముడు చేసిన ఉపకారాన్ని మరవలేదు. రాజ్యము నుంచి వాలిచే తరమబడి ఎంతోకాలం ఋష్యమూక పర్వతంపై సుఖాలకు దూరంగా జీవించాడు. రాముని దయ వలన లభించిన ఆ సుఖాలు ఇప్పుడు అతనిని ఉసిగొల్పాయి. పూర్వము విశ్వామిత్రుడంతటివాడు మేనకతో పదివేల సంవత్సరాల కాలాన్ని ఒక్క రోజుగా భావించి అనుభవించినట్లు, సుగ్రీవుడు కూడా కొంత సమయాన్ని మరచి ప్రవర్తించిన మాట వాస్తవమే. ఇది ఆలోచించి రాముడు సుగ్రీవుని క్షమించాలి. ధర్మాత్ముడైన లక్ష్మణా ఆవేశాన్ని వీడమని నేను నిన్ను వేడుకొంటూవున్నాను, అని తార లక్ష్మణునితో పలికింది.

రావణుని బలం గురించి పూర్వం వాలి నాకు చెప్పివున్నాడు. లెక్కకు మిక్కిలి అయిన ఆ రాక్షసుల్ని మట్టు బెట్టుటకు, గొప్ప బలవంతులైన వానర వీరులందరిని తీసుకొని రమ్మని సుగ్రీవుడు ఆజ్ఞాపించివున్నాడు. వారందరూ

ఈరోజే ఇక్కడకు చేరుకోవాల్సి వున్నది. రాముడు రావణుడిని వధించి సీతతో చేరుతాడు. నీ కోపానికి ఇక్కడి వారంతా హడలిపోతున్నారు. శాంతించు నాయనా లక్ష్మణా!, అని తార పలికింది. లక్ష్మణుడు కోపాన్ని వదిలాడు.

సుగ్రీవుని భోగలాలసత పెద్ద తప్పు కాదని లక్ష్మణుడిని ఒప్పించడానికి, రామలక్ష్మణుల గురువయిన విశ్వామిత్రుడి జీవితాన్నే ఉదాహరించడం ఆమె సమయస్ఫూర్తికి నిదర్శనం. వానరుడేదో తప్పు చేశాడని రఘుకుల వీరుడైన లక్ష్మణుడు కోపగించుకోవడం సరికాదని, అల్ప గుణవంతుల్ని అధిక గుణవంతులు సరిదిద్దాలని చెప్పడం ఆమె ప్రజ్ఞకు ప్రతీక. రావణుడి సైన్యానికి అనుగుణంగా వానరసైన్యాన్ని సమీకరించే యుద్ధానికి వెళ్ళాలని, ఆ ఆజ్ఞ ప్రకారం వానర వీరులు నలుదిక్కుల నుండి కిష్కంధకు నేడే చేరుకుంటారని చెప్పడం, రామ కార్యాన్ని సుగ్రీవుడు మరువలేదు, ఆ పనిలోనే సుగ్రీవుడు వున్నాడు అని చెప్పడం తార రాజనీతిజ్ఞతకు నిదర్శనం.

నేటి సమాజంలోని స్త్రీలందరూ కూడా నిర్భయంగా సమస్యను పరిష్కరించుకోవాలని, సంయమనాన్ని కలిగి వుండాలని, చక్కటి మాట తీరు కలిగిన ప్రజ్ఞావంతులై వుండాలని, తొందరపడకుండా సమస్యల పరిష్కారానికి మంచి రాజనీతిజ్ఞత కలిగివుండాలని, తార నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

తారలోని సూక్ష్మబుద్ధి, దూరదృష్టి, పరిస్థితులను చక్కగా తూకం వేయగల ప్రజ్ఞ, అమోఘమైన ధైర్యం, జటిల సమస్యలకు పరిష్కారం చూపగల దక్షత, ప్రియంగా పలకగల చక్కటి వాక్ చాతుర్యము, భర్తలు తప్పటడుగులు వేసేటప్పుడు వారికి చేయవలసిన హితబోధ, భగవద్భక్తి, పాతివ్రత్యము ఇలాంటి ఎన్నో సుగుణాలు నేటి నారీమణులకు ఆదర్శాలు, సమాజానికి సందేశాలు.

* * *

# మండోదరి

అహల్య, ద్రౌపది, కుంతి, తారా, మండోదరి అనే ఐదుగురు స్త్రీ రత్నాలను పంచకన్యలు అని పిలుస్తారు. వీరు పతివ్రతా శిరోమణులని, వారిని పూజిస్తే సకల పాపాలు తొలుగుతాయని చెప్పబడింది. అంతటి ఔన్నత్యాన్ని పొందిన గొప్ప ఇల్లాలు మండోదరి. ఈమె సకల శుభ లక్షణ సంపన్నురాలు. ఆదర్శ మహిళామణి, ఆత్మజ్ఞాన సంపన్నురాలు, తపస్విని, ధర్మనిష్ఠా గరిష్టురాలు, మహాపతివ్రత.

రామాయణంలో తప్పిదాలు, చెడు ధోరణుల దారిపట్టిన రాక్షస రాజు, ప్రతి నాయకుడూ అయిన రావణాసురిడి భార్య మండోదరి. భర్త పట్ల తన అంకిత భావం, తన వ్యక్తిత్వం, ధైర్యం, ధర్మాధర్మ విచక్షణ, భర్త తప్పులను సమర్థించక నీతి బోధ చేయడం, వివాహం తర్వాత కూడా తనదైన సొంత వ్యక్తిత్వాన్ని కలిగి ధర్మాన్ని ఆచరించడం, ఈ శుభలక్షణాలన్నీ కూడా మండోదరిని మహాప్రతివతగా, ఆదర్శ మహిళగా చరిత్రలో నిలిపాయి.

మయుడు రాక్షసవంశంలోని శిల్పాచార్యుడు. అనేక విధములైన శిల్పములతో దేవతలను, చతుర్ముఖ బ్రహ్మను మెప్పించాడు. లోకంలోని సర్వ ప్రాణులను పరమ ఆశ్చర్యమునకు గురిచేయగల అద్భుతమైన కట్టడాలను, భవనాలను, పట్టణాలను నిర్మించగల అపూర్వ శక్తిని బ్రహ్మదేవుడు మయునికి వరంగా ఇచ్చాడు. దేవతలందరూ మయుని ప్రశంసించి, అందమైన అప్సరసయిన హేమను ఇచ్చి మయుడికి వివాహం జరిపించారు. మయుడు సర్వాంగ సుందరమైన ఒక మహానగరాన్ని నిర్మించి, దానికి తన భార్య పేరుతో హేమ పురమనే పేరుపెట్టి, ఐదువందల సంవత్సరాల కాలం ఆమెతో ఆనందంగా ఐదు క్షణాలుగా గడిపాడు. హేమకు మయునికి, మాయావి, దుందుభి అను ఇద్దరు మగపిల్లలు, తర్వాత మండోదరి అను ఆడపిల్ల జన్మించారు. తర్వాత కొంతకాలానికి హేమ

దేవేంద్రుని ఆజ్ఞానుసారం స్వర్గానికి వెళ్లిపోగా, హేమపురాన్ని వదలి తాను కూడా తపోవనాలకెళ్ళి తపస్సు చేసుకోవాలని మయుడు సంకల్పించాడు. దానికి మునుపే తన కుమార్తె అయిన మండోదరికి వివాహం జరిపించాలని మయుడు తలచాడు. మయుడు వరుడిని అన్వేషిస్తూ మండోదరితో పాటు అడవుల గుండా ప్రయాణం చేస్తూ వున్నప్పుడు రాక్షసరాజైన రావణుడు వారికి ఎదురు పడ్డాడు. మండోదరి అందచందాలకు ముగ్ధుడై రావణుడు ఆమెను తనకు ఇచ్చి వివాహం జరిపించమని మయుడిని కోరాడు. అందుకు అంగీకరించిన మయుడు ఇలా పలికాడు.

**కరేణ తు కరం తస్యా గ్రాహయిత్వా మయ స్తదా ।**
**ప్రహసన్ ప్రాహ దైత్యేంద్రో రాక్షసేంద్ర మిదం వచః ॥**

**ఇయం మమాత్మజా రాజన్ హేమయా ప్సరసా ధృతా ।**
**కన్యా మండోదరీ నామ పత్న్యర్థం ప్రతిగృహ్యతామ్ ॥**

**బాఢమిత్యేవ తం రామ దశగ్రీవోభ్యభాషత ।**
**ప్రజ్వాల్య తత్ర చైవాగ్నిమ్ అకరోత్ పాణి సంగ్రహమ్ ॥**

**(శ్రీవాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 7వకాండ - 12వ సర్గ - 17,19 శ్లోకాలు)**

దైత్యేంద్రుడైన మయుడు తన కూతురు యొక్క చేతిని తన చేతితో పట్టుకొని, సంతోషముతో నవ్వుచు, రాక్షసరాజైన రావణుడితో, రాజా! ఈమె నా వలన హేమ అను అప్సరయందు జన్మించిన కూతురు. ఈ కన్య పేరు మండోదరి. ఈమెను నీ భార్యగా స్వీకరింపుము, అని పలికెను. రావణుడు అందుకు అంగీకరించి, అగ్నిని ప్రజ్వలింపచేసి, అగ్నిసాక్షిగా మండోదరిని రావణుడు పెండ్లియాడెను. మండోదరి లంకా మహా సామ్రాజ్య పట్ట మహిషి అయింది. సకల భోగాలను అనుభవిస్తూ పతికి అత్యంత అనుకూలవతి అయిన ఇల్లాలిగా జీవనాన్ని సాగించింది. మండోదరి మహా తపశ్శాలి. కొంతకాలానికి మేఘనాధుడనే పుత్రుడిని కని వీరమాతగా కీర్తి గడించింది.

మేఘనాధుడు తండ్రి నుంచి ధైర్యసాహసాలు, పరాక్రమం, మొండి పట్టుదలలు – తల్లి నుంచి మాయా విద్యలు, తపశ్శక్తి సంక్రమింప చేసుకొని మహా వీరుడైనాడు. ఇంద్రుడిని జయించి ఇంద్రజిత్తుగా బిరుదును సంపాదించాడు. లంకలో జరిగిన యుద్ధంలో, యుద్ధ భూమిలోనికి ఒకసారి అడుగుపెట్టిన వాళ్ళెవరూ కూడా తిరిగి లంకలోనికి వెళ్ళలేదు యుద్ధ భూమిలోనే మరణించారు, ఇద్దరే ఇద్దరు తప్ప. వారు ఒకరు రావణాసురుడు, ఇంకొకరు ఇంద్రజిత్తు. అంతటి మహావీరుడికి జన్మనిచ్చిన గొప్ప మాత మండోదరి.

మండోదరి వివాహం, దాంపత్య జీవనం, మాతృత్వం, జీవన విధానం ఇవన్నీ ఒక ఆదర్శ మహిళ , అనుకూలవతియైన ఇల్లాలు, ఎలా జీవించాలో సమాజానికి సందేశాన్నిచ్చే సందేశాలే.

ఆనందంగా సాగిపోతున్న మండోదరి జీవన నావ, తన భర్త అయిన రావణుడు కాముకత్వంతో తప్పటడుగులు వేస్తూ అధర్మ దారిన సాగడం ప్రారంభించడంతో కుదుపులకు గురి అవడం ప్రారంభమైంది. రావణుడు వేదవతిని వేధించడం, దేవ, గంధర్వ, ఋషి కన్యలను అపహరించి, రంభను మానభంగం చేసి, ఎందరో పతివ్రతలను బలాత్కారాలు చేసి శాపగ్రస్తుడు అయ్యాడు. మండోదరి ఎప్పటికప్పుడూ ఈ విషయాలన్నీ తెలుసుకుని బాధ పడుతూ, అలా చేయవద్దని రావణుడికి హితబోధ చేస్తూ వచ్చింది. న్యాయానికి, ధర్మానికి ప్రతీకగా తన భర్త చేస్తున్న తప్పులపై హితబోధ చేస్తూ, అధర్మ మార్గం నుంచి ధర్మ మార్గంలోనికి మళ్ళించడానికి ప్రయత్నం చేసింది. నేటి ఇల్లాలు తమ భర్తలు చేసే అధర్మ కార్యాలకు తమ అండదండలు అందించడకూడదని, వారికి హితబోధ చేయాలని, వారిని ధర్మమార్గంలో పెట్టాలనే సందేశాన్ని మండోదరి సమాజానికి అందించింది.

మండోదరి హితబోధలను పెడచెవిన పెట్టిన రావణుడు మాయలేడి రూపంలో మారీచుడిని పంపి, రామలక్ష్మణులను సీతకు దూరంగా వెళ్ళేలా చేసి, మాయ యతి వేషాన్ని ధరించి, వంటరిగా వున్న సీతను అపహరించి,

లంకానగరంలోని అశోకవనంలో వుంచి, బాధిస్తున్న తన భర్త రావణుడితో మండోదరి ఆమె సీతగా పునర్జన్మ ఎత్తిన వేదవతి అని,ఆమెను మోహింప వద్దని, అది రావణుని వినాశానికి కారణం అవుతుందని, హితబోధ చేసింది.

శ్రీరాముడు సీత జాడ కోసం పంపిన వానరుల్లో హనుమంతుడు లంకకు చేరాడు. సీత కోసం అంతఃపురంలో అన్వేషిస్తువున్నాడు.

**గౌరీం కనకవర్ణాభామ్ ఇష్టామంతః పురేశ్వరమ్ ।**
**కపిర్మందోదరీం తత్ర శయానాం చారు రూపిణీమ్ ॥**

**సతాం మహబాహుః భూషితాం మారుతాత్మజః ।**
**తర్కయామాస సీతేతి రూప యౌవన సంపదా ।**
**హర్షేణ మహతా యుక్తో ననంద హరియూధపః ॥**

**(శ్రీవాల్మీకి శ్రీమద్రామాయణం – 2వ భాగం – 5వకాండ – 11వ సర్గ – 52, 53 శ్లోకాలు)**

అక్కడ శయ్యపై వంటరిగా పడుకొని వున్న బంగారు వర్ణముతో మెరిసిపోతున్న మండోదరిని హనుమంతుడు చూశాడు. స్వచ్ఛమైన కాంతులతో మనోహరంగా మెరిసిపోతున్న సర్వాలంకార శోభితురాలైన సౌభాగ్యములు కల స్త్రీ రత్నము కాబట్టి, ఈమె సీతే అని అనుకొని, సీత జాడ దొరికిందని ఆనందంతో గంతులేస్తాడు హనుమ. మండోదరి యొక్క శోభ అంతటిది. ఆమె పతివ్రతా శిరోమణి కాబట్టే హనుమంతుడంతటి వాడే ఈమే సీత అని పొరబడగలిగేంతటి రూపం మండోదరిది.

అశోకవనంలోని సీత దగ్గరికి రావణుడు తన భార్యలతో కలసి వచ్చి శిరస్సు వంచి, నేలపై వ్రాలి, సీతా నాకోరికను తీర్చుము అని కోరగ, సీత తిరస్కారముతో కూడిన కంపరంతో రావణుడి వైపు చూసింది. అప్పుడు కోపంతో రగిలిపోయిన రావణుడు, గర్విష్ఠురాలా! ఒకవేళ నీవు అహంకారంతో నన్ను ఆదరింపనిచో రెండు మాసముల తరువాత నీ

రక్తమును త్రాగుతాను అని పలికాడు. అందుకు సీత, ఓ రాక్షస అధమా! నేను శ్రీరాముని భార్యను, ఆయన పరాక్రమం ముందు నీవు ఎంత, ఆయనలేని సమయంలో నీవు నన్ను దొంగతనంగా ఎత్తుకొనివచ్చావు. ఆయనకు నీవు దాసుడిగా కూడా సరిపోవు. ఇలాంటి మాటలు మాట్లాడితే నీ నాలుక తెగి క్రింద పడుతుంది, అని పలుకుతుంది. ఆ మాటలకు మహా కోపోద్రిక్తుడైన రావణుడు కుడిచేతి పిడికిలిని పైకెత్తి సీతను చంపడానికి ముందుకెళ్తాడు. ఆ సమయాన రావణుడి భార్యల నడుమ వున్న మండోదరి ముందుకు వచ్చి రావణుడిని వారించి మధురంగా ఇలా పలికింది. పరాక్రమమున దేవేంద్రుని వంటివాడా! సీతాదేవితో నీకేమి పని? ఆర్యా! నాతో రమింపుము, ఏ విధముగను సీత నాకంటే అందగత్తె కాదు, అని మధురంగా మాట్లాడి, అతని కోపాన్ని పోగొట్టింది.

**దేవ గంధర్వ కన్యాభిః యక్ష కన్యాభిరేవ చ।**
**సార్ధం ప్రభో రమస్వేహ సీతయా కిం కరిష్యసి॥**

**(శ్రీవాల్మీకి శ్రీమద్రామాయణం - 2వ భాగం - 5వకాండ - 58వ సర్గ - 79వ శ్లోకము)**

దేవ, గంధర్వ, యక్ష కన్యలతో నీవు హాయిగా క్రీడింపుము, వీరు ఇందరుండగా సీతకై ఏల ఆరాటపడతావు?, అని మండోదరి పలికి, ఇష్టంలేని స్త్రీని బలాత్కారించడం తప్పు అని నీతి బోధ చేసి, సీతను రావణుడు వధించకుండా కాపాడింది.

ఇలా భర్తలు చేసే తప్పులను వారించడం, వారి బారి నుంచి అన్యులను కాపాడడం, వారికి నీతి బోధ చేసి మంచి దారిలోనికి మళ్ళించడానికి ప్రయత్నం చేయడం వంటి శుభ లక్షణాలను భార్యలు కలిగివుండాలని, మండోదరి పాత్ర నేటి సమాజానికి సందేశాన్నిస్తూ వుంది.

సీత జాడను, సీతా సందేశాన్ని లంక నుండి తిరిగి వచ్చిన హనుమ, శ్రీరామునికి తెలియచేశాడు. శ్రీరాముడు లంకపై యుద్ధానికి వానరసైన్యంతో

కలసి బయలు దేరి, సముద్రాన్ని దాటారు. ఉత్తమ సతి అయిన మండోదరి తన పతి రావాణాసురుడికి ఇలా హితవు పలికింది.

**యదైవ చ జనస్థానే రాక్షసైర్బహుభిర్వృతః ।**
**ఖరస్తవ హతో భ్రాతా తదైవాసౌ న మానుషః ॥**

**యదైవ నగరీం లంకాం దుష్ప్రవేశాం సురైరపి ।**
**ప్రవిష్టో హనుమాన్ వీర్యాత్ తదైవ వ్యథితా వయమ్ ॥**

**యదైవ వానరైర్ఘోరైః బద్ధః సేతుర్మహార్ణవే ।**
**తదైవ హృదయేనాహం శంకే రామమ్ అమానుషమ్ ॥**

**(శ్రీవాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 7వ కాండము - 114వ సర్గ - 9,10,11 శ్లోకాలు)**

నాథా! అసంఖ్యాకమైన రాక్షస బలగాలతో కూడి వున్న నీతమ్ముడు ఖరుదుని, అతని జన్మస్థానము నందే రాముడు వధించాడు. కనుక రాముడు మానవ మాత్రుడు కాడు. దేవతలకే ప్రవేశింపడానికి వీలుకాని లంకనగరంలోనికి రాముని సేవకుడైన హనుమంతుడు వచ్చి, మన వారిని ముప్పుతిప్పలు పెట్టి లంకను కాల్చి మరీ వెళ్ళాడు. రాముని అనుచరులైన మహాపరాక్రమములుగల వానరవీరులు మహాసముద్రం పైననే సేతువు నిర్మించారు, అని మండోదరి రావణునితో పలికింది.

**రామ బాన అహి గన సరిస, నికర నిసాచర భేక ।**
**జబ లగి గ్రసత న తబ లగి, జతను కరహు తజిటేక ॥**

**(శ్రీరామచరిత మానసము - సుందరకాండము - దో 36)**

శ్రీరాముని బాణములు సర్పములతో సమానము, మన రాక్షస మూకలు కప్పలతో సమానము. ఆ పాములు ఈ కప్పలను కబళింపక ముందే మీ పట్టుదల మాని, రామునితో వైరము మాని, పతివ్రతా శిరోమణి అతని భార్యయైన సీతను అతనికి అప్పగించి, రామునితో మైత్రి కుదుర్చుకో, అని

మండోదరి రావణుడికి హితబోధ చేసింది. భర్త తప్పులను సమర్థించక మంచి దారిలో పెట్టడానికి, కరణేషు మంత్రిలా మంచి సలహాలు ఇచ్చి, మండోదరి భార్యలు భర్తల పట్ల ఎలా వుండాలో ఈ సమాజానికి సందేశాన్నిచ్చారు.

**వ్యక్తమ్ ఏష మహాయోగీ పరమాత్మా సనాతనః ।**
**అనాదిమధ్యనిధనో మహతః పరమో మహాన్ ॥**

**తమసః పరమో ధాతా శంఖ చక్రగదాధరః ।**
**శ్రీవత్సవక్షా నిత్యశ్రీః అజయ్యః శాశ్వతో ధ్రువః॥**

**మానషం వపురాస్థాయ విష్ణుః సత్యపరాక్రమః ।**
**సర్వైః పరివృతో దేవైః వానరత్వముపాగతైః ॥**

**(శ్రీవాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 6వ కాండము - 114వ సర్గ - 14,15,16వ శ్లోకాలు)**

శ్రీరాముడు మానవ మాత్రుడు కాడు. మహాయోగి, పరమాత్మ, ఆదిమధ్యాంత రహితుడు, మహత్తుకు మించిన మహాత్తైనవాడు, జ్ఞాన స్వరూపుడు, సమస్త ప్రాణులను పోషించువాడు, శంఖ, చక్ర, గదాధారి, లక్ష్మీ నిలయ హృదయుడు, అనంత పరాక్రమవంతుడు, ఇతడు సాక్షాత్తు శ్రీ మన్నారాయణుడే. లోకహితం కోసం మానవ రూపంలో అవతరించి నిన్ను వధించాడు, అని మండోదరి శ్రీరాముడిని చూసి విలపిస్తూ పలికింది. అదే మహా పాతివ్రత్యం అంటే! రావణుడికి, ఇంతమంది రాక్షసులకు రాముడిని చూసినప్పుడు కలగని సత్య దర్శనం, మండోదరి ఒక్కసారి రాముడిని చూడగానే ఆమెకయ్యింది. అలా సత్యదర్శనం చేసుకోగల స్థితిలో లోకులు జీవించాలనే సందేశం ఇక్కడ సమాజానికి మండోదరి ద్వారా అందుతూ వుంది.

**యాస్త్వయా విధవా రాజన్ కృతా నైకాః కులస్త్రియః ।**
**పతివ్రతా ధర్మపరాః గురుశుశ్రూషణే రతాః ।**

**తాభిః శోకాభితప్తాభిః శప్తః పరవశం గతః ॥**

**(శ్రీవాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగము - 6వకాండము - 114వ సర్గ - 65వ శ్లోకము)**

రాజా! నీవు పెక్కుమంది కులస్త్రీల భర్తలను చంపి వారిని విధవలను జేశావు. వారందరనూ ధర్మపరాయణులై పెద్దలను సేవించుచూవుండిన పతివ్రతలు. నీచేత అవమానితులైన ఆ సతీమణుల తీరని దుఃఖమే నీ పాలిట శాపమై నీవు నేడు నీ శత్రువు చేతిలో మరణించడానికి కారణమైనాయి.

భర్త చేసిన తప్పులను సమర్థించకపోవడం, దాని వలన వచ్చే ముప్పును తెలపడం, ఎదుటి వారి బలాలను నిజాయితీగా అంగీకరించి వివరించడం వంటి అద్భుతమైన మండోదరి లక్షణాలు నేటి సమాజంలోని భార్యామణులందరికీ సందేశాన్నిచ్చే ఆదర్శ గుణాలు.

కానీ పతివ్రతా శిరోమణి అయిన మండోదరి చెప్పిన మంచి మాటలను, రావణుడు తన అహంకారం, మూర్ఖత్వం, తన బలగాలు, బలంపై పెట్టుకొన్ని అతి నమ్మకం వంటి దుర్గుణాలతో, పెడచెవిన పెట్టాడు. చివరికి భీకరమైన రామరావణ యుద్ధంలో రావణుడు మరణించాడు. ఆ వార్త విన్న మండోదరి నుండి కన్నీటి ప్రవాహం ధారగా ప్రవహిస్తూ వుండగా మౌన ధీర గంభీర శోకమూర్తియై యుద్ధ భూమికి వెళ్ళింది. పదితలల రావణాసురుడు పెనుతుఫానుకు పెల్లగిల్లి నేలకూలిన మహావృక్షంలా విగత జీవుడై పడివున్నాడు. విభీషణుడు, రాక్షసులు, రావణుడి రాణులందరూ రోధిస్తూ వున్నారు. మూర్తీభవించిన శోక దేవతలా మండోదరి అక్కడికి వచ్చింది. అందరూ ఆవలికి జరిగారు. రావణుడి ఎదపై వ్రాలి మండోదరి భోరున రోధించి ఇలా పలికింది.

తన భర్త, పుత్రుడు, బంధువులు, రాజ్యం, తనవారు ఎవ్వరూ మండోదరికి లేకుండా ఒంటరిదై మిగిలింది. ఇంతమందిని చంపిన రాముడు అక్కడే ఉన్నాడు. దీనికంతటికీ కారణం నువ్వే అని రాముడిని, అందరు

సామాన్య స్త్రీలలా మండోదరి ఒక్క మాట కూడా నిందించలేదు. అన్నను వదిలి శత్రు పక్షాన చేరి నేటి పరిస్థితికి సహాయ సహకారాలందించిన తన మరిది విభీషణుడినీ మండోదరి పల్లెత్తు మాట అనలేదు. ఇదీ మండోదరి యొక్క గొప్ప తనం. పరనింద కాదు, యుక్తా యుక్త విచక్షణ అవసరమని మండోదరి సమాజానికి సందేశాన్నిచ్చింది.

పూజ్యుడా! ముల్లోకాలను జయించిన వీరులు మీరు. బ్రాహ్మణులు, ఋషులు, గంధర్వులు, యముడు, దేవేంద్రుడు వీరంతా మిమ్మల్ని చూస్తే గడ గడ వణికిపోతారే. మీరు మృత్యు దేవతకే మృత్యువే. మీ భుజ బలంతో శంకరునితో పాటు కైలాస పర్వతాన్నే ఎత్తి వేశారే, అటువంటి మీకా మరణం? అదీ ఒక మానవమాత్రుడి ద్వారానా? నిష్కారణంగా నేలపై రాలిన ఆ పతివ్రతల యొక్క కన్నీటి బిందువులే రావణుడి మరణానికి కారణమని సత్యశోధనతో కూడి పలికిన ఆమె మాటలు నేటి సమాజానికి ఆదర్శనీయ సందేశాలు.

**అరుంధత్యా విశిష్టాం తాం రోహిణ్యాశ్చాపి దుర్మతే ।**
**సీతాం ధర్షయతా మాన్యాం త్వయా హ్యసదృశం కృతమ్ ॥**

**వసుధాయాశ్చ వసుధాం శ్రియః శ్రీం  భర్తృ వత్సలామ్ ।**
**సీతాం సర్వానవద్యాంగీమ్ అరణ్యే విజనే శుభామ్ ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 6వ కాండము - 114వ సర్గ- 21,22 శ్లోకములు)**

దుర్మతీ! పతివ్రతలైన అరుంధతి కంటే, రోహిణి కంటే సీత ఉత్తమురాలు. ఆమె జగజ్జనని. అటువంటి పతివ్రతను నీవు కామించి, అపహరించుకొని వచ్చావు.

నాథా! సీతాదేవి సహనమున భూదేవిని మించినది, లక్ష్మీ దేవి వలె సర్వ సంపదలకు పెన్నిధి, పతి సేవా పరాయణురాలు, తన భర్త కోసం

అరణ్యాలకొచ్చిన మహాపతివ్రత. నీ మోసం వలన అటువంటి సాధ్వీమణి ధీనురాలై తల్లడిల్లుతుంటే, బలవంతంగా ఆమెను ఎత్తుకొని వచ్చావు. మరి ఆ తల్లి తేజస్సు నిన్ను కాల్చకుండా ఉంటుందా?, అని మండోదరి పలికింది.

స్త్రీకి సహజంగా ఉండవలసిన అసూయ ఏ మాత్రమూ లేనిదై మహనీయమూర్తిగా, మాననీయురాలిగా, జాజ్వల్యమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడానికి మండోదరి, జరిగిన పరిణామలకు కారణాలు ఏమిటో సత్య దర్శనం చేసి, నిష్పక్షపాతంగా విశ్లేషించిన మహానుభావురాలు మండోదరి. ఇవన్నీ సమాజంలోని స్త్రీ జాతికి మండోదరి ఇచ్చిన సందేశాలు.

**సర్వథా సర్వభూతానాం నాస్తి మృత్యురలక్షణః ।**
**తవ తావదయం మృత్యుః మైథిలీకృతలక్షణః ॥**
**సీతా నిమిత్తజో మృత్యుః త్వయా దూరాదుపాహృతః ।**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 6వ కాండము - 114వ సర్గ- 29,30 శ్లోకములు)**

సమస్త ప్రాణులకును ఏ విధముగను అకారణముగా మృత్యువు ప్రాప్తింపదు. అలాగే సీతాదేవిని అపహరించుకొని వచ్చుట వలన నీకు మృత్యువు దాపురించినది. సీత రూపములో నీ చావును దూరము నుండి నీవే స్వయంగా తెచ్చుకొన్నావు, అని రావణుడి మృత్యువుకు అసలు కారణమేమిటో మండోదరి వివరించింది.

**ఇంద్రియాణి పురా జిత్వా జితం త్రిభువనం త్వయా ।**
**స్మరద్భిరివ తద్వైర మింద్రియై రేవ నిర్జితః ॥**

**(వాల్మీకి శ్రీమద్రామాయణం - 3వ భాగం - 6వ కాండము - 114వ సర్గ- 18వ శ్లోకము)**

నాథా! పూర్వం నీవు ఇంద్రియాలను జయించి ముల్లోకములను జయించావు. ఆ శత్రుత్వంతో ఆనాడు నీ చేత ఓడిపోయిన ఆ ఇంద్రియాలు

నేడు నీవు నీ కామాన్ని నిగ్రహించుకోలేక తప్పుచేయడం వలన ఈనాడు అవే నిన్ను ఓడించాయి, అని మండోదరి పలికింది.

ఎంతటి వీరులయినా, తపశ్శంపన్నులైనా, ఇంద్రియాలను అదుపు చేసుకోలేకపోతే మృత్యువు తప్పదు. పరకాంతా వ్యామోహం పదితలల పాము పై కాటు వేయక తప్పదు. పతివ్రతల జోలికి వెళితే ఫలితం చాలా దారుణంగా వుంటుంది. ఎన్ని సుగుణాలున్నా కామం అనే ఒక్క దుర్గణం వుంటే, కడవడు పాలలో ఒక్క విషం చుక్క వేస్తే చాలు ఎలా ప్రాణాలను తీసివేస్తుందో అలా మృత్యువు ముఖానికి చేరువ అవుతారు, తస్మాత్ జాగ్రత్త అనే సందేశాల్ని మండోదరి నేటి సమాజానికి అందించింది.

భర్త, పుత్రులు, బంధువులు, రాజ్యం, సర్వం తానుచేయని తప్పులకు కోల్పోయి ఎంతో బాధలో వున్న మండోదరి, రాముడిని కానీ, విభీషణుడిని కానీ పల్లెత్తు మాట అనలేదు. సాధారణ స్త్రీలలాగా భర్త తప్పులను కప్పి పుచ్చి ఇతరులను సాధించలేదు. కారణాలను, తప్పటడుగులను సమీక్షించింది. నిర్మాణాత్మకమైన విమర్శనా ధోరణితో ఆవేదనా పూరిత అయ్యింది. మండోదరి విశాలమైన హృదయం, తప్పును తప్పుగా చెప్పగలిగే ధైర్యం, తనదైన సొంత వ్యక్తిత్వం చివర వరకు కలిగి వుండడం, భర్తలు చేసే తప్పులకు మంచివారైనవారి భార్యలు శిక్షలు అనుభవించవలసి వస్తుందన్న బోధ, ఇవన్నీ నేటి సమాజానికి మండోదరి అందించిన సందేశాలు.

నాయకుడికి భార్య అయిన వ్యక్తిలో శుభలక్షణాలుండడంలో ఆశ్చరమేమీ వుండదు కానీ, రాక్షస రాజ్యంలో మహరాణిగా వుండి, ప్రతి నాయకుడైన రాక్షసరాజు రావణాసురుడి భార్య అయిన మండోదరిలో ఇన్ని శుభలక్షణాలు ఉండడం ఎంతో ఆశ్చర్యానంద అద్భుతాన్ని కలిగిస్తుంది. తాను వున్న ప్రాంతం, తన చుట్టూ వున్న వ్యక్తుల ఆలోచనలు, చర్యలు అన్నీ రాక్షసత్వంతో కూడుకున్నవే. అయినా కూడా మండోదరి వాటి, వారి ప్రభావానికి లోనుకాక

సాత్వికంగా, ధర్మంగా, పతివ్రతా శిరోమణిగా జీవించింది. బురదలో పుట్టి పెరిగినా, ఆ బురదను ఏ మాత్రం అంటించుకొనక, స్వచ్ఛంగా వికసించే తామర పువ్వులా, ప్రతి ఒక్కరూ జీవించాలనే సందేశాన్ని మండోదరి ఈ సమాజానికిచ్చింది.

రాక్షసరాజు పట్టపు రాణి అయివుండి కూడా, ఎటువంటి చెడు కార్యాలు చేయకుండా, చెడును ప్రోత్సహించకుండా, ధర్మం తప్పిన రాజుకే హిత బోధ చేస్తూ, మండోదరి తనదైన సొంత వ్యక్తిత్వంతో జీవించి, ప్రతి ఒక్కరూ తమ స్వయం వ్యక్తిత్వ వెలుగులతో, జీవన గమనాన్ని సాగించాలనే సందేశ విజ్ఞాన కాంతులను నేటి సమాజానికి అందించిన ఆదర్శ జ్యోతి, పతివ్రతా శిరోమణి, మండోదరి.

* * *

# ద్రౌపది

అఖండ తేజస్సంపన్నురాలు, మహా పతివ్రత, గొప్ప భగవద్భక్తురాలు, సాటిలేని ధైర్యశాలి, ఉత్తమ ఇల్లాలు, ఆదర్శ గృహిణి, పతిసేవా పరాయణురాలు, సత్యసంధురాలు, ధర్మాచరణురాలు, బుద్ధిమంతురాలు, ఆదర్శగృహిణి, అభిమానధనురాలు, క్షమాశీలి, కారణజన్మురాలు ద్రౌపది. ఈమె క్షాత్ర ధర్మానుసారిణి. దాంపత్య ధర్మాన్ని చక్కగా నిర్వర్తించిన మహాసాధ్వి. జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా వాటన్నింటినీ ఎదుర్కొన్న ధీరవనిత. జగన్నాథుడైన శ్రీకృష్ణుని భార్య సత్యభామకే పతివ్రతా ధర్మాలు బోధించిన పరమాచార్య. భర్తల హృదయ నీరాజనాలు అందుకొన్న సుగుణాల సతి. స్త్రీలు సైతం మరులు గొని మోహించే అంత అద్భుత సౌందర్యరాశి. తనకు జరిగిన అవమానాలకు ప్రతీకారం తీర్చుకొని పంతం నెగ్గించుకొన్న రోషనారి. సర్వ ధర్మాలను తెలిసిన ధర్మవేత్రి. అధర్మాత్ములను అంతమొందించడానికి అగ్నిలో నుండి అయోనిజగ జన్మించిన దుష్ట సంహారకారిణి ద్రౌపది. ఇలా విభిన్న రూపాలలో అత్యంత విలక్షణ దివ్యాంగన ద్రౌపదిదేవి వ్యాస మహాభారతంలో సాక్షాత్కరించినది. ఎవరిని స్మరిస్తే సకల పాపాలు హరించబడతాయి అని చెప్పబడిందో, ఆ పంచకన్యలలో ద్రౌపది ఒకరు. మహాభారతములో అత్యంత ముఖ్యమైన స్త్రీ పాత్రలలో ప్రథమరాలు ద్రౌపది. కురుక్షేత్ర సంగ్రామం జరగడానికి సర్వ కౌరవ వినాశనానికి ప్రధాన కర్త ద్రౌపది.

భరద్వాజ మహర్షి పుత్రుడు ద్రోణుడు. భరద్వాజ మహర్షి మిత్రుడు వృషతుడు అనే రాజు. ఆ రాజు పుత్రుడు ద్రుపదుడు. ద్రుపదుడు భరద్వాజ మహర్షి ఆశ్రమానికి వెళ్ళి ద్రోణుడితో ఆడుకొనేవాడు, చదువుకొనేవాడు. వృషతుడు మరణించగానే ద్రుపదుడు రాజు అయ్యాడు. రాజైన ద్రుపదుని వద్దకు వెళ్ళి నేను నీ మిత్రుడను అని ఎంతో సంతోషంగా అన్నాడు ద్రోణుడు. రాజు కాని వాడు రాజునకు మిత్రుడు కాలేడు, ఒకనాటి చెలిమి గురించి

ఇప్పుడెందుకు వెళ్ళు, అన్నాడు ద్రుపదుడు. ద్రోణుడు తనకు జరిగిన అవమానానికి ద్రుపదునిపై పగ సాధించాలి అని నిశ్చయించుకొన్నాడు. పరుశురాముడు తన సంపదనంతా దానంచేసి తాను అరణ్యాలకు వెళ్ళాలనుకొంటున్నాడని తెలిసి ద్రోణుడు పరశురాముని వద్దకు వెళ్ళాడు. అప్పటికే తన వద్దనున్న సకల సంపదలు దానం చేసేశానని, ఇక మిగిలినవి రెండే రెండు, ఒకటి అస్త్రాలు, రెండు ఈ శరీరం. వీటిలో నీకు ఏది దానంగా కావాలో కోరుకో, అని పరశురాముడు ద్రోణుడితో అన్నాడు. వాటిని ప్రయోగించడం, ఉపసంహరించడం మంత్రాలతో పాటు అస్త్రాలన్నింటిని అనుగ్రహించమని ద్రోణుడు ప్రార్థించాడు. పరుశురాముడు ఇదిగో తీసుకో, అంటూ బ్రహ్మాస్త్రంతో సహ అస్త్ర విద్యను ద్రోణునికి దానం చేశాడు. పరమానంద భరితుడైన ద్రోణుడు హస్తినాపురముకు వెళ్ళాడు. భీష్ముడు తన మనవలైన కౌరవులకు, పాండవులకు గురువుగా ద్రోణుడిని నియమించి, అతనికి పెక్కుధనాన్ని ఇచ్చాడు. విద్యాభ్యాస అనంతరం ద్రోణుడు తన గురుదక్షిణగా ద్రుపదుడిని జయించి, బందీగా తీసుకురమ్మని తన శిష్యులను కోరాడు. అర్జునుడు ద్రుపదుడిని జయించి, బంధీగా తీసుకొచ్చి గురువైన ద్రోణాచార్యుని వద్దకు తీసుకొచ్చాడు. ద్రోణాచార్యుడు ద్రుపదునితో నేను నీతో మరలా మైత్రినే కోరుతూవున్నాను, రాజు కాని వాడు రాజుకు మిత్రుడు కాలేడు అన్నావు కదా! అందుకోసం ఇప్పుడు నేను జయించిన నీ రాజ్యంలో గంగానదికి దక్షిణాన వున్న సగభాగానికి నీవు రాజు, ఉత్తరానవున్న సగ భాగానికి నేను రాజు అని చెప్పాడు. అంగీకరించిన ద్రుపదుడు వెళ్ళిపోయాడు. కానీ ఆ పరాభవం ద్రుపదుని దహించివేసింది. యాజుడు, ఉపయాజుడు అను ఇద్దరు బ్రహ్మర్షులను ద్రుపదుడు ప్రార్థించి వారి ద్వారా ద్రోణుని కన్నా యుద్ధంలో మిన్నయై, ద్రోణుని సంహరించగల పుత్రుడు మరియు అర్జునుడిని వివాహమాడగల పుత్రిక కలగడానికి ఒక మహాయాగం చేశాడు. ఆ హోమాగ్ని నుండి దేవ

సమానుడైన పరాక్రమవంతుడైన పుత్రుడు పైకి లేచాడు. అతనికి ధృష్టద్యుమ్నుడు అని నామకరణం చేశాడు.

**కుమారీ చాపి పాంచాలీ వేదీమధ్యాత్సముత్థితా ।**
**సుభగా దర్శనీయాంగీ స్వసితాయతలోచనా ॥**

**శ్యామా పద్మపలాశాక్షీ నీలకుంచిత మూర్ధజా ।**
**తామ్రతుంగనఖీ సుభ్రూః చారుపీనపయోధరా ॥**

**మానుషం విగ్రహం కృత్వా సాక్షాదమర వర్ణినీ ।**
**నీలోత్పల సమో గంధః యస్యాః క్రోశాత్ ప్రధావతి ॥**

**యా బిభర్తి పరం రూపం యస్యాః నాస్త్యుపమా భువి ।**
**దేవదానవ యక్షాణామ్ ఈప్సితాం దేవరూపిణీమ్ ॥**

**(శ్రీ మహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - 166వ అధ్యాయము - 44,45,46,47 శ్లోకములు)**

తరువాత ఆ హోమాగ్ని నుండి ఒక కన్య పైకి వచ్చింది. ఆమె సౌందర్య సౌభాగ్యాలతో కూడి ఉన్నది. ఆమె నేత్రాలు నల్లగా, విశాలంగా ఉన్నాయి. ఆమె నల్లగా వున్నది. తామర రేకుల వంటి కన్నులు, ఉంగరాలు తిరిగిన నల్లని జుట్టు, ఎత్తైన ఎర్రటి గోరులు, అందమైన వక్ష సంపద కలిగి ఉన్నది. మనిషి రూపాన్ని ధరించిన దేవకాంతలా ఉంది. ఆమె శరీరం నుంచి కలువ పూల సువాసన (క్రోసెడు) రెండు మైళ్ళు దూరం వ్యాపిస్తూ ఉంది. ఆమె రూపం అత్యంత సుందరం. భూలోకంలో ఆమెకెవరూ సాటిలేనంత దివ్యరూపంతో అద్భుతంగా మానవులే కాదు దేవతలు యక్షులూ కూడా ఆమే కావాలనుకొనే అంత అందంగా ఆమె ఉన్నది.

“ఈమె పేరు కృష్ణ. స్త్రీలందరిలో శ్రేష్ఠురాలైన ఈమె క్షత్రియులందరినీ నాశనం చేస్తుంది. తగిన సమయంలో ఈమె ఈ దేవకార్యాన్ని పూర్తిచేస్తుంది. ఈమె కారణంగానే కౌరవులకు తీవ్ర భయం కలుగుతుంది”, అని ఆకాశము

నుండి అశరీరవాణి పలికింది. ఈమె శరీరచ్ఛాయ నల్లనిది కాబట్టి ఈమెకు కృష్ణ అనిపేరు. పాంచాల రాజు ద్రుపదుని కుమార్తె కాబట్టి ఈమే పాంచాలి అని, ద్రౌపది అని పిలవబడినది. యజ్ఞం నుండి జన్మించినది కాబట్టి యజ్ఞసేని అని పిలువబడింది.

కౌరవుల పన్నాగంతో లక్క ఇంటిలో పాండువులు తగలబడి చనిపోయారని కౌరవులు, లోకులు అనుకున్నారు. కానీ సొరంగమార్గం ద్వారా పాండవులు తప్పించుకొన్నారు. పాండవులు కొంత కాలం ఏకచక్రపురంలో తల్లియైన కుంతి దేవితో కలసి బ్రాహ్మణుల వేషధారణతో గడిపిన తర్వాత అక్కడ నుండి ద్రుపదమహారాజు పరిపాలించే దక్షిణ పాంచాల దేశానికి ప్రయాణమయ్యారు. పాంచాల దేశాన్ని చేరుకొని అక్కడ ఒక కుమ్మరి ఇంటిలో బస చేశారు. ద్రుపద మహారాజు ద్రౌపదికి స్వయంవరం ప్రకటించాడు. అర్జునుని వివాహమాడే పుత్రిక కోసం యాగం చేసి మరి ద్రౌపదిని పుత్రికగా పొందిన ద్రుపదుడు, చలించే లక్ష్యాన్ని అర్జునుడే చేధించగలడు కాబట్టి, బలమైన ధనస్సును చేయించి, దానితో ఆకాశంలో కృత్రిమంగా తిరిగే మత్సయంత్రాన్ని ఐదు బాణాలతో కొట్టిన వీరుడిని ద్రౌపది వరిస్తుందని ప్రకటించాడు.

బ్రాహ్మణ వేషంలో వున్న పాండవులు కూడా ద్రౌపది స్వయంవరానికి వెళ్ళారు. స్వయంవరానికి వచ్చిన ఎందరో రాజులు మత్స యంత్రాన్ని చేధించడానికి ప్రయత్నించి విఫలురైనారు. కర్ణుడు ధనస్సు చేతికి తీసుకోగానే సూతపుత్రుడిని ద్రౌపది వివాహం చేసుకోను అనడంతో కర్ణుడు వెనుదిరిగాడు. చివరగా బ్రాహ్మణ వేషంలో వున్న అర్జునుడు మత్స్యయంత్రాన్ని చేధించాడు. ద్రౌపది అర్జునుని మెడలో పూలమాలను వేసి వరించింది. దేవతలు పుష్పవర్షం కురిపించారు.

స్వయంవరానికి విచ్చేసిన ఇంతమంది రాజులను కాదని బ్రాహ్మణుడికిచ్చి ద్రౌపదిని వివాహం చేయడం నచ్చని రాజులందరూ కలసి

ద్రుపద మహారాజుపై దాడికి దిగబోగ, బ్రాహ్మణ వేషంలో వున్న అర్జునుడు, భీముడు వాళ్ళపై యుద్ధం చేసి ఓడించారు. భీమార్జునులు ద్రౌపదిని తీసుకొని కుమ్మరి ఇంటిలో వున్న కుంతిదేవి దగ్గరకు వెళ్ళి, అమ్మా! భిక్ష తెచ్చాము, అన్నారు. అటువైపు తిరిగివున్న ఆమె, మీరు అందరూ కలసి భుజించండి అంది. తరువాత ద్రౌపదిని చూసి అయ్యో ఇలా అన్నానేమిటి? అని అనుకొన్నది. తల్లి ప్రథమ గురువు, ఆమె ఆజ్ఞను పాటించాలని ద్రౌపదిని ఐదుమంది పెండ్లి చేసుకోవాలని ధర్మరాజు చెప్పాడు. పాండవులు భిక్షాటనకెళ్ళి తీసుకొచ్చిన భిక్షను ద్రౌపది, అత్తయైన కుంతిదేవి సూచనల ప్రకారం ఒక భాగం దేవతలకు బలిగా నివేదించి, మరొక భాగం విప్రులకు భిక్షగా పెట్టింది, మరియు వారి చుట్టూ అన్నంకోసం ఆశ్రయించుకొని ఉన్నవారికి కొంత భాగం ఆహారం పెట్టింది. మిగిలిన దానిలో సగం భాగం భీమునికి పెట్టింది. తక్కిన సగ భాగాన్ని ఆరు భాగాలుగా చేసి ధర్మరాజు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, కుంతి, తనకు అందరికీ సమానంగా పెట్టింది. భోజనం తర్వాత పాండవులు, కుంతి, ద్రౌపది అందరూ ఆ రాత్రికి దర్భలను నేలపై పరచి వాటిపై జింక చర్మాలను పరుచుకొని ఆ ఇంటిలోనే నిదురించారు.

రాజకుమార్తెగా పుట్టి పెరిగి, అంతఃపుర సుఖాలతో జీవించిన యువరాణి ద్రౌపది, కుమ్మరి ఇంటిలోనున్న పాండవుల నివాసానికి వెళ్ళి అందులోనే ఆమె సర్దుకోవడం, అత్త చెప్పిన మాటలను ఆచరించడం, భర్తలు తెచ్చిన భిక్షను తాను తినడం, అది కూడా వారందరూ భోజనం చేశాక చివరగా తాను తినడం, కటిక నేలపై దర్భలు పరుచుకొని తాను కూడా నిదురించడం ద్వారా సమాజానికి ఎన్నో సందేశాలు అందించింది. ఒక కన్య తన అమ్మగారింట ఎన్నో సౌకర్యాల నడుమ ఎంత వైభోగంగా పెరిగి వున్నా, వధువై వివాహానంతరం అత్తగారింట అడుగు పెట్టాక ఆమె అక్కడ వున్న సౌకర్యాలు, పరిస్థితులకనుగుణంగా తనను తాను సర్దుబాటు

చేసుకొని జీవించడం, పెద్దవారైన అత్తగారిని గౌరవించడం మరియు వారి మాటలను ఆచరణలో పెట్టడం, పంచయజ్ఞాలలో భాగంగా ఆహారం స్వీకరించేవేళ గృహస్థ ఆశ్రమ ధర్మాల్లో భాగమైన భూత యజ్ఞాన్ని ఆచరించడం, ఇంటిలోని వారందరికీ వారి వారి ఆకలి, తినగలిగే శక్తికి అనుగుణంగా ఆహారం అప్యాయంగా అందించడం, చివరగా ఇల్లాలు భోజనం స్వీకరించడం, కటిక నేలపైన కూడా ఆనందంగా నిదురించగలగడం లాంటి ఎన్నో సుగుణాలను ప్రతి ఇల్లాలు కలిగివుండాలని మంచి భార్యగా, మంచి కోడలుగా, మంచి గృహస్థుగా ప్రతి ఒక్కరూ జీవించాలని, ద్రౌపది నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

మరునాడు ద్రుపద మహారాజు పాండవులను, కుంతిని, ద్రౌపదిని విందుకు ఆహ్వానించాడు. అందరూ అంతఃపురానికి వెళ్లారు. ద్రుపద మహారాజు ధర్మరాజును వారి వివరాలు తెలుపమని కోరగా అతను తాము లంక ఇంటి దహనం నుండి తప్పించుకొని బ్రాహ్మణ వేషంలోనున్న పాండవులము అని తెలిపాడు. ద్రుపదుడు చాలా ఆనందపడ్డాడు. ద్రౌపదిని ఐదుమంది వివాహం చేసుకోవడం లోక విరుద్ధం అన్నాడు ద్రుపదుడు. వ్యాసుడు ఆ సమయానికి అక్కడికి వచ్చాడు. ద్రౌపది వివాహ విషయంలో ధర్మ సందేహాల్ని తీర్చమని ద్రుపదుడు వ్యాసుడిని కోరాడు. అప్పుడు వ్యాసుడు తన తపఃశక్తితో ద్రుపదునికి దివ్య చక్షువులిచ్చి గతంలో జరిగిన విషయాల్ని దర్శించమన్నాడు. పాండవులు పూర్వపు రూపాలైన నలుగురి ఇంద్రుల రూపాలను, ఇంద్రుడి వలన పుట్టిన అర్జునుడి రూపాన్ని, స్వర్గ లక్ష్మి అయిన ద్రౌపది రూపాన్ని ద్రుపదుడు దర్శించాడు. శివుడి ఆజ్ఞ మేరకు వారు దైవ కార్య నిమిత్తం మానవులుగా జన్మించిన రహస్యాన్ని ద్రుపదుడు తెలుసుకొని ఆశ్చర్యానికి లోనయ్యాడు. తర్వాత ఆ స్వర్గలక్ష్మి మానవకాంతగా ఒక ఋషికి జన్మించింది. ఆమెకు వివాహం కుదరలేదు. ప్రత్యక్షమైన శివుడు ఏమి వరము కావాలో కోరుకోమన్నాడు. ఆమె తొందరలో అయిదుసార్లు మంచి

భర్తను ఇమ్మని కోరింది. మరో జన్మలో నీవు కోరుకొన్నట్లు ఐదుమంది వీరులను భర్తలుగా పొందుతావని ఈశ్వరుడు వరము ఇచ్చాడు. ఆమెయే ఇప్పుడు నీ కూతురిగా హోమాగ్ని నుండి ఉద్భవించినది అని, ద్రౌపదికి ఐదుమంది భర్తలుగా పూర్వమే నిర్ణితమైనది, అని వ్యాసుడు ద్రుపదునికి తెలిపాడు. వివరాలు తెలుసుకొన్న ద్రుపద మహారాజు ద్రౌపది వివాహాన్ని పాండవుల ఐదుమందితోనూ చేయడానికి అంగీకరించి, ఘనంగా వారికి వివాహం జరిపించాడు.

పాండవులు జీవించేయే వున్నారన్న విషయము ద్రౌపది వివాహంతో లోకానికి అంతటికి తెలిసింది. భీష్మ, ద్రోణాచార్య, విదురుల సలహా మేరకు పాండవులను హస్తినకు ధృతరాష్ట్రుడు పిలిపించి వారికి అర్ధరాజ్యమిచ్చారు. ఖాండవ ప్రస్థానంలో దేవతల ఉత్తమ శిల్పి అయిన విశ్వకర్మచే ఇంద్రనగరం వంటి నగరాన్ని నిర్మింపచేసి ఇంద్ర ప్రస్థం అనే పేరుతో దానిని రాజధానిగా చేసుకొని పాండవులు పరిపాలించసాగారు. ఖాండవ వనాన్ని అగ్ని దహిస్తూ వుంటే రాక్షసుల ఉత్తమ శిల్పి అయిన మయుడిని అర్జునుడు కాపాడాడు. అందుకు ప్రతిఫలంగా మయుడు పాండవులకు ఇంద్రప్రస్థంలో మయసభను నిర్మించి ఇచ్చాడు. పాండవులు రాజసూయాగాన్ని చేయడానికి నిశ్చయించుకొని కౌరవులను, ఇతర రాజులను ఇంద్ర ప్రస్థానానికి ఆహ్వానించారు. రాజసూయాగ సమయాన పాండవుల పట్టపురాణియైన ద్రౌపదిదేవి ధర్మరాజు ప్రక్కన తన వైభవం, వ్యక్తిత్వంతో దివ్యంగా వెలిగిపోయింది. యాగ సమయాన జరిగే అతిథి మర్యాదలు, భోజన ఏర్పాట్లు, దానాలు ఇత్యాది ముఖ్యమైన కార్యక్రమాలలో ముఖ్య పాత్ర పోషించి, అత్యంత భక్తిశ్రద్ధలతో తన సేవలనందించింది. ప్రధాన భూమికను పోషించి, ముఖ్యమైన కార్యనిర్వహణల్లో ఇల్లాలు భర్తకు ఏ విధంగా సహకరించాలో, తన బాధ్యతల్ని ఎంత భక్తి శ్రద్ధలతో నిర్వహించాలో నేటి సమాజానికి ద్రౌపది సందేశాన్నిచ్చింది.

రాజసూయాగానికి వచ్చిన దుర్యోధనుడు మయసభలో భంగపడి, అసూయతో రగిలిపోయి, హస్తినకు వెళ్ళి శకునితో మంతనాలు చేసి, పాండవులను హస్తినాపురానికి రప్పించి, మాయాజూదంలో ధర్మరాజును ఓడించాడు. తన సంపదను, రాజ్యాన్ని, సోదరులను పందెంలో పెట్టి ఓడిన ధర్మరాజు, తరువాత తనను తాను, చివరగా ద్రౌపదిని పందెంలో పెట్టి ఓడిపోయాడు. ద్రౌపది ఇప్పుడు కౌరవుల దాసి, ఆమెను సభలోనికి తీసుకురమ్మనమని ప్రాతికామిని దుర్యోధనుడు పంపాడు. అతను వెళ్ళి ద్రౌపదికి విషయం మొత్తం వివరించి సభకు రమ్మన్నాడు. అందుకు ద్రౌపది ముందు ఈ విషయం ధర్మరాజునడిగి తెలుసుకొనిరా, తరువాత నేను వస్తాను అని చెప్పి, ఏ వస్తువులపై ఆధిపత్యం కలిగి నీవు నన్ను ఓడిపోయావు? ముందు నిన్ను ఓడిపోయావా? లేదా నన్నే ముందు ఓడిపోయావా?" అన్న ప్రశ్నలకు సమాధానం తెలుసుకురమ్మని అతనిని పంపింది. అతను వెళ్ళి ధర్మరాజుకు ఆ విషయం తెలియచేశాడు. ద్రౌపదిని సభలోకి వచ్చి ఇక్కడే ఆ విషయాన్ని అడగమను, అని దుర్యోధనుడు చెప్పి, ప్రాతికామిని ద్రౌపది దగ్గరకు తిరిగి పంపాడు. పెద్దవారికైనా చిన్నవారికైనా సుఖదు:ఖాలు తప్పవు. ధర్మంమొక్కటే లోకంలో గొప్పది. మనం దానిని రక్షిస్తే అది మనకు శాంతినిస్తుంది. నేను ఈ ధర్మాన్ని అతిక్రమించను. కాబట్టి ధర్మబద్ధంగా నేనేం చేయాలో అడుగు. ధర్మాత్ములు, నీతివంతులు అయిన పెద్దలు చెప్పినట్లే నేను చేస్తాను, అని ద్రౌపది అతనితో పలికింది. ప్రాతికామి తిరిగి సభకెళ్ళి ద్రౌపది మాటలను వినిపించాడు. దుర్యోధనుడు దుశ్శాసనుడిని పంపి ద్రౌపదిని ఎలాగైనా తీసుకురమ్మన్నాడు, అతడు ద్రౌపది జుట్టు పట్టుకొని ఈడ్చుకొంటూ ఆమెను సభలోకి లాక్కొని వచ్చాడు. ద్రౌపది నా ప్రశ్నకు సభలోని వారు సమాధానం చెప్పండి, నన్ను ధర్మానుసారంగా కౌరవులు గెలుచుకొన్నారా? లేదా?, అని సభలో ప్రశ్నించింది. ఎవ్వరూ సమాధానం చెప్పకపోతే కౌరవులలో చిన్నవాడైన వికర్ణుడు మాత్రం లేచి ఇలా

సమాధానమిచ్చాడు. వేట, సూరాపానం, జూదం, విషయాసక్తి ఈ నాలుగు క్షత్రియులకు వ్యసనాలు అని చెప్పబడ్డాయి. వ్యసనాలకు చిక్కిన మనిషి ధర్మాన్ని వీడి ప్రవర్తిస్తుంటాడు. అందువలన అతని పనులను లోకం హర్షించదు. ధర్మరాజు వ్యసనాసక్తుడై, ఈ జూదగాళ్ళు రెచ్చగొట్టడం వలన ద్రౌపదిని పణంగా పెట్టి ఆడాడు. ఈ సాధ్వి ద్రౌపది ధర్మరాజు ఒక్కనికే భార్య కాదు, పాండవులు ఐదు మందికీ భార్య. ధర్మరాజు ముందు తనను ఓడిపోయి ఆ తర్వాత ద్రౌపదిని పణంగా పెట్టాడు. తనను తాను ఓడిపోయిన తరువాత ధర్మరాజుకి ద్రౌపదిని పణంగా పెట్టే హక్కు వుండదు. శకునియే ధర్మరాజును రెచ్చగొట్టి ఆమెను పణంగా పెట్టేలా చేశాడు. కాబట్టి ద్రౌపది గెలవబడలేదని నేను భావిస్తున్నాను, అని పలికాడు. కర్ణుడు వికర్ణుడిని మందలించి కూర్చోమని గద్దించి, దుర్యోధనుడితో కలసి ద్రౌపది మరియు పాండవుల యొక్క వస్త్రాలను ఊడదీయమన్నాడు. ద్రౌపది చీరపట్టి బలవంతంగా లాగి ఆమె వస్త్రాలను తొలగించడానికి దుశ్శాసనుడు ప్రయత్నించాడు. ద్రౌపది తన మానాన్ని కాపాడుకోవడం కోసం తన వస్త్రాలను గట్టిగా పట్టుకొని పెనుగులాడింది. దుశ్శాసనుడి పశుబలానికి శక్తిహీనురాలైన ద్రౌపది, తప్పించుకోలేని ఆ ఆపద నుండి ఇక తనను భగవంతుడైన శ్రీకృష్ణుడే కాపాడగలడన్న పూర్తి విశ్వాసంతో, తన వస్త్రాన్ని జారిపోనీకుండా గట్టిగా పట్టుకొని వున్న చేతుల్ని సైతం విడచి సంపూర్ణ శరణాగతితో చేతులెత్తి శ్రీకృష్ణ పరమాత్మను భక్తితో ఇలా ప్రార్థించింది.

**గోవిందేతి సమా భాష్య కృష్ణేతి చ పునః పునః ।**
**మనసా చింతయామాస దేవం నారాయణం ప్రభుమ్ ॥**

**గోవింద ద్వారకావాసిన్ కృష్ణ గోపీ జన ప్రియ ।**
**కౌరవైః పరిభూతాం మాం కిం న జానాసి కేశవ ॥**

**హే నాథ హే రమానాథ వ్రజనాథార్తి నాశన ।**
**కౌరవార్ణవ మగ్నాం మామ్ ఉద్ధరస్వ జనార్దన ॥**

**కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వభావన ।**
**ప్రపన్నాం పాహి గోవింద కురుమధ్యేవసీదతీమ్ ॥**

**(శ్రీమహాభారతము - మొదటి భాగము - సభా పర్వము - 68వ అధ్యాయము - 40,41,42,43 శ్లోకములు)**

గోవిందా! కృష్ణా! గోపి జనప్రియా! కేశవా! నిండు సభలో కౌరవులు నన్ను మానభంగం చేసి పరాభవించడానికి చేస్తున్న నా ఈ ఆపదను గుర్తించవా? రమావల్లభా! ఆర్తి నాశకా! కౌరవ సాగరంలో మునిగిపోతున్న నన్ను ఉద్ధరించవా? జనార్ధనా? మహాయోగి! విశ్వాత్మా! నన్ను కాపాడు స్వామీ, నీవు తప్ప నాకు ఇక దిక్కు ఎవరూ లేరు స్వామీ!, అని ద్రౌపది రోదిస్తూ శ్రీకృష్ణుడిని ప్రార్థించింది. ధర్మస్వరూపుడైన శ్రీకృష్ణభగవానుడు ప్రత్యక్షమై అదృశ్యరూపంలో వుండి ఎడతెరిపి లేని వస్త్రాలను ద్రౌపదికి ప్రసాదించాడు.

దుశ్శాసనుడు ద్రౌపది చీరను లాగే కొద్దీ ఎడ తెరపి లేకుండా రంగు రంగుల చీరలు ఒక దాని వెంబడి మరొకటి ద్రౌపది చీరలాగే ఎంతసేపైనా రాసాగాయి. ఆ వస్త్రాలు గుట్టలు గుట్టలుగా పడిపోయినా ద్రౌపది వస్త్రాలు హరింపబడి ఆమె వివస్త్రకాలేదు. దుశ్శాసనుడు అలసి సొలసి క్రింద పడిపోయాడు. విదురుడు లేచి ద్రౌపది సభ ముందు వుంచిన ప్రశ్నకు సమాధానం చెప్పవలసినదిగా సభికులను కోరాడు. కురు వంశానికి కోడలినై, పుత్రీ సమానమైన నన్ను, ఒక స్త్రీని, పతివ్రతను, సభ మధ్యలోకి ఈడ్చుకు వచ్చి వస్త్రాపహరణ చేయడానికి పూనుకోవడం కాలవైపరీత్యమే. ఇదేనా రాజుల ధర్మము? ఇదేనా భారతీయ సనాతన ధర్మం? అని రోదిస్తూ ప్రశ్నించింది. అప్పుడు విదురుడు ధర్మరాజు తాను ఓడిన తర్వాత ద్రౌపదిని పందెంలో పెట్టాడు కాబట్టి అతనికి ఆ అధికారం లేదు, అది చెల్లదు అని, ధర్మాన్ని కాపాడాలని, అది నశిస్తే అందరి వినాశనం తప్పదు అని తెలిపాడు. అశుభ సూచకంగా నక్కల ఊళలు, గాడిదల ఓండ్రలు వినిపించాయి.

గాంధారి, విదురుడు ధృతరాష్ట్రునికి కీడును శంకించి విషయాన్ని నివేదించారు. ద్రౌపది సామాన్యురాలు కాదని గ్రహించిన ధృతరాష్ట్ర మహారాజు ఆమెకు శాంతిని కలిగించడానికి దుర్యోధనుడిని మందలించి, ద్రౌపదిని తనకు ఇష్టమైన వరం కోరుకొమ్మన్నాడు. ఆమె ధర్మరాజును దాస్య విముక్తిడిని చేయమని కోరింది. అలాగే జరుగుతుంది, ఇంకోవరం కూడా కోరుకొమ్మన్నాడు ధృతరాష్ట్రుడు. భీమార్జున నకల సహదేవులను దాస్య విముక్తుల్ని చేయమని కోరింది. అలాగే జరుగుతుంది, మూడవ వరం కూడా కోరుకొ, అని ధృతరాష్ట్రుడు ద్రౌపదిని అడిగాడు.

**లోభో ధర్మస్య నాశాయ భగవన్ నాహముత్సహే ।**
**అనర్హా వరమాదాతుం తృతీయం రాజసత్తమ ॥**

**ఏకమాహుర్వైశ్యవరం ద్వౌతు క్షత్రస్త్రియా వరౌ ।**
**త్రయస్తు రాజ్ఞో రాజేంద్ర బ్రాహ్మణస్య శతం వరాః ॥**

**పాపీయాంస ఇమే భూత్వా సంతీర్ణాః పతయో మమ ।**
**వేత్స్యంతి చైవ భద్రాణి రాజన్ పుణ్యేన కర్మణా ॥**

**(శ్రీమహాభారతము - మొదటి భాగము - సభాపర్వము - 71వ అధ్యాయము - 34,35,36 శ్లోకములు)**

లోభం ధర్మాన్ని నశింపచేస్తుంది. నాకిక వరాలపై ఆసక్తి లేదు. వైశ్యులకు ఒక్క వరం, క్షత్రియ కాంతకు రెండు వరాలు, క్షత్రియునికి మూడు వరాలు, బ్రాహ్మణునకు వంద వరాలు అని పెద్దలు అంటారు. కాబట్టి నేను మూడవ వరానికి అర్హురాలును కాను. రాజా! నా భర్తలు దాస్యాన్ని పొంది ఆపదలో పడ్డారు. ఇకపై పుణ్య కర్మలతో శుభాలను పొందగలరు, అని ద్రౌపది ధృతరాష్ట్రమహారాజుతో పలికింది.

ద్రౌపదికి నిండు సభలో ఎంతో పెద్ద అవమానం, ఆపద ఎదురైనా, ఆమె బేలగా మారి కృంగిపోలేదు. కౌరవులకు తన భర్తల బలాన్ని, ఆగ్రహాన్ని

తెలిపి వారిని భయపెట్టింది. ధైర్యంగా సభలోని వారిని, ప్రత్యేకించి భీష్మద్రోణ విదుర ధృతరాష్ట్రాది పెద్దవారిని ఈ అన్యాయాన్ని ప్రశ్నించకుండా మౌనంగా ఎందుకువున్నారని నిలదీసింది. నిండు సభలో ధర్మాన్ని ప్రశ్నించింది, అధర్మం చెల్లదు అని నినదించినది. మానవ ప్రయత్నాన్ని మించిపోయిన తరువాత భగవంతుడిపైనే పూర్తి భారం వేసి సంపూర్ణ భక్తి విశ్వాసాలతో తనను ఆ కష్టం నుండి కాపాడమని చేతులు వదిలి మరీ ప్రార్థించింది, భగవంతుడి అనుగ్రహానికి పాత్రురాలైంది.

రెండు వరాలను మాత్రం భర్తల కోసమే కోరుకొని, ఇస్తామన్నా మూడవ వరం వద్దన్న మహానుభావురాలు, అభిమానధనురాలు ద్రౌపది. తన భర్తలు సర్వ సమర్థులని, వారు ధర్మానికి కట్టుబడి, ఆస్థితిలో ఏమి చేయకుండా వున్నారని, వారు దాస్య విముక్తులైతే తమంత తాము దేనినైనా సాధిస్తారని దృఢమైన నమ్మకం కల సాధ్వీమణి ఆమె. ధర్మాన్ని నమ్మి, ధైర్యంగా విపత్తును ఎదుర్కొని, పాండవులకొచ్చిన ఆపదను తప్పించిన కార్య సాధకురాలు ద్రౌపది. ఆమె యొక్క విజ్ఞత, పాతివ్రత్య బలం, బుద్ధి పరిణత, ధైర్యం, అంచంచలమైన భక్తి, ధర్మాచరణ, ఇత్యాది సుగుణాలు సర్వులకూ ఆచరణీయాలు. ఈ శుభ లక్షణాలు నేటి సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్న సందేశాన్ని ద్రౌపది ఇచ్చింది. చిన్న చిన్న అవమానాలు, కష్టాలు కూడా తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకొంటూ వున్న నేటి సమాజంలోని ఎందరికో ద్రౌపది ఇచ్చిన సందేశం గొప్ప కనువిప్పు. ధర్మాన్ని నమ్ముకొని ముందుకెళితే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని ద్రౌపది ఇచ్చిన సందేశం సదా ఆచరణీయం. ఇస్తామన్నా మూడవ వరం వద్దన్న ఆమె గొప్పతనం, మొదటి రెండు వరాలు కోరుకోవడంలో ఆమె బుద్ధి కుశలత, నిస్వార్థత్వం సకల జనులకు ఆదర్శం.

పాండవులు దాస్య విముక్తులై తమ రాజ్యానికి హస్తిన నుండి బయలుదేరారు. ధృతరాష్ట్రుడిని దుర్యోధనుడు ఒప్పించి, గాంధారి వద్దని

వారిస్తున్నా మళ్లీ జూదానికి పాండవులను పిలిపించాడు. ఈసారి ధర్మరాజు మరలా ఓడిపోయి, రాజ్యాన్ని వదిలి పందెం ప్రకారం పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసానికి ద్రౌపదితో కలసి వెళ్ళారు.

పాండవులు, ద్రౌపది, అరణ్యవాసము చేస్తూ వుండగా ఒకనాడు, శ్రీకృష్ణుడు సత్యభామతో కలసి అక్కడకు వచ్చాడు. కుశల ప్రశ్నల అనంతరము, సత్యభామ ద్రౌపదులు ప్రక్కనే కూర్చొని పరిహాసాలు చేసుకొంటూ మాట్లాడసాగారు. ద్రౌపదీ! నీవు మహావీరులైన ఈ పాండవులను ఎలా వశం చేసుకొంటున్నావు? వారు నీ మీద ఎన్నడూ కోపగించుకోకుండా, నీ ముఖ దర్శనం కోసం తహతహలాడుతూ, నీకు సదా వశులై ఉండడానికి గల కారణం ఏమిటి? దానికి వ్రతాలు, తపస్సు, స్నాన మంత్రాలు, ఔషధాలు, అంజనాలు ఏమైనా ఉన్నాయా? చెప్పు, వాటితో నేను కూడా కృష్ణుడు ఎప్పుడూ నాకు వశుడై ఉండేలా చేసుకొంటాను, అని సత్యభామ రహస్యంగా ద్రౌపదిని అడిగింది. మంత్రతంత్రాలు, వశీకరణ విద్యలు, ఔషధాలు ఏమి లేవు, అమాయకంగా వాటిని వినియోగిస్తే వాటి వలన భార్య భర్తలిరువురికీ నష్టం కలుగుతుంది. భార్య ప్రవర్తనను బట్టి భర్త ఆమె పట్ల ప్రేమను కలిగివుంటాడు. నేను ఎలా ప్రవర్తిస్తానో చెపుతాను విను, అని ద్రౌపది సత్యభామకు ఇలా చెప్పింది.

**అహంకారం విహాయాహం కామక్రోధౌ చ సర్వదా ।**
**సదారాన్ పాండవాన్ నిత్యం ప్రయతోపచరామ్యహమ్ ॥**

**ప్రణయం ప్రతి సంహృత్య నిధాయాత్మాన మాత్మని ।**
**శుశ్రూ షుర్నిరహం మానా పతీనాం చిత్త రక్షిణీ ॥**

**దుర్వ్యాహృతాచ్ఛంకమానా దుఃస్థితాద్ దురవేక్షితాత్ ।**
**దురాసితాద్ దుర్వ్ర జితాదింగితా ధ్యాసితా దపి ॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగం - వనపర్వము - 233వ అధ్యాయము - 19,20,21 శ్లోకములు)**

నేను అహంకారాన్ని, కామక్రోథాలను ఎప్పుడూ దరిచేరనీయక పూర్తిగా ఏకాగ్రతతో నిత్యమూ పాండవులను సేవిస్తూ వుంటాను. ఒళ్ళు మరచిపోకుండా, నా కోరికలను నియంత్రించుకొని, సేవాభావంతోనే భర్తల మనస్సులను కాచుకొంటాను. చెడ్డ మాటలు, చెడ్డ ప్రవర్తన, తగని చోట కూర్చోవడం, తగని నడక ఇత్యాదివానికి అవకాశం లేకుండా జాగ్రత్త వహిస్తాను, భర్తల అభిప్రాయాలకనుగుణంగా నడుచుకొంటాను. భర్తలు స్నానం చేయకముందు నేను స్నానం చేయను. వారు భుజింపక మునుపు నేను భోజనము చేయను. వారు శయనించక మునుపు నేను నిదురించను. భర్త బయట నుండి ఇంటికి రాగానే వారికి ఎదురెళ్ళి నీరు, ఆసనము, ఇత్యాది సకల సౌకర్యాలు వెంటనే సమకూర్చుతాను. భర్త లేని చోటు నాకు ఏ విధంగానూ నచ్చదు. భర్త తినని, త్రాగని వాటిని నేను కూడా తినను, త్రాగను. భర్త వూరు వెళ్ళినప్పుడు పూలు ఇత్యాది అలంకరణలు మాని వ్రతాలను ఆచరించుకొంటూ వుంటాను, అని ద్రౌపది సత్యభామకు తెలిపింది.

దేవతలైనా, మనుష్యులైనా, గంధర్వులైనా, ఎంత ధనవంతుడైనా ఎంత అందగాడైనా సరే నా మనసుకు నా భర్తలు తప్ప మరొక మగవాడు నచ్చదు. దేవలోకంతో సహా ఏ లోకంలోనైనా భార్యకు భర్త వంటి దైవం మరొకరు లేరు.

**తస్మాద పత్యం వివిధాశ్చ భోగా: శయ్యాసనాన్యుత్తమ దర్శనాని ।**
**వస్త్రాణి మాల్యాని తథైవ గంధా: స్వర్గశ్చ లోకో విపులా చ కీర్తిః ॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము - వనపర్వము - 234వ అధ్యాయం - 3వ శ్లోకము)**

భర్త సేవ వలననే స్త్రీకి సంతానం, వివిధ భోగాలు, శయ్య, ఆసనం, అందమైన వస్త్రాలు, పుష్పాలు, సుగంధాలు, స్వర్గలోకం, మహాకీర్తి, సకలమూ

లభిస్తాయి. భర్తకు సంబంధించిన పనులన్నీ భార్యే స్వయంగా చేయాలి. భర్త చెప్పిన మాటలను అవి రహస్యాలు కాకపోయినా ఎవ్వరికీ చెప్పకూడదు. ఇలా భార్య మెలిగితే భర్తలు ఆమె పట్ల అంతులేని అనురాగంతో వుంటారు, అని ద్రౌపది సత్యభామకు తెలిపింది.

అంతేకాదు నేను మాటలతో ఎవ్వరినీ తిరస్కరించను. కోపస్వభావం, మత్తులో మునిగేవారు, తిండిపోతులు, దొంగలు, చాపల్యం గలవారు వంటి చెడ్డవారితో నేను స్నేహం చేయను. నీచులతో మాట్లాడను. ఇతరుల పనులను ప్రస్తావించను. కోపగించుకోను. అతిగా నవ్వను. గుమ్మంలో నిలవను. మురికి ప్రదేశాలలోగాని, ఉద్యానవనాల్లో కానీ ఎక్కువ సేపు ఉండను. నిష్కల్మషంగా నవ్వుతాను. పతివ్రతలతో స్నేహాన్ని కలిగివుంటాను. వినయంగా నడుచుకొంటాను. భర్తలున్నప్పుడు చక్కగా అలంకరించుకొని, వారికిష్టమైన పనులనే చేస్తాను.

మా అత్తగారైన కుంతిదేవి నాకు పూజ్యనీయురాలు ఆమె మాటకు నేను ఎన్నడూ ఎదురు చెప్పను. భోజన పానీయాలు, వస్త్ర భూషాణాదాది నా పరిచర్యలతో నిత్యము నేను మా అత్తగారిని సేవిస్తాను. ఆమె భూదేవి వంటిది. వస్త్రభూషణభోజనాది ఏ విషయాలలోను ఎప్పుడూ నేను ఆమెను మించిపోను.

మృష్టాన్నాన్ని కుటుంబ సభ్యులకు నేనే వండిపెడతాను. గిన్నెలు శుభ్రం చేసుకోవడం, ఇంటిని చక్కగా శుభ్రంగా ఉంచుకోవడం, ఇత్యాది గృహానికి సంబంధించిన పనులన్నీ నేనే స్వయంగా చేసుకొంటాను. ఖజానాకు సంబంధించిన ఆదాయ వ్యయాలు, ధాన్యాగారంలోని నిలువలు, దానాది కార్యక్రమాలు, అతిథి మర్యాదలు, జీత భత్యాది సేవకుల సంక్షేమం, ఇత్యాది గృహ నిర్వహణకు సంబంధించిన అనేక బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి ఈ పనులకు సంబంధించిన భారం భర్తలపై పడకుండా చూసుకొనే దానిని.

దీని వలన సాధారణంగా మోయలేనంత భారం నా మీద పడినా, సుఖాన్ని వీడి రాత్రి అనక పగలనకా వాటిని సమర్థవంతంగా నిర్వర్తించేదానిని. అందరూ శయనించాక నిదురపోయి, అందరికన్నా ముందే నిదురలేచేదానిని. పతిని మించిన దైవం లేరన్న భావనతో వారిని సేవించే నా పతి భక్తే నా వశీకరణ మంత్రం, అని నవ్వుతూ ద్రౌపది సత్యభామకు చెప్పింది. నీవు కూడా వీనిని ఆచరిస్తే శ్రీకృష్ణుడు నీ ప్రేమకు బందీ అయ్యి ఎప్పుడూ నీతోనే వుంటాడు, అని ద్రౌపది సత్యభామకు తెలిపింది.

భార్య భర్త పట్ల ప్రవర్తించవలసిన తీరు, అత్తగారి పట్ల కోడలు నడుచుకోవలసిన విధానం, ఒక వివాహితకు ఉండవలసిన సాధారణ ప్రవర్తనా విధానం, ఉత్తమ ఇల్లాలు ఆచరించవలసిన ఆర్థిక సాంఘిక, పరిచారక , అతిథి, గృహస్థు మొదలైన విధులు, ఒక గృహిణి తన ఇంటిని ఎలా ఆనందనందనంగా మలచుకోవాలి, ఇత్యాది ఎన్నో ద్రౌపది సత్యభామకు తెలిపిన అద్భుత విషయాలు, నేటి సమాజానికి ద్రౌపది అందించిన సందేశాలు.

అరణ్యవాస సమయాన ఒకనాడు కామ్యకవనంలోని పాండవులు బ్రాహ్మణ రక్షణార్థం ఒకేసారి అందరూ అడవిలోని నలుదిక్కులకు వేటకు వెళ్ళారు. అదే సమయంలో పెక్కుమంది రాజులతో సైన్యంతో కలసి శాల్వ దేశానికి అరణ్య మార్గాన వెళుతున్న సింధుదేశపు రాజు కొడుకు అయిన జయద్రథుడు (సైంధవుడు), ఆశ్రమంలో వున్న ద్రౌపదిని చూసి కామపీడితుడై ఆమెను సమీపించాడు. పాండవులు రాజ్యము, ధనమూ కోల్పోయారు. వివేకవంతులైన స్త్రీలు అటువంటి వారిని వదిలివేసి, ధనం వున్నవారిని అనుసరిస్తారు. అలాగే నీవు కూడా వచ్చి నా రథం ఎక్కు, నాతో అమితమైన సుఖాలను పొందు అన్నాడు. అందుకు ద్రౌపది కోపంతో అలా ఎన్నటికీ జరగదు, నా భర్తలు ఎంతో గొప్పవారు. నీవు ఇలా అన్నందుకు నీవు శిక్షార్హుడివి. కానీ కౌరవ పాండవుల చెల్లెలు అయిన దుశ్శలకు నీవు భర్తవు,

అంటే నాకు సోదరుడవు కాబట్టి క్షమిస్తున్నాను. నీవు ధర్మంగా వుండాలి, రాజులు ధర్మాన్ని రక్షించాలి. ఇలాంటి తప్పులు చేయకూడదు అని హితబోధ చేసింది. అతను దానిని పెడచెవిన పెట్టి ద్రౌపదిని బలవంతంగానైనా తీసుకెళ్ళడానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు తన భర్తల పరాక్రమం గురించి తెలిపి అతనిని హెచ్చరించింది. అయినా అతను వినకుండా ద్రౌపదిని తీసుకెళ్ళడానికి ప్రయత్నించగా తీవ్రంగా ప్రతిఘటించినది. చివరకు జయద్రథుడు ద్రౌపదిని బలవంతంగా అతని రథంలోకి ఎక్కించుకొని తీసుకెళ్ళసాగాడు. వేట నుండి తిరిగివచ్చిన పాండవులు విషయం తెలుసుకొని అతనిని వెంబడించి, యావత్తు సైన్యాన్ని మట్టుబెట్టి, సైంధవుడిని పట్టుకొచ్చి గుండుకొట్టి ద్రౌపది క్షమా భిక్ష పెట్టగా అతనిని వదిలివేశారు. వుండాలని, ఆ రాక్షసుడికి చెప్పాడు. ద్రౌపది కీచకుని మందిరానికి, వెళ్ళింది. ఆమెను అతడు బలత్కారం చేయబోయాడు.

**యథైవాహం నాభిచరే కదాచిత్ పతీన్ మదాద్ వై మనసాపి జాతు ।**
**తేనైవ సత్యేన వశీకృతం త్వాం ద్రష్టాస్మి పాపం పరికృష్యమాణమ్ ॥**

**(శ్రీమహాభారతము - 3వ భాగము - విరాటపర్వము - 16వ అధ్యాయము - 6వ శ్లోకము)**

ఓరి పాపీ! నేను ఇంతవరకు ఎప్పుడూ కూడా మనసులోనైనా కోపంతో నా భర్తలకు విరుద్ధంగా ప్రవర్తించని దాననయితే, నా సత్య ప్రభావానికే నీవు సర్వనాశనం అయిపోవడం నేను చూస్తాను, అన్నది ద్రౌపది.

భార్యలు మనసులో కూడా భర్తలకు విరుద్ధంగా ప్రవర్తించకూడదని, మనసులో కూడా భర్తను తప్ప పర పురుషుడిని భార్య తలవకూడదని, అలాంటి పతివ్రతలకు దైవ అనుగ్రహం, శపించగలిగే శక్తి సిద్ధిస్తాయని, ఆపదలలో దైవాన్ని ప్రార్థిస్తే స్త్రీల రక్షణ భారాన్ని దైవం చూసుకొంటుందని, ఇలాంటి ఎన్నో అద్భుతమైన సందేశాల్ని నేటి సమాజానికి ద్రౌపది అందించింది.

కీచకుడు ద్రౌపది పైట చెంగుపట్టుకొని లాగి బలవంతంగా ఆమెను పట్టుకోవడానికి ప్రయత్నించాడు. ఆమె అతనిని రెండు చేతులతో ఒక్కసారిగా వేగంగా తోసివేసింది, అతడు క్రింద పడ్డాడు. వెంటనే ద్రౌపది అతని నుండి తప్పించుకోవడానికి విరాటరాజు కొలువు దీరి వున్న సభ వద్దకు పరుగెత్తింది. లేచిన కీచకుడు ఆమె వెంట పరిగెత్తాడు సభను సమీపించిన ద్రౌపదిని, సభలోని రాజుతో సహా అందరూ చూస్తూ వుండగానే, జుట్టు పట్టుకొని లాగి క్రిందపడవేసి మొహం మీద కాలితో తన్నాడు కీచకుడు. వెంటనే సూర్యదేవుడు ద్రౌపదికి రక్షణగా పంపిన అదశ్యరూపంలో వున్న రాక్షసుడు తుఫాను వేగంతో కీచకుడిని దూరంగా విసిరి కొట్టాడు. కళ్ళు గిర్రున తిరుగుతుండగా మొదలు నరికిన చెట్టులా కీచకుడు పడిపోయాడు.

**ప్రియేష్వపి చ ద్వేష్యేషు సమత్వం యే సమాశ్రితాః ।**
**వివాదేషు ప్రవృత్తేషు సమం కార్యాను దర్శినా ।**
**రాజ్ఞా ధర్మాసన స్థేన జితౌ లోకావు భావపి ॥**

తనకు బంధువులు, అనుచరులు ఇత్యాది ప్రియమైన వారి పట్లనూ, తమకు బంధువులు, అనుచరులు కాని వారి పట్లనూ, సమభావంతో వివాదాలను విచారించి, తగిన విధంగా చర్యలను తీసుకొనే పాలకులు ఈ లోకంలోను, పై లోకాల్లోనూ రెండింటిలోను జయాన్ని పొందుతారు. దేశంలోని ప్రజలకు, తన కన్న బిడ్డలకు తేడా లేదనుకొని అందరిని సమానంగా రక్షించి, పాలించడం పాలకుల ధర్మం, అని ద్రౌపది విరాట రాజుతో పలికింది. ద్రౌపది రాజనీతజ్ఞత మరియు ఆమె పలికిన ఈ పలుకులు నేటి పరిపాలకులకు ఆచరణీయ సందేశాలు.

తన బావమరిది, సేనాధిపతి, అత్యంత బలవంతుడైన కీచకుడిని విరాటరాజు శిక్షించలేదు, కనీసం మందలించను కూడా లేదు. వంట వాని వేషంలో వున్న భీముడు, కంకుబట్టు వేషంలో వున్న ధర్మరాజు ఇవన్ని ప్రత్యక్షంగా చూశారు. ద్రౌపది రాత్రి రహస్యంగా వంటవాని వేషంలో వున్న

భీముని దగ్గరకు వెళ్ళి ఆనాడు నిండు సభలో వస్త్రాలు లాగిన దుశ్శాసనుడు, కామ్యవనంలో రథంపైకి లాగి అపహరించుకెళ్ళిన సైంధవుడు, నేడు మోహంపై కాలితో తన్నిన కీచకుడు, ఇలా నేను ఇంకా ఎందరి దగ్గర కష్టాలు పడాలి, అని తనకు జరిగిన అవమానాల్ని భీముడికి గుర్తుచేసి అతనిలో ఆగ్రహాన్ని ప్రకోపింపచేసి, కీచకుడి బారి నుండి కాపాడమని కోరింది. కీచకుడిని చంపడానికి నిశ్చయించుకొన్న భీముడు, ద్రౌపదికి అతనిని రాత్రి సమయాన ఒక్కడినే నర్తనశాలకు రమ్మని చెప్పమన్నాడు. ద్రౌపది అలానే చెప్పడం, అతను రావడం, కీచకుడిని భీముడు భయంకరంగా చంపేయడం జరిగింది. ద్రౌపది తన భర్తలైన గంధర్వులు కీచకుడిని వధించారని చెప్పింది. అందుకు ప్రతీకారంగా కీచకుడి తమ్ములైన నూట అయిదుమంది ఉపకీచకులు ద్రౌపదిని కూడా కీచకుని పాడికి కట్టేసి, అతనితో పాటు ఆమెను కూడా దహనం చేయడానికి శశ్మానానికి తీసుకుపోసాగారు. అప్పుడు ద్రౌపది ఆ ఆపద గురించి భీమునికి వినపడేలా వీరులై పతులుండగానే వీరు నన్ను తగలబెట్టడానికి తీసుకెళుతూవున్నారు, కాపాడండి, అని తెలివిగా గట్టిగా అరిచింది. అది విన్న భీముడు వారికంటే ముందు శ్మశానానికి వెళ్ళి వారు రాగానే వారందరిని చంపి ద్రౌపదిని కాపాడి, ఆమెను సుదేష్ణారాణి అంత:పురానికి వెళ్ళమన్నాడు.

ప్రమాదం ఏర్పడినప్పుడు దాని నుండి ఎలా తెలివిగా బయటపడాలో, ద్రౌపది సమాజానికి తెలియచేసింది. ఎన్ని కష్టాలు ఎదురైనా ఎలా ధైర్యంగా ముందుకు వెళ్ళాలో ద్రౌపది తెలియచేసింది. ఎంతటి బలశాలి అయినా, ఎంత అధికారము, పాలకుల అండదండలు, పలుకుబడి వున్నా సరే, అధర్మంగా ప్రవర్తించేవారు నశించక తప్పదు, అనే సందేశాన్ని నేటి సమాజానికి ద్రౌపది ఇచ్చింది.

పాండవుల అరణ్య, అజ్ఞాతవాసాలు పూర్తి అయ్యాక శ్రీకృష్ణుడు కౌరవుల వద్దకు పాండవుల రాయబారిగా వెళుతున్న వేళ శ్రీకృష్ణుడితో ద్రౌపది

ఇంతవరకు పాండవులకు జరిగిన మోసం, ఎదురైన అవమానాలు, ప్రత్యేకించి ద్రౌపదికి నిండుసభలో జరిగిన అవమానం గురించి గుర్తు చేసింది. దుశ్శాసనుడు పట్టి లాగిన ఆమె కురులను చూపి వాటిన్నింటిని దృష్టిలో ఉంచుకొని రాయబారాన్ని నడపమని, యుద్ధం అనివార్యమయ్యేలా చేయమని కోరింది.

**న హి సామ్నా న దానేన శక్యోర్థస్తేషు కశ్చన ।**
**తస్మాత్ తేషు న కర్తవ్యా కృపా తే మధుసూదన ॥**

**క్షత్రియేణ హి హంతవ్యః క్షత్రియో లోభమాస్థితః ।**
**అక్షత్రియో నా దాశర్హ స్వధర్మ మనుతిష్ఠతా ॥**

**(శ్రీమహాభారతము - 3వ భాగము - ఉద్యోగ పర్వము - 82వ అధ్యాయము - 12,16 శ్లోకములు)**

శ్రీకృష్ణా! కౌరవుల విషయంలో సామం, దానం ఈ రెండు పద్ధతుల ద్వారా కార్యము నెరవేరదు. కాబట్టి వారిపై దయచూపక దండోపాయాన్నే ప్రయోగించాలి. లోభానికి లోనయినవాడు క్షత్రియుడైనా సరే, వాడిని ధర్మాన్ని ఆచరించే రాజు సంహరించాలి, అని ద్రౌపది శ్రీకృష్ణుడికి తెలియచేసింది.

ద్రౌపది రాజనీతిజ్ఞత, తగిన సమయంలో ఏ విషయాలను గుర్తుకు చేయాలో అలా చేసే సమయస్ఫూర్తి, జరిగిన అవమానాలకు చేసిన ప్రతిజ్ఞలు నెరవేర్చుకొనేలా క్షత్రియ స్వభావగుణం, కౌరవ వినాశనానికి పుట్టిన కారణ జన్మరాలైన ఆమె కార్యాన్ని చక్కబెట్టే నేర్పు, ఇవన్నీ కూడా ద్రౌపది నుండి గ్రహించవలసిన సందేశాలు.

కురుక్షేత్ర సంగ్రామం ప్రారంభమైంది. 18 రోజులు భయంకరంగా జరిగిన ఆ యుద్ధంలో కౌరవులు అందరూ మరణించారు. దుర్యోధనుడు మాత్రం తొడలు విరిగి యుద్ధ భూమిలో పడివున్నాడు. అశ్వత్థామ, కృతవర్మ, కృపుడు, దుర్యోధనుడి చెంతకెళ్ళి అతని స్థితిని చూసి విలపించారు.

దుర్యోధనుడు అశ్వత్థామను సర్వసేనాధిపతిగా నియమించాడు. అతడు నిదురిస్తువున్న పాండవ శిబిరంలోని దుష్టద్యుముడిని అతని పుత్రులను, పాండవుల ద్రౌపది పుత్రులను హతమార్చి, దుర్యోధనుడికి ఆ విషయాన్ని తెలిపాడు. ఆనందంతో దుర్యోధనుడు ప్రాణాలను విడిచాడు. పాండవులు, ద్రౌపది వారి పుత్రులైన ఉపపాండవుల మరణానికి ఎంతగానో శోకించారు. అశ్వత్థామను హతమార్చడానికి భీముడు, అర్జునుడు, శ్రీకృష్ణుడు వెళ్ళారు. అశ్వత్థామను బంధించి అతని శిరస్సుపైన పుట్టుకతోనే వచ్చి వుండెడి మహిమాన్వితమైన మణిని తీసుకొన్నారు. ద్రౌపది ఆ మణిని ధర్మరాజుని తన కిరీటంలో ధరించమని కోరింది. తన ఐదుమంది పుత్రులను చంపిన గురుపుత్రుడైన అశ్వత్థామను అంత పుత్రశోకంలోనూ క్షమించి ప్రాణాలతో విడచి పెట్టడానికి ద్రౌపది అంగీకరించింది. నేటి సమాజంలోని ప్రతి ఒక్కరూ క్షమాగుణం కలిగి వుండాలని ద్రౌపది సందేశాన్నిచ్చింది.

యుద్ధం ముగిశాక పాండవులకు రాజ్య పట్టాభిషేకం జరిగింది. ద్రౌపది మహారాణి అయ్యింది. రాజ్యాన్ని, ప్రజలను చక్కగా పరిపాలించారు. భారతీయ స్త్రీలు తాము తమ భర్తల కంటే మునుపే పుణ్యస్త్రీగా పసుపుకుంకుమలతోనే మరణించాలని కోరుకొంటారు. తదనుగుణంగానే ద్రౌపది తన కర్తవ్యం నెరవేరిన తరువాత పతులందరికన్నా ముందుగా ఆమె శరీరాన్ని విడచిపెట్టి  సౌభాగ్య సంపన్నురాలుగా స్వర్గానికి చేరింది. తద్వారా భారతీయ సంస్కృతి యొక్క గొప్పతనం ద్రౌపది నేటి సమాజానికి తెలిపింది.

కౌరవ సభలో, కామ్యవనంలో, విరాటరాజు కొలువులో మూడు చోట్లా ద్రౌపదిదేవికి అవమానం, అన్యాయం, ఆపద ఎదురయ్యాయి, అప్పుడు ఆమె వాటిని ఎదుర్కొన్న తీరు, ప్రశ్నించిన విధానము, ప్రదర్శించిన ధైర్యము, ప్రలోభాలకు లొంగని సుసంపన్నమైన వ్యక్తిత్వం, ఇవన్నీ కూడా నేటి సమాజంలోని స్త్రీలకు మార్గ దర్శకత్వాన్నిస్తూ వున్నాయి.  స్త్రీ అబల కాదు

సబల అని, ఎటువంటి పరిస్థితులను అయినా సరే స్త్రీలు ధైర్యంగా ఎదుర్కోవాలని సందేశానిస్తూ వున్నాయి. అంతే కాకుండా ఎంతటి అధికారము పలుకుబడి కలిగిన వారికయినా సరే అన్యాయానికి పాల్పడితే కఠినమైన శిక్షలు పరిణమిస్తాయని, కూడా ద్రౌపది జీవిత సంఘటనలు నేటి సమాజానికి సందేశాల్నినిచ్చాయి.

స్త్రీ పుట్టినింట సకల సౌకర్యాలతో యువరాణిలా పెరిగినా, మెట్టినింట వున్నవాటితోనే సర్దుకొని సుఖంగా జీవించాలని, భర్తే ప్రత్యక్ష దైవంగా తలచి భార్య అతనిని సేవించాలని, శ్లాఘనీయమైన అత్తాకోడళ్ళ సత్సంబంధాన్ని సాగించాలని, ఆధ్యాత్మిక ఆర్థిక సాంఘిక యాజమాన్య ఇత్యాది గృహస్థాశ్రమ సంసార బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఆదర్శ గృహిణిగా ఉత్తమ ఇల్లాలిగా సర్వశుభ లక్షణాలు కలిగిన పతివ్రతా శిరోమణిగా ప్రతి స్త్రీ జీవించాలని, లోభ రాహిత్యంతో అభిమానధనులై మంచి వ్యక్తిత్వంతో అందరూ జీవించాలని, తమ కర్తవ్య నిర్వహణను చిత్తశుద్ధితో నిర్వర్తించి, వారి వారి జీవితాలను ప్రతి ఒక్క స్త్రీ పండించుకోవాలని మరియు పరస్త్రీల పొందుకోరడం వలన అపకీర్తి, అపమృత్యువు కలుగుతాయని గుర్తించి, అధర్మ మార్గాలను వీడి ధర్మమార్గాలలో ప్రతి పురుషుడు జీవించాలని, నేటి సమాజానికి ద్రౌపది సందేశాన్నిచ్చింది.

* * *

## కుంతీదేవి

విశేషమైన వినయ విధేయ సంపన్నశీలి, సుందర సౌశీల సదాచార సంపన్నురాలు, ప్రశంసాపాత్రమైన పరోపకార పరాయణురాలు, సరిలేని సత్యగుణవంతురాలు, సాటిలేని సహనాన్ని సొంతం చేసుకొన్న నారీ శిరోమణి, అపూర్వ త్యాగశీలి, గొప్ప రాజనీతిజ్ఞురాలు, అచంచలమైన భగవద్భక్తి గల మహాభక్తురాలు, అత్యంత ఆదర్శ మహిళామణి కుంతి దేవి. సాక్షాత్తు శ్రీకృష్ణభగవానునికే ఈమె మేనత్త. ధర్మ విజేతలైన పాండవులను కన్న వీరమాత.

యదువంశంలో శ్రేష్ఠమైనవాడు శూరసేనుడు. అతని కుమారుడు వసుదేవుడు, కుమార్తె పృథ. పిల్లలు లేని తన మిత్రుడైన కుంతి భోజునకు, శూరుసేనుడు తన పుత్రిక పృథను దత్తతగా ఇచ్చాడు. కుంతి భోజుని వద్ద పెరగడం వలన పృథయే కుంతి అని పిలవబడినది. కుంతి భోజుడు తన ఇంటికి వచ్చిన అతిధులను సేవించే బాధ్యత కుంతికి అప్పచెప్పాడు. ఒకసారి దుర్వాస మహర్షి కుంతి భోజుని ఇంటికి అతిధిగా వచ్చాడు. మహా కోపం గల ఆ మహర్షి అత్యంత నియమ నిష్ఠలతో కూడిన వ్రత దీక్ష గలవాడు. కుంతీ ఆ మహర్షిని భక్తితో సేవించి, అన్ని విధాలా అతిధి మర్యాదలను అందించి, ఎంతో సహనంతో అన్ని వేళలా వారికి పూజాది కార్యక్రమాలకు అవసరమైన సకలము సిద్ధపరుస్తూ, అత్యంత వినయంతో కూడిన భక్తి శ్రద్ధలతో ఆ మహర్షిని సంవత్సర కాలము సేవించింది. అందుకు ప్రసన్నుడైన దుర్వాస మహర్షి ప్రసన్నుడై, అమ్మా! నీవు చేసిన సేవ నాకు పరమానాందాన్ని కలిగించింది, నీకు ఇష్టమైన వరము కోరుకో, ఇస్తాను, అని కుంతితో పలికాడు. మహాత్మా! మీరు నా యెడల ప్రసన్నులు కావడం కంటే నాకు కావలసినది ఏమున్నది? మీరు ప్రసన్నత చెందడం వలన నా కార్యములన్నీ సఫలము అయినట్లే, ఇక నాకు ఏ వరాలు వద్దు స్వామి, అని కుంతి పలికింది. ఇంత చిన్న వయసులో అంత నిష్కామ భావం గల ఆమె ఏ

వరమూ కోరుకోక పోయినా, ఆమె జీవితంలో జరగబోయే సంఘటనలను గ్రహించిన ఆ మహర్షి ఆమెకు వశీకరణ మంత్రాన్ని ఉపదేశించాడు. నీవు ఈ మంత్రంతో ఏ దేవతలనైనా ఆహ్వానించి, వారి అనుగ్రహంతో కుమారులను పొందవచ్చు అనే వరాన్నిచ్చాడు.

మంచి అలవాట్లను చిన్న నాటి నుండి తల్లిదండ్రులు పిల్లలకు నేర్పడం, 'అతిథి దేవో భవ' అని ఇంటికొచ్చిన అతిథులను పరమభక్తితో సేవించడం వంటి భారతీయ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కుంతీదేవి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. ప్రతిఫలాపేక్ష లేకుండా నిష్కామ సేవ చేయాలని, తాము చేస్తున్న పనిని ఇష్టంతో చేస్తే ఆనందం వస్తుందని, వినయ విధేయతలతో సహనంతో తమ కప్పగించిన విధులను అంకిత భావంతో నిర్వర్తిస్తే, ప్రతిఫలంగా గుర్తింపు, వరాలు వాటంతట అవే అందుతాయని, నేటి సమాజానికి కుంతి సందేశానిచ్చింది.

దుర్వాస మహర్షి ఇచ్చిన మంత్రం ఎలా సిద్ధిస్తుందోనన్న కుతూహలంతో కుంతి తాను కన్యగా వున్నప్పుడే ఒకనాడు సూర్యదేవుని ఆహ్వానించింది. వెంటనే సూర్యుడు ఆమె చెంతకు రాగానే ఆశ్చర్యపోయింది. ఆ మంత్రాన్ని పరీక్షించడానికే నిన్ను ఆహ్వానించాను. నా తప్పును మన్నించి మీరు వెళ్ళిపోమని కుంతి సూర్యదేవుని ప్రార్థించింది. కానీ సూర్యదేవుడు ఆమెకు ఏ దోషము రాదని నచ్చజెప్పి కవచకుండలాలతో భాసిల్లే కర్ణుడిని పుత్రుడిగా ఇచ్చి, ఆమెకు కన్యత్వాన్ని మరలా అనుగ్రహించాడు. వివాహానికి మునుపే పుట్టే పిల్లల వలన వచ్చే సమస్యల గురించి ఆలోచించి కుంతి ఆ బాలుడిని పెట్టెలో పెట్టి నదిలోని నీటిలో వదిలివేసింది. రాధ – అధిరథుడు అనే సూత జాతికి చెందిన దంపతులు ఆ పెట్టెలోని కర్ణుడిని పెంచి పెద్ద చేశారు. కర్ణుడి జననం, తరువాత అతని వలన జరిగిన పరిణామాలు కుంతిదేవిని ఆమె జీవితాంతం బాధకు గురిచేశాయి.

కుతూహలంతో కానీ, ఇంకో కారణంతో కానీ కన్యలెప్పుడూ తమ ఆలోచనలను అదుపు తప్పనివ్వకూడదు, జాగ్రత్తగా వుండవలెను అనే సందేశాన్ని మరియు జీవితంలో ఒకసారి చేసిన తప్పు మనిషి జీవితాంతం వారిని వెంటాడుతూ వుంటుంది, బహు పరాక్, అనే హెచ్చరికను కుంతి నేటి సమాజానికి అందించింది.

**సత్త్వ రూపగుణోపేతా ధర్మరామా మహావ్రతా ।**
**దుహితా కుంతిభోజస్య పృథా పృథుల లోచనా ॥**

**తాం తు తేజస్వినీం కన్యాం రూపయౌవన శాలినీమ్ ।**
**వ్యవృణ్వన్ పార్థివాః కేచిత్ అతీవ స్త్రీ గుణైర్యుతామ్ ॥**

**(శ్రీ మహాభారతము- 1వ భాగము -ఆదిపర్వము - 111వ అధ్యాయము - 1,2 శ్లోకములు)**

కుంతి విశాలమయిన కన్నులు, మంచి రూపం, ఉత్తమ గుణాలు కలది. అందం, యౌవనం, తేజస్సు కలిగి, స్త్రీకి అవసరమైన సుగుణాలు మిక్కిలిగా కలిగి, ధర్మాన్ని ఆశ్రయించి మహావ్రతాలను పాటించేది. ఆ కన్యారత్నాన్ని ఎంతోమంది రాజులు వివాహం చేసుకోవాలని కోరుకుంటూ వుండడంతో కుంతి భోజుడు ఆమెకు స్వయంవరాన్ని ఏర్పాటు చేశాడు. సూర్యతేజస్సుతో వెలిగిపోతూ, విశాలమైన వక్షఃస్థలం, వృషభ నేత్రాల వంటి కనులు గలిగి, మహాబలశాలియైన పాండురాజును కుంతీదేవి స్వయం వరంలో వరించి, అతని మెడలో మాలవేసి తన భర్తగా ఎంచుకొంది. పాండురాజుకి - కుంతీకి వివాహం ఘనంగా జరిగింది.

మద్రరాజ్యానికి రాజు అయిన శల్యుడి సోదరి మాద్రి. ఆమెతో పాండురాజుకు వివాహం జరిగింది. కుంతి తన సవతి భార్య అయిన మాద్రిని ఆనందంగా ఆహ్వానించింది, సోదరిలా ఆమెపట్ల ఎంతో ప్రేమతో మెలిగింది. పాండురాజు ఇతర రాజ్యాలపైకి దండెత్తి వారిని ఓడించి,

విశేషమైన సంపదలను గ్రహించి, వారిని తమ సామంతరాజులుగా మార్చి గొప్ప పరిపాలన చేయసాగాడు. ఒకనాడు పాండురాజు వేటకు వెళ్ళాడు. అక్కడ పొదల మాటున క్రీడిస్తూ వున్న రెండు జింకల్లో ఒక దానిని తన బాణంతో పాండురాజు కొట్టాడు. వెంటనే ఆ రెండు జింకలూ కిందమ ఋషిగా, అతని భార్యగా మారి, భార్యతో కామ క్రీడలో వున్న నన్ను అకారణంగా చంపావు కాబట్టి, నీవు కూడా కామ క్రీడలో పాల్గొన్న వెంటనే తలపగిలి మరణిస్తావు అని ఆ ఋషి పాండురాజుకు శాపమిచ్చాడు. వేట అనే వ్యసనానికి లోనై నేను తప్పు చేశాను, ఇక నాకు రాజ్య భోగాలు వద్దు, వానప్రస్థ ఆశ్రమాన్ని స్వీకరించి అడవులకెళ్ళి తపస్సు చేసుకొంటాను అని నిర్ణయించుకొన్నాడు, పాండురాజు. కుంతి మాద్రిలు కూడా ఇంద్రియ సుఖాలను పరిత్యజించి, అతనితో పాటు తపస్సు చేస్తాము అని అతనిని ఒప్పించి, అతనితో పాటు అంతఃపుర సుఖాలను విడిచి తపస్సుకై శతశృంగ పర్వతంపైకి చేరారు. ముగ్గురూ అక్కడ తపస్సు చేసుకొంటూ జీవించసాగారు.

తన సవతి భార్యయైన మాద్రి కుంతి జీవితంలోకి అడుగుపెట్టగానే అందరిలా ఆమెపై అసూయ ద్వేషాలు పెంచుకోక, కుంతి తన విశాలహృదయంతో ఆమెను ఆదరించి సొంత చెల్లెలులా ఎంతో ప్రేమగా చూసుకొంది. భర్త వానప్రస్థాన ఆశ్రమం స్వీకరించి అడవికి వెళుతూ వుంటే తాను కూడా అంతఃపుర భోగ భోగ్యాలని కాదని పతినే అనుసరించిన మహపతివ్రత కుంతిదేవి. అడవులలో పతితో పాటు తానూ తపస్సు చేసిన తపశ్శాలి కుంతిదేవి. అసూయ ద్వేషాలకు దూరంగా వుంటూ ప్రేమ, విశాలమైన మనసు మనుషులు కలిగి వుండాలని, భోగ భాగ్యాల కన్నా అడవులలోనైనా పతి వెంటే వుండడం ధర్మమని, తపస్సు ద్వారా ఇంద్రియాలను జయించాలని, బ్రహ్మచర్య వ్రతం చేయాలని, కుంతీదేవి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

ఒకనాడు పాండురాజు కొంతమంది మహర్షులను చూశాడు. వారితో ఇలా పలికాడు. ప్రతి మనిషి సంతానం కనడం, శ్రాద్ధ కర్మలను

పితృదేవతలకు చేయడం ద్వారా పితృ ఋణం తీర్చుకోవాలి. యాగాలు చేయడం ద్వారా దేవ ఋణం తీర్చుకోవాలి. స్వాధ్యాయ తపస్సుల ద్వారా ఋషి ఋణం తీర్చుకోవాలి. ఇతర జీవుల పట్ల దయకలిగివుండి వానిని తృప్తిపరచడం ద్వారా మనుష్య ఋణం తీర్చుకోవాలి. నేను దేవ, ఋషి, మనుష్య ఋణాలు తీర్చుకొని వాటి నుంచి విముక్తిని పొందాను. కానీ సంతానాన్ని కనలేకపోవడం వలన పితృఋణం తీర్చుకోలేక పోయాను, అందువలన నేను స్వర్గలోక ప్రవేశానికి అనుర్హుడినయ్యాను. నా భార్యకు సంతానం కలిగే మార్గమేది? అని వారిని ప్రార్థించాడు. అప్పుడు ఆ ఋషులు తమ దివ్య దృష్టితో చూసి మీకు దైవ సమానమైన పుత్రులు జన్మిస్తారు అని తెలిపి, వారు వెళ్ళిపోయారు. వారి మాటలను మననం చేసుకొంటూ పాండురాజు తన భార్యయైన కుంతీదేవిని అవకాశం లేనప్పుడు మానవుడు తన ద్వారా కాకపోయినా మరొక ఉత్తముల ద్వారా పుత్రులను పొందవచ్చు. అది ధర్మ ఫలితాన్నే ఇస్తుందని స్వాయంభు మనువు చెప్పాడు. నాకున్న శాపకారణంగా మనకు పిల్లలు పుట్టే అవకాశం లేదు కాబట్టి నీవు నాకన్నా ఉత్తములు ద్వారా సంతానాన్ని పొంది నన్ను పితృఋణం నుండి విముక్తిడిని చేయమని, కుంతీదేవిని పాండురాజు ప్రాధేయపడ్డాడు. అప్పుడు కుంతీదేవి తన చిన్నతనంలో దుర్వాస మహర్షికి చేసిన సేవ, ఆయన ఇచ్చిన వరం గురించి తెలిపింది. ఆ విషయాన్ని తెలుసుకొన్న పాండురాజు ఎంతో సంతోషించి, ఆ మహర్షికి వందనాలు సమర్పించి, యమధర్మరాజును, వాయుదేవుని, ఇంద్రుని ఆ మంత్రంతో ఆహ్వానించి దేవతా సమానులైన పుత్రులను పొందు, అని చెప్పాడు. కుంతి అదేవిధంగా చేసి ఆ దేవతల ద్వారా ధర్మానికి ప్రతీకయైన ధర్మారాజుని, అత్యంత బలశాలియైన భీముడిని, సాటిలేని శస్త్ర అస్త్రాల నైపుణ్యం గల వీరుడైన అర్జునుడుని, తన పుత్రులుగా పొందింది.

పాండురాజు ఇంకా సంతానం కావాలని కుంతిని కోరగా, ఆమె ముగ్గురుని మించి ఈ విధంగా కనటానికి శాస్త్రాలు అంగీకరింపవని

తెలపడంతో, పాండురాజు మాద్రిని కూడా సంతానవతిని చేసి అనుగ్రహించు అని కుంతిని కోరాడు. ఆమె మాద్రికి మంత్రోపదేశం చేసినది. అశ్వని దేవతల వలన మాద్రికి నకులుడు, సహదేవుడు అనే ఇద్దరు కవలపిల్లలు జన్మించారు. పాండవులు ఐదుగురు, అక్కడే పెరుగుతూ, శుకుడు దగ్గర వారు సకల విద్యలను అభ్యసించసాగారు. అర్జునునికి సుమారు పదనాలుగు సంవత్సరాల వయసు వచ్చింది. ఒకనాడు మాద్రి ఉద్యాన వనంలో విహరించే వేళ పాండు రాజు కామ పరవశుడయ్యాడు. అతనిలో పుట్టిన కోరికను అణుచుకోలేక ఆమెతో సంగమించడానికి సిద్ధమయ్యాడు. మాద్రి పాండురాజుకున్న శాపాన్ని గుర్తుచేసి, పదే పదే వద్దని ప్రార్థించినా అతడు వినలేదు. ఫలితంగా పాండురాజు వారి కలయిక అనంతరం మరణించాడు. కుంతీ, మాద్రి, పాండవులు ఎంతగానో విలపించారు. కుంతీ భర్తతో పాటు తాను కూడా అగ్నికి ఆహుతి అవుతాను, పిల్లల్ని నీవు చూసుకోమని మాద్రిని కోరింది. అందుకు మాద్రి అంగీకరించక, పిల్లల యోగక్షేమాలు చూడటంలో నీవు సమర్థురాలువి, ఏ స్త్రీ, కడకూ అరుంధతి అయినా, సరే బుద్ధిలో నీకు సాటిరారు, నేను నీయంత సమర్థురాలుని కాను, కాబట్టి నీవు పిల్లలను చూసుకో, నేను భర్తతో పాటు అగ్నికి ఆహుతి అవుతాను, అని కుంతితో మాద్రి పలికింది. పాండురాజు దహనక్రియలు అక్కడే జరిగాయి, మాద్రి సతీ సహగమనంతో తనువును చాలించింది. తర్వాత కుంతీదేవి తన ఐదుగురు పుత్రులను, పాండురాజు మరియు మాద్రిల అస్తికలను తీసుకొని అక్కడ వున్న ఋషుల సహాయంతో హస్తినా పురం చేరి జరిగిన విషయాలన్నీ వారికి వివరించింది. పాండు రాజు మాద్రి అస్తికలను ఘనంగా కర్మలు జరిగేలా చేసింది. కౌరవులతో సమానంగా తన పుత్రులు ఐదుగురు కూడా సకల సౌకర్యాలు, విద్యాభ్యాసాలు పొందేలా చేసింది కుంతి.

భర్త, సవతి భార్య ఇద్దరూ చనిపోయి, అడవులలో ఒంటరిగా మిగిలినా, భయపడక ఐదుమంది పిల్లల బాధ్యతను తాను స్వీకరించి, పిల్లలను,

అస్తికలను తిరిగి రాజ్యానికి తీసుకువచ్చి అస్తికలకు దహన సంస్కారాలు చేయించడమే గాక పిల్లలను ప్రయోజకులుగా చేసిన గొప్ప మహిళామణి కుంతీదేవి. జీవితంలో ఊహించని సంఘటనలను జరిగినప్పుడు, అధైర్యపడక, తమ బాధ్యతలను నిర్వహించడంలో సమర్ధతను, బుద్ధి కుశలతను, ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ కలిగివుండాలనే సందేశాన్ని కుంతిదేవి నేటి సమాజానికి అందించింది.

పాండురాజుకు అన్నయైన ధృతరాష్ట్రుడు పుట్టు గ్రుడ్డివాడు. గాంధారి ధృత రాష్ట్రులకు వందమంది పుత్రులు, ఒక పుత్రిక. కౌరవులలో పెద్దవాడు దుర్యోధనుడు. ధృతరాష్ట్రుడు ధర్మరాజును యువరాజు చేశాడు. పాండవుల వృద్ధిని, వారి పట్ల ప్రజల ప్రేమను చూచి దుర్యోధనుడు బాధపడి, వారిని వారణావత పురానికి పంపివేయమని తండ్రి ధృతరాష్ట్రుని కోరాడు. పాండవులు అంగీకరించి కుంతి మాతతో కలసి వెళ్ళారు. కౌరవులు కుట్రపన్ని లక్కగృహంలో వారిని చంపడానికి నిప్పు అంటించారు. పాండవులు సొరంగ మార్గం ద్వారా ఆ లక్క ఇంటి నుండి తప్పించుకొన్నారు. కుంతిదేవి తన కుమారులతో కలసి ఏక చక్రపురంలో ఒక బ్రాహ్మణుని ఇంటిలో నివసిస్తూ వుండేది. ఆ పురానికి దగ్గరలోని అడవిలో బకాసురుడనే రాక్షసరాజు వుండేవాడు. రోజుకొకరి ఇంటి వంతుగా ఆ రాక్షసుడికి రెండు దున్నపోతులు, బండెడు ఆహారాన్ని, ఒక మనిషిని పంపాలి. అందులో భాగంగా ఒకనాడు కుంతీదేవి నివసిస్తున్న బ్రాహ్మణుని ఇంటి వంతు వచ్చింది. ఇంటి నుండి రాక్షసుడికి ఆహారంగా నేను వెళతాను అంటూ కుటుంబ సభ్యులైన భార్య, భర్త, కొడుకు, కూతురు, అందరూ భోరున రోదించడం కుంతిదేవి విన్నది. మీకు ఒక్కగానొక్క కొడుకు వున్నాడు. నాకు ఐదుమంది కొడుకులున్నారు, వారిలో నా ఒక్కకొడుకుని మీకు బదులు నేను రాక్షసుడి కడకు పంపుతాను, మీరు బాధపడకండి, అని కుంతి దేవి తెలిపింది. అతిధిగా వచ్చిన మీ ప్రాణాలను పణంగా పెట్టి మేము ఆత్మ రక్షణ చేసుకోవడం ధర్మం కాదు

అన్న బ్రాహ్మణుడిని, నా బిడ్డ మహా బలవంతుడు, మంత్ర సిద్ధి గలవాడు, అతనికేమీ హాని కలగదు అని నచ్చజెప్పి, ఒప్పించింది కుంతిదేవి. మనం వీరి వలన ఉపకారం పొందాం, వీరికి నేడు కష్టం వచ్చింది కాబట్టి ప్రత్యుపకారం చేయాలి, అని కుంతి భీమున్ని కోరి, రాక్షసుడి దగ్గరకు అతనిని పంపింది.

**ఏ తావాన్ పురుషస్తాత కృతం న నశ్యతి ।**
**యావచ్చ కుర్యాదన్యోస్య కుర్యాదభ్యధికం తతః ॥**

**(శ్రీ మహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - 156వ అధ్యాయము - 14వ శ్లోకము)**

ఎవరికి చేసిన ఉపకారం నిరుపయోగం కాదో వాడే నిజమైన పురుషుడు. ఉపకారం చేసిన వానికి అంతకంటే ఎక్కువ మేలు చేయడం మానవత్వం అవుతుంది, అని కుంతి భీముడికి తెలిపింది. భీముడు వెళ్ళి ఆ బకాసురుడనే రాక్షసుడిని చంపివేసి ఆ పుర ప్రజలను ఆ రాక్షసుడి బాధలనుండి విముక్తుడిని చేశాడు.

తమకు ఉపకారం చేసిన వారికి రెట్టింపు ఉపకారం చేయాలని బోధించి, పరోపకారం మిదం శరీరం అన్నట్లు పరుల ప్రాణపరిరక్షణకై తన బిడ్డను రాక్షసుడి కడకు పంపి కుంతీదేవి మహాత్యాగం చేసింది. ఉపకారికి మరింత ప్రత్యుపకారం, పరుల ప్రాణరక్షణకై ముందుకు రావడం, త్యాగశీలాన్ని కలిగి వుండడం వంటి శుభలక్షణాలను అందరూ కలగి ఉండాలని కుంతి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

పాంచాల దేశపు రాజు అయిన ద్రుపదుడు తన కూతురు ద్రౌపదికి స్వయంవరం ప్రకటించాడు. పాండవులు స్వయంవరంలో మత్స్యయంత్ర ఛేదనతో ద్రౌపదిని వివాహమాడి పాంచాల దేశానికి చేరారు. లక్క గృహంలో మరణించారనుకొన్న పాండవులు బ్రతికే వున్నారన్న వార్త తెలిసి విదురుడు

వారిని హస్తినకు తీసుకెళ్ళాడు. ధృతరాష్ట్రుడు పాండవులకు అర్ధ రాజ్యమిచ్చి ఖాండవ ప్రస్థాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలించమన్నాడు. అక్కడ సుందర నగర నిర్మాణం చేసి ఆ నగరానికి ఇంద్ర ప్రస్థం అని పేరు పెట్టి జనరంజకంగా పాండవులు పరిపాలించసాగారు. ఖాండవ దహన సమయాన అగ్నిలో చిక్కుకున్న మయుడిని అర్జునుడు రక్షించాడు. ప్రతి ఫలంగా మయుడు పాండవులకు మయసభను నిర్మించి ఇచ్చాడు. పాండవులు రాజసూయాగాన్ని చేశారు. విచ్చేసిన దుర్యోధనుడు మయసభలో భంగపడ్డాడు. దుర్యోధనుడు శకుని, పాండవులను హస్తినకు పిలిపించి, మాయాజూదంతో ఓడించి, పన్నెండు సంవత్సరాలు వనవాసానికి, ఒక సంవత్సరము అజ్ఞాతవాసానికి పంపి, పాండవుల యొక్క సర్వస్వం కౌరవులు లాగేసుకొన్నారు. పాండవులు ద్రౌపదితో కలసి అరణ్యాలకు బయలుదేరారు.

కుంతిదేవి తన బాధను లోపలే అదిమి పట్టుకొని ద్రౌపదికి ఇలా ధైర్యాన్ని చెప్పింది. అమ్మా!, ఈ విధమైన కష్టం వచ్చిందని శోకించవద్దు. నీవు సాధ్వివి, సద్గుణ సంపన్నవు, స్త్రీ ధర్మాలను తెలిసిన దానివి. త్వరలోనే నీ ధర్మాచరణమే నిన్ను రక్షిస్తుంది. త్వరలోనే నీవు శ్రేయస్సు నందుకోగలవు. నా సంకల్పం వలన నీకు అభ్యుదయం కలుగుతుంది, మీరు ధైర్యంగా ఉండండి అని ద్రౌపదికి ధైర్యాన్ని తెలిపింది కుంతిదేవి. నా చిన్న కుమారుడైన సహదేవుడిని వనవాసకాలంలో మరింత శ్రద్ధగా చూసుకో, అని కుంతిదేవి ద్రౌపదితో పలికింది.

మీరు ధర్మాన్ని పాటించేవారు, ఉన్నతులు, దృఢ భక్తులు, దేవతారాధనాతత్పరులు. మీ సత్ప్రవర్తనమే మీకు ఆభరణం, అని కుంతి పాండవులకు ధైర్యం చెప్పింది. భగవాన్ కృష్ణా! ఎక్కడున్నావు, ఈ దుఃఖం నుండి నన్ను, పాండవులను రక్షించు. స్వధర్మాన్ని పాటిస్తూ శీల స్వభావులను అనుసరించే ఈ నా కుమారులు కష్టాలను అనుభవింపదగిన వారు కాదు. వీరిపై దయచూపు, అని కుంతిదేవి ప్రార్థించింది.

కష్టాలు ఎదురైనపుడు తాను గుండె దిటువు చేసుకొని వుండటమే గాక, తన పుత్రులకు కోడలికి కూడా కుంతిదేవి ధైర్యాన్ని ఇచ్చింది. కష్టాల్లో వున్నప్పుడు గట్టు ఎక్కించేది ఆ భగవంతుడే అని దైవ ప్రార్థన చేసిన మహా భక్తురాలు కుంతి. సాధారణ మనుషులలో కనిపించే సవతి బిడ్డలపై అసూయ లాంటి లక్షణాలు అస్సలు లేకుండా ఒక మహాసాధ్వీమతల్లివలె ఆమె ఎంతో ఆదర్శప్రాయంగా వ్యవహరించింది. తన సవతిపుత్రుడైనా కూడా చిన్న కొడుకు అయిన సహదేవునిపైననే ఆమెకు ప్రత్యేకమైన ప్రేమ ఉండేది.

పదవిలో వున్నంతకాలమే ప్రజలు ప్రభువులను గుర్తు పెట్టుకొంటారు. పదునాలుగు సంవత్సరాల తర్వాత వచ్చే పాండవులను ప్రజలు మరచిపోయే అవకాశం వున్నందున, పాండవులు మరల తిరిగి వస్తారన్న విశ్వాసం ప్రజల్లో రాజఉద్యోగుల్లో కల్పించుట కోసం కుంతిదేవి పాండవుల ప్రతినిధిగా హస్తినాపురంలో విదురుని ఇంటనే ఉండిపోయి తన రాజనీతిజ్ఞతను చాటింది.

కష్టాలకు క్రుంగిపోని తత్వం, గుండెను పిండేసే బాధ ఎదురయినా గుండెను దిటువు చేసుకొని ఎదుటివారికి ధైర్యాన్ని నూరిపోయడం, కష్టాలను దాటించగల శక్తి భగవంతునికే వుందని నమ్మి అతనిని ప్రార్థించే భక్తితత్వం, సవతి కొడుకునే సొంత కొడుకుల కన్నా ఎక్కువగా ప్రేమించగలిగే విశాల హృదయం కలిగిన ఆదర్శ మాతృత్వ సుగుణం, రాజనీతిజ్ఞత ఇవన్నీ కూడా ప్రతి ఒక్కరూ కలిగి వుండాలని కుంతి దేవి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

పాండవులు అరణ్య, అజ్ఞాతవాసాలు పదమూడు సంవత్సరాలు పూర్తి చేసుకొన్నారు. వారి అర్ధరాజ్యం వారికి ఇవ్వమని శ్రీ కృష్ణుడిని చివరలో రాయబారిగా హస్తినాపురానికి పంపారు. ముందుగా విదురునితో మాట్లాడిన తర్వాత తన మేనత్త అయిన కుంతిదేవి వద్దకు కృష్ణుడు వెళ్ళాడు. కుంతిదేవి కన్నీళ్ళతో పేరుపేరునా పాండవులందరి మరియు కోడలు ద్రౌపది యొక్క క్షేమ సమాచారాలు అడిగింది. కౌరవుల వలన పాండవులకు జరిగిన

కష్టనష్టాలను గుర్తు తెచ్చుకుంది. డబ్బు వలననో, చదువు వలననో కాదు తన నడవడి చేతనే ఒక వ్యక్తి గొప్పవాడు కాగలడు అన్నది.

**అథో ధనంజయం బ్రూమాః నిత్యోద్యుక్తం వృకోదరమ్ ।**
**యదర్థం క్షత్రియా సూతే తస్య కాలో యమాగతః ॥**

**అస్మింశ్చేదాగతే కాలే మిథ్యా చాతిక్రమిష్యతి ।**
**లోక సంభావితాః సంతః సునృశంసం కరిష్యథ ॥**

**నృశంసేన చ వో యుక్తాన్ త్యజేయం శాశ్వతః సమాః ।**
**కాలే హి సమనుప్రాప్తే త్యక్తవ్యమపి జీవనమ్ ॥**

**(శ్రీమహాభారతము - 3వ భాగము- ఉద్యోగ పర్వం - 90వ అధ్యాయము - 75,76,77 శ్లోకములు)**

కృష్ణా! క్షత్రియకాంత ఏ ప్రయోజనం కోసం పిల్లలను కంటుందో ఆ ప్రయోజనం నెరవేర్చేకాలం ఇప్పుడు వచ్చినదని భీమార్జునులకు తెలియజేయి. ఇటువంటి సమయంలో కూడా యుద్ధం చేయకపోతే అవకాశం చేజారిపోతుందని, దీనులులా యుద్ధం చేయడానికి వెనకడుగు వేస్తే వారిని నేను శాశ్వతంగా వదిలివేస్తాను, అవసరమైనప్పుడు వారు ప్రాణాలను విడువడానికైనా సిద్ధపడాలి, అని చెప్పమని కుంతిదేవి శ్రీకృష్ణుడితో తెలిపింది. పాండవులతో కలసి కృష్ణుడు శత్రువులను సంహరించి రాజ్యలక్ష్మిని చేపట్టాలని కోరింది.

**యద్ యత్ తేషాం మహాబాహో పథ్యం స్యాన్మధుసూదన ।**
**యథా యథా త్వం మన్యేథాః కుర్యాః కృష్ణ తథా తథా ॥**

**అవిలోపేన ధర్మస్య అనికృత్యా పరం తప ।**
**ప్రభావజ్ఞాస్మి తే కృష్ణ సత్యస్యాభిజనస్య చ ॥**

**వ్యవస్థాయాం చ మిత్రేషు బుద్ధి విక్రమయోస్తథా ।**
**త్వమేవ నః కులే ధర్మః త్వం సత్యం త్వం తపో మహత్ ॥**

**త్వం త్రాతా త్వం మహద్ బ్రహ్మ త్వయి సర్వం ప్రతిష్ఠతమ్ ।**
**యథైవాత్థ తథైవైతత్ త్వయి సత్యం భవిష్యతి ॥**

**(శ్రీమహాభారతము - 3వ భాగము - ఉద్యోగ పర్వం - 90వ అధ్యాయము - 101,102,103,104 శ్లోకములు)**

మహాబాహూ! మధుసూదనా! పాండవులకు ఏది మంచిదని నీవు భావిస్తున్నావో ఆ రీతిగా నీవు చేయి. ధర్మ భంగం లేకుండా, వంచన లేకుండా కార్యసాధన చేయాలి. నీ సత్యపరాయణత్వం నాకు తెలుసు. కార్యాన్ని చక్కబెట్టడంలో, మిత్రులను సేకరించడంలో, బుద్ధి పరాక్రమాలలో నీ గొప్పతనం నాకు తెలుసు. నీవే సత్యం, నీవే తపస్స్వరూపుడవు. నీవే రక్షకుడవు, నీవే పరబ్రహ్మవు, నీయందే సర్వమూ ప్రతిష్ఠింపబడి ఉన్నది, అని కుంతిదేవి శ్రీకృష్ణుడిని ప్రార్థించింది.

వ్యక్తి యొక్క గొప్పతనం, ధనం, విద్య ద్వారా కాదు వారి నడవడికను బట్టే వస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరూ మంచి నడవడిక కలిగి వుండాలని, యుద్ధం చేయడం క్షత్రియ ధర్మం కాబట్టి పుత్రులను యుద్ధం చేయమని చెప్పడం ద్వారా ప్రతి ఒక్కరూ వారి వారి ధర్మాలను వారు నిర్వర్తించాలని, అధర్మాన్ని, అన్యాయాన్ని, మోసాలని ఎవ్వరూ చేయకూడదని, వాటిని ఎదురించాలని, దైవాన్ని నమ్మి మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించి ఫలితాన్ని భగవంతునికే వదిలివేయాలని, కుంతిదేవి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. కౌరవ పాండవుల ఇరువురి మధ్య శాంతి కోసం శ్రీకృష్ణుడు చేసిన సంధిప్రయత్నాలు కౌరవుల గర్వం కారణంగా విఫలమయ్యాయి. కౌరవ పాండవుల మధ్య యుద్ధం అనివార్యమైంది. యుద్ధంలో ఒకవైపు కౌరవుల తరపున తన కొడుకైన కర్ణుడు, మరొకవైపు పాండవుల తరపున తన ఐదుమంది కొడుకులు తలపడుతూ వుండడంతో కుంతిదేవి కర్ణుడిని రహస్యంగా కలసి అతని జన్మ రహస్యాన్ని తెలిపి, యుద్ధంలో పాండవుల వైపుకు రమ్మని కోరినది. కర్ణుడు మిత్ర ధర్మాన్ని వీడి రానన్నాడు. తన

పుత్రుడైన కర్ణుడు మరియు పాండవుల ఇరువురి క్షేమం కోసం కుంతి తపించింది.

కురుక్షేత్ర యుద్ధం జరిగింది. కౌరవులు అందరూ యుద్ధంలో మరణించారు. అటు ధృతరాష్ట్రుడు, ఇటు ధర్మరాజు మృతవీరులకు తిలోదకములు వదులుతున్నారు. కర్ణుడు సూతపుత్రుడని ఆ ఇద్దరిలో ఎవరూ అతనికి ఉదకములు వదలలేదు. అది చూచి కుంతిదేవి కడుపులో అగ్ని పర్వతాలు బ్రద్దలైనాయి. దుఃఖావేశంతో కర్ణుడి జన్మ రహస్యము తెలిపి తిలోదకములు వదలమని ధర్మరాజును కోరి అతనికి పుణ్యలోకాలు ప్రాప్తించేలా చేసింది. కర్ణుడి గురించి కుంతిదేవి చివరి వరకు బాధపడింది. తెలిసీతెలియక మనుషులు చేసే తప్పులు వారిని జీవితాంతం బాధకు గురిచేస్తాయని, మనిషి మరణం తర్వాత నిజాలు దాచకూడదని, మనిషి మరణం తర్వాత వదలవలసిన ఉదకములు ఇత్యాది క్రియలు ఎంతో ముఖ్యమైనవని, నేటి సమాజానికి కుంతిదేవి సందేశాన్నిచ్చింది.

కురువంశంలో కౌరవ పాండవుల వారసుడుగా అభిమన్యుడి భార్య ఉత్తర గర్భంలో వున్న ఒకే ఒక్కడిని కూడా సంహరిస్తానని గురు పుత్రుడైన అశ్వత్థామ చివరగా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. శ్రీకృష్ణుడు దాని నుంచి వారిని కాపాడి, మృతుడై పుట్టిన ఆ పుత్రుడిని తిరిగి బ్రతికించి అతనికి పరీక్షిత్తు అని పేరు పెట్టాడు. ధర్మరాజుకు రాజ్య పట్టాభిషేకం జరిగింది. పాండవులు సంపూర్ణ రాజ్యాధికారాన్ని సకల సంపదలను పొందారు. అశ్వమేధ యాగం చేశారు. శ్రీకృష్ణ భగవానుడు ధర్మ రాజాదులకు ధర్మోపదేశం చేశాడు. పాండవుల నుండి సెలవు తీసుకొని తిరిగి ద్వారకకు శ్రీకృష్ణుడు బయలు దేరాడు. శ్రీకృష్ణుని రథమును సమీపించి ఆపుకోలేని దుఃఖంతో కుంతిదేవి ఇలా ప్రార్థించింది.

**విషాన్మమాగ్నేః పురుషాద దర్శనాద్ ।**
**అసత్స భాయా వనవాసకృచ్ఛ్రతః ॥**

**మృధే మృధేనేక మహారథాస్త్రతో ।**
**ద్రౌణ్యస్త్రతశ్చాస్మ హరే భి రక్షితాః ॥**

**విపదః సన్తు తాః శశ్వత్తత్ర తత్ర జగద్గురో ।**
**భవతో దర్శనం యత్స్యాదపునర్భవ దర్శనమ్ ॥**
**(శ్రీమద్భాగవతము - 1-8-24,25)**

శ్రీకృష్ణా! విషాహారము నుండి, మహాగ్ని నుండి, నరమాంస భకక్షకుల నుండి, దుష్ట సభాగృహము నుండి, అరణ్య వాస కష్టాల నుండి, పలువురు మహారథులు పాల్గొనిన కురుక్షేత్ర యుద్ధం నుండి మమ్ము రక్షించావు. అదేవిధంగా ఇప్పుడు అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రము నుండి కూడా మమ్ములను కాపాడావు. అటువంటి నీవు మమ్మల్ని విడచి వెళ్లకు. కష్టాలలో మమ్మల్ని అణుక్షణం కాపాడే నీ దర్శనము కోసము మాకు మరల మరల ఆ కష్టాలను ఇవ్వు, ఎందుకంటే అలాగైనా మాకు నీ దర్శనము మరల మరల కలుగుతుంది. నీ దర్శనం కలిగితే చాలు నిరంతర జనన మరణాల చక్రం నుంచి మాకు విముక్తి కలుగుతుంది, అని కుంతిదేవి శ్రీకృష్ణుడిని ప్రార్థించింది.

మనుషులు సుఖాల్లో భగవంతుడిని మరచి పోతారని, కష్టాలు కలిగినప్పుడు దైవాన్ని ప్రార్థిస్తారని, బహుశా అందుకే మనుషులకు కష్టాలు అవసరమని, చావు పుట్టుకలకతీతమైన మోక్షసాధనే మానవజన్మ పరమార్థం అని, అది భగవద్దర్శనంతోనే సాధ్యమని, అందుకు మానవులకు భగవంతునిపై అచంచలమైన కృతజ్ఞత భక్తి భావాలు అవసరమని కుంతిదేవి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

పాండవులు సంపూర్ణ రాజ్యాధికారాన్ని పొందాక, కుంతిదేవి రాజమాతగా సకల సుఖవైభోగాలు అనుభవించే కాలం ఆసన్నమయ్యింది. గాంధారి ధృతరాష్ట్రులను సేవిస్తూ కుంతిదేవి వారికి కలిగిన బాధను

ఉపశమించడానికి ప్రయత్నించింది. పుత్ర వియోగ బాధతో గాంధారి ధృతరాష్ట్రులు వనవాసం చేయడానికి నిర్ణయించుకొన్నారు. పుట్టు గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుడు, తన భర్త చూడని లోకాన్ని నేనూ చూడనని కనులకు గుడ్డ కట్టుకొన్న గాంధారి వీరిరువురి కంటిచూపు లేక, వనవాస కాలంలో ఇబ్బందులు పడతారని, వారితో పాటు వనవాసానికి తాను కూడా వెళ్ళి వారికి సేవచేయాలని కుంతి దేవి నిర్ణయించుకొన్నది. జీవితమంతా కష్టాలు అనుభవించిన కుంతిదేవికి సుఖపడే రోజులు వచ్చాక, సుఖాలను అనుభవించకుండా, ఎవరి వలన తనకు, తన కొడుకులకు, కోడలకు కష్టాలు, అవమానాలు ప్రాప్తించాయో, వారి కోసం అడవులకు వెళ్ళాలని నిర్ణయించుకొన్న అపూర్వ నిస్వార్థ త్యాగమూర్తి కుంతిదేవి. ఆమెను వనాలకు వెళ్ళవద్దని ప్రార్థించిన తన పుత్రులతో కుంతి, మీరు క్షత్రియ ధర్మాన్ని పాటించాలని, న్యాయముగా మీకు రావాల్సిన రాజ్యాధికారాన్ని వదులుకోరాదని, వంశం నశించకూడదని, మిమ్మల్ని యుద్ధం చేయమని కోరాను. నేను రాజ్య సుఖాలను కోరుకోవడం లేదు, తపస్సుతో నేను వనాలలో నా శరీరాన్ని శుష్కింపచేసుకొని మీ తండ్రిగారు వెళ్ళిన పుణ్యలోకాలకు నేను కూడా వెళ్ళాలని కోరుకొంటున్నాను అని, మీరు ధర్మాన్ని వీడకుండా జీవించండి, అని చెప్పి కుంతీదేవి వనాలకెళ్ళి తపస్సు చేసుకొంటూ ప్రశాంతమైన జీవనాన్ని సాగించింది. కొంతకాలం తర్వాత అడవిలో దావాగ్నికి ధృతరాష్ట్ర, గాంధారిలతో పాటు, కుంతిదేవి కూడా యోగీశ్వరురాలిలా దేహత్యాగం చేసింది.

కుంతి దేవి త్యాగం, సంతానానికి సరియైన వేళల్లో సరియైన మార్గ నిర్దేశనం, ఐహిక సుఖాలను కాదని తపస్సు ద్వారా ఆధ్యాత్మిక పథాన సాగాలన్న నిర్ణయం, నేటి సమాజానికి కుంతి దేవి ఇచ్చిన సందేశాలు. ఇన్ని సుగుణాలు కలిగిన మహా సాధ్వీమణి కాబట్టే, ఎవరిని స్మరిస్తే సకల పాపాలు హరించబడుతాయో, ఆ పంచకన్యలలో ఒకరుగా కుంతిదేవి,

అహల్య, ద్రౌపది, తార, మండోదరి లాంటి పతివ్రతా శిరోమణుల సరసన నిలిచింది.

వినయ విధేయతలు, సహనం, అంకింత భావంతో తమకు అప్పగించిన విధులను అందరూ నిర్వర్తించాలని, ఇంటికొచ్చిన అతిథికి గౌరవ మర్యాదలతో కూడిన సేవలు అందరూ చేయాలని, అసూయ ద్వేషాలు లేని విశాలమైన హృదయంతో కూడిన నడవడికను అందరూ అలవర్చు కోవాలని, దాంపత్య ధర్మానుసారం కష్టాలలో సైతం భర్త వెంటే ఉండాలని, ఊహించని కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా వాటిని ఎదుర్కొని శాంతితో కూడిన సంయమనంతో వాటిని దాటాలని, పుత్రులను పెంచడంలో వారికి సరియైన దిశా నిర్దేశం చేయడంలో గొప్ప తల్లిగా ఉండాలని, స్వార్థపు గోడలను ఛేధించి పరోపకారార్థం ప్రతి ఒక్కరూ త్యాగాలు చేయాలని, దైవం పట్ల అచంచలమైన కృతజ్ఞత, భక్తి భావాలు కలిగి ఉండాలని, తపస్సుతో మోక్షాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ సాధన చేయాలని, ఇలా ఎన్నో అద్భుతమైన సందేశాలను నేటి సమాజానికి అందించిన ఆదర్శప్రాయురాలైన సాధ్వీమణి కుంతిదేవి.

* * *

# శకుంతల

నియమనిష్ఠాగరిష్టపరురాలు, సదాచార సత్‌శీలసంపన్నురాలు, రూపయౌవ్వనలావణ్యరాశి, దూరదృష్టి పరాయణురాలు, పతివ్రతా శిరోమణి, గొప్ప తపః సంపన్నురాలు, సత్యధర్మ పరాయణురాలు, ధైర్యస్థర్యరాలు, ఆదర్శ మహిళామణి, వివేక విజ్ఞానాది జ్ఞానశీలి, శకుంతల. పౌరవ వంశంలోని, ఇలిలుడు అనే రాజర్షికి – రథంతరిలకు జన్మించిన పుత్రుడు దుష్యంతుడు. ఇతడు నలు సముద్రాల నడుమనున్న సువిశాల భూమండలాన్ని పరిపాలిస్తున్న రాజు. మహా తేజస్వి, వీరుడు, శత్రుభయంకరుడు. అతని పాలనలో ప్రజలు చోర, ఆకలి, వ్యాధి భయాలు లేక ఆనందంగా ధర్మార్థాలను పాటిస్తూ జీవిస్తున్నారు. దుష్యంత మహారాజు ఒకనాడు అడవికి తన చతురంగ బలాలతో వేటకు వెళ్ళాడు. ఎన్నో క్రూరమృగాలను వేటాడిన తర్వాత కొన్ని మృగాలను వెంటాడుతూ దుష్యంతుడొక్కడే మరొక వనం చివరకు వెళ్ళాడు. ఆ వనం నుంచి ప్రకృతి శోభతో విరాజిల్లుతున్న ఇంకొక వనంలోకి ప్రవేశించాడు. అక్కడ మాలినీ నదీ తీరంలో ఎంతో మనోహరంగా వున్న కణ్వ మహర్షి ఆశ్రమాన్ని చూసి, అందులోనికి ప్రవేశించి, ఇక్కడ ఎవరున్నారు?, అని పిలిచాడు.

ఆ మాటలు విని, లక్ష్మీదేవి వంటి రూపంతో, తాపసీ వేషంలో వున్న అందాల కలువ కన్యయైన శకుంతల వెలుపలికి వచ్చి, దుష్యంతునికి స్వాగతం పలికి, అర్ఘ్య పాద్య ఆసనాలతో గౌరవించి, కుశల ప్రశ్నలడిగి, మీకొరకు నేను ఏమి చేయగలనో తెలుపమని వినయంగా అడిగింది.

ఇంటికి వచ్చిన అతిధికి స్వాగతం పలికి, వారిని గౌరవించడం మన భారతీయ సంప్రదాయం అని శకుంతల తాను ఆచరించి చూపి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. అప్పుడు దుష్యంతుడు తన వివరాలు తెలిపి, కణ్వ మహర్షి దర్శనానికి వచ్చాను, మహర్షి ఎక్కడున్నారు, అని శకుంతలను

అడిగాడు. పూజ్యుడగు నాతండ్రి ఫలాలకోసం ఆశ్రమం నుంచి బయటకు వెళ్ళాడు, ముహుర్తకాలం వేచివుంటే వారు వస్తారు, అని శకుంతల తెలిపింది.

**అపశ్యమానస్తమృషిం తథా చోక్తస్తయా చ సం ।**
**తాం దృష్ట్వా చ వరారోహాం శ్రీమతీం చారుహాసినీమ్ ॥**

**విభ్రాజమానాం వపుషా తపసా చ దమేన చ ।**
**రూపయౌవనసంపన్నామ్ ఇత్యువాచ మహీపతిః ॥**

**(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - 71వ అధ్యాయము - 10,11 శ్లోకములు)**

చక్కని శరీర లావణ్యం, అందమైన చిరునవ్వు, తపస్సు, ఇంద్రియ నిగ్రహం, రూపయౌవన సంపదలు కలిగిన శకుంతలను చూసి, దుష్యంతుడు తొలిచూపులోనే నీవు నా మనసును హరించావు, నేను నిన్ను వివాహ మాడదలిచాను, అని పలికి తన వివరాలను ఆమెకు తెలిపి, ఆమె ఎవరో తెలియచేయమని కోరాడు.

నేను పూజ్యుడు, తపస్వి, ధర్మజ్ఞుడు, మహాత్ముడు అయిన కణ్వమహర్షి కూతురుని. నాకు తండ్రి, గురువు అన్నీ ఆ మహర్షే, నేను స్వతంత్రురాలను కాను. నీవు నాతో కాకుండా వారితో మీ కోరికను తెలియజేయుట ధర్మము, అని చిరునవ్వుతో శకుంతల దుష్యంతునితో పలికింది. తమ వివాహ విషయంలో తండ్రి యొక్క అనుమతి ప్రతి కన్యకు అవసరమని, స్వతంత్ర్యంగా వారు నిర్ణయాలు తీసుకోవడం తగదు, అనే సందేశాన్ని శకుంతల సమాజానికి ఇచ్చింది. అప్పుడు దుష్యంతుడు, నియమవ్రతుడు, ధర్మ నిష్ఠాగరిష్ఠుడైన కణ్వమహర్షి ఎటువంటి ఆకర్షణలకు చలించడు. మరి నీవు ఎలా ఆ మహర్షికి కూతురయ్యావు?, అని శకుంతలను అడిగాడు. ఇదే ప్రశ్నను ఒక మహర్షి, కణ్వమహర్షిని గతంలో అడిగినప్పుడు వారు సమాధానం చెప్పగా నేను విన్న వివరాలను తెలుపుతాను, అంటూ శకుంతల దుష్యంతునికి ఇలా తెలియచేసింది. పూర్వం విశ్వామిత్ర మహర్షి గొప్ప

తపస్సు చేయసాగాడు. అది చూసి దేవతల రాజైన ఇంద్రుడు తన పదవిని ఎక్కడ విశ్వామిత్రుడు ఆక్రమిస్తాడేమో అతని ఈ తపః శక్తి వలన అని, భయపడిన ఇంద్రుడు మేనకను పంపి విశ్వామిత్రునికి తపోభంగం కలిగించి అతని మనసు తపస్సు నుంచి మరల్చమని తెలిపాడు. మేనక విశ్వామిత్రుని గొప్పదనం, కోపం, శక్తిని వివరించి తన భయాన్ని దేవేంద్రుడితో వ్యక్తం చేయగా, దేవేంద్రుడు వాయువును ఆమెకు తోడుగా పంపి సహకరించమని ఆదేశించాడు. మేనక విశ్వామిత్రుని చెంతకు చేరి నమస్కరించి నాట్యం చేయసాగింది. వాయువు వాతావరణాన్ని సుగంధ పరిమళాలతో నింపి, తన గాలితో మేనక వస్త్రాన్ని తొలగించాడు.ఆమె సిగ్గుపడుతూ వస్త్రం తీసుకోవాలని కంగారుగా విశ్వామిత్రున్ని సమీపించింది. వర్ణనలకు అందనంత అందచందాలతో యవ్వన వొంపు సొంపులతో వస్త్రములు తొలగివున్న మేనకను చూసిన విశ్వామిత్రునిలో కామం పొంగిపొరలగా అతడు తన తపస్సును విడిచి ఆమె సాంగత్యాన్ని కోరుకున్నాడు. ఎంతోకాలం సాధనతో సంపాదించుకొన్న తపస్సు క్షీణించింది. వారిరువురూ ఒక్కటై రోజుకొక విధంగా స్వేచ్ఛగా క్రీడించారు. పదివేల సంవత్సరాలు వారిరువురు ఆనందంగా సంసారం చేశారు. ఫలితంగా వారిరువురికి శకుంతల జన్మించింది. ఆ పసిపాపను హిమాలయాల్లోని మాలినీ నది తీరంలో వదిలి, తను వచ్చిన పని పూర్తయ్యిందని మేనక ఇంద్ర సభకు వెళ్ళిపోయింది. తాను కామాన్ని జయించలేక తపఃశక్తిని క్షీణింపచేసుకొన్నానన్న సత్యాన్ని గ్రహించి తిరిగి తపస్సు కోసం విశ్వామిత్రుడు బయలుదేరి వెళ్ళిపోయాడు. సింహాలు, పులులు, రాబందులు తినివేయకుండా సమూహంగా చేరి అడవిలోని పక్షులు ఆ పాపను కాపాడసాగాయి. కణ్వమహర్షి ఆచమనం కోసం ఆ నదీతీరానికెళ్ళగా ఆ పక్షులన్నీ ఆ మహర్షి పాదాలపై వాలి మధురంగా ఆ పాప జన్మవృత్తాంతాన్ని తెలిపి, విశ్వామిత్రుని పుత్రికను పోషించమని కోరాయి. శకుంతలాలు అంటే పక్షులు. వాటిచే రక్షింపబడడం

వలన ఆ పాపకు శకుంతల అనే నామకరణం చేసి, అన్ని ప్రాణుల శబ్ధాలను తెలిసినవాడు, అన్ని ప్రాణుల యందు దయగలవాడు అయిన కణ్వమహర్షి ఆమెను తన ఆశ్రమానికి తీసుకొని వచ్చి పెంచాడు. అలా శకుంతల కణ్వమహర్షి కూతురు అయ్యింది, అని ఆ మహర్షికి, కణ్వమహర్షి తెలియచేయగా నేను విన్నాను, అని శకుంతల దుష్యంతునికి తన గురించి తెలియచేసింది.

కామాన్ని జయించలేకపోతే ఎంతటి గొప్పవారైన అన్నింటిని పోగొట్టుకొని అధఃపాతాళానికి జారిపోతారని, కామాన్ని ప్రతి ఒక్కరూ జయించాలనే సందేశాన్ని శకుంతల తన జన్మ వృత్తాంతం ద్వారా నేటి సమాజానికి అందించింది.

అంత దుష్యంతుడు, ఆనందంతో నీవు రాజపుత్రికవు అందుకే నా మనసు నిన్ను కోరుకున్నది. నీవు నా భార్య కావడానికి నేనేమి చేయాలో చెప్పు. నా సర్వ సంపదలు, సమస్త రాజ్యమూ నీవే. ఇప్పుడే నీవు నన్ను గాంధర్వ వివాహమాడు, అని శకుంతలతో పలికాడు.

**పితాహి మే ప్రభుర్నిత్యం దైవతం పరమం మతమ్ ।**
**యస్య వా దాస్యతి పితా సమే భర్తా భవిష్యతి ॥**

**పితా రక్షతి కౌమారే భర్తారక్షతి యౌవనే ।**
**పుత్రస్తు స్థవిరే భావే న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి ॥**

**అమన్యమానా రాజేంద్ర పితరం మే తపస్వినమ్ ।**
**అధర్మేణ హి ధర్మిష్ఠ కథం వరము పాస్మహే ॥**

**(శ్రీ మహాభారతము - మొదటిభాగము - ఆదిపర్వము - 73వ అధ్యాయము - పుట 269)**

బాల్య కౌమారాలలో తండ్రి, యౌవనంలో భర్త, ముసలితనంలో కొడుకు, స్త్రీని రక్షిస్తూ ఉంటారు. స్త్రీ వారిని కాదని ముఖ్యమైన విషయాలలో

నిర్ణయాలు తీసుకోరాదు. నా తండ్రే నాకు దైవం, అతడు ఎవరికి నన్నిస్తే అతడే నా భర్త, నా తండ్రి వచ్చే వరకు వేచివుండు, అని శకుంతల దుష్యంతునికి సమాధానమిచ్చింది.

తండ్రి దైవ సమానుడని, తనను అనుక్షణం వివిధ దశలలో రక్షించే తండ్రి, భర్త, పుత్రుడికి తెలియకుండా స్త్రీ తన జీవితంలోని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోరాదు, అనే సందేశాన్ని శకుంతల సమాజానికిచ్చింది.

బ్రహ్మం, దైవతం, ఆర్షం, ప్రాజాపత్యం, ఆసురం, గాంధర్వం, రాక్షసం, పైశాచం అనే ఎనిమిది రకాలైన వివాహాలు ధర్మ సమ్మతమైనవని, స్వాయంభువ మనువు చెప్పినాడని, వానిలో మొదటి ఆరు క్షత్రియులకు ధర్మ సమ్మతాలని, శకుంతల రాజర్షి అయిన విశ్వామిత్రునికి జన్మించడం వలన ఆమె క్షత్రియ కన్య అని, గాంధర్వ వివాహం ద్వారా ఆమె తన భార్య కావడం ధర్మ సమ్మతమే, అని దుష్యంతుడు శకుంతలకు తెలిపాడు.

అది ధర్మ సమ్మతమే అయితే, నా వలన నీకు జన్మించిన కుమారుడే యువరాజై నీ తర్వాత నీ రాజ్యానికి రాజు కావాలన్న నియమానికి నీవు అంగీకరిస్తే, నేను గాంధర్వ వివాహానికి సిద్ధమే, అని శకుంతల దుష్యంతునికి తెలిపింది. అందుకు సమ్మతించిన దుష్యంతుడు శకుంతలను పాణిగ్రహణం చేసి గాంధర్వ వివాహం చేసుకొన్నాడు. వారిరువురూ ఒకటై సుఖించారు.

తమకు పుట్టబోయే కొడుకునే యువరాజుగా చేయాలన్న నియమం, రాజు అయిన దుష్యంతునికే విధించి వివాహానికి ముందే మాట తీసుకొని తర్వాత పెండ్లికి అంగీకరించడంలో శకుంతల యొక్క ఠీవి, రాజసం, వివేకం, దూరదృష్టి మనకు వ్యక్తమవుతూ వుంది. ఎంత గొప్పవారైనా, ఎంతటి ఆకర్షణ వున్నా, తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా వివేకంతో, ముందుచూపుతో స్త్రీలు ఆలోచించి తదనుగుణంగా జీవితంలో ముందుకు వెళ్ళాలనే సందేశాన్ని శకుంతల నేటి సమాజానికి ఇచ్చింది.

దుష్యంతుడు కొంతకాలం శకుంతలతో గడిపాడు, ఆమెకు విశ్వాసం కలిగాక, నేను రాజ్యానికి వెళ్ళి, నీ కోసం చతురంగ బలాలను పంపి తన రాజ సౌధానికి రప్పించుకొంటాను అని చిరునవ్వుతో పలికాడు. శకుంతల కన్నీటితో దుష్యంతుడినికి ప్రదక్షిణ చేసి, అతని పాదాలపై వాలింది. నేను నిన్ను తప్పక తీసుకువెళ్తాను, మన ఎడబాటు స్వల్ప సమయమే విచారించకు, నేనింత వరకు సంపాదించిన నా పుణ్యం సాక్షిగా ప్రమాణం చేస్తూ వున్నా, అని మళ్ళీ మళ్ళీ దుష్యంతుడు శకుంతలకు చెప్పి తన రాజ్యానికి వెళ్ళాడు.

తర్వాత ఆశ్రమానికి వచ్చిన తన తండ్రి కణ్వ మహర్షికి శకుంతల దుష్యంత మహరాజు ఆశ్రమానికి వచ్చాడని, దైవాజ్ఞచే అతనిని తాను పతిగా వరించాను అని, జరిగిన విషయాలన్ని తెలియచేసింది. దివ్య దృష్టితో జరిగినది తెలుసుకొన్న మహర్షి, గాంధర్వ వివాహం క్షత్రియులకు ధర్మమైనదే, నీ పతి యోగ్యుడు. మీకు మహాత్ముడు, మహాబలుడు అయిన పుత్రుడు జన్మిస్తాడు, అతడు ఈ భూమండలాన్ని అంతా దివ్యంగా పరిపాలిస్తాడు, అని కణ్వమహర్షి శకుంతలతో పలికాడు.

తల్లిదండ్రులు లేనప్పుడు జరిగిన విషయాలేవీ దాచకుండా, వారు రాగానే వారికి అన్ని విషయాలు పిల్లలు తెలియచేయాలని, తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లల హితాన్నే కోరుకుంటారని, మంచి విషయాలలో వారి సహాయం, దీవెనలు ఎప్పుడూ పిల్లలకి లభిస్తాయనే సందేశాన్ని శకుంతల నేటి సమాజానికిచ్చింది.

దుష్యంతుడు తన రాజ్యానికి చేరాక సైన్యాన్ని పంపి తనను తీసుకొని వెళ్తాడనే దృఢ నమ్మకంతో శకుంతల ఎదురు చూస్తూనే వుంది, కానీ వారు రాలేదు. శకుంతలా దుష్యంతల కలయిక వలన ఆమె గర్భాన్ని ధరించి, మిక్కిలి తేజస్సుతో అగ్ని వలె ప్రకాశిస్తున్న పుత్రుడికి ఆమె జన్మనిచ్చింది. దేవతలు పూలవర్షం కురిపించారు, ఇంద్రుడు ఆ బాలుడు చక్రవర్తి అవుతాడని, అసమాన బలపరాక్రమాలు కలిగి, నూరు అశ్వమేధయాగాలు,

వేలకొలది రాజసూయాది యాగాలు, దానాలు చేస్తాడని పలికాడు. శకుంతల ఆ బాలుడిని వీరునిగా తీర్చిదిద్దసాగింది. ఆరు సంవత్సరాల ఆ బాలుడు ఆశ్రమ సమీపంలోనికి వచ్చిన సింహాలు, పులులపై ఎక్కి వాటిని లొంగదీసుకొని స్వారీచేయసాగాడు. ఆశ్రమ చుట్టూ ప్రక్కలకు వచ్చిన రాక్షసులను మర్ధించి చంపసాగాడు. ఆ బాలుడు తన పరాక్రమంచే అన్నింటిని అణచివేస్తూ వుండడం వలన ఆశ్రమ వాసులు అతనికి సర్వదమనుడు అని పేరు పెట్టారు. అంతటి తేజస్సు, బలం కలిగిన పుత్రునికి జన్మనివ్వడం వలన శకుంతల వీరమాత అయ్యింది.

కణ్వ మహర్షి శకుంతల, సర్వ దయనులను పిలచి, దుష్యంతుడు స్వయంగా రాలేదనో, తాను వీరిని అతని వద్దకు పిలిపించుకోలేదనో ఆలోచనతోనే కాలం గడిచిపోయింది. మీరే అతని దగ్గరకు వెళ్ళి హాయిగా జీవించండి, అదే ధర్మము అని చెప్పి, వారిని ఆశీర్వదించి, వారికి తోడుగా తన ఆశ్రమ వాసులను పంపి, దుష్యంత మహారాజు చెంతకు వారిని చేర్చమని చెప్పాడు. తండ్రి మాటకు ఎదురు పలకక శకుంతల కణ్వమహర్షికి నమస్కరించి భక్తితో ప్రదక్షిణ చేసి, తండ్రి అనే చనువుతో ఎప్పుడైనా నేను అజ్ఞానంతో పొరపాటుగా మాట్లాడినా, అసత్యం పలికినా, చేయకూడని పని చేసి వున్నా, మీ ఇష్టానికి వ్యతిరేకంగా నడుచుకొని వున్నా నన్ను క్షమించండి, అని ప్రార్థించింది.

తండ్రి, పెద్దల మాటలను గౌరవించడం, వారు ఏమి చేసినా పిల్లల శ్రేయస్సు కోసమే చేస్తారని విశ్వసించడం, వారి పట్ల పిల్లలు తెలియక చేసిన తప్పులను క్షమించమని వారిని ప్రార్థించడం, ఇలాంటి విశిష్టమైన గుణగణాలతో కూడిన ఆదర్శమైన సంస్కారంతో కూడిన వ్యక్తిత్వాన్ని నేటి తరం కలిగి వుండాలనే సందేశాన్ని శకుంతల నేటి సమాజానికి అందించింది.

శకుంతల తన కుమారునితో కలసి దుష్యంత మహారాజు సభలోనికి ప్రవేశించింది. ఆమెతో పాటు వచ్చిన మునులు శెలవు తీసుకొని తిరిగి

కణ్వ ఆశ్రమానికి బయలు దేరారు. దుష్యంతుడు శకుంతలను గుర్తించనట్లు చూసి, వచ్చిన పని ఏమిటో చెప్పమని అడిగాడు. ఆమె సిగ్గుతో తలవంచుకొని తన పుత్రుడిని చూపి ఇతనే మన కుమారుడు, కణ్వ ఆశ్రమానికి మీరు వచ్చి నన్ను వివాహం చేసుకొని, మనకు పుట్టబోయే పుత్రుడిని ఈ రాజ్యానికి యువరాజును చేస్తానని మాట ఇచ్చిన ప్రకారం ఇప్పుడు మన కొడుకుకి యువరాజ్య పట్టాభిషేకం చేయండి మహారాజా, అని పలికింది. దుష్ట తాపసీ! నీవెవరో, నీకు నాకు వున్న సంబంధం ఏమిటో నాకు గుర్తు రావడం లేదు, నీవు ఇలా అబద్ధాలు ఆడడం తగదు, ఇక్కడ నుంచి వెళ్ళు, అని దుష్యంతుడు శకుంతలతో పలికాడు. వూహించని ఆ సమాధానికి హతాశురాలై దుఃఖం పొంగిపొర్లగా, అవమాన భారంతో కనులు ఎర్రబడగా, ఎగసే కోపాన్ని తపఃశక్తితో నిగ్రహించుకొని, శకుంతల ఇలా దుష్యంతునితో పలికింది. మహారాజా! తెలిసిన వాడవై కూడా నాకు తెలియదు అని, ఎలా మాట్లాడ గలుగుతున్నావు?

**అత్ర తే హృదయం వేద సత్యస్యై వానృతస్యచ ।**
**కళ్యాణం వద సాక్ష్యేణ మాత్మాన మవమన్యథాః ॥**

**యో న్యథా సంత మాత్మాన మన్యథా ప్రతి పద్యతే ।**
**కిం తేన న కృతం పాపం చారేణాత్మాప హరిణా ॥**

**(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - 74వ అధ్యాయము - 26,27 శ్లోకములు)**

ఈ విషయంలో ఏది సత్యమో, ఏది అసత్యమో నీ అంతరాత్మకే తెలుసు, నీ అంతరాత్మను అవమానించుకోక, అంతరాత్మ సాక్షిగా నీవు నిజం చెప్పు. ఒక విధంగా వున్న తనను వేరొక విధంగా చెప్పేవాడు తనను తాను దొంగలించుకొనేవాడుగా లెక్క. అతడు ఎంతటి పాపాన్నైనా చేస్తాడు, అని శకుంతల దుష్యంతునితో పలికింది.

**మన్యతే పాపకం కృత్వా న కశ్చిద్ వేత్తి మామితి ।**
**విదంతి చైనం దేవశ్చ యశ్చై వాంతర పూరుషః ॥**

**ఆదిత్య చంద్రావని లానలౌ చ ద్యౌర్భూమిరాపో హృదయం యమశ్చ।**
**అహశ్చ రాత్రిశ్చ ఉభే చ సంధ్యే ధర్మశ్చ జానాతి నరస్య వృత్తమ్ ॥**

**(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము- 74వ అధ్యాయము - 29,30 శ్లోకములు)**

అసత్యం లేకుండా సత్పురుషులందరికి హితాన్ని కలిగించేది ధర్మమే. పాపం చేస్తూ దాన్ని ఎవరూ తెలుసుకోలేరు అని భావించడం అవివేకం, ఎందుకంటే మనకు కనిపించకుండా వుండే దేవతలకు మన లోపల వున్న అంతరాత్మకు అవి తెలుస్తాయి. సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, ఆకాశం, భూమి, నీరు, హృదయము, యముడు, అహోరాత్రాలు, ప్రాతఃసాయం సంధ్యలు, ధర్మం ఇవన్నీ అణుక్షణమూ మానవుని నడవడిని గమనిస్తూ వుంటాయి. హృదయంలో వున్న కర్మసాక్షి, మనిషి సన్మార్గుడై మంచి పనులు చేస్తూ వుంటే సంతోషించి అతని పాపాలు తొలగిస్తాడు, లేకపోతే ఆ పాపాత్ముడిని యముడే ఈ లోకం నుండి తొలగిస్తాడు. తన్ను తాను మోసం చేసుకొని అసత్యాలు చెప్పుకొనే వానికి దేవతలు కూడా ఎప్పటికి మంచిని చేయలేరు, అని శకుంతల దుష్యంతునితో పలికింది.

సత్యాసత్యాల గురించి మానవుల నడవడిక గురించి, మనిషి మనసులోని అంతరాత్మ గురించి, నిత్యం మానవుడిపనులను గమనిస్తూ వుండే పంచభూతాలు, దేవతలు, కర్మసాక్షి గురించి శకుంతల పైన వివరించిన విషయాలు నేటి సమాజంలోని మానవులందరికీ వారి సత్ ప్రవర్తనకై దిశా నిర్ధేశం చేసి వారి అజ్ఞానాంధకారాలను పారద్రోలే సత్యభాస్కర అక్షర కిరణాలు ఈ సందేశాలు.

**అర్ధం భార్యా మనుష్యస్య భార్యా శ్రేష్ఠతమః సఖా ।**
**భార్యా మూలం త్రివర్గస్య భార్యా మూలం తరిష్యతః ॥**

భార్యావంతః క్రియావంతః సభార్యా గృహమేధినః ।
భార్యావంతః ప్రమోదంతే భార్యావంతః శ్రియాన్వితాః ॥

సఖాయః ప్రతివిక్తేషు భవంత్యేతాః ప్రియంవదాః ।
పితరో ధర్మకార్యేషు భవంత్యార్తస్య మాతరః ॥

కాంతారేష్వపి విశ్రామః జనస్యాధ్వని కస్య వై ।
యః సదారః సవిశ్వాస్యః తస్మాద్ దారాః పరాగతిః ॥

**(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - 74వ అధ్యాయము - 41,4,2,43,44 శ్లోకములు)**

పతికి ప్రాణంలా నడుచుకొనేది, అతనిలో సగభాగం, అతనికి ఉత్తమోత్తమమైన స్నేహితుడు భార్య. ధర్మార్థకామాల సాధనకు పతికి సతియే సాధనము. భార్య కలవారే యజ్ఞాది పుణ్యకార్యాలు చేయడానికి అర్హులు. భార్య కలవారే ఉత్తములైన గృహస్థులు, ఆనందాన్ని పొందగలవారు, భాగ్యవంతులు. భార్యలు భర్తలకు ఏకాంత సమయాలలో మిత్రులుగాను, ధర్మ కార్యాలలో తండ్రులుగాను, కష్టసమయాలలో తల్లులుగాను ప్రవర్తించి అన్ని విధాల తోడు నీడగా వుంటూ శాంతిని కలిగిస్తారు. అందువలన భార్యే భర్తకు ఉత్తమ గతి. భార్య భర్త కంటే ముందే చనిపోతే అతని రాకకోసం పరలోకంలో కూడా ఎదురు చూస్తుంది, భర్త ముందుగా చనిపోతే తానుకూడా అతని వెంట వెళ్తుంది. భార్య పాత్ర అంత గొప్పది. అటువంటి నీ భార్యను అయిన నన్ను నీవు అవమానించడము అధర్మము, అని శకుంతల దుష్యంతునితో పలికింది.

భార్య భర్తల అనుబంధం, భార్య యొక్క ఉత్తమోత్తమైన విధులు, భార్య యొక్క ప్రాధాన్యత, భార్య యొక్క విలువ తదితర ఎన్నో శకుంతల తెలిపిన గొప్ప విషయాలు నేటి సమాజంలోని, ప్రతి భార్య భర్తలకు ఎంతో ఆదర్శనీయం, ఆచరణీయం, సందేశాత్మకం.

**కులవంశ ప్రతిష్ఠాం హి పితరః పుత్రమ బ్రువన్ ।**
**ఉత్తమం సర్వ ధర్మాణాం తస్మాత్ పుత్రం న సంత్యజేత్ ॥**

**ధర్మకీర్త్యావహా నృణాం మనసః ప్రీతివర్ధనాః ।**
**త్రాయంతే నరకాజ్జాతాః పుత్రా ధర్మప్లవాన్ పితౄన్ ॥**

**(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - 74వ అధ్యాయము - 98,100 శ్లోకములు)**

కులానికి, వంశానికీ ప్రతిష్ఠలు కలిగించేవాడు పుత్రుడు. పుత్రుడిని కలిగి వుండడం అన్ని ధర్మాల్లోను ఉత్తమ ధర్మం. అందువలన పుత్రుని ఎప్పుడూ విడచిపెట్టకూడదు. పుత్రులు ధర్మాన్ని కీర్తిని తెచ్చేవారే కాదు, మనసుకు ప్రీతిని కలిగించేవారు, పితృదేవతలను పుణ్నామ నరకం నుంచి రక్షించేవారు కూడా. పుత్రుడు తండ్రియొక్క ప్రతిబింబము, ఆత్మ. అందువలన నీ పుత్రుడిని నీవు విడిచిపెట్టవద్దు, దగ్గరకు తీసుకొని ఆదరించు, నీవు ఇచ్చిన మాట ప్రకారం అతనిని ఈ రాజ్యానికి యువరాజుగా చేయి, అని శకుంతల దుష్యంతునితో పలికింది.

పుత్రుడికి తండ్రికి మధ్య వుండే అనుబంధం, ప్రేమ, వారిరువురి ధర్మాలు, కర్తవ్యాలను నేటి సమాజానికి వివరించి, వాటిని వారు ఆచరించాలనే సందేశాన్ని శకుంతల ఇచ్చింది.

**వరం కూపశతాద్ వాపీ వరం వాపీ శతాత్ క్రతుః ।**
**వరం క్రతుశతాత్ పుత్రః సత్యం పుత్రశతాద్ వరమ్ ॥**

**అశ్వమేధ సహస్రం చ సత్యం చ తులయా ధృతమ్ ।**
**అశ్వమేధ సహస్రాద్ధి సత్యమేవ విశిష్యతే ॥**

**సర్వవేదాధిగమనం సర్వ తీర్థావగాహనమ్ ।**
**సత్యం చ వచనం రాజన్ సమం వా స్యాన్న వాసమమ్ ॥**

**నాస్తి సత్యసమో ధర్మః న సత్యాద్ విద్యతే పరమ్ ।**
**నహి తీవ్రతరం కించి దనృతా దిహ విద్యతే ॥**

**(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - 74వ అధ్యాయము - 102,103,104,105 శ్లోకములు)**

మంచినీళ్ళు చేదుకునే నూరు బావులకన్నా ఒక దిగుడు బావి మేలు. అటువంటి దిగుడు బావులు నూరింటి కన్నా ఒక యజ్ఞం మేలు. అటువంటి నూరు యజ్ఞాల కన్నా ఒక పుత్రుడు మేలు. అటువంటి నూరు మంది పుత్రులు కన్నా ఒక సత్యవాక్యం మేలు. వేయి అశ్వమేధ యాగాల ఫలం కంటే ఒక్క సత్యవాక్యమే గొప్పది. అలాగే వేదాలన్నీ చదవడం, అన్ని తీర్థాల్లో స్నానమాచరించడం, ఇవేవి కూడా ఒక సత్యవాక్యంతో సమాన పుణ్య ఫలాన్ని ఇవ్వలేవని ఋషులు తెలిపారు. సత్యంతో సమానమైన ధర్మం లేదు, సత్యమే పరబ్రహ్మం, సత్యమే అన్నింటి కన్నా గొప్ప వ్రతం. కాబట్టి మన గాంధర్వ వివాహం వేళ కణ్వాశ్రమంలో నీవు నాకు చేసిన ప్రతిజ్ఞను గుర్తు చేసుకో, నీకే సత్యం బోధపడుతుంది, అని శకుంతల దుష్యంతుడితో పలికింది.

'సత్యం వద', అన్న ఆర్ష వాక్యాన్ని మించినది లేదని, సత్యాన్ని పలకడం కన్నా గొప్ప ధర్మం లేదని, సత్యాన్ని చెప్పడం ద్వారా వచ్చే పుణ్యఫలాన్ని మించినదేదీ లేదని, ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గ్రహించి సత్యాన్నే పలకాలని, శకుంతల నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. సాధారణంగా స్త్రీలు అసత్యమాడుతారు. నిన్ను ఇంతకు మునుపు నేను చూడలేదు. ఈ బాలునికి నాకు ఏ సంబంధమూ లేదు. నీ అసత్యాలు ఆపి వచ్చిన దారినే నీ ఆశ్రమానికి వెళ్ళు, అని దుష్యంతుడు శకుంతలతో కఠినంగా పలికాడు. నేను ఇంత చెప్పిన తర్వాత కూడా మీకు సత్యాన్ని కాక అసత్యము పలకడమే ఇష్టమైతే నేను వెళ్ళిపోతాను, మీ లాంటి వానితో కలసియుండడం నాకు కూడా ఇష్టం లేదు, అని శకుంతల ఆవేదనతో పలికి సభ నుండి వెళ్ళడానికి సిద్ధమైంది. అప్పుడు ఆకాశంలో నుంచి అశీరరవాణి ఇలా పలికింది.

"దుష్యంతా! శకుంతల చెప్పినదంతా యదార్థం, నీ భార్య అయిన ఆమె మహాపతివ్రత. మీ ఇరువురి పుత్రుడు అయిన అతను భరతుడనే పేరుతో ఈ రాజ్యాన్ని పరిపాలిస్తాడు, అతని పేరుతోనే ఈ దేశాన్ని భారతదేశం అని పిలుస్తారు, నీవు నీ భార్య పుత్రులను స్వీకరించు", అని పలికింది. దేవతలు పూల వర్షం కురిపించారు. దుష్యంతుడు తన పుత్రుడిని చెంతకు తీసుకొని ముద్దాడాడు. శకుంతలను పట్టపురాణిగా చేసుకొని గౌరవించి సన్మానించాడు. భరతునికి యువరాజుగా పట్టాభిషేకం జరిపించాడు.

సత్యమేవ జయతే, అన్న పెద్దల వాక్కు ప్రకారం, చివరకు సత్యమే గెలుస్తుందని, మనలో సత్యం, పతివ్రతాధర్మాలు వుంటే ప్రకృతి, దేవతలు, సత్యఫలము ఇవన్నీ మనల్ని రక్షిస్తాయని, అవే మనల్ని గెలిపిస్తాయనే సందేశాన్ని శకుంతల నేటి సమాజానికి అందించినది.

శకుంతల దుష్యంతుల వివాహానికి సాక్షులు ఒక్కరు కూడా లేరు, అందువలన భవిష్యత్తులో జరిగిన పరిణామాలు, ఆమె ఎదుర్కొన్న అవమానాలు మనిషి జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలలో సాక్షులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి ప్రాముఖ్యత ఏమిటో నేటి సమాజానికి తెలియచేశాయి. దుష్యంతుడు శకుంతలను నాలుగురోజుల్లో తన రాజ్యానికి పిలిపించుకొంటానని చెప్పిన మాటలు, పుట్టబోయే పుత్రుడినే రాజ్యానికి యువరాజుగా చేస్తానన్న ప్రతిజ్ఞ ఇవేవి రాజు నిలుపుకోలేదు. కాబట్టి ఎదుటి వారి మాటలను నమ్మి మోసపోతున్న నేటి సమాజంలోని ఎందరో కన్యలకు కనువిప్పు కలిగించే సందేశాన్నిస్తూ వుంది శకుంతల జీవితం. భర్త తన దగ్గరకు రాలేదనే బాధను దిగమింగుకొని, సింహాలతో ఆడుకొనేంత వీరుడిగా, ఈ దేశమే తన పుత్రుడి పేరుతో పిలవబడే అంత అనన్య సామాన్యమైన చక్రవర్తిగా, తన కొడుకును తీర్చిదిద్ది వీరమాతగా, గొప్ప మాతృమూర్తిగా నిలచి, నేటి సమాజంలోని తల్లుల బాధ్యత ఎంత గురుతురమైనదో శకుంతల తెలియచేసింది. దుష్యంతుని దగ్గరకు వెళ్ళితే నీవు ఎవరో నాకు తెలియదు

అన్న ఊహించని అతని మాటలకు అవమాన భారంతో కుమిలిపోయిందే కాని కృంగిపోలేదు, బేలగా మారలేదు. ధైర్యంగా ఎదుర్కొని అంతరాత్మ, భార్య, పుత్రుడు, సత్యము, ధర్మము వీటన్నింటిని ఆధారంగా నిజాన్ని నిరూపించడానికి ప్రయత్నించి విజయాన్ని సాధించడం ద్వారా, చిన్న చిన్న కష్టాలకు, అవమానాలకు కృంగిపోయి ఆత్మహత్యలు కూడా చేసుకొంటూ వున్న నేటి సమాజంలోని ఎందరో స్త్రీలకు స్ఫూర్తినిచ్చి, ధైర్యంగా వాటిని స్త్రీలు ఎదుర్కొని, విజయాలు సాధిస్తూ సాగిపోయి, తమ జీవితాలను ఆనందమయం చేసుకోవాలనే, సందేశాన్ని నేటి సమాజానికి శకుంతల ఇచ్చింది.

* * *

# సతీసావిత్రి

సావిత్రి దేవి వరపుత్రిక, మహా సాధ్వీమణి, నిశ్చలమైన బుద్ధి గలిగి ఒక్కసారి తీసుకున్న నిర్ణయానికి ఎటువంటి పరిస్థితులలోను కట్టుబడి ఉండెడి దృఢ సంకల్పురాలు, అంతఃపుర భోగాలను కాదని అడవిలోని ఆశ్రమ జీవితాన్ని ఎంచుకొన్న స్థితప్రజ్ఞురాలు, ధర్మమార్గాన్ని అనుసరించే ఉత్తమురాలు, సర్వ సుగుణాల నిధి, గొప్ప పతిభక్తి పరాయణురాలు, అత్తమామలను సేవించే ఉత్తమ ఇల్లాలు, గొప్ప తపస్సంపన్నురాలు, వ్రత సిద్ధి పొందిన మహాభక్తురాలు, గొప్ప వినయ విధేయ సంస్కార వంతురాలు, అత్యంత ధైర్యవంతురాలు, పట్టు వదలక పతి ప్రాణాలను సైతం తిరిగి యముడి వద్దనే సాధించుకొన్న మహా పతివ్రత, ధర్మార్థాలతో కూడిన ఎన్నో విషయాలను అర్థవంతంగా ఆ యమధర్మరాజుకే నివేదించి ఆయన మెప్పును పొందిన మహాజ్ఞాని, తన తెలివితేటలతో సమయ స్ఫూర్తితో భర్త ప్రాణాలను సాధించుకొన్న సహనశీలి మరియు విశేష ప్రతిభావంతురాలు, అటు మెట్టినింటిని ఇటు పుట్టినింటిని మరియు తన మాంగల్యాన్ని తన భక్తి, ధర్మనిరతి, పాతివ్రత్యంతో ఆదుకొన్న గొప్ప ఆదర్శ నారీమణి సతీ సావిత్రి.

మద్ర దేశాన్ని పరిపాలించే రాజు అశ్వపతి. ఇతను పరమ ధార్మికుడు, ధర్మాత్ముడు, సత్య సంధుడు, జితేంద్రియుడు, సహనశీలుడు, సర్వప్రాణుల హితాన్ని కోరేవాడు, ప్రజలు మెచ్చిన రాజు. కానీ అతనికి సంతానం కలగలేదు. ఆ రాజు సంతానాన్ని పొందడం కోసం, బ్రహ్మచర్యాన్ని స్వీకరించి, మితాహారాన్ని స్వీకరిస్తూ, తీవ్ర నియమాలను పాటిస్తూ, ప్రతిరోజు లక్షగాయత్రి హోమం చేస్తూ పద్దెనిమిది సంవత్సరాలు సావిత్రిదేవిని పూజించాడు. అనుగ్రహించిన ఆ దేవత దివ్యరూపంతో అగ్నిహోత్రం నుండి ఆవిర్భవించి నీ భక్తికి మెచ్చాను, ఇష్టమైన వరం కోరుకోమనింది. వంశవర్ధనులయిన కొడుకులు చాలామంది కావాలని అశ్వపతి రాజు

కోరుకొన్నాడు. అందుకు సావిత్రిదేవి ముందే నీకు పుత్రుల కొరకై నేను బ్రహ్మదేవునికి నివేదించాను. ఆయన అనుగ్రహం వలన త్వరలోనే నీకు ఈ లోకంలోనే తేజస్విని అయిన కూతురు పుడుతుంది. ఇక నీవు ఈ విషయాలు ఏమీ మాట్లాడకు, నీకు అంతా మంచే జరుగుతుందని సావిత్రిదేవి మాయమైంది. అశ్వపతి భార్య మాలవి మహా తేజస్విని అయిన పుత్రికకు జన్మనిచ్చింది.

**సావిత్ర్యా ప్రీతయా దత్తా సావిత్ర్యా హుతయా హ్యపి ।**
**సావిత్రీత్యేవ నామాస్యా చక్రుర్విప్రాస్తథా పితా ॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము - వనపర్వము - 293వ అధ్యాయము - 24వ శ్లోకము)**

గాయత్రీ మంత్ర హోమం చేసినందువలన ప్రసన్నురాలు అయిన సావిత్రి దేవి వరప్రసాదం వలన పుట్టిన బిడ్డ కాబట్టి, ఆ పుత్రికకు సావిత్రి అని అశ్వపతి రాజు పేరుపెట్టాడు. ఆ రాజకుమారి సావిత్రి పెరిగి పెద్దదై యుక్త వయస్సురాలయింది. తామరరేకుల వంటి విశాలమైన కన్నులు కలిగి, బంగారు బొమ్మవలె అఖండమైన తేజస్సుతో మెరిసిపోతున్న సావిత్రిని అందరూ దేవకన్య అని భావించారు.

ఒకనాడు తండ్రియైన అశ్వపతిరాజు తన కూతురు సావిత్రితో నీకు వివాహము చేయదగ్గ వయసు వచ్చింది, నీ గుణాలకు సరిపోయే భర్తను నీవు స్వయంగా అన్వేషించు, నీకు నచ్చిన వానిని గురించి నాకు తెలుపు, నేను పరిశీలించి కన్యాదానం చేస్తాను, నీ ఇష్టం వచ్చిన వానిని వరించు, అని తెలిపాడు.

**అప్రదాతా పితా వాచ్యః వాచ్యశ్చానుపయన్ పతిః ।**
**మృతే భర్తరి పుత్రశ్చ వాచ్యః మాతుర రక్షితా ॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము - వనపర్వము - అధ్యాయము 293- 35వ శ్లోకము)**

కూతురుకు పెండ్లి చేయని తండ్రి, సంగమకాలంలో భార్యను సమీపించని భర్త, భర్త మరణించిన తల్లిని రక్షించని కొడుకు నిందింపదగిన వారు, అని ధర్మశాస్త్రాలు చెపుతున్నాయి. కావున నేను దోషిని కాకుండా ఉండేలా నీవు నీకు నచ్చిన వరుణిడిని ఎంచుకో, నేను వివాహం చేస్తాను, అని అశ్వపతి రాజు తన కూతురు సావిత్రితో పలికాడు.

యుక్త వయస్కురాలైన కూతురికి వివాహం చేయడం తండ్రి బాధ్యత అని, భార్యను సుఖపెట్టడం భర్త ధర్మమని, భర్త మరణించిన తల్లిని రక్షించి ఆమెను జాగ్రత్తగా చూసుకోవడం కొడుకు ధర్మమని సతీసావిత్రి కథ నేటి సమాజంలోని తండ్రులకు, భర్తలకు, పుత్రులకు సందేశాన్నిచ్చింది.

సావిత్ర యాత్రకు తగిన అన్ని అశ్వపతి రాజు ఏర్పాట్లు చేశాడు. ఆమె తపోవనాలు, తీర్థాలు, ఇంకా అనేక చోట్ల ప్రయాణం చేసి దానాది పుణ్యకార్యక్రమాలను ఎన్నింటినో చేసి తిరిగి మద్రరాజైన తన తండ్రి అశ్వపతి వద్దకు వచ్చింది. ఆ సమయానికి ఆమె తండ్రి అక్కడికి విచ్చేసిన నారద మహర్షితో మాట్లాడుతూ ఉన్నాడు. ఆమె ఇరువురి పాదాలకు శిరసు వంచి నమస్కరించింది. తండ్రి మాటను శిరసావహించడం, పుణ్యప్రదేశాలను సందర్శిచడం, పుణ్యతీర్థాలలో స్నానాదులు ఆచరించడం, దానాది పుణ్య కార్యక్రమాలు చేయడం, వినయ విధేయలతో పెద్దల పాదాలకు నమస్కారము చేసే సంస్కారం కలిగి ఉండడం, ఇత్యాది శుభలక్షణాలు స్త్రీలు కలిగి వుండాలని సావిత్రి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

రాజా! నీ కుమార్తె ఎక్కడకు వెళ్ళింది?, ఎక్కడి నుండి వస్తోంది, యుక్త వయస్కురాలైన ఈమెకు వివాహం ఎప్పుడు జరిపిస్తావు?, అని నారదుడు అశ్వపతి రాజుని అడిగాడు. దేవర్షి! ఆ పని మీదనే వెళ్ళి ఆమె ఇప్పుడే వస్తూవుంది. ఆమె వరించిన భర్త గురించి వినండి, అని నారదునితో పలికి నీవు వరించిన వ్యక్తి వివరాలు తెలుపమని సావిత్రిని కోరాడు, అశ్వపతి రాజు. అందుకు సావిత్రి ఇలా తెలిపింది. శాల్వదేశంలో ద్యుమత్సేనుడనే

ధర్మాత్ముడు రాజ్యాన్ని పరిపాలిస్తూ వుండేవాడు. తరువాత కొంత కాలానికి అతడు అంధుడయ్యాడు. అతని కొడుకు బాలుడుగా వుండేవాడు. కాబట్టి పొరుగురాజు ఆయన రాజ్యాన్ని ఆక్రమించాడు. ఆ రాజు తన చిన్నబిడ్డ అయిన పుత్రుడితో , భార్యతో కలిసి వనవాసానికి వెళ్ళి తపస్సు చేసుకొంటూ జీవించసాగాడు. రాజ్యంలోని అంతఃపురంలో పుట్టి తపోవనంలో పెరిగిన అతని పుత్రుడి పేరు సత్యవంతుడు. ఆయనే నాకు తగిన భర్త అని నేను మనస్ఫూర్తిగా భావించి అతనిని వరించాను, అని సావిత్రి తెలిపింది.

అప్పుడు నారదుడు ఇలా తెలిపాడు. సత్యవంతుడికి గుర్రాలంటే ఇష్టం. మట్టితో గుర్రాల బొమ్మలు చేయడం, గుర్రాల బొమ్మలు గీయడం చేస్తూవుంటాడు. అందుకే అతనిని చిత్రాశ్వుడని కూడా అంటారు. అతని తల్లిదండ్రులు సత్యమునే పలుకుతారు, అందువలన అతనికి సత్యవంతుడని పేరుపెట్టారు.

**వివస్వానివ తేజస్వీ బృహస్పతి సమో మతా ।**
**మహేంద్ర ఇవ వీరశ్చ వసుధేవ సమన్వితః ॥**

**సాంకృతే రంతిదేవస్య స్వశక్త్యా దానతః సమః ।**
**బ్రహ్మణ్యః సత్యవాదీ చ శిబిరౌశీనరో యథా ॥**

**స దాంతః స మృదుః శూరః స సత్యః సంయతేంద్రియః ।**
**స మైత్రః సోనసూయశ్చ స హ్రీమాన్ ద్యుతిమాంశ్చ సః ॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము - వనపర్వము - 294వ అధ్యాయము -15,17,19 శ్లోకములు)**

సత్యవంతుడు సూర్యుని వలె తేజస్వి, బుద్ధిలో బృహస్పతి, మహేంద్రుని వంటి వీరుడు. భూమివలె సహనశీలి. దానంలో రంతిదేవుడితో సమానమైనవాడు. శిబిచక్రవర్తి వలె త్యాగశీలి. యయాతి వలె ఉదారుడు. చంద్రుని వలె చూడముచ్చటైనవాడు. రూపంలో అశ్విని దేవతవంటివాడు.

సత్యవాది, జితేంద్రియుడు, మృదుస్వభావి, శూరుడు, సత్య స్వరూపుడు, స్నేహశీలి, అసూయలేని వాడు, కానీ ఇన్ని సుగుణాలున్న ఆ సత్యవంతుడిలో ఒకే ఒక దోషముంది. అదేమంటే నేటి నుండి ఒక సంవత్సర కాలం లోపే అతను ఆయువు తీరి మరణిస్తాడు, అని నారదుడు అశ్వపతిరాజుకు, సావిత్రికి తెలియచేశాడు. అప్పుడు రాజు ఇన్ని సుగుణాలున్న అతను అల్పాయుస్సు వంతుడు కాబట్టి నీవు వేరే వరుణుని అన్వేషించుకో, అని సావిత్రితో పలికాడు.

**సకృదంశో నిపతతి సకృత్ కన్యా ప్రదీయతే ।**
**సకృదాహ దదానీతి త్రీణ్యేతాని సకృత్ సకృత్ ॥**

**దీర్ఘాయురథ వాల్పాయుః సగుణో నిర్గుణోపివా ।**
**సకృద్ వృతో మయా భర్తా న ద్వితీయం వృణోమ్యహమ్ ॥**

**మనసా నిశ్చయం కృత్వా తతో వాచాభిధీయతే ।**
**క్రియతే కర్మణా పశ్చాత్ ప్రమాణం మే మనస్తతః ॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము -వనపర్వము - 294వ అధ్యాయము - 26,27,28 శ్లోకములు)**

మనసులు ఒక్కసారే పంచుకొంటారు, ఒక్కసారే కన్యాదానం చేస్తారు, దానం చేస్తున్నాను అని దాత ఒక్కసారే చెపితే చాలు, ఈ మూడు ఒక్కొక్కసారే జరగాలి. సత్యవంతుడు దీర్ఘాయుస్సు కలవాడైనా, అల్పాయుస్సు కలవాడైనా, గుణవంతుడైనా, గుణహీనుడైనా నేను అతనిని భర్తగా వరించాను. ఒకసారి నేను అతనిని వరించిన తర్వాత మరొకరిని ఇక నేను వరించను. మనస్సులో నిశ్చయించుకొని, మాట చెప్పిన తరువాత క్రియారూపంలో పెడతాము. నాకు నామనస్సే ప్రమాణము అని, సావిత్రి ఆమె తండ్రితో పలికింది.

దానము ఇవ్వడం, కన్యాదానం చేయడం, భాగస్వామిని ఎంచుకోవడం ఇవన్నీ కూడా జీవితంలో ఒక్కసారి జరిగాక వాటిని వెనుకకు తీసుకోకూడదని, భాగస్వామిని వరించడం ఇత్యాది ముఖ్యమైన విషయాలను

మనసా వాచా కర్మణేనా త్రికరణ శుద్ధిగా చేయాలని, ఒక్కసారి తీసుకొన్న నిర్ణయానికి ఎటువంటి పరిస్థితులు ఎదురైనా కట్టుబడి వుండాలని, సావిత్రి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

నీ కుమార్తె సావిత్రి నిశ్చలబుద్ధి గలది, ధర్మమార్గాన్ని అనుసరించే ఉత్తమురాలు. ఆమెను ఏ రీతిగానూ వారించలేము. సత్యవంతుడులో వున్న సుగుణాలు మరే పురుషునిలోనూ లేవు. కాబట్టి నీ కుమార్తెను అతనికిచ్చి వివాహం చేయడం ఉత్తమం, అని నారదుడు అశ్వపతిరాజుకు చెప్పి స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు. మీ మాటను తప్పక నేను ఆచరిస్తాను అన్న అశ్వపతిరాజు, వివాహ సామాగ్రిని సమకూర్చుకొని, బ్రాహ్మణ, ఋత్విజ, పెద్దలందరినీ వెంటపెట్టుకొని ఒక శుభదినాన సావిత్రి సమేతంగా బయలుదేరి వెళ్ళి మేధ్యారణ్యంలోని ఆశ్రమంలో వున్న ద్యుమత్సేనుని కలిశాడు. అంధుడై దర్భాసనంపై ఆశ్రమంలో కూర్చొని వున్న ద్యుమత్సేనుని తగిన రీతిగా గౌరవించి, జాగ్రత్తగా మాట్లాడుతూ తనను తాను పరిచయం చేసుకొని, తన కూతురిని అతని పుత్రుడైన సత్యవంతునికిచ్చి వివాహం జరిపించి, ధర్మబద్ధంగా సావిత్రిని అతని కోడలుగా స్వీకరించమని, అశ్వపతి రాజు కోరాడు. మేము రాజ్యాన్ని కోల్పోయి వనవాసం చేస్తున్నాం. యమనియమాలతో తపోధర్మాన్ని పాటిస్తూవున్నాం. నీ కుమార్తె ఈ కష్టాలను ఎలా సహిస్తుంది? వనవాసానికి ఆమె తగదు, అని ద్యుమత్సేనుడు పలికాడు.

**సుఖం చ దుఃఖం చ భవాభవాత్మకం యదా విజానాతి సుతాహమేవ చ ।**
**న మద్విధే యుజ్యతి వాక్యమీదృశం వినిశ్చయే నాభిగతోస్మితే నృప॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము - వనపర్వము - 295వ అధ్యాయము - 10వ శ్లోకము)**

రాజా! సుఖదుఃఖాలు వస్తూవుంటాయి, పోతూవుంటాయి. ఈ విషయం నాకూ, నా కుమార్తెకూ తెలుసు. కాబట్టి మేము ఈ వివాహం జరగాలనే నిశ్చయం చేసుకొనియే వచ్చాము. కాదనవద్దు. వియ్యం పొందడానికి నాకు

నీవు తగినవాడవు. నేను నీకు తగిన వాడను. సజ్జనుడైన సత్యవంతునకు భార్యగా, నీ కోడలుగా నా కూతురును స్వీకరించు, అని అశ్వపతిరాజు ద్యుమత్సేనరాజుతో అన్నాడు. నేను మీ సంబంధాన్ని ఇంతకు మునుపే కోరుకొన్నాను. కానీ నేడు రాజ్యము లేదు, అడవులలో వున్నాము అని ఆలోచిస్తువున్నాను. సరే నీ ఇష్టం ప్రకారమే కానివ్వు, అని వివాహానికి అంగీకరించాడు ద్యుమత్సేనరాజు. సావిత్రి సత్యవంతుల వివాహం జరిపించారు. సర్వగుణాల నిధి అయిన సావిత్రిని భార్యగా పొంది సత్యవంతుడు సంతోషించాడు. తాను కోరుకొన్న భర్త లభించినందున సావిత్రి కూడా సంతోషించింది. అశ్వపతిరాజు వారి నుండి సెలవు తీసుకొని ఆశ్రమం వదిలి తన రాజ్యానికి వచ్చేశాడు.

**గతే పితరి సర్వాణి సంన్యస్యా భరణాని సా ।**
**జగహే వల్క లాన్యేవ వస్త్రం కాషాయమేవ చ ॥**

**పరిచారైర్గుణైశ్చవ ప్రశ్రయేణ దమేన చ ।**
**సర్వకామక్రియాభిశ్చ సర్వేషాం తుష్టిమాదధే ॥**

**శ్వశ్రూం శరీర సత్కారైః సర్వైరాచ్ఛాద నాదిభిః ।**
**శ్వశురం దేవసత్కారైః వాచః సంయమనేన చ ॥**

**తథైవ ప్రియవాదేన నైపుణేన శమేన చ ।**
**రహశ్చైవోపచారేణ భర్తారం పర్యతోషయేత్ ॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము - వనపర్వము - 295వ అధ్యాయము -18,19,20,21 శ్లోకములు)**

తండ్రి తన రాజ్యానికి వెళ్ళిపోగానే అరణ్యంలోని ఆశ్రమంలో అత్తగారింటవున్న సావిత్రి తన పట్టువస్త్రాలను, నగలను అన్నింటిని వదిలి, నార చీరలను, కాషాయ వస్త్రాలను ధరించింది. ఆమె అందరికీ నచ్చేటట్లు తన సేవలతో పనిచేయడం ద్వారా ఆశ్రమంలోని అందరికీ ఆనందాన్ని

కలిగించింది. శారీరక సేవలు, వస్త్రాభరణాలను అందించడం ఇత్యాది సేవలతో అత్తను సేవించింది. చక్కటి మాటలతో, దేవ సత్కారాలతో మామను సేవించింది. సావిత్రి అత్తమామలను సేవిస్తున్న తీరుకు వారిరువురూ ఎంతో ఆనంద పడ్డారు. తన భర్తైన సత్యవంతునితో ప్రియంగా మాట్లాడడం, నేర్పుతో, ఓర్పుతో ఏకాంతంలో అతనికి అనేక ఉపచర్యలు చేయడం వంటి అనేక సేవలతో సావిత్రి అతనిని ఎంతో సంతోష పెట్టింది. ఆ సజ్జనులు ఆ విధంగా ఆశ్రమంలో తపస్సు చేసుకొంటూ, ఆనందంగా జీవించసాగారు.

ఎవరి జీవితంలోనైనా సుఖదుఃఖాలు శాశ్వతంగా ఉండవని, వస్తూ పోతూవుంటాయని, ఉన్న చోటుకనుగుణంగా అలంకరణ వస్త్రధారణ ప్రతి ఒక్కరూ కలిగివుండాలని, తను ఉన్న చోటుని సంసారాన్ని చక్కదిద్ది, అందులోని సభ్యులందరి మనసులలో ఆనందాన్ని నింపగలిగేలా ప్రతిఒక్కరూ ప్రవర్తించాలని, అత్తమామలను సేవించి వారికి సంతోషాన్ని కలిగేలా నడుచుకోవడం ప్రతి కోడలు యొక్క కర్తవ్యమని, భర్తకు అన్ని విధాలా ఉపచర్యలు చేస్తూ అతనిని ఆనందపరచడం ప్రతిభార్య యొక్క విధి అని, సావిత్రి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. నారదుడు చెప్పిన మాట సావిత్రి మనసులో ఎప్పుడూ మెదులుతూవుండడం వలన ఆమె ప్రతి దినాన్ని లెక్కపెడుతూనే వుంది.

**చతుర్థేహని మర్తవ్యమ్ ఇతి సంచింత్య భామినీ ।**
**వ్రతం త్రిరాత్రముద్దిశ్య దివారాత్రం స్థితాభవత్ ॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము - వనపర్వము - 296వ అధ్యాయము - 3వ శ్లోకము)**

సత్యవంతుడు ఇక నాలుగు రోజులలో మరణిస్తాడనగా, సావిత్రి త్రిరాత్ర వ్రతాన్ని స్వీకరించి పగలు రేయి ఉపవాసంతో మూడురోజులు వ్రత దీక్ష పూర్తి చేసి, పూర్వాహ్ణంలో చేయవలసిన పనులన్నీ ముగించి అగ్ని ప్రజ్వలింపచేసి ఆహుతులనిచ్చింది. సమస్త బ్రాహ్మణులకు, పెద్దవారికి,

అత్తమామలకు వినయపూర్వకంగా నమస్కరించి సుమంగళీభవ అనే వారి అశీర్వాదాలను పొందింది. భుజాన గొడ్డలి పెట్టుకొని పండ్లు సమిధలు కొరకు బయలుదేరిన సత్యవంతుడితో మీరు ఒంటరిగా వెళ్ళవద్దు, నేనూ మీతో పాటే అడవికి వస్తానని సత్యవతి కోరింది. నీవెప్పుడూ అరణ్యానికి రాలేదు, పైగా ఇప్పుడు మూడు రోజులుగా ఉపవాసముల వలన నీరసంగా వున్నావు, నడవలేవు, అన్నాడు సత్యవంతుడు. నిన్ను వదిలి ఉండాలనిపించలేదు, నేను అలసిపోయి బలహీనంగా లేను, నీతో రావాలని ఉత్సాహంగా ఉన్నాను, అని సత్యవతి తెలిపింది. సత్యవంతుడు అంగీకరించాక, అత్తమామల అనుమతి తీసుకొని, అతనితో పాటు అరణ్యాల కెళ్లింది సావిత్రి. పుణ్యజలాలు ప్రవహించే నదులను, నిలువెల్లా పూసిన పుష్పాలను, మహాపర్వతాల అందాలను సావిత్రికి చూపిస్తూ సత్యవంతుడు ముందుకు కదులుతూ ఉన్నాడు. నారదుని మాట గుర్తుతెచ్చుకుంటూ నా భర్త మరణం జరగబోయే రోజు నేడే అని, ఒక వైపు భర్తను అనుసరిస్తూ, మరొకవైపు రాబోయే ఆ క్షణం కోసం అప్రమత్తతో నిరీక్షిస్తూ భర్తవెంట సాగుతూ వుంది సావిత్రి.

పెద్దలు చెప్పిన మాటను గుర్తుపెట్టుకోవాలని, ఎదుటివారికి బాధను కలిగించే అంశాలను వారికి చెప్పకూడదని, ఎంతటి కష్టానైనా ఎదుర్కోగల ధైర్యం, ఆపద నుండి గట్టు ఎక్కడానికి దైవ కృప కోసం చేయాల్సిన వ్రత ఉపవాసాది భక్తి కార్యాలు చేయడం, పెద్దల ఆశీర్వాదాలు పొందడం, ఆపదను ఎదుర్కోవడానికి అత్యంత అప్రమత్తతతో మెలగడం, ఇవన్నీ సమాజంలోని ప్రతి ఒక్కరకీ అవసరమనే సందేశాన్ని సావిత్రి ఇచ్చింది.

సత్యవంతుడు భార్య సహకారంతో పండ్లను ఏరి పాత్రను నింపాడు. సమిధల కోసంఎండిన చెట్టు కట్టెలు కొట్టసాగాడు. ఇంతలో అతనికి బాగా అలసట, తల నొప్పి, విపరీతమైన చెమటలు, ఒళ్ళంతా నొప్పులు కలిగాయి. సత్యవంతుడు సావిత్రి దగ్గరకొచ్చి తలను శూలాలతో గుచ్చుతూవున్నంత

బాధగా వుంది, నిలుచుకొనే శక్తి లేదు, కొంచెం సేపు నిదురించాలి, అన్నాడు. ఆమె నేలపై కూర్చొని అతని తలను తన ఒడిలో పెట్టుకొని నిదురపొమ్మన్నది. ఇంతలో తలపై కిరీటం, సూర్యతేజస్సు, నల్లని శరీరం, ఎర్రటి కళ్ళు, చేతిలో పాశం కలిగిన ఒక దివ్య పురుషుడు ఆమెకు కనిపించాడు. తన భర్త శిరస్సు మెల్లగా ప్రక్కకు జరిపి, లేచి నిలుచుకొని, వినయంగా చేతులు జోడించి నమస్కరించి, వినయంగా మీరెవరో దివ్య పురుషుల్లా వున్నారు, తమరికి అభ్యంతరం లేకపోతే మీరెవరో, ఎందుకు వచ్చారో దయతో తెలియచేయండి మహానుభావా!, అని సావిత్రి అతనిని కోరింది. నేను యముడిని, నీ భర్త ప్రాణాలను తీసుకు వెళ్ళడానికి వచ్చాను. నీవు పతివ్రతవు కాబట్టే నేను నీకు కనిపించాను, నీవు తపస్వినివి కాబట్టే నీతో మాట్లాడుతున్నాను అని పలికాడు. మనుషుల ప్రాణాలను తీసుకెళ్ళడానికి యమభటులు వస్తారని విన్నాను, తమరే స్వయంగా వచ్చారెందుకు స్వామీ?, అని సావిత్రి అడిగింది. ఈ సత్యవంతుడు ధర్మాత్ముడు, గుణ సాగరుడు, అందుకే నేనే స్వయంగా వచ్చానని తెలిపాడు యముడు. తర్వాత తన చేతిలోని పాశంతో సత్యవంతుని శరీరంలోని బొటనవ్రేలంత జీవుని యముడు బయటకు లాగాడు. వెంటనే సత్యవంతుని ఊపిరి ఆగి, శరీరంలో చలనాలు ఆగిపోయి, దేహంలో కాంతి మాయమైంది. సత్యవంతుని ప్రాణాలు తీసుకొని యమధర్మరాజు దక్షిణం వైపు బయలుదేరాడు. సావిత్రి కూడా ఎంతో దుఃఖంతో యముడిని అనుసరించింది. ఆమె సౌభాగ్యవతి, పతివ్రత, వ్రతసిద్ధిని పొంది ఉన్నది కాబట్టి, ఆమె యమునితో పాటు వెళ్ళ గలిగింది. సావిత్రీ! నీ భర్త వెంట నీవు రాగలిగినంత దూరం వచ్చావు. ఋణం తీరిపోయింది. ఇక వెనుతిరిగి వెళ్ళి ఇతనికి దహన సంస్కారాదిక్రియలను జరిపించు, అని యముడు పలికాడు.

**యత్ర మే నీయతే భర్తా స్వయం వా యత్ర గచ్ఛతి ।**
**మయా చ తత్ర గంతవ్యమ్ ఏష ధర్మః సనాతనః ॥**

**తపసా గురుభక్త్యా చ భర్తుః స్నేహాద్ వ్రతేన చ।**
**తవ చైవ ప్రసాదేన న మే ప్రతిహతా గతిః ॥**

**ప్రాహుః సాప్తపదం మైత్రం బుధాస్తత్త్వార్థ దర్శినః ।**
**మిత్రతాం చ పురస్కృత్య కించిద్ వక్ష్యామి తచ్ఛృణు ॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము - వనపర్వము - 297వ అధ్యాయము - 21,22,23 శ్లోకములు)**

నా భర్త ఎక్కడకు వెళ్ళినా, ఎక్కడకు తీసికొని పోబడినా నేను కూడా అక్కడకు వెళ్ళాలి, ఇది సనాతన ధర్మం. తపస్సు వలనా, గురుభక్తి వలనా, భర్త ప్రేమ వలనా, వ్రతసిద్ధి వలనా, నీ అనుగ్రహం వలనా కూడా నా దారి అడ్డగింపబడదు. ఏడడుగులు నడకతో ఎవరితోనైనా స్నేహం ఏర్పడుతుందంటారు. నేను మీతో చాలా దూరం ప్రయాణం చేసి వచ్చాను. తద్వారా ఏర్పడ్డ మైత్రి వలన నేను చెప్పేది కొంచెం దయచేసి విను యమధర్మరాజా, అని సావిత్రి పలికింది.

మార్గాలన్నింటిలోనికి ముఖ్యమైనది ధర్మమార్గము. జితేంద్రియులు ధర్మాన్ని శ్రద్ధగా పాటిస్తూ జ్ఞానాన్ని పొందగలగడాన్నే ధర్మ సిద్ధి పొందారు అని అంటారు. ఆ ధర్మ సిద్ధిని పొందడానికి ఆచరించవలసినవి ఆశ్రమ ధర్మాలు. ఒక్క ఆశ్రమ ధర్మాన్ని శ్రద్ధగా పాటించినా చాలు జ్ఞానాన్ని, ధర్మసిద్ధిని మానవులు పొందుతారు. ఆమె మాటలకు సంతోషించిన యముడు, నీ భర్త ప్రాణం తప్ప మరేదైనా కోరుకో, ఇస్తాను అని పలికాడు. కంటిచూపు పోగొట్టుకోవడం వలన రాజ్యాన్ని కూడా పోగొట్టుకున్న నా మామగారు ద్యుమత్సేనునికి నీ అనుగ్రహం వలన కంటి చూపు వచ్చేలా చేయి స్వామీ, అతను సూర్యాగ్ని సమానుడై వెలుగొందాలి, అని సావిత్రి కోరుకుంది. నీవు కోరిన వరాన్ని నీకు ఇస్తున్నాను, శ్రమపడి ఇంతదూరం వచ్చినది చాలు, ఇక తిరిగివెళ్లు, అని యముడు పలికాడు.

**సతాం సకృత్సంగత మీప్సితం పరం తతః వరం మిత్రమితి ప్రచక్షతే।**
**న చాఫలం సత్పురుషేణ సంగతం తతః సతాం సన్నివసేత్ సమాగమే॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము- వనపర్వము - 297వ అధ్యాయం - 30వ శ్లోకము)**

సజ్జనులతో ఒక్కసారి కలవటం కూడా చాలా ఆనందంగా వుంటుంది. మంచివారితో స్నేహం అంతకన్నా గొప్పగా వుంటుంది. అది ఎప్పటికి నిరర్థకం కాదు. అందుకే ఎప్పుడూ సజ్జన సాంగత్యం కలిగి వుండాలి, అని సావిత్రి యమునితో పలికింది.

నీవు చెప్పిన హితోక్తి పండితుల బుద్ధికి కూడా పదును పెట్టగలదు, నాకు బాగా నచ్చింది. నీ భర్త ప్రాణాలు కాకుండా మరేదైనా వరం కోరుకో, అని యమధర్మరాజు అన్నాడు. ధీమంతుడైన నా మామగారి రాజ్యాన్ని ఇతరులు అపహరించారు. ఆయన తిరిగి ఆ రాజ్యాన్ని పొందాలి, పూజ్యులైన నా మామగారు ఎప్పుడూ స్వధర్మాన్ని విడువకూడదు, అనే వరాన్ని ప్రసాదించమని, సావిత్రి కోరింది. యముడు ఆ వరాన్ని ప్రసాదించి, ఇక శ్రమపడకు, వెనుకకు తిరిగి వెళ్ళమని సావిత్రిని యముడు కోరాడు. దేవా! ప్రజలందరిని ధర్మబద్ధంగా ఉంచుతున్నావు, ఆయువు తీరిన వారి ప్రాణాలను గడువు ప్రకారం తీసికొని పోతున్నావు, అందుకే నిన్ను ధర్మ దేవత అయిన యమధర్మరాజు అని అంటున్నారు. మరొక మాట చెపుతాను. దయచేసి వినండి, అని సావిత్రి పలికింది.

**అద్రోహః సర్వభూతేషు కర్మణా మనసా గిరా ।**
**అనుగ్రహశ్చ దానం చ సతాం ధర్మః సనాతనః ॥**

**ఏవం ప్రాయశ్చ లోకోయం మనుష్యాః శక్తి పేశలాః ।**
**సంతస్త్వే వాప్యమిత్రేషు దయాం ప్రాప్తేషు కుర్వతే ॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము - వనపర్వము - 297వ అధ్యాయము - 35,36 శ్లోకములు)**

ధర్మాలలో త్రికరణశుద్ధి ముఖ్యమైనది. మనస్సులో ఆలోచించిందే పలకాలి, పలికిందే ఆచరించాలి. సర్వప్రాణులకు మనసా, వాచా, కర్మణా ద్రోహం చేయకుండడం, మంచి చేయడం, దానం చేయడం సత్పురుషుల యొక్క సనాతన ధర్మం. అల్పాయుష్కులైన మనుషులే కాదు శత్రువులు కూడా మీ వంటి సజ్జనులను శరణు కోరితే దయచూపుతారు, అని సావిత్రి యమునితో పలికింది.

దప్పికగా ఉన్నవానికి చల్లటి నీరు ఉపశమనాన్ని కలిగించినట్లు నీ మాటలు నాకు ఎంతో తృప్తిని కలిగించాయి. సత్యవంతుని ప్రాణులు తప్ప మరేదయినా వరం కోరుకో, అన్నాడు సావిత్రితో యముడు. మా నాన్న గారికి పుత్రులు లేరు. వారికి గొప్ప పుత్రుల్ని వందమందిని ప్రసాదించి ఆయన వంశపరంపర కొనసాగేలా వరాన్ని ప్రసాదించమని, సావిత్రి కోరింది. ఆ వరాన్ని ప్రసాదించిన యముడు, నీ కోరిక తీరినది కదా! చాలా దూరం వచ్చావు, ఇక మరలిపో, అని సావిత్రితో పలికాడు. నా భర్త సన్నిధిలో నడుస్తువున్నాను, ఇది నాకు దూరమేమీ కాదు దయతో నా మరొక్క మాట ఆలకించండి, అని సావిత్రి పలికింది. తమరు సూర్యుని పుత్రులు కాబట్టి తమరిని వైవస్వతుడంటారు. ప్రజలను సమాన ధర్మంతో పాలిస్తారు కాబట్టి ధర్మరాజత్వం మీ సుగుణం.

**ఆత్మన్యపి న విశ్వాసః తథా భవతి సత్సుయః ।**
**తస్మాత్ సత్సు విశేషేణ సర్వః ప్రణయమిచ్ఛతి ॥**

**సౌహృదాత్ సర్వభూతానాం విశ్వాసో నామ జాయతే ।**
**తస్మాత్ సత్సు విశేషణ విశ్వాసం కురుతే జనః ॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము - వనపర్వము - 297వఅధ్యాయము - 42,43 శ్లోకములు)**

మనుష్యులకు మంచివారిపై నమ్మకం ఎక్కువ. అందుకే మంచివారిని అందరూ ప్రేమిస్తారు. సర్వ ప్రాణులకు సౌహార్దం వలననే విశ్వాస

మేర్పడుతుంది. కాబట్టి అందరూ మంచి వారుగా జీవించడమే ప్రధానం, అని సావిత్రి యముడితో పలికింది. నీవన్న మాట విని నేను ఎంతో ఆనందించాను. నీ పతి సత్యవంతుని ప్రాణాలు తప్ప మరేదైనా నాలుగవ వరం కోరుకో అని యముడు అన్నాడు. వంశాన్ని నిలిపే వందమంది గొప్ప పుత్రులను నాకూ సత్యవంతుడికీ ప్రసాదించండి స్వామి!, అని సావిత్రి కోరింది. ఆ వరాన్ని కూడా ప్రసాదించాను, ఇక తిరిగి వెళ్లు, అని యముడు సావిత్రితో పలికాడు.

సత్పురుషులు సత్యబలంతో సూర్యుని నడిపించగలరు, తపస్సుతో భూమిని భరించగలరు, భూత భవిష్యత్తుకు సత్పురుషులే గతి. వారు సర్వరక్షకులు, అని సావిత్రి యమునితో పలికింది. పతివ్రతా! నీవు ధర్మ సమ్మతంగా, అర్థవంతంగా చక్కగా మాట్లాడే కొద్దీ నాకు నీపై ఉత్తమభక్తి పెరుగుతూ ఉంది. సాటిలేని వరమేదైనా కోరుకో అని యముడు అన్నాడు.

**న కామయే భర్తృవినాకృతా సుఖం న కామయే భర్తృవినాకృతా దివమ్।**
**న కామయే భర్తృవినాకృతా శ్రియం న భర్తృహీనా వ్యవసామి జీవితుమ్॥**

**వరాతి సర్గః శతపుత్రతా మమ త్వయైవ దత్తో హ్రియతే చ మే పతిః।**
**వరం వృణే జీవతు సత్యవానయం తవైవ సత్యం వచనం భవిష్యతి ॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము - వనపర్వము- 297వ అధ్యాయము - 53,54 శ్లోకములు)**

భర్త లేకపోతే నాకు సుఖం అక్కరలేదు. స్వర్గ మక్కరలేదు. సంపద అక్కరలేదు. భర్త లేకుండా బ్రతకాలని కూడా లేదు. నాకు నూరుమంది కొడుకులు పుడుతారని మీరు వరమిచ్చారు. కానీ తమరు నాభర్త ప్రాణాలను తీసుకొని వెళుతున్నారు. మీరు నాకు ఇచ్చిన నాలుగవ వరం నెరవేరాలంటే మా దాంపత్య జీవనం కోసం నా భర్త జీవించే వుండాలి. అందువలన దయచేసి నా భర్త సత్యవంతుని బ్రతికించు స్వామి, అని సావిత్రి యముడిని ప్రార్థించింది.

ఆనంద ఆశ్చర్యాలకు గురైన యమధర్మరాజు సావిత్రి కోరికను మన్నించి, యమపాశాన్ని విడిపించాడు. సత్యవంతుడిని బ్రతికించాడు. ధర్మార్థాలతో కూడిన నీ మాటలకు ఆనందించాను. సాధ్వీ! సత్యవంతునకు క్షేమం, మనోరథ సిద్ధి కలుగుతాయి. నీతో కలసి నాలుగువందల సంవత్సరాలు జీవిస్తాడు. యాగాలు చేసి, ధర్మబద్ధంగా జీవించి, లోకంలో ప్రసిద్ధి పొందగలడు. మీకు వందమంది కొడుకులు పుట్టి నీ భర్త ప్రసిద్ధి చెందుతాడని చెప్పి, ఆమె కోరిన వరాలన్ని ఇచ్చి, ఆమెను వెనుకకు మరల్చి, యముడు తన లోకానికి వెళ్లిపోయాడు. సావిత్రి భర్త ప్రాణాలను పొంది, భర్త దేహమున్న చోటికి వెళ్లింది. భర్త తలను ఒడిలో పెట్టుకొన్నది. సత్యవంతుడు నిద్ర నుండి మేలు కొన్న వాడిలా లేచి, చాలాసేపు నిదురించాను అన్నాడు. రాత్రి అవుతూ వుంది, తల్లిదండ్రుల దగ్గరకెళ్లాలి, వారు ఎదురుచూస్తూ వుంటారు, అని సత్యవంతుడు అన్నాడు. ఇద్దరూ రాత్రివేళలోనే ఆశ్రమానికి చేరారు. సావిత్రి మామగారికి కంటిచూపు వచ్చింది. సావిత్రి జరిగినదంతా వారికి వివరించినది. అంధకారమనే ఊబిలో మునిగిపోతున్న ద్యుమత్సేనుని వంశాన్ని సావిత్రి తన సౌశీల్యవ్రత పుణ్యంతో కాపాడిందని అందరూ ప్రశంసించారు. ఉదయమే ద్యమత్సేనుని వద్దకు అతని రాజ్యం నుండి ప్రజలు వచ్చి శత్రువైన రాజు అమాత్యునిచే చంపబడ్డాడని, మిగిలిన శత్రువులు పారిపోయారని ఇక ఆ రాజ్యానికి ద్యుమత్సేనుడే రాజు కావాలని వారందరూ సావిత్రి మామగారిని ప్రార్థించారు. ఆశ్రమం నుండి అందరి వద్ద శెలవు తీసుకొని కుటుంబ సమేతంగా అతను రాజ్యానికి బయలుదేరి వెళ్ళాడు. ద్యుమత్సేనునికి రాజుగా, సత్యవంతుడికి యువరాజుగా పట్టాభిషేకం జరిగింది. సత్యవంతుడు సావిత్రి ఆనందంగా కాపురం చేసి వందమంది పుత్రులను కన్నారు. సావిత్రి తండ్రియైన మద్రదేశాధిపతి అశ్వపతికి కూడా నూరుమంది కుమారులు కలిగారు.

**ఏవమాత్మా పితా మాతా శ్వశ్రూః శ్వశుర ఏవ చ ।**
**భర్తుః కులం చ సావిత్ర్యా సర్వం కృచ్ఛ్రాత్ సముద్ధృతమ్ ॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము - వనపర్వము - 300వ అధ్యాయము - 14వ శ్లోకము)**

ఈ విధంగా సతీ సావిత్రి తనను, తన తండ్రిని, తన తల్లిని, తన అత్తమామలను, భర్తను, వారి వంశాల్ని కూడా ఆపద నుండి గట్టెక్కించింది, అని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు మహాభారతంలోని వన పర్వంలో తెలియచేశాడు.

పాతివ్రత్యం, తపశ్శక్తి, వ్రతసిద్ధి, గురుభక్తి, దైవ అనుగ్రహం పొందిన పుణ్యాత్ములు యముడిని సైతం దర్శించి, మాట్లాడి, అనుసరించగలరని, ఏడడుగులు కలసి ఎవరితో నడిచినా స్నేహం ఏర్పడుతుందని, బ్రహ్మచర్యం, గృహస్థం, వాన ప్రస్తానం, సన్యాసం వీనిలో ఏ ఒక్క ఆశ్రమ ధర్మాన్ని శ్రద్ధగా ఆచరించినా జ్ఞానము, ధర్మసిద్ది ఈ రెండింటిని మనుషులు పొందగలరని, సావిత్రి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. ఆనందాన్ని ప్రయోజనాన్ని కలిగించే సజ్జన సాంగత్యాన్ని అందరూ కలిగి ఉండాలని, అందరూ మనసా వాచా కర్మణా త్రికరణశుద్ధిగా ఇతరులకు మంచిని, దానాలను చేయాలని, చెడు చేయకూడదని సావిత్రి సమాజానికి సందేశానిచ్చింది. మంచివారిపై మనుష్యులకు ప్రేమ, నమ్మకం ఎక్కువని, అందుకే అందరూ మంచివారుగా జీవించాలని, ధర్మాన్ని ఆచరించాలని, సత్పురుషులు, సర్వ సమర్థులు మరియు సర్వరక్షకులు అని, అందరూ సత్పురుషులుగా తమను తాము మలుచుకొని జీవనాన్ని సాగించాలని, సావిత్రి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. తనకు దైవం వరాలను ఇచ్చినప్పుడు, మొదట మామగారి చూపు మరియు రాజ్యం, తర్వాత తండ్రిగారికి పుత్ర సంతానం కోరుకొని, చివరలో తనకూ భర్తకు సంతానం కోరుకోవడంలో సావిత్రి సంస్కారం, గొప్ప వ్యక్తిత్వం వ్యక్తమవుతూ ఉంది.

వివాహితకు మొదట మెట్టినింట సౌభాగ్యం, తరువాత పుట్టినింట సౌభాగ్యం, తరువాత తన సౌభాగ్యం ముఖ్యమని సమున్నతమైన వ్యక్తిత్వంతో కూడిన సందేశాన్ని సమాజానికి సావిత్రి ఇచ్చింది. యముడు నీ భర్త ప్రాణాలు తప్ప ఇంకేదైనా వరాలు కోరుకొమ్మనప్పుడు, తనకు తన భర్తకు పుత్ర సంతానం కావాలని కోరుకొని, ఆ వరాన్ని ప్రసాదించాక, భర్త జీవించి వుండకపోతే సంతానము, ఆ వరము ఎలా సిద్ధిస్తుంది?, అని ప్రశ్నించి, తన తెలివి తేటలు, సమయస్ఫూర్తితో యమధర్మరాజు అంతటివాడిని మెప్పించి, తన భర్త ప్రాణాలు తిరిగి పొందగలగడం ద్వారా, ధైర్యం, తెలివితేటలు,సమయస్ఫూర్తి, సూక్ష్మబుద్ధి ద్వారా ఎంతటి కష్టానైనా అధిగమించవచ్చనే సందేశాన్ని సావిత్రి నేటి సమాజానికిచ్చింది. యముడినే మెప్పించి తన భర్త ప్రాణాలనే కాదు, మామగారికి చూపు మరియు రాజ్యం, నాన్నగారికి పుత్రసంతానం, తనకూ భర్తకు పుత్ర సంతానం వరాలుగా పొంది, సావిత్రి ఇటు అత్తమామలను, అటు తల్లిదండ్రులను, తనను, భర్తను, అందరినీ కూడా, ఆపదల నుండి గట్టెక్కించడం ద్వారా ఆమె సతీ సావిత్రిగా ప్రసిద్ధిచెంది, ఆదర్శమూర్తి అయిన మహా పతివ్రతగా నిలచి నేటి సమాజానికి ఆచరణీయమైన ఎన్నో సందేశాలను సావిత్రి అందించింది.

* * *

# దమయంతి

**కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్యచ ।**
**ఋతు పర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనమ్ ॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము - వనపర్వము - 79వ అధ్యాయము - 10వ శ్లోకము)**

నలుడు, దమయంతి, కర్కోటకుడు, ఋతుపర్ణుడు మహాభారతంలోని నలోపాఖ్యానంలో కీలక వ్యక్తులు. వీరిని కీర్తిస్తే కలి నాశనము జరుగుతుంది అన్నది జగత్ప్రసిద్ధి. దమయంతి కథ చదివినా, వినినా మానవులకు కలి బాధల నుండి విముక్తి కలుగుతుంది. అంతటి పతివ్రతా శిరోమణి దమయంతి.

రామాయణంలోని సీతాదేవి కథకి మహాభారతంలోని దమయంతి కథకి కొన్ని పోలికలు కనిపిస్తాయి. సీతలాగే దమయంతి కూడా భర్త వద్దంటున్నా అతనితో పాటు అరణ్యాలకు వెళ్ళింది. రావణుడు సీతను కోరుకొని దక్కకపోవడం వలన ఆ దంపతులను ఎన్నో కష్టాలకు గురిచేసినట్లే, కలిపురుషుడు దమయంతిని పెండ్లి చేసుకోవాలన్న కోరిక తీరకపోవడం వలన అసూయతో ఆ దంపతులను ఎన్నో కష్టాలకు గురిచేశాడు. సీత, దమయంతి ఇరువురూ కూడా తమ పాతివ్రత్య నిరూపణ కోసం ప్రతిజ్ఞతో కూడిన శపథాలు చేశారు. సీత రావణ వధ అనంతరం అగ్ని ప్రవేశం చేసే వేళ తర్వాత లవకుశల రామకథాగానం అనంతరం అయోధ్యలో భూమాతను ప్రార్థించే వేళ ప్రతిజ్ఞలు చేయగా, దమయంతి తనను బలాత్కారం చేయబోయిన కిరాతుణ్ణి శపించే వేళ తర్వాత నలుడిని రప్పించుటకు తనకు రెండవ వివాహం స్వయంవరం ఎత్తుగడ మాత్రమే అని తన భర్త ఎదుట నిరూపణ వేళ ప్రతిజ్ఞలు చేశారు. అందుకే రామాయణాన్ని సీతాయనం (సీతా చరితం) అని వాల్మీకి అన్నట్లే, నలోపాఖ్యానాన్ని కూడా దమయంత్యు పాఖ్యానమని (దమయంతి చరితం) అనవచ్చును.

శ్రీ మహాభారతంలోని అరణ్య పర్వములోని నలోపాఖ్యానము నందు నల దమయంతుల కథ చెప్పబడినది. అరణ్యవాస కాలంలో అడవులలో ఉన్న పాండవుల దగ్గరకు బృహదశ్వ మహర్షి వచ్చాడు. ధర్మరాజు ఆ మహర్షిని అతిథి మర్యాదలతో పూజించి, ఆసీనుని చేసి, తన వృత్తాంతాన్ని వివరించి, తనకంటే దురదృష్టవంతుడు, దుఃఖశాలి లోకంలో ఎవరైనా ఉన్నారా? అని ప్రశ్నించాడు. అప్పుడు ఆ మహర్షి నీకంటే ఎక్కువ కష్టాలు పొందిన రాజు ఒకరు ఉన్నారు, అని తెలిపాడు. అతని కథను తెలుపమని ధర్మరాజు కోరగా, ఆ మహర్షి నలదమయంతుల కథను పాండవులకు తెలిపాడు.

వీరసేనుడి పుత్రుడైన నలుడు నిషధరాజ్యానికి రాజు. షట్చక్రవర్తులలో ఒకడైన నలుడు. గొప్ప గుణవంతుడు, పరమ సుందరుడు, సత్యవాది, జితేంద్రియుడు, వేదజ్ఞుడు, సర్వులకూ ఇష్టుడు, గొప్ప అస్త్రవిద్యా నిపుణుడు, మిక్కిలి పరాక్రమవంతుడు, జూదం ఆడటంలో ప్రీతికలవాడు.

విదర్భ రాజ్యానికి రాజు భీమకుడు. సర్వ సుగుణాది సంపన్నుడైన ఆరాజుకు సంతానం లేకపోవడంతో దమనుడనే మహర్షిని సేవించగా ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు జన్మించారు. ఆ మహర్షి పేరు వచ్చేలా ఆ నలుగురికి దమయంతి, దముడు, దాంతుడు, దమనుడు అని నామకరణం చేసి వారిని అల్లారు ముద్దుగా పెంచాడు.

**దమయంతీ తు రూపేణ తేజసా యశసా శ్రియా ।**
**సౌభాగ్యేన చ లోకేషు యశః ప్రాప సుమధ్యమా ॥**
**(శ్రీమహాభారతము - 2వ భాగము - వన పర్యము - 53వ అధ్యాయము - 10వ శ్లోకము)**

దమయంతి విశాలమైన నేత్రాలు, అద్భుతమైన రూపలావణ్యాలతో లక్ష్మీ సమానమైన సౌందర్యాన్ని కలిగి ఉండి, త్రిలోకాల్లో ఎక్కడా ఇంతటి

అందగత్తె వుండదేమో అని కీర్తి పొందింది. సకల సద్గుణాల రాశియైన దమయంతి యుక్త వయస్సుకు చేరుకొంది.

విదర్భరాజ్యం నుండి నిషధ దేశానికి వచ్చినవారు నలమహారాజు ఎదుట దమయంతి రూపగుణాలను వర్ణిస్తూ వుండేవారు. అలాగే నిషధరాజ్యం నుండి విదర్భ దేశానికి వచ్చినవారు దమయంతి ఎదుట నలమహారాజు రూప సుగుణాలను వర్ణిస్తూ ఉండేవారు. దాని వలన ఇరువురి హృదయాలలో పరస్పర ఇష్టం, ప్రేమ చిగురించాయి.

ఒకరోజు నలుడు ఉద్యానవనంలో తిరుగుతూ వుండగా ఓ హంసల గుంపు అక్కడ ఉండడం చూసిన అతడు వాటి అందానికి ముచ్చటపడి వాటిలో ఒకదానిని పట్టుకొన్నాడు. మిగిలిన హంసలు ఆ హంస కోసం ఆకాశంలోనే తిరగసాగాయి. పట్టుబడ్డ ఆ హంస మానవ భాషలో నలుడితో తనను విడిచి పెడితే ప్రత్యుపకారంగా దమయంతి చెంతకెళ్ళి అతని గుణగణాలు వివరించి ఆమె నలుని వరించేలా చేస్తాను, అని పలికింది. నలుడు సంతోషంగా ఆ హంసను వదిలిపెట్టాడు. ఆ హంసతో కూడిన హంసల గుంపు దమయంతి విహరిస్తున్న ఉద్యానవనంలో వాలాయి. వాటిని చూసి సంతోషించిన ఆమె, పట్టుకోవడానికి ప్రయత్నించగా నలునికి చిక్కిన హంసే ఆమెకు అందుబాటులోకి వచ్చి కావాలనే పట్టుబడింది. అప్పుడు ఆ హంస దమయంతితో ఇలా పలికింది.

నలుడు అశ్వినీ కుమారుని వలె ఎంతో అందగాడు, మానవులలో అతనిని మించిన అందగాడు లేడు. సాక్షాత్తు మన్మథుడిలా వుంటుంది అతని రూపం. నీవు అతనికి అర్థాంగివి అయితే నీరూపం, జన్మ రెండూ ధన్యమవుతాయి. మేము దేవతలను, గంధర్వులను, మానవులను, నాగులను, రాక్షసులను అందరినీ చూశాము, కాని నలుడు అంతటి అందగాడు వారి ఎవరిలోనూ లేడు. నీవు స్త్రీలలో రత్నానివి అయితే, అతడు పురుషులకు భూషణం. మీ ఇద్దరి వివాహం జరిగితే అది వివాహ వ్యవస్థకే శోభను

కలిగిస్తుంది, అని హంస దమయంతితో పలికింది. అందుకు ఎంతో ఆనందపడిన ఆమె తన గురించి కూడా నలునికి ఇలాగే చెప్పమని హంసను కోరింది. అలాగేనన్న ఆ హంస తిరిగి నలుని వద్దకు వచ్చి దమయంతికి సంబంధించిన అన్ని విషయాలు వివరించింది. ఆ హంస రాయబారంతో వారిరువురిలోని ప్రేమ మరింతగా పెరిగింది.

దమయంతి నలుని గురించిన ఆలోచనలతో సరిగా నిద్రాహారాలు తీసుకోకపోవడం గమనించిన ఆమె చెలికత్తెలు, ఆమె తండ్రియైన భీమ మహారాజుకు ఆమె ప్రేమ వృత్తాంతాన్ని గురించి తెలియచేశారు. రాజు ఆమెకు వివాహం జరిపించవలసిన సమయము ఆసన్నమైనదని గ్రహించి దమయంతి స్వయంవరాన్ని చాటించాడు. అది విన్న రాజులందరూ అందంగా అలంకరించుకొని తమ తమ రథ, అశ్వ, గజ బలాలతో విదర్భ రాజ్యానికి బయలుదేరారు. దమయంతి స్వయంవరానికి ఆ విధంగా బయలుదేరిన రాజుల యొక్క గజ, తురగ, రథ శబ్దాలు భూమండలమంతా వినిపించాయంట. దేవ ఋషులైన నారదుడు, పర్వతుడి ద్వారా ఈ వార్త దేవతలకు కూడా తెలియడంతో దిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు వీరు నలుగురు దేవతలు కూడా దమయంతి స్వయంవరానికి బయలుదేరారు. అదే సమయంలో నలమహారాజు కూడా స్వయంవరానికి బయలుదేరాడు.

మన్మథునిలా రూపసౌందర్యం కలిగి, సూర్యునిలా ప్రకాశిస్తూ వున్న నలుడిని మార్గమధ్యలో చూసిన ఆ దేవతలు అతని దగ్గరకొచ్చి, నీవు దూతవై మాకు సహాయం చేయమని కోరారు. అందుకు అంగీకరించిన నలుడు, ఏ విషయంలో వారికి సహాయం చేయాలో తెల్పమని అడిగాడు. అప్పుడు వారు మేము దేవతలము, ఇంద్రాగ్ని వరుణ యములము, దమయంతి స్వయంవరానికి వచ్చాము, నీవు మా దూతగా ఆమె వద్దకు వెళ్ళి, మేము ఆమెను వివాహమాడాలనుకొంటున్నాము అని తెలిపి, మా గుణ విశేషాలను

వివరించి, మాలో ఎవరు నచ్చితే వారిని వివాహం చేసుకోమని ఆమెకు చెప్పి ఒప్పించమని, నలుడిని ఆ దేవతలు కోరారు. అది విన్న నలుడు రెండు చేతులు జోడించి, మీరు నేనూ ఒకే పనిపై దమయంతి స్వయంవరానికి వెళుతూవున్నాము. నేను భార్యగా కోరుకుంటూ వున్న ఆమె దగ్గర కెళ్ళి మిమ్మల్ని వివాహం చేసుకోమని ఎలా తెలుపగలను, ఈ విషయంలో నేను దూతగా మీ తరపున వెళ్ళడం భావ్యం కాదు. కాబట్టి నేను ఈ పనిని చేయలేనందుకు దయచేసి నన్ను క్షమించండి, అని దేవతలతో పలికాడు. నీవు ముందుగానే మాకు మాట ఇచ్చావు, ఆడిన మాట తప్పడం తగదు కాబట్టి నీవు అక్కడికెళ్ళు, అని దేవతలు పలికి, కాపలా భటులు నీ అంతఃపుర ప్రవేశాన్ని ఆపలేరని చెప్పారు. అంగీకరించిన నలుడు దమయంతి అంతఃపురానికి వెళ్ళాడు.

**దదర్శ తత్ర వైదర్భీం సఖీగణ సమావృతామ్।**
**దేదీప్యమానాం వపుషా శ్రియాచ వరవర్ణినీమ్॥**

**అతీవ సుకుమారాంగీం తనుమధ్యాం సులోచనామ్।**
**ఆక్షిపంతీమివ ప్రభాం శశినః స్వేన తేజసా॥**

**తస్య దృష్ట్వైవ వవృధే కామస్తాం చారుహాసినీమ్।**
**సత్యం చికీర్షమాణస్తు ధారయామాస హృచ్ఛయమ్॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము - వనపర్వము - 55వ అధ్యాయము - 12,13,14 శ్లోకములు)**

అంతఃపురంలో చెలికత్తెల సమూహం నడుమ దేవకాంతలా దేదీప్యమానమైన రూపలావణ్య కాంతులతో వెలిగిపోతున్న దమయంతిని నలుడు చూశాడు. అత్యంత సుకుమార సుందర శరీరము, మెరుపు తీగలాంటి సన్నని నడుము, కలువుల వంటి సుందరమైన కనులు, అందాల చందమామ వెన్నెల వెలుగులు చిన్నబోయేంత వన్నెల వెలుగులతో మెరిసిపోతూ, చిరు

చిరు నవ్వులు చిందిస్తూ వున్న దమయంతి రూపం, హంస తనకు వివరించిన దానికన్నా వేయిరెట్లు ఎక్కువ అందంగా వుందే అనుకొంటూ నిలబడ్డ నలుని చెలికత్తెలు మరియు దమయంతి చూశారు. అతని సౌందర్యం, సాహసం, చూసి ఆశ్చర్యంతో దమయంతి, సుందరాంగా! నీవు ఎవరు? రాజభటులను దాటి ఎలా అంతఃపురంలోనికి ప్రవేశింపగలిగావు అని నలుడిని అడిగింది.

నా పేరు నలుడు, దేవతలైన ఇంద్రాగ్నియమ వరుణులు నిన్ను వివాహం చేసుకోవడానికై నన్ను వారి దూతగా నీ వద్దకు పంపారు. ఆ దేవతల ప్రభావం వలన నేను నీ అంతఃపురంలోనికి ప్రవేశింపగలిగాను, అని దమయంతికి తెలిపాడు.

**అహం చైవ హి యచ్చాన్యద్ మమాస్తి వసు కించన ।**
**తత్ సర్వం త్వ విశ్రబ్ధం కురు ప్రణయ మీశ్వర ॥**

**యది త్వం భజమానాం మాం ప్రత్యాఖ్యాస్యసి మానద ।**
**విషమగ్నిం జలం రజ్జుమ్ ఆస్థాస్యే తవ కారణాత్ ॥**

**(శ్రీ మహాభారతము- 2వ భాగము - వనపర్వము- 56వ అధ్యాయము - 2,4 శ్లోకములు)**

దమయంతి దేవతలకు భక్తితో నమస్కరించి, చిరునవ్వుతో నలుడికి ఇలా తెలిపింది. నేను మీరే నా సరస్వం అని భావిస్తున్నాను, ఈ విషయం మీకు తెలుసు. హంస మీ గురించి తెలిపిన విషయాలు విన్నప్పటి నుండి మీకై ఆరాటపడుతున్నాను. మీ కోసమే నా ఈ స్వయంవరము ఏర్పాటు చేయబడినది. కనుక నన్ను మీరు భార్యగా స్వీకరించి, మీకు ఏమి సేవ చేయగలనో ఆజ్ఞాపించండి. నన్ను భార్యగా స్వీకరించనిచో నిన్నే ఆరాధించే నేను ఉరివేసుకొని గాని, విషం మ్రింగి గాని, నీళ్లల్లోనో, నిప్పుల్లోనో దూకి ప్రాణత్యాగం చేస్తాను గాని మరొకరిని పతిగా అంగీకరించను. నేను నలమహారాజు భార్యను అని దేవతలకు తెలియజేయమని నలునికి దమయంతి తెలిపింది.

ఈ భూమండలాన్నంతనూ మ్రింగగల అగ్నిదేవుడిని, ఎవని దండనాభయం వలన సమస్త జీవులు ధర్మాన్నే ఆచరిస్తూ వున్నాయో అటువంటి యమ ధర్మరాజును, రాక్షసులను అణచివేసి ధర్మాన్ని కాపాడే మహాత్ముడైన దేవరాజు ఇంద్రుడిని, సర్వ జీవులకు అవసరమైన జలాలతో లోకాలను రక్షించే వరుణుడిని, భర్తగా వరించని వారు ఎవరుంటారు? దేవతలు గొప్పవారు, లోకాలన్నీ పాలించేవారు, నేను వారి పాద ధూళికి సాటిరాను. నీవు వారిలో నీకు నచ్చిన ఎవరినైనా వరిస్తే నీకు దైవత్వం సిద్ధిస్తుంది, స్వర్గ సుఖాలను పొందగలవు, జనన మరణ సంసార బంధాల నుండి విముక్తి పొందగలవు. అలా కానిచో వారి ఆగ్రహానికి గురై మనం కష్టాలకు గురికావాల్సి వస్తుంది, అని నలుడు దమయంతితో పలికాడు.

దూతగా వచ్చిన మీలో దోషం లేకుండా చేయుటకై, ఇంద్రాది దేవతలు, మీరు అందరును కలిసే నా స్వయం వరానికి రండి. దేవతలందరికీ నమస్కారం చేసి నేనీ సత్యాన్ని చెపుతున్నాను. అక్కడ అందరి సమక్షంలోనే నేను మిమ్మల్ని వరించి నా భర్తగా ఎంచుకొంటాను, అప్పుడు మీకు ఎటువంటి చెడు దేవతల వలన జరగదు, అని దమయంతి నలుడికి తెలిపింది.

హంస రాయబారంతో నలుడినే తన భర్తగా ఎంచుకొన్న దమయంతి దగ్గరకు సాక్షాత్తు ఆ నలుడే దేవతల దూతగా వచ్చి వారి గొప్పతనం ప్రయోజనాలు వివరించి వారిలో ఒకరిని వివాహం చేసుకోమని కోరితే, దేవతలే దిగివచ్చినా సరే, తాను తీసుకొన్న నిర్ణయానికే కట్టుబడి వుంటానని, కాదంటే తాను ప్రాణ త్యాగానికి సిద్ధమని దమయంతి తెలపడం ఆమె యొక్క స్థిర చిత్తానికి, నిజమైన ప్రేమకు నిదర్శనం. మెరుగైన అవకాశాలు అంది వచ్చినప్పుడు మునుపు తీసుకొన్న నిర్ణయాలకు కట్టు బడకుండా చంచలమైన మనసుతో మనసు మార్చేసుకోకుండా దృఢ చిత్తాన్ని కలిగివుండాలని, తెలియచేసింది. దేవతలకు నమస్కారం చేసి తన నిర్ణయాల్ని నిస్సంకోచంగా తెలుపుటలో ఆమె భక్తి, వినయమూ ప్రస్ఫుటమవుతూ

ఉన్నాయి. దూతగా వచ్చిన వ్యక్తికి తన నిర్ణయం వలన ఎటువంటి ఇబ్బంది కలుగకుండా వుండడం కోసం, దేవతలను నలుడిని కలసి స్వయం వరానికి రమ్మని, అక్కడ అందరి ఎదుటా తానే నలుడిని వరునిగా ఎంచుకొంటానని చెప్పడంలో దమయంతి యొక్క తెలివితేటలు, ధైర్యస్థైర్యాలు ప్రకటితమవుతూ వున్నాయి. ఈ సుగుణాలన్నీ నేటి సమాజంలోని స్త్రీలందరికీ కూడా అవసరము అనే సందేశాన్ని దమయంతి అందిస్తూ ఉంది.

నలుడు దేవతల వద్దకు వెళ్ళి తనకు దమయంతికి నడుమ జరిగిన సంభాషణను యథాతథంగా వివరించి చెప్పాడు. దేవతలు నలుడి యొక్క నిజాయితికి సంతోషించారు. దమయంతి స్వయంవర ముహూర్తం నిశ్చయించారు, రాజులందరూ స్వయంవర మండపానికొచ్చి ఆసీనులైయ్యారు. సౌందర్యరాశి అయిన దమయంతి ఆ మండపంలో ప్రవేశించింది. ఆమెకు రాజులు ఒక్కొరొక్కరుగా పరిచయం చేయబడుతూ వున్నారు, వారి గురించి తెలుసుకొని వారిని చూస్తూ ముందుకు కదలిపోతూవుంది. ఒకచోట ఒకేవిధమైన రూపం, అలంకరణలతో అచ్చం నలమహారాజులానే వున్న ఐదుమంది ప్రక్క ప్రక్కనే ఆసీనులై వుండగా, దమయంతి వారి వద్దకు వచ్చి వారిలో అసలు నలుడు ఎవరో పోల్చుకోలేక పోయింది. తన బుద్ధిని ఉపయోగించి, పెద్దవారు చెప్పగా విన్న దేవతలకుండే లక్షణాలు గుర్తు తెచ్చుకొని పరీక్షగా ఆ ఐదుమందిని చూడగా, ఏ ఒక్క లక్షణమూ వారిలో కనబడలేదు. దమయంతి దేవతలకు నమస్కరించి వినయవిధేయలతలతో ఇలా ప్రార్థించింది.

**హంసానాం వచః శ్రుత్వా యథా మే నైషధో వృతః ।**
**పతిత్వే తేన సత్యేన దేవాస్తం ప్రదిశంతు మే ॥**

**మనసా వచసా చైవ యథా నాభిచరామ్యహమ్ ।**
**తేన సత్యేన విబుధాః తమేవ ప్రదిశంతు మే ॥**

**యథా దేవైః స మే భర్తా విహితో నిషధాధిపః ।**
**తేన సత్యేన యే దేవాః తమేవ ప్రదిశంతు మే ॥**

**యథేదం వ్రతమారబ్ధం నలస్యారాధనే మయా ।**
**తేన సత్యేన మే దేవాః తమేవ ప్రదిశంతుమే ॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము - వనపర్వము - 57వ అధ్యాయము - 17,18,19,20 శ్లోకములు)**

దేవతలారా! హంసల మాటలు విని నలమహారాజుని నేను భర్తగా వరించాను. యదార్థంగా నేను మనసులో గాని వాక్కుతో గాని ఇంకెవ్వరిని నా భర్తగా భావింపనిదానినైతే నాకు నలునిని ప్రసాదించండి. దేవతలే నాకు నలుడిని భర్తగా నిర్ణయించారు. అతడిని పతిగా ఆరాధించడం అనేది నేను ప్రారంభించాను. ఇవన్నీ సత్యాలు, కాబట్టి దేవతలు నాకు నలుడిని ప్రసాదించుగాక. నేను నలుడుని గుర్తించడానికి వీలుగా మీ యొక్క నిజరూపాన్ని ధరించండి అని చేతులు జోడించి దమయంతి దేవతలను ప్రార్థించింది. ఆమె దృఢ నిశ్చయం నిజమైన ప్రేమ, ఆత్మశుద్ధి, భక్తి, నలుని మీద ఆసక్తి, బుద్ధినిశ్చయత, వినయవిధేయతలు, ఇవన్నీ చూసిన దేవతలు, ఆమెకు దేవతలకు మనుషులకు గల భేదాన్ని గుర్తించగలిగిన శక్తిని ప్రసాదించారు. అప్పుడు దమయంతి, దేవతల శరీరానికి చమట పట్టకపోవడం, కనురెప్పలు ఆర్పకపోవడం, పూలమాలలు వాడకపోవడం, శరీరం మీద మురికిలేకపోవడం, స్థిరంగా నిలిచినా భూమిని తాకకపోవడం, ఇవన్నీ గమనించింది. నలుని పక్కన ఆయన నీడ కూడా ఉండి, పూలదండలు వాడి కూడా వుండి, చెమట వుంది, పాదాలు నేల మీద ఉన్నాయి, కనురెప్పలు ఆర్పడం తెలుస్తుంది. ఆ తేడాని బట్టి ఒకేలా ఉండే అయిదు మందిలో అసలు నలుడు ఎవరో దమయంతి గుర్తించగలిగింది. సిగ్గులు మొగ్గలు తొడుగుతూ ఉండగా ఆనందం పొంగి పొరలుతుండగా దమయంతి తన చేతిలోని పూలదండను నలుని మెడలో వేసి అతన్ని తన భర్తగా వరించింది.

అప్పుడు దేవతలు, మహర్షులు, సభలోని సకల జనాలు వారిరువురుని అభినందించి, వారికి తమ ఆశీస్సులందించారు. ఇంద్రాది దేవతలు నలునికి ఏడు వరాలిచ్చారు. ఇంద్రుడు, యజ్ఞ సమయంలో తన దర్శనం కలుగుతుందని, ఉత్తమగతి లభిస్తుందని, అగ్ని తనని తలుచుకున్నప్పుడు తను కోరిన చోటు తానుంటానని, ప్రకాశవంతమైన లోకం ప్రాప్తిస్తుందని, యముడు నలుడు చేసిన వంట అద్భుతంగా ఉంటుందని, ధర్మం పక్క నిలబడతావని, వరుణుడు నలుడు కోరిన చోటు నీళ్ళు పుడుతుందని, అతను ధరించిన మాల మిక్కిలి సువాసనాభరితమై ఉంటుందని వరాలిచ్చి తిరిగి దేవతలు స్వర్గానికి బయలుదేరారు.

జీవితంలో మనుష్యులకు ఎన్నో పరీక్షలు ఎదురవుతూ వుంటాయి. దమయంతి తన జీవన భాగస్వామిని ఎంచుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన విషయంలో ఐదుమంది నలునిలానే కనిపించి దేవతలు ఆమెకు పరీక్ష పెట్టారు. అప్పుడు ఆమె తాను నమ్మిన సత్యం, తాను ఆచరించిన పాతివ్రత్యం వీనితో అత్యంత వినయవిధేయతలతో, భక్తిగా, దేవతలను ప్రార్థించింది. నలునిపై మనసావాచా కర్మణా తనకున్న గొప్ప ప్రేమ వలన, పరీక్షను గెలిచింది. నేటి సమాజంలోని స్త్రీలు పై లక్షణాలు కలిగి వుండాలని, జీవితంలో పరీక్షలెదురయ్యినప్పుడు ధైర్యంగా, దైవబలంతో, వినయవిధేయలతో కూడిన భక్తితో, సత్యధర్మాలు, పతివ్రతాది సుగుణాల సహాయంతో వాటిని గెలవాలనే సందేశాన్ని దమయంతి నేటి సమాజానికి అందించింది.

దేవతలకి దారి మధ్యలో కలి, ద్వాపరులు ఎదురుపడ్డారు. ఇంద్రుడు కలిని ఎక్కడికి వెళుతున్నారని అడిగాడు. కలి తాను దమయంతి స్వయం వరానికి, ఆమెను వివాహమాడడానికి వెళుతున్నానని చెప్పాడు, ఇంద్రుడు నవ్వి ఆమె స్వయం వరం ఎప్పుడో అయిపోయిందని, అందరూ చూస్తుండగానే దమయంతి నలుడిని వరించిందని చెప్పాడు. అందుకు కలి కోపంతో మండిపోతూ, దేవతలను కాదని మానవున్ని వరించినందుకు

శిక్షించవలసిందే అన్నాడు. దేవతలు అతన్ని శాంతింపచేస్తూ, మా అనుమతి తీసుకున్నాకే ఆమె నలుడిని దమయంతి వరించింది, అతను మంచివాడు. అతనికి శాపం ఇవ్వడం అంటే నరకానికి నీవు ఉరకడమే, అని కలిని దేవతలు హెచ్చరించి వెళ్ళిపోయారు. కలి ద్వాపరునితో సోదరా, నాకు కోపం చల్లారడం లేదు, నేను నలుని శరీరంలో నివశిస్తూ అతన్ని అన్నీ పోగొట్టుకొని అడవులకు పోయేలా చేస్తాను. అప్పుడు దమయంతితో జీవించలేడు. ఇందుకు నీవు జూదపు పాచికలలో ప్రవేశించి, నాకు సహాయం చేయాలని కోరాడు. దానికి ద్వాపరుడు అంగీకరించాడు. ఇద్దరూ కలసి నలుని రాజధానిలో తిష్ఠ వేశారు. నలునిలో దోషం కోసం వేచి చూసి పన్నెండేళ్ళు వారు ఎదురుచూశారు. నలదమయంతులు ఆనందంగా జీవించారు. వారికి ఇంద్రసేనుడనే కొడుకు, ఇంద్రసేన అనే కూతురు జన్మించారు. రాజ్యంలో ప్రజలందరిని కంటికి రెప్పలా కాపాడుతూ నలుడు పరిపాలించసాగాడు. అశ్వమేధాది యజ్ఞాలు రాజ్యక్షేమానికై అనేకం చేశాడు, నలుడు ఒక రోజు సంధ్యాసమయంలో లఘుశంక తరువాత కాళ్ళు కడుక్కోకనే సంధ్యావందనం చేయడానికి కూర్చున్నాడు. ఆ అవకాశం చూసి కలిపురుషులు నలుని శరీరంలో ప్రవేశించారు. అంతేగాక మారు వేషంలో నలుని సోదరుడైన పుష్కరుని దగ్గరికి వెళ్ళి నీవు నలునిని జూదానికి ఆహ్వానించి, అతనితో జూదం ఆడు, మా తోడ్పాటుతో నలునితో జూదం ఆడి, రాజ్యంనే సొంతం చేసుకో, అని కలి మరియు ద్వాపరులు చెప్పారు. అందుకు పుష్కరుడు అంగీకరించాడు, నలుని దగ్గరికి వెళ్ళి జూదం ఆడాలని పట్టుపట్టాడు. దమయంతి వద్దంటున్నా నలుడు పుష్కరునితో జూదం ఆడడానికెళ్ళాడు. ద్వాపరుడు పాచికలలో ప్రవేశించాడు. ఫలితంగా నలుడు, సైన్యం, వెండి, బంగారం, రథాలు, వాహనాలు ఏవి పందెంగా ఒడ్డితే వాటన్నింటిని ఓడిపోయాడు. ప్రజలు, మంత్రులు వీరందరి కోరికపై దమయంతి నలమహారాజు దగ్గరికి వెళ్ళి జూదాన్ని ఆపవలసిందిగా

ప్రార్థించింది. కానీ కలి ప్రభావంతో నలుడు దమయంతి మాటలు వినలేదు. దాని వల్ల నలుడు తన రాజ్యాన్ని, సంపదను, సర్వాన్ని పోగొట్టుకొన్నాడు.

భర్త జూదం ఇత్యాది సప్త వ్యసనాలలో దేనికి ప్రభావితుడైనా, భార్యలు ప్రతి ఒక్కరు దానిని ఆపడానికి తమవంతు కృషి చేయవలను అన్న సలహాను దమయంతి నేటి సమాజానికందించింది.

పిల్లలను తీసుకొని దమయంతిని ఆమె తల్లిదండ్రుల వద్దకు వెళ్లమని నలుడు కోరాడు. దమయంతి తన పిల్లలిద్దరినీ నలుని రథ సారధి అయిన వార్ష్ణేయుని ద్వారా తన తల్లిదండ్రులుండే రాజ్యానికి తీసుకెళ్ళి జాగ్రత్తగా తన తల్లిదండ్రులకు అప్పగించమని చెప్పి పంపింది. దమయంతి మాత్రం నలునితోనే కష్టసమయంలో ఉండి అతనిని సేవిస్తానని, అతనితో పాటు రాజ్యాన్ని సకల సంపదలను వీడి కట్టుబట్టలతో నగరాన్ని వీడింది. నగరం బయట మూడు రాత్రులు నలదమయంతులు గడిపారు. నలునిపై సానుభూతి చూపినా, ఆదరించినా, వారికి ఉరిశిక్ష విధించబడుతుందని పుష్కరుడు చాటింపు వేయించాడు. అతనికి భయపడి ప్రజలెవ్వరూ నలదమయంతులకు ఆహారం కూడా ఇవ్వకపోవడంతో కేవలం నీరు మాత్రమే తాగి మూడురోజులు వారు నగరం బయటే వున్నారు. నాల్గవ రోజు భరించలేని ఆకలితో అలమటిస్తు కందమూలాలు, ఫలాలు లభిస్తాయన్న ఆశతో అడవిలోనికి నలదమయంతులు ఇరువురూ వెళ్ళిపోయారు.

ఒకనాడు నలుని ప్రక్కన రెక్కలకు బంగారు వుండే ఒక పక్షుల గుంపు వాలాయి. ఈ పక్షులు ఆహారంగానూ, వీటి రెక్కలకుండే బంగారు ద్వారా కొంతధనమూ సంపాదించవచ్చు అని ఆలోచించిన నలుడు, ఆ పక్షులను పట్టుకోవడానికి తాను ధరించివున్న వస్త్రాన్ని విప్పి వానిపై వలలా విసిరాడు. సాధారణంగా చిక్కిపోయే పక్షులు దానికి భిన్నంగా ఆశ్చర్యకరంగా ఆ వస్త్రంతో సహా ఆకాశానికి ఎగిరిపోయాయి. మేము మాయాపాచికలం, నీ రాజ్యాన్ని సంపదలను మోసంతో గెలుచుకొన్న మేము, నీ ఒంటి మీది

వస్త్రాలను కూడా కాజేయాలని పక్షి రూపంలో వచ్చాము, అని ఆ పక్షులు ఆకాశాన ఎగురుతూ నలునితో పలికాయి. నలుడు సిగ్గుతో బాధతో, దిగంబరుడుగా మిగిలిపోయాడు. నలునిని దమయంతి ఓదార్చి తను కట్టుకొన్న చీరు చెరుగును ఇచ్చి కట్టుకోమన్నది. నలదమయంతులిద్దిరూ ఒక్క చీరనే ధరించారు. అత్యంత కష్ట సమయాన భర్తకు తన వస్త్రాన్ని ఇచ్చి, అతనిని ఓదార్చి, భర్తకు అండగా నిలవడం ద్వారా దమయంతి నేటి సమాజంలోని భార్యలకు కష్ట సమయాన భర్తలకు ఎలా అండగా ఉండాలో సందేశాన్నిచ్చింది.

నలుడు దుఃఖిస్తూ మనం ఆకలి బాధతో ప్రాణాలను నిలుపుకో లేకున్నాము. దక్షిణ దిక్కుగా ఈ అడవిలో వెళ్తే కోసల రాజ్యం వస్తుంది, దానికి దక్షిణ దిక్కుగా వచ్చేది నీ తండ్రి గారి రాజ్యమైన విదర్భ రాజ్యం. నీవు ఆకలిదప్పులతో కష్టాలు పడుతూ ఈ అడవిలో ఉండలేవు. కాబట్టి నీ తండ్రి దగ్గరకెళ్ళి సుఖంగా వుండు, అని దమయంతితో నలుడు పలికాడు. ఈ అడవిలో క్రూరమృగాల నడుమ ఆకలి దప్పులతో కష్టాలు పడడం ఎందుకు? నీవు కూడా వస్తే ఇద్దరూ కలసి మా తండ్రి గారి రాజ్యమైన విదర్భకు వెళ్దాం, అని నలునితో దమయంతి పలికింది. నేను రాజుగా సమస్త సంపదలతో తులతూగుతూవున్నప్పుడు నన్ను బంధువులంతా ఎంతో ఆదరంతో చూసేవారు. ఇప్పుడు అన్నీ పోగొట్టుకొని పరమ దరిద్రుడనై వారి మధ్యకు వెళ్ళడానికి నా మనస్సు అంగీకరించడం లేదు, అని నలుడు పలికాడు.

**ఉద్వేజతే మే హృదయం సీదంత్యంగాని సర్వశః ।**
**తవ పార్థివ సంకల్పం చింతయంత్యాః పునః, పునః ॥**

**హృతరాజ్యం హృదద్రవ్యం వివస్త్రం క్షుత్చ్ఛ మాన్వితమ్ ।**
**కథముత్సృజ్య గచ్ఛేయమ్ అహం త్వాం నిర్జనే వనే ॥**

**శ్రాంతస్య తే క్షుధార్తస్య చింతయానస్య తత్ సుఖమ్ ।**
**వనే ఘోరే మహారాజ నాశయిష్యామ్యహం క్లమమ్ ॥**

**న చ భార్యాసమం కించిద్ విద్యతే భిషజాం మతమ్ ।**
**ఔషధం సర్వదుఃఖేషు సత్యమేతద్ బ్రవీమి తే ॥**

**(శ్రీ మహాభారతము - 2వ భాగము - వనపర్వము - 62వ అధ్యాయము - 26,27,28,29 శ్లోకములు)**

మిమ్మల్ని విడచి మా తండ్రిగారి వద్దకు నన్ను ఒక్కదాన్నే వెళ్ళమన్న మీ ఆలోచన నన్ను ఎంతో బాధకు గురిచేస్తూ వుంది. రాజ్యాన్ని, సంపదలను, చివరికి వస్త్రాన్ని కూడా కోల్పోయి ఆకలి దప్పులతో అనేక కష్టాలు పడుతూ వున్న మిమ్మల్ని విడచి నేను ఎలా వెళ్లగలను. రోగాలన్నింటిలోకి దుఃఖం గొప్ప రోగం. దుఃఖంతో బాధపడుతూ వున్న వ్యక్తికి భార్యయే సరి అయిన మందు. ఆమె ప్రక్కన వుంటే అతనికి అనేక సేవలు చేస్తూ, ధైర్యం చెపుతూ, ఓదార్పునిస్తూ వుంటుంది. భార్యతో కలసి వున్నవాడు ఎన్ని కష్టాలనైనా తట్టుకొని నిలబడతాడు. నీతోనే ఉండనివ్వు, నన్ను విడచి వెళ్ళకు, అని దమయంతి నలునితో పలికింది. అందుకు నలుడు నేను నిన్ను విడచివెళ్ళను, భయపడకు, అని దమయంతికి మాట ఇచ్చాడు.

కష్ట సమయాల్లో భార్య భర్తకు ఎలా తోడుండాలి, ఎలా ఓదార్పును, ధైర్యాన్ని ఇచ్చి అతనిని ఆ కష్టాలు తట్టుకొనేలా చేయాలి, అన్న విషయాలు వివరించి దమయంతి నేటి సమాజంలోని దంపతులకు మార్గ దర్శనము చేసింది.

ఆ అడవిలో పాడుబడిన మంటపంలో ఆ రాత్రి నల దమయంతులిద్దరు పడుకొన్నారు. బాగా అలసిపోయిన దమయంతి నిద్రలోనికి జారుకొన్నది. నలుడు దమయంతిని చూసి చెలికత్తెలతో సేవలందుకొంటూ పట్టుపరుపులపై అంతఃపురభోగాలతో హాయిగా వుండాల్సిన ఈమె, తన వలన శరీరం

దుమ్ముకొట్టుకొనిపోయి, తినడానికి తిండిలేక, కటిక నేలపై అనేక కష్టాలకు గురి అవుతూ వుందని కన్నీరు కార్చాడు. ఈమెకు ఇకనైన ఈ కష్టాలు తప్పాలి అంటే, తను ఈమెకు కనిపించకుండా వెళ్ళిపోతే, తనకోసం కొంతసేపు దుఃఖించినా చివరకు తండ్రి వద్దకు వెళ్ళి పిల్లలతో హాయిగా వుంటుందని భావించాడు. ఇద్దరూ ధరించివున్న ఒకే వస్త్రాన్ని చించి తను వేరుపడ్డాడు. కలి పురుషుడి ప్రభావంతో అర్ధరాత్రి, అమాయకురాలు, యవ్వనంలో వున్న స్త్రీని తనను నమ్మి సర్వం వదిలి వచ్చిన అర్ధాంగిని భయంకరమైన అడవిలో ఒంటరిగా వదిలి నలుడు దూరంగా వెళ్ళిపోయాడు.

ఉదయం నిద్ర లేచిన దమయంతికి ప్రక్కన భర్త కనపడలేదు. తన చీర సగం చిరిగివుండడం గమనించింది. తనను ఆట పట్టించడానికి పొదల మాటున నలుడు దాగివున్నాడేమో అని వెతికింది, లేకపోయేసరికి మహారాజా! అంటూ పెద్దగా అరచింది, క్రూరమృగాలుండే ఈ అడవిలో నన్ను ఒంటరిగా ఎందుకు వదిలి వెళ్ళావు అని భయంతో విలపించింది. నిన్నే నమ్ముకొని నీ నీడలా వెన్నంటి వుండే నీ భార్యను, ఇతరులు అపకారం చేసే అవకాశం వున్న సమయంలో ఆమెకు రక్షణగా నిలువక ఎందుకు విడచి వెళ్ళావు అని ఏడ్చింది. ఆకలిదప్పులతో శ్రమతో అలసిన మీరు ఒక్కరే ఈ అడవిలో నేను కూడా లేకుండా ఎలా వుండగలరు అని వెక్కి వెక్కి ఏడ్చింది.

**యస్యాభిశాపాద్ దుఃఖార్తః దుఃఖం విందతి నైషధః ।**
**తస్య భూతస్య నో దుఃఖాద్ దుఃఖమప్యధికం భవేత్ ॥**

**అపాపచేతసం పాపః య ఏవం కృతవాన్ నలమ్ ।**
**తస్మాద్ దుఃఖతరం ప్రాప్య జీవత్వం సుఖజీవికామ్ ॥**

**(శ్రీమహాభారతము – 2వభాగము – వనపర్వము – 63వ అధ్యాయము – 16,17 శ్లోకములు)**

ఎవని వలన నలుడు ఈ విధంగా దుఃఖార్తుడై బాధలను అనుభ విస్తున్నాడో, ఎవడైతే ఏ పాపం ఎరుగని నలుని విషయంలో ఇటువంటి

పాపపు పనిచేశాడో, అతనికి మేము అనుభవిస్తున్న దుఃఖం కంటే అధిక దుఃఖం, అధిక కష్టాలు కలుగు గాక, అని దమయంతి శపించింది.

దమయంతి చెప్పలేనంత బాధతో రోదిస్తూ తన భర్త కనిపిస్తాడేమో అన్న ఆశతో అటూ ఇటూ తిరుగుతూ వుండగా, ఆ అడవిలో నున్న ఒక పెద్ద కొండచిలువ ఆమెను పట్టుకొని మ్రింగివేయసాగింది. ఆ సమయంలో కూడా నలుని గురించే బాధపడుతూ వున్న దమయంతి, అనాథనైన నన్ను ఒక కొండ చిలువ పట్టుకొని మ్రింగేస్తూవుంది, ఇప్పుడైనా నీవు పరుగెత్తుకొనివచ్చి నన్ను కాపాడవేమీ? అని బిగ్గరగా అరవసాగింది. ఆమె అరుపులు విన్న ఒక బోయవాడు అక్కడికి వచ్చి తన చేతిలోని కత్తితో కొండచిలువ తలను సరికాడు. ఆమెకు ఆహార పానీయాలు అందించి, ఆమె వివరాలు అడిగాడు. ఆమె తన గురించి అన్ని వివరాలు చెప్పింది. ఆమెను అతడు ఓదార్చాడు. దమయంతి యొక్క రూపం, మాటలు, సగం వస్త్రం, వీటన్నింటి వలన ఆమె పట్ల అతనికి కామం కలిగినది. తన కోరిక తీర్చమని అతడు ఆమెను బలాత్కారం చేయబోయాడు. దమయంతి వలదు అని మంచిగా చెప్పినా, వారించినా అతడు వినలేదు, పైగా మరింతగా రెచ్చిపోసాగాడు.

**యద్యహం నైషధాదన్యం మనసాపి న చింతయే ।**
**తథాయం పతతాం క్షుద్రః పరాసుర్మృగ జీవనః ॥**

**(శ్రీమహాభారతము – 2వభాగము – వనపర్వము – 63వ అధ్యాయము – 38వ శ్లోకము)**

నేను నిషధరాజైన నలుని తప్ప మరొకరిని మనసులో సైతం భావించనట్లయితే, నీచుడైన ఈ వనచరుడు మరణించుగాక, అని దమయంతి కోపంతో వ్యాధుడని పేరుగల ఆ బోయవాడిని శపించింది. అతడు భగ్గున కాలి బూడిద రాశిగా మిగిలి మరణించాడు. తమ కష్టాలు మరియు దుఃఖానికి కారణమైన కలిని శపించడం, తనను మానభంగం చేయ

ప్రయత్నించిన వ్యాధుడిని శపించి బూడిదగా మార్చడం, దమయంతిలోని పతివ్రతా శక్తికి నిదర్శనం. పతివ్రతలుగా జీవించడం వలన వచ్చే శక్తిని, ఆపదలలో సైతం దైవం అదృశ్యరూపంలో వుండి మంచివారిని కాపాడుతాడనే ఋజువుని దమయంతి నేటి సమాజానికి సందేశంగా అందించింది.

ఆ తరువాత భయంకరమైన మృగాలున్న ఆ దట్టమైన అడవిలో దమయంతి నలుని వెతుకుతూ ముందుకు సాగిపోయింది. కనిపించే చెట్టు, పుట్ట, జంతువు, పర్వతాలని తన భర్త జాడ అడుగుతూ శోకిస్తూ మూడురోజులు ఆ అరణ్యాలలో తిరిగి ఒక ముని ఆశ్రమానికి చేరుకొంది. ఆమె తన భర్త జాడ ఆ ఆశ్రమంలోని ఋషులను అడుగగా, భవిష్యత్తులో మీరిరువురూ కలసి గత వైభవంతో రాజ్యాన్ని ఏలుతారని చెప్పి వారు అంతర్ధానమయ్యారు. తరువాత ఆమె అడవిలో తన భర్త కోసం వెతుకుతూ వెతుకుతూ అటువైపుగా ప్రయాణం చేస్తున్న ఒక వర్తకుల గుంపును చూసింది. వారిని సమీపించి తన భర్త జాడను అడిగింది. ఆ వర్తక సమూహం యొక్క నాయకుడైన శుచి అనే పేరుగల వ్యక్తి, నలుని వారు చూడలేదని తెలిపి, ఈ అరణ్యాన ఇలా ఒంటరిగా వుండడం ప్రమాదమని తెలిపి, ఆమెకు అభ్యంతరం లేకపోతే, వారితో పాటు ఆమె కూడా వారు వెళుతూ వున్న చేది రాజ్యానికి రావచ్చని తెలిపాడు. అంగీకరించిన దమయంతి వారితో కలసి ప్రయాణం చేసింది. రాత్రివేళ కావడంతో అందరూ ఒక చెరువు సమీపాన నిద్రించారు. ఒక ఏనుగుల గుంపు వచ్చి వారిలో చాలామందిని తొక్కి చంపేసింది. మిగిలిన వారు కొందరు దీనికంతా కారణం దమయంతి తమ చెంతకు రావడమే, అని నిందించారు. అది విన్న ఆమె, నాపై విధి చాలా దారుణంగా పగబట్టింది. మనసా వాచా కర్మణా ఎవరికీ చెడుచేయని నేను, రాజ్యాన్ని, భర్తను, పిల్లల్ని అందరినీ పోగొట్టుకొని ఈ ఘోర అరణ్యంలో దిక్కులేని దానినై నిలచి, నేడు ఈనిందలను భరిస్తూ వున్నాను. ఇది అంతా ఏ కర్మ ఫలమో అని రోదించింది.

మిగిలిన వర్తకుల గుంపును అనుసరిస్తూ ఆ అడవి మార్గాన ప్రయాణం చేసి చేది రాజ్యంలోకి దమయంతి ప్రవేశించింది. సగం వస్త్రంతో, మట్టికొట్టుకుపోయిన రూపంతో పిచ్చిదానిలా వున్న ఆమెను చూసి పిల్లలు చుట్టుముట్టి వింతగా చూస్తూ, ఆటపట్టించసాగారు. మేడపై నుండి చేది రాజ్య రాజమాత, దమయంతిని చూసి అద్భుతమైన రూపంతో మట్టిలో మాణిక్యంలా ప్రకాశిస్తున్న ఈమె శరణార్థి, ప్రజల వలన ఇబ్బంది పడుతూ వుంది. వెళ్ళి ఆమెను తీసుకొని రా, అని పరిచారికను పంపింది. రాజమాత ఆమె వివరాలు అడిగింది. నేను సైరంధ్రీ జాతి స్త్రీనని, తన భర్త వనవాసం, తదనంతరం పరిణామాలు తెలిపింది. అప్పుడు దమయంతిని ఇక్కడే వుండమని రాజమాత కోరగా, అందుకు మీరు నా ఒప్పందానికి అంగీకరిస్తే వుంటానని తెలిపింది. ఎంగిలి తినను, పాదసేవ చేయను, ఇతర పురుషులతో ఎన్నడూ మాట్లాడను, ఏ పురుషుడైనా నన్ను కోరితే అతనిని కఠినంగా శిక్షించాలి. నా భర్తను వెదకడానికి బ్రాహ్మణులను నియమించాలి, అని తన ఒప్పందంలోని నియమాలు తెలిపింది. అంగీకరించిన రాజమాత, తన కూతురైన సునందని పలిచి, నీ సమాన వయస్కురాలైన ఈమె నీకు సఖిగా వుంటుందని చెప్పి కూతురితో పాటు ఆమె మందిరానికి దమయంతిని పంపగా, అక్కడ ఆమె కొంత ప్రశాంతంగా కాలం గడుపుతూవున్నది.

తప్పనిసరైన పరిస్థితులలో ఇతరుల చెంత ఆశ్రయాన్ని పొందవలసి వచ్చినా, తన గౌరవానికి, శీలానికి భంగం కలుగకుండా ముందే తన నియమాలు తెలిపి సమ్మతించిన తర్వాతే వారితో కలసివుండడం వంటి జాగ్రత్తలు నేటి సమాజంలోని స్త్రీలకు అవసరము, అని దమయంతి సందేశాన్నిచ్చింది.

నలుడు దమయంతిని వదిలి ఒంటరిగా అడవిలో తిరుగుతూ వుండెను. అక్కడ ఒక ప్రాంతం పెనుమంటలతో తగలబడిపోతూ వుండగా, అందులో నుండి కాపాడమనే అరుపులు విన్నాడు నలుడు. మంటల మధ్యలో చిక్కుకున్న

ఒక నాగుపాము, తన పేరు కర్కోటకుడినని, నారదున్ని కాటువేయడం వలన, అతను ఇచ్చిన శాప ఫలితంగా కదలలేకుండా వున్నానని, నలుని దర్శనంతో తనకు శాపవిముక్తి కలుగుతుందని, రక్షించమని ప్రార్థించి, తన రూపాన్ని చిన్నదిగా మార్చుకొన్నది. నలుడు కర్కోటకుడిని ఆ మంటల నుండి కాపాడి బయటకు తీసుకువచ్చాడు. నీవు లెక్కపెడుతూ పది అడుగులు వేయమన్నాడు. పదవ అడుగు వేయగానే నలుడిని కర్కోటకుడు కాటువేశాడు. ఆ విష ప్రభావం వలన నలుడి రూపం గుర్తు పట్టలేని విధంగా వికృతంగా మారిపోయింది. నీకు మేలు చేయడానికే నేను ఇలా చేశాను, ఇప్పుడు నిన్ను ఎవరూ గుర్తించలేరు, నీకు విషభయాలు, భూతప్రేత పిశాచాల, శత్రువుల భయము వుండదు. నీవు రాబోయే కాలంలో నీ భార్య పిల్లల్ని కలుసుకొని నీ రాజ్యాన్ని తిరిగి పొందుతావు. నీ నిజరూపం ఎప్పుడు నీవు కావాలంటే అప్పుడు నన్ను తలుచుకుంటే ఈ వస్త్రం నీ ముందు వుంటుంది. దీనిని కప్పుకోగానే నీ అసలు రూపం నీకు వస్తుంది. నీవు ఋతుపర్ణుడనే రాజు వద్దకెళ్ళి అతని కొలువులో చేరు, నీకు తెలిసిన అశ్వహృదయ విద్య అతనికి నేర్పి, అతని నుండి నీవు అక్షహృదయ విద్య నేర్చుకో, నీ పేరు బాహుకుడిగా మార్చుకొని, ఆ రాజుకు రథసారథిగా ఉండు, అని చెప్పి కర్కోటకుడు వెళ్ళిపోయాడు. నలుడు కర్కోటకుడు చెప్పినట్లే ఋతు పర్ణరాజు దగ్గర బాహుకుడనే పేరుతో రథసారథిగా మరియు వంట వానిగా చేరి అజ్ఞాతవాసం చేయసాగాడు.

దమయంతి తండ్రియైన భీమ మహారాజు నలదమయంతులను వెదకటానికి బ్రాహ్మణులను నలుమూలలకు పంపాడు, వారి జాడ తెలిపిన వారికి వేయి గోవులు, అగ్రహారాలు బహుమతిగా ఇస్తానని ప్రకటించాడు. వారిలో సుదేవుడనే బ్రాహ్మణుడు చేదిపురానికి చేరి అక్కడ రాజ గృహంలో వున్న దమయంతిని చూశాడు. ఆమె చెంతకు వెళ్ళి నేను సుదేవుడనే బ్రాహ్మణుడిని, మీ అన్నగారి మిత్రుడను, మీ నాన్న గారి ఆదేశంపై

నలుదిక్కులా నీకై వెతుకుతున్న వారిలో నేనొకడిని, అని పలికాడు. ఆమె అతనిని గుర్తించింది, తన అన్నకు ఇష్టుడైన అతనిని చూసి కన్నీరు కార్చింది. అది చూసిన రాజమాత పుత్రిక సునంద తన తల్లికి ఆ విషయం తెలుపగా, ఆమె వచ్చి సుదేవుడిని దమయంతి గురించిన వివరాలు తెలపమనగా, అతను దమయంతి తల్లిదండ్రులు, భర్త, జరిగిన విషయాలు అన్నీ తెలిపాడు. అప్పుడు రాజమాత సంతోషంతో దమయంతి తల్లి, ఆమె ఇద్దరూ స్వంత అక్క చెల్లెలు అని, దశార్ణ దేశాధి పతియైన సుదాముని కుమార్తెలమని తెలిపి, తాను దమయంతికి స్వయాన పినతల్లి అని తెలిపింది. దమయంతి కోరిక మేరకు వెంటనే ఆమెను, సుదేవుడిని తన సైన్యం ద్వారా విదర్భ రాజ్యములోని దమయంతి తల్లిదండ్రుల వద్దకు చేర్చే ఏర్పాటు చేసింది.

దమయంతి విదర్భ రాజ్యానికి చేరి తల్లిదండ్రులను, కన్నబిడ్డలను చూసి శోకించింది. సకల సౌకర్యాలున్నా కూడా దమయంతి శరీర సౌఖ్యాలన్నింటిని వదిలేసింది, అరణ్యాలలో ధరించిన ఆనాటి మాసిన సగం చీరనే ధరించేది, జుట్టంతా జడలు కట్టి ఉన్నా కేశ సంస్కారం చేసుకునేది కాదు, నేల మీదనే పడుకునేది, ఎప్పుడూ తన భర్తనే తలుచుకొంటూ వుండేది.

అన్ని సౌకర్యాలు అమ్మగారి ఇంట ఆమెకున్నా, భర్త ఎడబాటు, అతను ఎలా వున్నాడో అన్న దిగులు వీటన్నింటి కారణం చేత ఆమె ఆనాటి సగం చీరనే ధరించి, అలంకరణలు చేసుకోక, కటిక నేలపై పరుండటం లాంటి దీక్ష చేపట్టింది. ఇవన్నీ కూడా భర్త పట్ల దమయంతికి గల ప్రేమను, ఆమె యొక్క పతివ్రతా లక్షణాలను తెలియచేస్తున్నాయి. నేటి సమాజం ఈ శుభలక్షణాల నుండి పాఠాలు నేర్వ వలసిన అవసరం ఎంతైనా వుంది.

తన తల్లి దగ్గరకెళ్లి దమయంతి, అమ్మా! నేను జీవించివుండాలనే కోరిక మీకు వుంటే వెంటనే నా భర్త జాడ తెలుసుకొని మరల అతనిని తీసుకొని రావడానికి ప్రయత్నం చేయమని తండ్రి గారికి చెప్పు, అని పలికింది. మహారాణి ఆ మాటలను భీమరాజుకు తెలుపగా, అతను వెంటనే

నలుని జాడ తెలుసుకొని రావడానికి బ్రాహ్మణులను సిద్ధం చేశాడు. అప్పుడు దమయంతి ఆ బ్రాహ్మణులతో ఇలా తెలిపింది, మీరు వెళ్ళే అన్ని దేశాలలో, జన సమూహాలున్న ప్రదేశాలలో మాటి మాటికి మీరు ఈ వాక్యాలు పలకండి, ఆ మాటలకు ఎవరైనా సమాధానం చెపితే అతని వివరాలు, ఆచూకి వచ్చి నాకు తెలియచేయండి, అని వారికి వివరించి, వారు పలుకవలసిన మాటలను దమయంతి క్రింది విధంగా వారికి తెలిపింది.

ప్రియుడా! అనురాగవతియైన ప్రేయసిని ఆమె నిద్రించే సమయంలో అడవిలో విడచి, సగం చీర చింపుకొని వెళ్ళిన జూదరివి నీవు. నీవు ఎక్కడున్నావు? ఆ సగం చీరతోనే తన శరీరాన్ని నేటికి కప్పుకొని, మిక్కిలి దుఃఖంతో ఆమె నీ కోసమే ఎదురుచూస్తూ వుంది. ఏడుస్తువున్న ఆమెపై దయ చూపు. భర్త అన్నవాడు భార్యను భరించాలి, రక్షించాలి. మరి నీవెందుకు ఆ రెండు కర్తవ్యాలు విడచి దయారహితుడవై ప్రవర్తిస్తున్నావో? సమాధానం చెప్పు వీరా!, అని పలుకమని దమయంతి బ్రాహ్మణులకు వివరించింది.

బ్రాహ్మణులు, నలుదిక్కులకూ వెళ్ళి, దమయంతి చెప్పిన మాటలను యథాతథంగా, అన్ని చోట్లా పదే పదే వినిపించసాగారు. చాలాకాలం గడిచిన తర్వాత పర్ణాదుడనే బ్రాహ్మణుడు దమయంతి వద్దకు తిరిగి వచ్చి ఇలా తెలిపాడు. నేను ఎన్నో రాజ్యాలు తిరిగి మీ మాటలను అన్ని చోట్లా వినిపించాను, అందుకు ఎవ్వరూ తిరిగి సమాధానం పలకలేదు. కానీ అయోధ్య నగరంలో ఋతుపర్ణుని రాజ్య సభలో నేను ఈ మాటలు పలకగా, రాజుగారి రథసారథి, కురూపి, పొట్టి చేతులు కలిగిన, రుచికరమైన వంటలు వండటంలో నేర్పరి అయిన బాహుకుడు నన్ను రహస్య ప్రదేశంలో కలసి మాట్లాడాడు. క్షేమ సమాచారాలు అడిగాడు, నిట్టూర్చాడు, ఏడ్చాడు, తర్వాత ఇలా సమాధానం ఇచ్చాడు. ఉత్తమ స్త్రీలు ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని రహస్యంగా ఉంచుతారు, సర్వ సుఖాలను కోల్పోయి, వస్త్రాలు కూడా అపహరింపబడి, ప్రాణాలు నిలుపుకోవడానికి ప్రయత్నించే సంకట స్థితిలో

అలా చేసిన భర్తపై భార్య కోపం చూపకూడదు, భర్త యొక్క ఎటువంటి దోషాలనైనా భార్య మన్నించగలిగాలి, అని బాహుకుడు తనతో తెలిపాడని పర్ణాదుడు దమయంతికి తెలిపాడు.

ఆ మాటలు విన్న దమయంతి కన్నీరు కార్చింది. పర్ణాదునికి అధిక ధనమిచ్చి సత్కరించి పంపింది. ఈ విషయాన్ని తండ్రికి తెలపవద్దని దమయంతి తన తల్లిని కోరి, సుదేవుడనే బ్రాహ్మణుడిని దమయంతి పిలిపించి, నువ్వే నన్ను గుర్తుపట్టి ఆనాడు ఇంటికి చేర్చావు కాబట్టి, ఈ పనికి కూడా నువ్వే సమర్థుడవు. నీవు అయోధ్య రాజు ఋతుపర్ణుని వద్దకు వెళ్ళి, నలుని జాడ కోసం దమయంతి తండ్రైన భీమ మహరాజు బ్రాహ్మణులను నలుమూలలకు పంపాడు, అయినా అతని జాడ కనుక్కోలేక పోయారు, అందువలన దమయంతికి రెండవ వివాహం కోసం స్వయంవరం ప్రకటించాడు, రేపే ఆ స్వయంవరం, అని అతనికి తెలియచేయి, అని దమయంతి సుదేవునికి తెలిపింది. అతడు అలాగే చేశాడు. ఆ మాటలు విన్న ఋతుపర్ణరాజు, నేను దమయంతీ స్వయంవరానికి విదర్భకు వెళ్లాలనుకొంటూవున్నాను, ఒక్కరోజే సమయముంది నీకు అశ్వహృదయము విద్య తెలుసు కాబట్టి, నీవు ఒక్క రోజులో నన్ను వంద యోజనాల దూరం తీసుకొని వెళ్ళగలవా? అని బాహుకుడిని ప్రశ్నించాడు. నేను చేసిన తప్పులకు, నా వలన ఆమెకు కలిగిన శోకానికి దమయంతి ఈ నిర్ణయం తీసుకొందా? తపస్విని, సంతానవతి, పతివ్రత అయిన ఆమె అలా ఎన్నడూ చేయదు కదా? ఏది సత్యమో? ఎలాగు వెళుతున్న ఋతుపర్ణుడితో పాటు నేను వెళ్ళి కళ్ళారా చూస్తాను, అని నలుడు అనుకొని, ఒక్క రోజులో మిమ్మల్ని స్వయంవరం జరిగే విదర్భ రాజ్యానికి తీసుకెళ్తాను, అని చెప్పి రథాన్ని సిద్ధం చేశాడు. బాహుకుడు, పూర్వపు నలుడి సారథి వార్ష్ణేయుడు, ఋతుపర్ణరాజు రథంలో స్వయంవరానికి బయలుదేరారు. బాహుకుడు పగ్గాలను చేతబూని అశ్వాలను అదిలించగానే అవి ఆకాశం పైకెగసి వాయు

వేగంతో ముందుకు దూసుకుపోయాయి. ఆ వేగాన్ని చూసి ఋతుపర్ణరాజు, వార్ష్ణేయుడు ఆశ్చర్యపోయారు. రాజు ఉత్తరీయం భుజం నుండి జారి క్రింద పడగా, బాహుకా రథాన్ని ఆపు ఉత్తరీయాన్ని వార్ష్ణేయుడు వెళ్ళి తీసుకొనివస్తాడు, అని రాజు పలికాడు. అప్పుడు బాహుకుడు రెప్పపాటులో రథం యోజన దూరం వచ్చేసింది, ఇప్పుడు ఆపినా దానిని తీసుకురాలేనంత దూరం మనం వచ్చేశామని తెలిపాడు. ఆశ్చర్యపోయిన ఋతుపర్ణుడు నీ విద్య అమోఘం, ఇప్పుడు నేను నా విద్యను ప్రదర్శిస్తాను చూడు, ఈ తాండ్ర చెట్టు నుండి రాలిపడిన ఆకులు నూటొక్కటి, పండు ఒకటి, చెట్టుకున్న రెండుకొమ్మలకూ ఐదుకోట్ల ఆకులున్నాయి, రెండు వేల తొంబై ఐదు ఫలాలున్నాయి, అని తెలిపాడు.

బాహుకుడు రథాన్నాపి వానిని లెక్కించి, లెక్క సరిగ్గా వున్నదని చెప్పి, ఋతుపర్ణరాజు యొక్క నైపుణ్యానికి ఆశ్చర్యపోయి, తనకు ఆవిద్యను నేర్పమని ప్రార్థించాడు. ఋతుపర్ణుడు, ఈ విద్యను అక్షహృదయ విద్య అంటారని, దీన్ని నేర్చుకున్న వ్యక్తి సంఖ్యావేత్త అవుతాడని, పాపాలు, దుర్గుణాలు, విషాల నుండి విముక్తి పొందుతాడని తెలిపి, ఆ విద్యను బాహుకుడికి నేర్పించాడు. అందుకు బదులుగా బాహుకుడు ఋతుపర్ణరాజుకు అశ్వహృదయ విద్యను నేర్పాడు. నలుడు అక్షవిద్యను నేర్చుకోగానే అంతవరకు అతని శరీరంలో వున్న కలి పురుషుడు, కర్కోటకుని విషాన్ని కక్కుతూ నలుడి శరీరం నుండి బయటికి వచ్చాడు. తన కష్టాలన్నింటికీ కారకుడైన కలిని నలుడు శపించబోయాడు. అప్పుడు రెండు చేతులు జోడించి శాంతించండి, మీరు దమయంతిని ఒంటరిగా అడవిలో విడిచినప్పుడే ఆమె నాకు శాపాన్నిచ్చింది, కర్కోటకుని విషం చేత మాడిపోతూ అతికష్టంపై ఇన్నాళ్ళు మీ లోపల ఉన్నాను, మిమ్మల్ని కీర్తివంతులను చేస్తాను, మీ చరితను తెలుసుకొన్న వారికి నా వలన భయం ఉండదు, నేను మీ శరణు కోరుతూ వున్నాను, అని ప్రార్థించి, అక్కడే వున్న తాండ్ర చెట్టులోకి ప్రవేశించి కలిపురుషుడు

అదృశ్యమయ్యాడు. ఈ సంభాషణ కలి పురుషునికి నలునికి తప్ప అన్యులెవ్వరికీ తెలియకుండా జరిగింది. కలి నలుడిని వదిలి వెళ్ళిపోయాక అతనిలో వున్న చింత తీరినట్లయింది, రూపం మాత్రం మారలేదు. వాయువేగంతో బాహుకుడు రథాన్ని నడిపి ఋతుపర్ణుడిని సాయంకాలానికి మునుపే విదర్భ దేశానికి చేర్చాడు.

ఋతుపర్ణరాజుకు అక్కడ స్వయంవరపు ఏర్పాట్లు కానీ, ఇతర రాజులు కానీ కనిపించలేదు. భీమరాజు తన రాజ్యానికి విచ్చేసిన ఋతుపర్ణరాజు ఏకారణం చేత వచ్చాడో తెలియకపోయినా, ఆత్మీయమైన స్వాగతం ఏర్పాటు చేసి సకల సౌకర్యాలతో బస ఏర్పాటు చేశాడు.

ఆ రథం యొక్క శబ్దాన్ని బట్టి అది నలుడిది అని గ్రహించిన దమయంతి సంతోషంగా అక్కడికి చేరుకొన్నది, కానీ అందులో వున్న ముగ్గురిలో ఆమెకు నలుడు కనిపించలేదు. ఋతుపర్ణరాజు, వార్ష్ణేయుడు వీరిరువురు నలుడు కాదు, మరి మిగిలిన ఆ వికృత రూపంతో వున్న వ్యక్తి ఎవరో తెలుసుకొని రమ్మని, అతనితో ఏమి మాట్లాడాలో కూడా తెలిపి కేశిని అనే చెలికత్తెను, దమయంతి బాహుకుడి దగ్గరకు పంపింది. అతను ఇచ్చే సమాధానాలను యథాతథంగా తనకు చెప్పమంది. కేశిని బాహుకుడి దగ్గరకెళ్ళి అతని వివరాలు అడిగి, నలుని గురించి వివరాలు అడిగింది. తన పేరు బాహుకుడని ఋతుపర్ణ రాజు రథసారథి మరియు వంటవాడిని అని, నలుని గురించి ఎవ్వరికీ తెలియదని, అతను తన రూపాన్ని కోల్పోయాడని చెప్పాడు. పర్ణాదుడనే బ్రాహ్మణుడు ఋతుపర్ణరాజు కొలువులో పలికిన మాటలను కేశిని యధాతధంగా మరల బాహుకుడితో పలుకగా, అప్పుడు పర్ణాదునకు ఇచ్చిన సమాధానమే తిరిగి కేశినికి కళ్ళ నీళ్ళతో బాహుకుడు వినిపించాడు. కేశిని జరిగినదంతా దమయంతికి తెలియచేసింది.

ఆ విషయాలు విన్న దమయంతి కళ్ళలో నీళ్ళు కారాయి. అతడే నలుడన్న తన అనుమానాన్ని మరింత ఋజువు చేసుకోవాలని కేశినిని

మరల బాహుకుడి వద్దకు వెళ్ళి అతని చర్యలను, ప్రత్యేకించి నీరు, నిప్పు గురించి గమనించి చెప్పమంది. కేశిని వెళ్ళి బాహుకుడి చర్యలను రహస్యంగా గమనించింది. అతను గడ్డి తీసుకొని సూర్యుని వైపు చూపగానే అది మండటం, దానితో అగ్నిని సిద్ధం చేయడం, నీరు ఖాళిపాత్రలోనికి అవే రావడం, అగ్నిని తాకుతూ వంట చేయడం ఇలాంటి ఎన్నో ఆశ్చర్యకర విషయాలు చూసి, వాటన్నింటిని దమయంతికి కేశిని తెలిపింది. బాహుకుడు వండిన వంటను తెచ్చి దమయంతికిచ్చింది, దాని రుచిని చూసి, ఆ రుచి నలుని వంటదే అని దమయంతి గ్రహించింది. కేశిని ద్వారా తన ఇరువురి పిల్లల్ని బాహుకుడి వద్దకు పంపింది. వారిని చూసి, అతడు ఎదురువెళ్ళి కౌగిలించుకొని, వారిని తన తొడమీద కూర్చోబెట్టుకొని దుఃఖాన్ని ఆపుకోలేక పెద్దగా ఏడ్చాడు. తర్వాత కేశినిని గమనించి, వీరు నా బిడ్డల వలె వుండడం వలన నేను కన్నీరు పెట్టుకొన్నాను అని సర్దుకొని, అతిథిగా వచ్చిన అతని వద్దకు ఆమె మాటిమాటికీ రావడం మంచిది కాదని, ఇక రావద్దు, అని నలుడు తెలిపాడు. ఆ విషయాలన్నీ కేశిని ద్వారా విన్న దమయంతి తన తల్లితో ఇలా తెలిపింది.

**పరీక్షితో మే బహుశః బాహుకో నలశంకయా ।**
**రూపే మే సంశయస్త్వేకః స్వయమిచ్ఛామి వేదితుమ్ ॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము - వనపర్వము - 76వ అధ్యాయము - 3వ శ్లోకము)**

బాహుకుడు నలుడై వుంటాడనే అనుమానంతో నేను అనేక విధాలుగా పరీక్షించాను. ఒక్క రూపం తప్ప మిగిలినవేవి సందేహించవలసిన అవసరం లేనంతగా ఇద్దరూ ఒక్కరే అన్న విషయాన్ని తెలుపుతున్నాయి. నేనే స్వయంగా ఇక సందేహాన్ని తీర్చుకోదలిచాను. అందుకు బాహుకుడినైనా మన మందిరంలో ప్రవేశపెట్టండి, లేకపోతే నన్నే బాహుకుడున్న దగ్గరకు వెళ్ళడానికి అనుమతించండి, అని దమయంతి ఆమె తల్లిగారిని కోరింది.

ఆ విషయాన్ని దమయంతి తల్లి భీమ మహారాజుకు తెలియజేయగా, దమయంతి ఉన్న మందిరంలోనికే బాహుకుడిని ప్రవేశపెట్టారు.

దమయంతిని చూడగానే నలునికి దాచుకోలేనంత దుఃఖ శోకాలు కలిగి కన్నుల నుండి నీరు ధారగా కారాయి. ఆ స్థితిలోని బాహుకుడిని చూచి పెల్లుబికుతున్న బాధను దాచుకొని, మలినమైన అర్ధవస్త్రంతో, జడలు వేసుకోని కురులతో, కాషాయవస్త్రాలు ధరించివున్న దమయంతి, బాహుకా! పూర్వం అరణ్యంలో నిద్రిస్తున్న భార్యను అర్ధరాత్రివేళ విడిచివెళ్ళిన ధర్మజ్ఞుడైన పురుషుని నీవు చూచావా?, అని అడిగింది.

**అనాగసం ప్రియాం భార్యాం విజనే శ్రమ మోహితామ్ ।**
**అసహాయాం తు కో గచ్ఛేత్ పుణ్యశ్లోకమృతే నలమ్ ॥**

**కిము తస్య మయా బాల్యాద్ అపరాద్ధం మహీపతేః ।**
**యో మాముత్సృజ్య విపినే గతవాన్ నిద్రయార్ధి తామ్ ॥**

**సాక్షాద్ దేవానసాహాయ వృతో యః స పురా మయా ।**
**అనువ్రతాం సాభికామాం పుత్రిణీం త్య క్తవాన్ కథమ్ ॥**

**అగ్నౌ పాణిం గృహీత్వా తు దేవానామ గ్రతస్తథా ।**
**భవిష్యామీతి సత్యం తు ప్రతిశ్రుత్య క్వ తద్ గతమ్ ॥**

**(శ్రీమహాభారతము - 2వ భాగము - వనపర్వము - 76వ అధ్యాయము - 11,12,13,14 శ్లోకములు)**

ఏ తప్పూ చేయని భార్యను, అలసటలో ఆదమరచి నిద్రించే సమయంలో నిర్జన ప్రదేశమైన అడవిలో, పుణ్యవంతుడైన నలుడు తప్ప మరెవ్వడైనా విడిచి వెళ్ళగలడా?, నిస్సహాయురాలైన నన్ను అరణ్యంలో విడిచి వెళ్ళడానికి, ఆ మహారాజుకి బాల్యం నుంచి నేను ఏమైనా అపరాధం చేశానా?, ప్రత్యక్షంగా వచ్చిన దేవతలను కూడా కాదని, నేను నలునినే వరించాను కదా!, అతనికి భార్యనై, అతని పిల్లలకు తల్లినైన నన్ను విడిచి

ఎట్లా వెళ్ళగలిగాడు?, అగ్నిసాక్షిగా దేవతలందరి ముందు పాణిగ్రహణం చేసి సత్యంగా నన్ను ఎన్నడూ వీడనన్న ఆ నలమహారాజు నన్ను ఎందుకు విడిచాడు?, ఎక్కడకు వెళ్ళాడు?, అని దమయంతి బాహుకుడిని ప్రశ్నించింది.

అందుకు ఆగని కన్నీటితో బాహుకుడి రూపంలో వున్న నలుడు దమయంతికి ఇలా సమాధానమిచ్చాడు. నేను కావాలని నా రాజ్యాన్ని పోగొట్టుకోలేదు, నిన్నూ వదలనూ లేదు, ఇది కలిపురుషుడు చేసిన పని. నీవు ఇచ్చిన శాపాగ్నిచే దహింపబడుతున్న అతను నా శరీరంలో చేరి నా తనువును కూడా దహింపచేశాడు. నా ప్రయత్నం చేత తపోబలం చేత అతనిపై నేనిప్పుడు విజయం సాధించాను. ఇప్పుడు కలి నన్ను విడిచి వెళ్ళి పోయాడు. ఇక మన కష్టాలు తీరిపోయినట్లే, అని పలికాడు నలుడు. నా వంటి ప్రేమించే భర్తను వదిలి, ఇద్దరు పిల్లలు కలిగిన నీవు రెండవ వివాహం చేసుకోవడానికీ స్వయం వరానికి ఎలా సిద్ధపడ్డావు?, అని నలుడు దమయంతిని ప్రశ్నించాడు.

దేవతలనే కాదని నిన్నే వరించిన దానను నేను. అటువంటి నాపై దోషారోపణ చేసి అనుమానించడం మీకు తగదు నలమహారాజా!, అసలు విషయం చెపుతాను వినండి, అంటూ దమయంతి క్రింది విధంగా జరిగిన విషయాన్ని వివరించింది. మీ జాడ తెలుసుకోవడం కోసమే అన్ని దిక్కులకు బ్రాహ్మణులను పంపడం, నా కథను అన్ని చోట్ల వారిచే పలికించడం జరిగింది. పర్ణాదుడనే బ్రాహ్మణుడి నోటివెంట మీరు ఆ మాటలు విని ఇచ్చిన సమాధానం ద్వారా మీరే నా ప్రభువైన నలుడై వుంటారని ఊహించి, మీరు తప్ప వేరొక్కరూ నూరుయోజనాల దూరాన్ని ఒక్క రోజులో గుర్రాల ద్వారా చేరుకోలేరన్న విషయం తెలిసిన నేనే, కావాలని స్వయంవరమనే కట్టుకథను మీకు ఒక్కరోజు ముందుగా మాత్రమే తెలిసేలా చేసి, ఇక్కడికి రప్పించాను. వచ్చిన తర్వాత కేశినీ ద్వారా మీ గురించిన అనేక విషయాలు పదే పదే నిర్ధారణ చేసుకొని, మీరే నా ప్రభువునే నిర్ణయానికొచ్చాను. కానీ

మీ రూపం మాత్రం వేరుగా వుండడంతో ఆ విషయం నిర్ధారించుకోవడానికే మిమ్మల్ని ఇక్కడికి పిలిపించాను, అని పలికి, అసలు స్వయంవరం గానీ రెండో పెండ్లి ఆలోచన గానీ, మిమ్మల్ని అగౌరపరచాలనే ఆలోచన గాని తన మనస్సులో కూడా అసలు లేనే లేవని, దమయంతి నలునికి తెలిపింది. అట్టి పాపపు ఆలోచన నాకుంటే భూమండలమంతా సంచరించే సూర్యచంద్ర వాయుదేవతలు నన్ను నశింప చేయదురు గాక, లేనిచో వారే ఈ సత్యాన్ని తెలుపుదురు గాక, అని దమయంతి ప్రతిజ్ఞ చేసింది. వెంటనే వాయుదేవుడు, నలమహారాజా! దమయంతి చెప్పినదంతా సత్యం, ఆమె సౌశీలవతి, పతివ్రతా శిరోమణి, అందుకు మేము ముగ్గురు దేవతలూ సాక్షీభూతులము, మీరిరువురూ కలసిమెలసి ఇక సుఖంగా జీవించండి అని పలికాడు. దేవతలు దేవదుందుభులు మ్రోగించి పుష్పవర్షం కురిపించారు. ఆనందంతో నలమహారాజు కర్కోటకుడిని ప్రార్థించాడు, అతని ముందు ఒక వస్త్రం ప్రత్యక్షమయ్యింది, దానిని కప్పుకోగానే నలునికి బాహుకుడి రూపం పోయి తన యధార్థమైన రూపం వచ్చేసింది. దమయంతి నలుడు పరస్పరం గాఢంగా కౌగిలించుకొని కన్నీరు కార్చారు. విషయం తెలుసుకొన్న ఋతుపర్ణరాజు, భీమరాజు, ప్రజలు ఎంతో సంతోషించారు. ఋతుపర్ణరాజు తన దేశానికి వెళ్ళి పోయాడు. ఒక నెల రోజులు నలదమయంతులు తమ పిల్లలతో కలసి అక్కడే వున్నారు. తర్వాత భీమరాజు దగ్గర సెలవు తీసుకొని, పుష్కరుని చెంతకు వచ్చి, జూదమైనా ఆడు లేకపోతే నాతో యుద్ధమైనా చేయమని నలుడు అడగగా, అతడు జూదమాడాడు. ఈసారి నలుడే గెలిచాడు. ఓడిన తన సోదరుడైన పుష్కరునికి తన సంపదలో కొంతభాగం ఇచ్చి ఆనందంగా జీవించమని నలుడు పంపాడు. నలుడు తన రాజ్యాన్ని తిరిగి పొంది, చక్కగా రాజ్యాన్ని పరిపాలించాడు. తరువాత నలదమయంతులు తమ పిల్లలతో కలసి ఆనందంగా జీవించారు.

దమయంతి తన భర్తను వెతికించడానికి చేసిన ప్రయత్నాలు, ఆమె బ్రాహ్మణుల ద్వారా పలికించిన మాటలకు స్పందించిన వ్యక్తే నలుడని

ఆమె వేసిన ఎత్తుగడ, నలుని అశ్వవిద్య తెలిసి నూరు యోజనాల దూరాన్ని ఒక రోజులో ప్రయాణం చేసేలా ముందు రోజే ఆ వార్తను అతనికి తెలిసేలా చేసిన తెలివితేటలు, రప్పించాక రధశబ్దాన్ని బట్టి, వంట రుచిని బట్టి అతనిని గుర్తించిన నిశితమైన పరిశీలనా శక్తి, చెలికత్తె ద్వారా మాటిమాటికీ పంపి సేకరించిన విషయాల విశ్లేషణతో ఋజువుల పరిశీలన, స్వయంగా పిలిపించి ఆమె నలునితో మాట్లాడిన అద్భుతమైన మాటతీరు, ఆమె పాతివ్రత్యా నిరూపణ కోసం చేసిన శపథం, ఇవన్నీ కూడా దమయంతి యొక్క అద్భుతమైన గుణగణాలతో కూడిన వ్యక్తిత్వాన్ని తెలియచేస్తాయి. ఇట్టి సుగుణాలు, మంచి వ్యక్తిత్వం నేటి సమాజంలోని స్త్రీలకు ఎంతో అవసరమని దమయంతి సందేశాన్నిచ్చింది.

భార్య గొప్పతనం భర్త పేదరికంలోనే తెలుస్తుందంటారు. నలుడు తన రాజ్యాన్ని పోగొట్టుకుని దమయంతిని పిల్లలతో కలసి పుట్టినింటి కెళ్ళమంటే వెళ్ళకుండా, భర్తను అనుసరించి, అడవిలో అనేక కష్టాలు పడి భర్తను సేవించింది. భర్త వస్త్రం కూడా అపహరింపబడితే తన సగవస్త్రం ఇచ్చింది. అడవిలో వున్నప్పుడు తన పుట్టినింటికెళ్లడానికి దారి చూపి దమయంతిని వెళ్లమని నలుడు కోరినప్పుడు, భార్య విలువ తెలిపి, భర్త వెంటే కష్ట సమయంలో తానూ వుండి, అతనికి ఓదార్పుని, ప్రశాంతతను ఇస్తానంది. కష్టాలు, పేదరికం వచ్చినప్పుడు భర్తతో ఎలా ప్రవర్తించాలన్న విషయాల్ని నేటి సమాజంలోని స్త్రీలు దమయంతి జీవితం ద్వారా నేర్చుకోవాలి.

కలి ప్రభావంతో భర్త అడవిలో తనను వదిలి వెళ్ళిపోతే అతనికోసమే ఎన్నో ఉపాయాలతో కూడిన వ్యూహరచన చేసి భర్తను తిరిగి పొందిన గొప్ప సతి దమయంతి. భర్త చేసిన తప్పులను క్షమించగలిగే గొప్ప మనసు భార్యలకు వున్న నాడే ఆ బంధం కలకాలం సాగుతుంది. భార్యభర్తల బంధం హక్కులు, తప్పులు వీటన్నింటికీ అతీతమై ఒకరి ఆత్మతో మరొకరి ఆత్మ

పెనవేసుకొని సాగిపోయే సాటిలేని మేటి బంధం. దానిని కాపాడుకోవడానికి క్షమ, సహనం, విచక్షణ, వివేకం ఇవన్నీ అవసరం. ఈ శుభలక్షణాలన్నీ నేటి సమాజంలోని భార్యలకు అవసరము అనే సందేశాన్నీ దమయంతి అందిస్తూ ఉంది.

జీవితంలో ఊహించని కష్టాలు, పరిస్థితులు ఎదురైనప్పుడు వాటికి కృంగిపోక, వాటిని ఎదుర్కొని విజయాన్ని సాధించే తత్వం, వ్యూహాత్మకమైన ప్రణాళికలు రచించగల నేర్పరితనం, శోధించి సాధించే ధీరత్వం, ఇవన్నీ కూడా ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని దమయంతి నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది.

* * *